సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 312

శుక్రవారం 2-2-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

ఫ్యాషన్



లెహంగా టాప్

వేడుకలలో ప్రత్యేకంగా వెలిగిపోవాలన్నా, యంగ్‌లుక్‌తో మెరిసిపోవాలన్నా, ఆధునికతతో జోడీ కట్టాలన్నా, సంప్రదాయంతో జత చేరాలన్నా అన్నింటికీ ఒకే ఆన్సర్‌గా సమాధానం లెహంగా టాప్ అనేది నవతరం మాట. దానికి తగ్గట్టు ఇండోవెస్ట్రన్ లుక్‌తో మెరిసిపోయే ఈ డిజైన్స్ రానున్న పెళ్లిళ్ల సీజన్‌కు మరింత వైవిధ్యంగా ముస్తాబై రానున్నాయి.







★ పట్టు, జార్జెట్, బ్రోకేడ్... మెటీరియల్ ఏదైనా లెహంగా గ్రాండ్‌గా వెలిగిపోతుంది. దానిమీదకు ధరించే టాప్ మాత్రం కాలర్‌టైప్, పెప్లమ్, సింగిల్ షోల్డర్ .. వంటి డిజైన్స్ అయితే మోడర్న్‌గా ఆకట్టుకోవచ్చు. సంప్రదాయ వేడుకలకు ప్రత్యేక కళను తీసుకురావచ్చు.

•••

★ లెహంగా టాప్ ఒకే కలర్‌లో ఎంచుకున్నప్పుడు దానికి తగిన ఎంబ్రాయిడరీ లేదా ప్రింట్, మెటీరియల్‌ను బట్టి స్పెషల్‌గా క్రియేట్ చేయచ్చు.

•••

★ ప్లెయిన్ కాలర్ నెక్ టాప్ ఎంచుకున్నప్పుడు కొద్దిపాటి ఎంబ్రాయిడరీ డిజైన్‌తో మెరిపించవచ్చు. దీనికి ప్లెయిన్ లెహంగా లేదా ప్రింటెడ్ లెహంగా సరైన కాంబినేషన్ అవుతుంది.

•••

★ గ్రాండ్‌గా ఉన్న లెహంగాకి సింగిల్ షోల్డర్ కేప్ స్టైల్ టాప్ ప్రత్యేకతను తీసుకువస్తుంది.

వంటిల్లు

ఆరోగ్యంగా పెరగాలంటే రోజూ పండ్లు తినాలి. ఇది డాక్టర్ మాట... అలాగే అమ్మ మాట కూడా. రోజూనా... నాకు బోర్ కొడుతోంది... పిల్లల హఠం. రోజూ తినే పండ్లనే కొత్తగా పరిచయం చేద్దాం. చేయడం సులభం... స్టవ్ వెలగాల్సిన పని లేదు. గరిట తిప్పాల్సిన అవసరం అంతకన్నా లేదు.

మంట లేకుండా పండంటి వంటలు





గ్రీన్ గ్రేప్ సోర్బెట్

కావలసినవి: ఆకుపచ్చ ద్రాక్ష – 200 గ్రాములు; అల్లం తురుము – టీ స్పూన్; నిమ్మరసం– 2 టీ స్పూన్‌లు; చక్కెర – టీ స్పూన్ (అవసరం అనిపిస్తేనే) గార్నిష్ చేయడానికి.. పుదీన ఆకులు – 20.

తయారీ: ● ద్రాక్షను మంచినీటితో శుభ్రం చేసి ఆ తరవాత గోరువెచ్చటి నీటిలో ఉప్పు కలిపి అందులో వేయాలి. ద్రాక్షను ఉప్పు నీటిలో 15 నిమిషాల సేపు ఉంచిన తర్వాత అందులో నుంచి తీసి మంచి నీటిలో ముంచి కడిగి నీరు కారిపోయే వరకు పక్కన పెట్టాలి. ● ద్రాక్ష, అల్లం, నిమ్మరసం మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. రుచి చూసి అవసరమనిపిస్తే చక్కెర వేసి మరొకసారి గ్రైండ్ చేయాలి. ఈ చిక్కటి ద్రవాన్ని ఒక పాత్రలో పోసి మూత పెట్టి ఎనిమిది గంటల పాటు ఫ్రీజర్‌లో పెట్టాలి. సర్వ్ చేసే ముందు తీసి ఫోర్క్‌తో గుచ్చి పలుకులు చేసి గ్లాసుల్లో పోసి పుదీన ఆకులతో గార్నిష్ చేయాలి.



స్ట్రాబెర్రీ విత్ క్రీమ్

కావలసినవి: స్ట్రాబెర్రీ ముక్కలు – వంద గ్రాములు (కడిగి పలుచగా తరగాలి); మీగడ– వంద గ్రాములు; ఐసింగ్ షుగర్ లేదా మామూలు చక్కెర పొడి– 2 టేబుల్ స్పూన్‌లు; గార్నిష్ కోసం... స్ట్రాబెర్రీలు – 2 టీ స్పూన్; బ్లాక్ సాల్ట్ – చిటికెడు;

తయారీ: ● మీగడను బాగా చిలికి నాజిల్ ఉన్న ట్యూబ్‌లో వేయాలి. కోన్ అయినా ఫర్వాలేదు. అదీ లేకపోతే జంతికల గొట్టంలో స్టార్ డిజైన్ ఉన్న ప్లేట్ అమర్చి ఉపయోగించుకోవచ్చు. ● స్ట్రాబెర్రీ ముక్కలను గ్లాసులో పావు వంతు వేయాలి. ఆ పైన కొద్దిగా మీగడ అమర్చాలి. ఆ పైన మళ్లీ ఒక వరుస స్ట్రాబెర్రీ ముక్కలు, ఆ పైన మీగడ వేయాలి. చివరగా ఒక స్ట్రాబెర్రీ అమర్చి సర్వ్ చేయాలి.



చట్‌పటా పామోగ్రనేట్

కావలసినవి: దానిమ్మ గింజలు – ముప్పావు కప్పు; చాట్ మసాలా – పావు టీ స్పూన్; ఆమ్‌చూర్ పౌడర్ – పావు టీ స్పూన్ (ఆమ్‌చూర్ పౌడర్ లేకపోతే పచ్చి మామిడి తురుము టీ స్పూన్); జీలకర్ర పొడి– పావు టీ స్పూన్; బ్లాక్ సాల్ట్ – చిటికెడు

తయారీ: ఒక కప్పులో వీటన్నింటినీ వేసి స్పూన్‌తో కలిపితే చట్‌పటా పామోగ్రనేట్ రెడీ. పిల్లలకు బాక్సులో పెట్టడానికి కూడా బావుంటుంది.



డ్రాగన్ – కోకోనట్ స్మూతీ

కావలసినవి: డ్రాగన్ ఫ్రూట్ ముక్కలు – కప్పు; కొబ్బరి పాలు – కప్పు; స్వచ్ఛమైన తేనె – టేబుల్ స్పూన్; ఐస్ క్యూబ్స్ – 10 (ఇష్టమైతేనే)

తయారీ: పచ్చి కొబ్బరిని గ్రైండ్ చేసి పాలు తీసుకోవచ్చు లేదా రెడీమేడ్ కోకోనట్ మిల్క్ తీసుకోవచ్చు. డ్రాగన్ ముక్కలను మిక్సీ జార్‌లో వేసి మెత్తగా బ్లెండ్ చేసి అందులో కొబ్బరి పాలు వేసి మొత్తం కలిసే వరకు బ్లెండ్ చేయాలి. పెద్ద గ్లాసులో పోసి తేనె కలిపి సర్వ్ చేయాలి. బ్లెండ్ చేసిన వెంటనే తాగేటట్లయితే తేనె కూడా అప్పుడే వేసుకోవచ్చు. డ్రాగన్ – కొబ్బరి పాల మిశ్రమాన్ని ముందుగా చేసుకుని ఫ్రిజ్‌లో పెట్టుకుని తర్వాత తాగాలంటే తాగే ముందు తేనెను కలుపుకోవాలి.

యువర్స్



పాత వస్తువులను చూస్తూ కొత్తగా ఆలోచిస్తే ఏమొస్తుంది? కొత్త ఆవిష్కరణకు బీజం పడుతుంది. సమాజానికి మేలు జరుగుతుంది. రసాయనాలతో కూడిన ఎయిర్ ఫ్రెషనర్ ద్వారా అనారోగ్యానికి గురైన రాజీవ్ శర్మ ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాడు. 'జీరో ప్లాస్టిక్, జీరో ట్యాక్సిన్స్' నినాదంతో ఎకో-ఫ్రెండ్లీ ఎయిర్ ఫ్రెషనర్‌ను డిజైన్ చేశాడు. 'ఆల్వే-గ్రీన్ సొల్యూషన్స్' స్టార్టప్‌తో సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతున్నాడు జంషెడ్‌పూర్‌కు చెందిన రాజీవ్ కుమార్ శర్మ....

ఇన్నోవేషన్

ప్రతికూలతకు... పచ్చటి జవాబు

కోవిడ్ సమయంలో రాజీవ్‌శర్మ కుటుంబం శానిటైజర్‌లతో పాటు ఎయిర్ ఫ్రెషనర్‌లను ఉపయోగించేది. ఒకరోజు వాంతులు, తలనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు రాజీవ్. హాస్పిటల్ నుంచి ఇంటికి తిరిగివచ్చిన తరువాత 'ఎందుకు ఇలా జరిగింది?' అంటూ ఆలోచించాడు. ఇంట్లోకి కొత్తగా వచ్చిన ఎయిర్ ఫ్రెషనర్ వల్లే తాను అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్నాడు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కలప, పూలవ్యర్థాలతో సహజమైన ఎయిర్ ఫ్రెషనర్ తయారుచేశాడు.

ఈ ఎయిర్ ఫ్రెషనర్ ద్వారా ఇన్నోవేటర్ కాస్తా ఎంటర్‌ప్రెన్యూర్ అయ్యాడు. 'ఆల్వే-గ్రీన్ సోల్యూషన్స్' పేరుతో స్టార్టప్ ప్రారంభించి విజయం సాధించాడు.

'ఎయిర్ ఫ్రెషనర్‌లలో ఇబ్బంది కలిగించే రసాయనాలు ఉన్నాయి. మనం చేయాల్సిందల్లా ఏదైనా ఎయిర్ ఫ్రెషనర్ తయారీలో ఉపయోగించిన ఇన్‌గ్రేడియెంట్స్ గురించి తెలుసుకోవడం. పిల్లలు, జంతువులకు ఇవి సురక్షితం కాదు. ఈ నేపథ్యంలో పర్యావరణానికి హాని కలిగించని, మనుషులకు, జంతువులకు సురక్షితమైన ఎయిర్ ఫ్రెషనర్‌ను తయారుచేయాలనుకున్నాను' అంటాడు రాజీవ్‌శర్మ. ఈ ప్రాజెక్ట్‌పై తల్లితో కలిసి ఎనిమిది నెలలకు పైగా శ్రమించాడు. ఎన్నో ట్రయల్స్ తరువాత ఫైనల్ ప్రాజెక్ట్ ఓకే అయింది. 'మా ప్రొఫెసర్‌లు ఆశ్చర్యపోయారు. ఇది మరింత ఎక్కువమందికి చేరువ కావాల్సిన అవసరం ఉంది అని చెప్పారు. కాలేజీలోని యంత్రాలతో ఎయిర్ ఫ్రెషనర్ పర్‌ఫెక్ట్‌గా రావడానికి సహాయం చేశారు' అంటాడు రాజీవ్.

జంషెడ్‌పూర్(ఝార్ఖండ్)లోని ఆలయాల నుంచి రాజీవ్ ప్రతిరోజూ కనీసం మూడు కిలోల పూలవ్యర్థాలను సేకరిస్తాడు. ప్రస్తుతం ఇంటి నుంచే కంపెనీని నడుపుతున్న రాజీవ్ దాన్ని మరింత విస్తరించే ఆలోచనలో ఉన్నాడు. 'ఆల్వే-గ్రీన్ సొల్యూషన్' ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-బెంగళూరుతో కలిసి పనిచేస్తోంది. చిన్నప్పటి నుంచి రాజీవ్ కొత్త కొత్త వస్తువులు తయారుచేసేవాడు. కోవిడ్ సమయంలో సౌకర్యవంతమైన పీపీఇ కిట్‌లను రూపొందించాడు. 'ఝార్ఖండ్ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ' సభ్యుడిగా గాయపడిన శునకాల కోసం ప్రత్యేకమైన వీల్‌చైర్‌లను తయారు చేశాడు. 'మనకు ఉపయోగపడే వస్తువులు మాత్రమే కాదు పర్యావరణానికి హాని కలిగించని పరికరాలను తయారు చేయడం నా లక్ష్యం' అంటున్నాడు రాజీవ్ కుమార్ శర్మ.



● ఆల్వే-గ్రీన్ సొల్యూషన్స్



● గాయపడిన శునకాల కోసం...



డ్రైవ్ అప్ ది వాల్

ఇరిటేట్ అయ్యే సందర్భాలలో వాడే మాట... డ్రైవ్ అప్ ది వాల్

ఉదా: హిజ్ ట్యూన్‌లెస్ సింగింగ్ అండ్ డ్రమ్మింగ్ ఆన్ ది టేబుల్ డ్రైవ్ మీ అప్ టు ది వాల్

పెట్రిఫైడ్ ఆఫ్

బాగా భయపడే స్థితిలో వాడే మాట...పెట్రిఫైడ్ ఆఫ్

ఉదా: మోస్ట్ పీపుల్ సీమ్ టు బి పెట్రిఫైడ్ ఆఫ్ స్నేక్స్

అంబివలెంట్ ఎబౌట్

ఒకే సమయంలో ఒక వ్యక్తి లేదా అంశంపై మిక్స్‌డ్ ఫీలింగ్. ఎటూ తేల్చుకోలేని అనిశ్చిత సమయంలో వాడే మాట... అంబివలెంట్.

ఉదా: ది హోల్ ఫ్యామిలీ వాజ్ అంబివలెంట్ ఎబౌట్ ది మూవ్ టు ది సబర్బ్స్

● అవును... ఇది నిజమే!



● ఎమోషనల్ ఎటాచ్‌మెంట్, ప్రేమ విషయంలో భయపడే మానసిక స్థితిని 'ఫీలోఫోబియా' అంటారు. ● వన్స్ అపాన్ ఏ టైమ్ చైనా. జపాన్‌లలో క్యాండిల్ వాచ్‌లు ఉండేవి. రకరకాల సైజ్‌లలో క్యాండిల్ మండే వ్యవధిని బట్టి టైమ్‌ను అంచనా వేసేవారు ● హారర్ క్లాసిక్ 'సైకో' రిలీజైన తరువాత–'ఫిల్మ్ స్టార్ట్ అయ్యాక ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రేక్షకులను అనుమతించవద్దు' అంటూ థియేటర్ వాళ్లకు స్ట్రిక్ట్‌గా చెప్పాడు ఆ సినిమా డైరెక్టర్ ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్.

● మ్యూజిక్ వరల్డ్

గోల్డెన్ వాయిస్



శృతి రాణే సింగర్, మ్యూజిక్ కంపోజర్. స్కూలు రోజుల నుంచి పాటలు పాడేది శృతి. స్థానికంగా జరిగే పాటల పోటీల్లో ఎన్నో బహుమతులు గెలుచుకుంది. 'గోల్డెన్ వాయిస్' అని శృతిని పిలిచేవారు. గానంలోనే కాదు పాటల కంపోజింగ్‌లో కూడా మంచి పేరు తెచ్చుకుంది శృతి. తన డైనమిక్ స్టేజీ పెర్‌ఫామెన్స్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. తన అభిమాన మ్యూజిక్ కంపోజర్‌లు ప్రీతమ్, విశాల్–శేఖర్. ఎంత జటిలమైన పాటను అయినా అవలీలగా పాడే శృతి క్లాసిక్ సాంగ్స్ రీక్రియేటెడ్ వెర్షన్స్‌కు సంబంధించి చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఎందుకంటే ఏ చిన్న పొరపాటు జరిగినా విమర్శలు తప్పవు.

'బాలీవుడ్ క్లాసిక్‌సాంగ్స్‌ను ఇష్టపడే లక్షలాది శ్రోతలలో నేను ఒకరిని. ఒక క్లాసిక్ సాంగ్‌కు సంబంధించి బ్యాడ్ వెర్షన్ విన్నప్పుడు ఎంత కోపం వస్తుందో నాకు తెలుసు. ఒరిజినల్ ఎసెన్స్ మిస్ కాకుండా పాడితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అదృష్టవశాత్తు రీక్రియేట్ వెర్షన్‌కు సంబంధించి నాకు ప్రశంసలు తప్ప విమర్శలు ఎదురు కాలేదు' అంటుంది శృతి రాణే.

● టెక్.. టాక్

హానర్ మ్యాజిక్ 6



సైజ్: 6.78 అంగుళాలు ; బ్యాటరీ: 5,100 ఎంఏహెచ్
ర్యామ్: 12జీబి ; స్టోరేజ్: 256జీబి
ఓఎస్: ఆండ్రాయిడ్14 ; బరువు: 206 గ్రా.

● గేమింగ్ నేడే విడుదల



వీరాధివీరులు

యాక్షన్ షూటర్ గేమ్ 'సూసైడ్ స్క్వాడ్: కిల్ ది జస్టిస్ లీగ్' నేడు విడుదల అవుతుంది. డీసీ కామిక్స్ 'సూసైడ్ స్క్వాడ్' ఆధారంగా రూపొందించిన గేమ్ ఇది. డీసీ యూనివర్స్‌లో జరిగే కథాంశంతో రూపుదిద్దుకున్న ఆట. సూసైడ్ స్క్వాడ్ సభ్యులు హార్లే క్విన్, డెడ్ షాట్, కెప్టెన్ బూమరాంగ్, కింగ్ షార్క్‌ల చుట్టూ తిరిగే కథ ఇది. వీరు ఈ భూగోళాన్ని రక్షించడానికి అసాధ్యమైన మిషన్‌ను చేపడతారు. ప్రతి పాత్రకు ప్రత్యేక ఆయుధం, ప్రత్యేక పోరాట శైలి ఉంటాయి. సింగిల్ ప్లేయర్‌గా, మల్టీప్లేయర్ కో–ఆప్‌లో స్నేహితులతో జట్టు కట్టడం ద్వారా ఈ గేమ్ ఆడవచ్చు.

ఇంజిన్: అన్‌రియల్ 4 ; ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ ; జానర్: యాక్షన్–అడ్వెంచర్, థర్డ్ పర్సన్ షూటర్ ; మోడ్స్: సింగిల్–ప్లేయర్, మల్టీప్లేయర్

జీమెయిల్ హెల్ప్ మీ రైట్



పాపులర్ ఈమెయిల్ సర్వీస్ జీమెయిల్‌లో జెనరేటివ్ ఏఐ ఆధారిత ఫీచర్‌లు ఎన్నో ఉన్నాయి. తాజాగా జెనరేటివ్ ఏఐ ఆధారిత ఫీచర్‌ను ఉపయోగించి ఈమెయిల్స్ డ్రాఫ్ట్ చేయడానికి యూజర్‌లను అనుమతించే 'హెల్ప్ మీ రైట్' ఫంక్షనాలిటీతో పాటు, వాయిస్ ఉపయోగించి ఈమెయిల్స్ డ్రాఫ్ట్ చేసే విధానాన్ని కూడా పరీక్షిస్తున్నారు.

ఆర్క్ సెర్చ్



ఆర్క్ బ్రౌజర్ తయారీ సంస్థ 'ది బ్రౌజర్ కంపెనీ' 'ఆర్క్ సెర్చ్' అనే కొత్త యాప్ గురించి ప్రకటించింది. ఆర్క్ సెర్చ్‌లోని 'బ్రౌజ్ ఫర్ మీ' ఫీచర్ ద్వారా మన సందేహాలకు జవాబు తెలుసుకోవచ్చు. అనేక వెబ్‌పేజీలను చదవడానికి ఈ యాప్ కృత్రిమ మేధ(ఏఐ)ని ఉపయోగిస్తుంది. 'మీ ఐఫోన్‌లో ఆర్క్ సెర్చ్ యాప్‌ను లాంచ్ చేయడం ద్వారా కీబోర్డ్ ఆటోమేటిక్‌గా సెర్చ్‌బాక్స్‌పై ఫోకస్ అవుతుంది' అంటున్నాడు బ్రౌజర్ కంపెనీ సీయివో జోష్ మిల్లర్.

మెటా కోడ్ లామా 70బీ

మెటా ఏఐ తమ ఏఐ జెనరేషన్ మోడల్ కోడ్ లామా 70బి అప్‌డేటెడ్ వెర్షన్‌ని విడుదల చేసింది. పైథాన్, జావా, పీహెచ్‌పీలాంటి వివిధ ప్రోగ్రామింగ్ భాషలలో ఇది మోడల్ కోడ్ రాయగలదు. పరిశోధన, వాణిజ్య అవసరాల కోసం మూడు ఉచిత వెర్షన్‌లను అందిస్తుంది. 'కోడ్ లామా అత్యంత అధునాతన, ఉత్తమ పనితీరు కలిగిన మోడల్' అంటోంది కంపెనీ. జెనరేటివ్ ఏఐ బెంచ్ మార్క్ అయిన హ్యూమన్‌ఈవల్‌లో ఈ మోడల్ 67.8 స్కోర్ సాధించింది.



శుక్రవారం 2-2-2024


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 312



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

క్లుప్తంగా...

హైకోర్టు పీపీగా పల్లె నాగేశ్వర్‌రావు

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులుగా ఐదుగురు..



సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో ప్రభుత్వం తరఫున పోలీసులకు సంబంధించిన కేసుల్లో వాదనలు వినిపించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్(హెచ్‌సీఏఏ) అధ్యక్షుడిగా ఉన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు 29 ఏళ్లుగా గవర్నమెంట్ ప్లీడర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, స్టాండింగ్ కౌన్సిల్‌గా వివిధ హోదాల్లో హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది దేశంలోనే తొలిసారిగా హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన రికార్డు ఆయన సొంతం. ఇప్పుడు ఆయన పీపీగా నియమితులవడంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులుగా..

అలాగే రాష్ట్ర హైకోర్టులో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులుగా ఐదుగురిని నియమిస్తూ ప్రభుత్వం మరో జీవో జారీ చేసింది. పొట్టిగారి శ్రీధర్‌రెడ్డి, ఐవీ సిద్ధివర్ధన, రాహుల్‌రెడ్డి సొంటిరెడ్డి, రామకృష్ణ మల్లోజల, స్వరూప్ ఊరిళ్లను ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులుగా నియమిస్తూ న్యాయ శాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి పేరిట జీవో 66 వెలువడింది. వీరికి నెలకు రూ.1.25 లక్షల చొప్పున జీత భత్యాల కింద చెల్లిస్తారు.

బ్యాంకు ఖాతాల గుట్టు విప్పేలా..!

- రెండోరోజు దర్యాప్తులో హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ నుంచి కీలక సమాచారం సేకరణ
- లాకర్లకు సంబంధించిన కీలక వివరాలు రాబట్టిన ఏసీబీ

సాక్షి, హైదరాబాద్: అక్రమార్జనతో దొరికిపోయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ నుంచి ఏసీబీ అధికారులు కీలక వివరాలు సేకరిస్తున్నారు. శివబాలకృష్ణ, ఆయన కుటుంబసభ్యులు, ఇతర బినామీల పేరిట ఉన్న బ్యాంకు ఖాతాల వివరాల సేకరణపై ఫోకస్ పెట్టారు. శివబాలకృష్ణను ఏసీబీ కోర్టు ఎనిమిది రోజుల కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. బుధవారం తొలిరోజు కస్టడీకి కొనసాగింపుగా గురువారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయానికి ఆయనను ఏసీబీ అధికారులు తరలించి విచారణ చేపట్టారు. బ్యాంకు ఖాతాల వివరాలు, లాకర్ల సమాచార సేకరణపైనే రెండోరోజు దర్యాప్తు కొనసాగినట్టు సమాచారం. సోదాల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న బినామీ ఆస్తులతోపాటు మరో నాలుగు అనుమానాస్పద ఆస్తులను ఏసీబీ గుర్తించినట్టు తెలిసింది. శివబాలకృష్ణ పేరిట ఎనిమిది, ఆయన భార్య రమాదేవి పేరిట నాలుగు, ఇతర కుటుంబసభ్యుల పేరుతో మరో 15 బ్యాంకు ఖాతాలు ఉన్నట్టు గుర్తించినట్టు సమాచారం. మరో నాలుగు బ్యాంకు లాకర్లు ఉన్నట్టుగా కనుగొన్న ఏసీబీ అధికారులు వాటిని తెరిస్తే మరికొన్ని కీలక వివరాలు వెల్లడికావచ్చని భావిస్తున్నట్టు తెలుస్తోంది. శుక్రవారం మరోమారు ఆయనను కస్టడీకి తీసుకోనున్న ఏసీబీ అధికారులు మరింత లోతుగా ప్రశ్నించే అవకాశం ఉంది.

3,479 మంది చిన్నారుల గుర్తింపు

ముగిసిన ఆపరేషన్ స్మైల్–10

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా జనవరి 1 నుంచి బుధవారం వరకు చేపట్టిన ఆపరేషన్ స్మైల్–10 స్పెషల్‌డ్రైవ్ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,479 మంది చిన్నారులను ప్రత్యేక బృందాలు గుర్తించాయి. వీరిలో తప్పిపోయిన, అదృశ్యమైన, బాలకార్మికులుగా, భిక్షాటనలో చిక్కుకుపోయిన చిన్నారులున్నారు. చిన్నారులతో పనులు చేయిస్తున్నారన్న కారణాలతో మొత్తం 652 కేసులు నమోదు చేసి 655 మందిని అరెస్టు చేసినట్లు మహిళా భద్రత విభాగం అడిషనల్ డీజీ శిఖా గోయల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

10 రోజుల్లో 1,203 కిలోల గంజాయి పట్టివేత

147 మంది అరెస్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్‌శాఖ అధికారులు గంజాయి, ఇతర మత్తుపదార్థాల పట్టివేతకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 1,203 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మత్తుపదార్థాలు రవాణా చేస్తున్న వారిపై 116 కేసులు నమోదు చేయడంతోపాటు ఈ కేసులతో సంబంధం ఉన్న 147 మందిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్తుపదార్థాల అక్రమ రవాణా ముఠాలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు జనవరి 22 నుంచి 31 వరకు చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో గంజాయితోపాటు 1.7 కిలోల ఆల్ప్రాజోలం, 0.46 కిలోల డైజోపాం గుర్తించడంతోపాటు నిందితులు వాడుతున్న 37 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కడప గడ్డపై ఓ కపట నాటకం

తెరపైకి సౌభాగ్యమ్మ!

సూత్రధారి కుటిలనీతి చంద్రబాబు

పాత్రధారులు: షర్మిల, సునీత, బీటెక్ రవి, సీఎం రమేశ్ తదితరులు

- ఎంపీగా సునీత బరిలోకి దిగేలా షర్మిలతో బాబు రాయబారం
- కాంగ్రెస్‌లో చేరి పోటీ చేసేందుకు ఆమె విముఖత.. దీంతో వివేకా భార్య సౌభాగ్యమ్మను నిలిపే ఆలోచన
- బాబు స్కెచ్ ప్రకారం కడపలో 'కుటుంబ పోరు' ఆవిష్కరించేందుకు కుట్ర



(సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)

ఇడుపులపాయలో రెండ్రోజుల కిందట షర్మిల–సునీత కలిశారు. దానికి ఎల్లో మీడియా ఎందుకు అంత ప్రాధాన్యమిచ్చింది? హైదరాబాద్‌లో రెగ్యులర్‌గా కలిసే ఈ అక్కచెల్లెళ్లిద్దరూ ఒకరినొకరు ఇడుపుల పాయలో కలిస్తే అంత ప్రాధాన్యమెందుకు? ఎందుకంటే వైఎస్ వివేకానందరెడ్డి భార్య సౌభాగ్యమ్మను కడపలో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించటమనేది ఇక్కడ దాదాపుగా ఖరారైంది. కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తే... బీజేపీకి తప్పుడు సంకేతాలు వెళ్లి కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమకు వ్యతిరేకంగా మారవచ్చని సునీత భయం. దీంతో... ఆమె తల్లి సౌభాగ్యమ్మను తెరపైకి తీసుకొచ్చారు. ఎందుకంటే బీజేపీలోని సీఎం రమేశ్, సుజనా చౌదరి లాంటి టీడీపీ నేతలే ఈ కేసులో ఆమెకు ఆర్థికంగా, న్యాయపరంగా సహకరించటంతో పాటు రికమెండేషన్లు, పైరవీల్లోనూ సాయం చేస్తున్నారు. ఇక తెలుగుదేశంలో చేరిపోతే... బాబు నాయుడితో, ఏబీఎన్ రాధాకృష్ణతో, వివేకాను అనైతికంగా ఓడించిన బీటెక్ రవితో తమ సత్సంబంధాలు బాహటంగా బయటపడిపోతాయని... ఇన్నాళ్లూ కేసును వెనకనుంచి నడిపింది వీరేనన్న సత్యం వెల్లడయిపోతుందని భయం. దీంతో బాబు ప్లాన్ ప్రకారం... సునీత తల్లి సౌభాగ్యమ్మను స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టేటట్లుగా, దానికి కాంగ్రెస్, టీడీపీ నూరు శాతం మద్దతిచ్చేట్లుగా వీరి మధ్య ఒక అవగాహన కుదిరినట్లు తెలిసింది. ఇలా చేస్తే ప్రస్తుతం ఎంపీగా ఉన్న అవినాశ్ రెడ్డిపై వీలైనంత బురద జల్లవచ్చని, కుటుంబంలోని వ్యక్తి స్వతంత్రంగా పోటీ చేస్తున్నారనే ముసుగులో కుటుంబీకుల మద్దతు అడగవచ్చనేది వారి ఆలోచన. పైపెచ్చు కుటుంబంలోని వ్యక్తి ఇండిపెండెంట్‌గా పోటీ చేసినా... మద్దతివ్వకుండా ఆమెపై అభ్యర్థిని నిలబెట్టారనే కోణంలో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా దుష్ప్రచారం చేయాలనేది వారి కుట్ర.

ఇది కుట్ర అని అడుగడుగునా తెలిసిపోతున్నా... పాత్రధారులు మాత్రం బాబు నాయుడి ఉచ్చులో పడి ఆయన చెప్పినట్లు చేసుకుంటూ పోతుండటమే అన్నిటికన్నా విచిత్రం. వివేకా హత్య జరిగిన నాటి నుంచి వరసగా మారుతున్న పరిణామాలు... దీన్లోని లోతైన కుట్ర కోణాన్ని చెప్పకనే చెబుతాయి.

వైఎస్ అవినాశ్‌రెడ్డి



అవినాశ్, వివేకా ఇళ్ల మధ్య ఉన్న దూరం ఏరియల్ డిస్టెన్స్ అయితే 250 మీటర్లు. రోడ్డు మార్గాన అయితే 700 మీటర్లు. గూగుల్ టేకవుట్ పేరు చెప్పి వివేకా ఇంట్లో ఉన్న ఒక మనిషిని అవినాశ్ ఇంటికి వచ్చినట్లు ఎలా నిర్ధారిస్తారు? ఆ రోజు ఉదయం అవినాశ్ ఎన్నికల ప్రచారం కోసం జమ్మలమడుగుకు బయలుదేరి పులివెందుల రింగ్‌రోడ్లోకి ప్రవేశించిన వెంటనే నర్రెడ్డి శివప్రసాద్ ఫోన్ చేసి వివేకా మరణం గురించి చెప్పారు. వెంటనే ఆయన యూ–టర్న్ తీసుకుని తనతో ఉన్న 3 వాహనాలతో సహా వివేకా ఇంటికి వెళ్లారు. ఫోన్ వచ్చిన రెండు నిమిషాల్లోనే ఎలా వచ్చారనేది సీబీఐ ప్రశ్న. నిజానికి రింగ్‌రోడ్డు (కష్టాలయం) నుంచి వివేకా ఇంటికి రెండు నిమిషాలు చాలు. పైపెచ్చు ఉదయాన్నే రోడ్లు ఖాళీగా ఉంటాయి కదా!.

మీ నాన్నను చంపింది నేనే! అని చెప్పినా...



ఇతను వివేకా మాజీ డ్రైవరు. వివేకాను తానే గొడ్డలితో నరికి కిరాతకంగా చంపానని స్వయంగా స్టేట్‌మెంట్ ఇచ్చిన వ్యక్తి. రూ.500, వెయ్యి అప్పులు తెచ్చుకుని గాలికి తిరిగే ఈ దస్తగిరి ఆర్థిక పరిస్థితి... వివేకా కేసులో అప్రూవర్‌గా మారాక ఒక్కసారిగా టర్న్ అయింది. కార్లలో డ్రైవరును పెట్టుకుని తిరిగే స్థితికి వచ్చేశాడు. వివిధ కోర్టుల్లో ఈయనపై ఉన్న కేసుల కోసం లాయర్లను సునీత, చంద్రబాబు, బీటెక్ రవి పెడుతున్నారంటే ఈ కుట్రను తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. దస్తగిరి అప్రూవర్‌గా మారకముందే ముందస్తు బెయిలు కోసం కోర్టులో దరఖాస్తు చేశాడు. తన తండ్రిని అత్యంత కిరాతకంగా నరికి చంపానని స్వయంగా చెప్పిన దస్తగిరి బెయిలుకు.. వివేకా కుమార్తెగా సునీత ఏమాత్రం అభ్యంతరం చెప్పలేదు. వీళ్ల మధ్య ఉన్న ఎంత గాఢమైన లోపాకారీ ఒప్పందం ఉందో తెలియటానికి ఇది చాలదూ!!.

అనైతికంగా ఓడించినా...



క్రికెట్ బెట్టింగుల్లో స్థానికంగా చిరపరిచితుడు. బెట్టింగుల్లో పోలీసులకూ దొరికాడు. 2017లో టీడీపీ తరఫున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కడపలో పోటీ చేసి.. వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన వైఎస్ వివేకాను అనైతికంగా ఓడించాడు. చాలినంత మంది ఎంపీటీసీ, జెడ్పీటీసీల మద్దతు లేకపోయినా... నాటి సీఎం చంద్రబాబు, మంత్రి ఆదినారాయణరెడ్డి సాయంతో వాళ్లను రకరకాలుగా ప్రలోభపెట్టాడు. కొందరిని బెదిరించి లోబరచుకుని తనకు బలం లేకున్నా వివేకాను ఓడించగలిగాడు. తండ్రిని దుర్మార్గపు పద్ధతుల్లో ఓడించిన ఈ వ్యక్తి... ఇపుడు సునీత దంపతులకు అత్యంత సన్నిహితుడంటే ఏమనుకోవాలి? కేసు గురించి, కేసుద్వారా పొందాల్సిన రాజకీయ ప్రయోజనాల గురించీ వీరు నిత్యం సంప్రతింపులు జరుపుకొనే స్థాయిలో ఉన్నారంటే ఏమనుకోవాలి? ఈ కేసులో అవినాశ్‌పై బురద జల్లాలనుకున్న ప్రతిసారీ... మాట్లాడేది రవి. మాట్లాడించేది సునీత దంపతులు. బీటెక్ రవి తీవ్రమైన విమర్శలు చేయటం... దాన్ని ఎల్లో మీడియా విస్తృతంగా ప్రచారం చేయటం... తరవాత చంద్రబాబు సహా టీడీపీ వాళ్లు ఇవే అంశాల్ని మాట్లాడటం వీళ్ల మోడస్ ఆపరాండీ.

మొదట చూశారు... కుమార్తెకు చెప్పారు



వివేకా మృతదేహాన్ని మొదట చూసింది ఆయన పీఏ కృష్ణారెడ్డే. అక్కడే రక్తపు మరకలతో ఉన్న లేఖను, వివేకా మొబైల్ ఫోన్‌ను ఈయన తీసుకున్నాడు. అదే విషయాన్ని సునీతకు ఫోన్లో చెప్పాడు. సునీతతో పాటు వివేకా బావమరిది నర్రెడ్డి శివప్రసాద్ రెడ్డికి (ఈయన సునీత భర్త రాజశేఖరరెడ్డికి, సౌభాగ్యమ్మకు సొంత సోదరుడు) కూడా చెప్పాడు. ఈ విషయం కాల్ రికార్డ్స్‌లోనూ వెల్లడయింది. వివేకా గురించి సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పగానే... ఆ లేఖను, వివేకా ఫోన్‌ను ఎవ్వరికీ ఇవ్వవద్దని కృష్ణారెడ్డిని ఆయన ఆదేశించారు. దీంతో ఆయన తదుపరి వచ్చిన బంధువులకు గానీ, పోలీసులకు గానీ ఎవ్వరికీ దీన్ని చూపించలేదు. ఆ లేఖను చూపించి ఉంటే... దాన్లోని రక్తాన్ని చూసైనా ఎవ్వరూ మతదేహాన్ని ముట్టుకునేవారు కాదేమో. కానీ నర్రెడ్డి ఆదేశాలతో ఆయన ఎవ్వరికీ దీన్ని చూపించలేదు... చెప్పలేదు. ఈ విషయాన్ని సునీతే పోలీసుల దగ్గర అంగీకరించారు. అలా ఎందుకు చెప్పారని అడిగితే... కృష్ణారెడ్డికి ప్రాణభయం ఉంటుందనే ఉద్దేశంతోనే అలా చెప్పామన్నారు. లేఖ రాసింది తన తండ్రేనని, చేతి రాత ఆయనదేనని కూడా సునీత పోలీసు డీజీపీ ఎదుట అంగీకరించారు. నిజానికి రక్తంతో రాసిన ఆ లేఖను ఎవరు చూసినా... అది సహజ మరణం కాదని తేలిగ్గా అర్థమవుతుంది. పోలీసులకో, అక్కడికి వచ్చిన వారికో వెంటనే ఆ లేఖను ఇచ్చి ఉంటే... అక్కడి వ్యవహారం మరోలా ఉండేది. ఇది చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు జరిగిన హత్య. అప్పటి పోలీసులు గానీ, సీబీఐ గానీ ఎందుకు ఈ లేఖ, ఫోన్ చూపించలేదని... ఫోన్లో నుంచి వివేకా–ఆయన రెండో భార్య షమీమ్ సంభాషణల్ని ఎందుకు డిలీట్ చేశారని, సునీతను దూషిస్తూ షమీమ్ లేవనెత్తిన అంశాలను ఎందుకు డిలీట్ చేశారని విచారించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. అసలు ఆ కోణాన్నే పట్టించుకోలేదెందుకో..!!.

ఈ హత్యలో ఎల్లో మీడియా చేస్తున్న మరో దుష్ప్రచారమేంటంటే... ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందే అక్కడకు చేరుకున్నారనేది. నిజానికి అవినాశ్ అక్కడకు చేరేసరికే జనం పోగై ఉన్నారు. వివేకా గుండెపోటుతో చనిపోయారని, సిగరెట్లు ఎక్కువ తాగుతారు కనుక ఇలా జరిగిందని తనతో నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి చెప్పినట్లు స్వయంగా నాటి టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డే చెప్పారు. అదే శివప్రకాశ్ రెడ్డి అవినాశ్‌కూ ఫోన్ చేసి, ''బావ చనిపోయారు. అర్జెంటుగా అక్కడకు వెళ్లు'' అన్నారు. దీంతో జమ్మలమడుగులో ఎన్నికల ప్రచారానికని అప్పుడే బయల్దేరిన అవినాశ్‌రెడ్డి... వెంటనే యు టర్న్ తీసుకుని అక్కడకు చేరుకున్నారు. ఆయన ఫోన్ చెయ్యకుండా ఉంటే అవినాశ్‌కు విషయం తెలిసేదే కాదు. ఆయన అక్కడకు రాకుండా ఎన్నికల ప్రచారానికి వెళ్లిపోయి ఉండేవారు. బావ చనిపోయారు... వెళ్లమని చెప్పిన నర్రెడ్డి శివప్రసాద్... ఎలా చనిపోయారనేది కానీ, లెటర్– ఫోన్ సంగతి కానీ చెప్పలేదు. ఇదంతా ఒక్క స్కెచ్ ప్రకారం జరిగిందనటానికి ఇంతకన్నా ఏం కావాలి?

ఆస్తి కోసం సునీతతో విభేదాలు



వివేకా మరణించిన నాడు షమీమ్‌కు, వివేకాకు మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, మెసేజుల్లో చాలా అంశాలున్నాయి. ముఖ్యంగా సునీత గురించి జరిగిన ఎస్ఎంఎస్/సంభాషణలన్నీ ఆ తరవాత డిలీట్ చేసేశారు. ఎందుకు చేశారనేది దర్యాప్తు చేయనేలేదు. వివేకాకు, షమీమ్‌కు ఒక కుమారుడు ఉన్నాడనే అంశాన్ని సైతం రహస్యంగానే దాచిపెట్టారు. షమీమ్ సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో వివేకాను ఆయన కుమార్తె, అల్లుడు, బావమరిది ఏ రకంగా హింస పెట్టారు... చెక్ పవర్ తీసేసి ఆర్థికంగా ఎలా నిర్వీర్యం చేశారో స్పష్టంగా చెప్పారు. దస్తగిరి తాను వివేకాను చంపటానికి ముందు కొన్ని డాక్యుమెంట్ల కోసం ఇల్లంతా వెతికినట్లు సాక్షులు చెప్పారు. కానీ దర్యాప్తులో ఆ అంశాలకు విలువే ఇవ్వలేదు. అంతేకాదు. తొలుత ఛార్జిషీట్లో వివేకాకు, ఏ1గా పేర్కొన్న ఎర్ర గంగిరెడ్డికి ఆర్థికపరమైన వివాదాలున్నాయని, వివేకాకు ఏ2 సునీల్ యాదవ్ తల్లితోనూ, ఏ3 ఉమామహేశ్వరరెడ్డి భార్యతోనూ అక్రమ సంబంధాలున్నాయని స్పష్టంగా ఉన్నప్పటికీ... ఆ కోణాన్ని తరువాతి ఛార్జిషీట్లలో పూర్తిగా తొక్కిపట్టేశారు.

బాబు శిష్యుల కలయిక దేనికోసం?



కనెక్షన్ అనొచ్చు... రిలేషన్ అనొచ్చు. చంద్రబాబు నాయుడు, బీటెక్ రవి, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ, సునీత, షర్మిల అందరూ ఇందులో భాగమే. ఆ రాష్ట్రమూ కాదు... ఆ పార్టీ కూడా కాదు. కానీ రేవంత్‌రెడ్డిని బీటెక్ రవి వెళ్లి కలిశాడంటే ఏమిటర్థం? అప్పటిదాకా తెలంగాణలోనే చావో రేవో అన్న షర్మిల... ఆ తరవాత కాంగ్రెస్‌లో చేరి నేరుగా ఏపీకి వచ్చి ఈ రకమైన మంత్రాంగం నడుపుతున్నారంటే ఏమనుకోవాలి? అయినా ఇది చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన సంఘటన. మూడు నెలల తరవాత మరో ప్రభుత్వం వచ్చింది. పోలీసులూ వారే... దర్యాప్తు మొదలుపెట్టిందీ వారే. ఇంత స్పష్టంగా నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆదేశాలతో లేఖ, ఫోన్ దాచిపెడితే వారిని ఎందుకు విచారించలేదు? రాజకీయాలకు, విమర్శలకు ఈ సంఘటనను వాడుకుని... అసలు కేసును నీరుగార్చింది నాటి చంద్రబాబు ప్రభుత్వం కాదా? అసలు ఇన్ని కుట్రలు చేసే బదులు బాబు నేరుగా టీడీపీ టికెట్టే ఇవ్వవచ్చు కదా? అపుడు ప్రజల్లో ఎవరి బలం ఎంత ఉందో తెలిసిపోతుందిగా? కుట్రలకు, కుతంత్రాలకు విలువ ఉందో... లేక మంచి చేసిన ప్రభుత్వానికి విలువ ఉందో తేలిపోతుందిగా? ఏమంటావ్ బాబూ!!?

మరో 2 గ్యారంటీలు అమలు చేద్దాం

- ఈ బడ్జెట్లోనే వాటికి నిధుల కేటాయింపు
- అర్హులందరికీ లబ్ధి చేకూరేలా పథకాల అమలు
- ప్రజాపాలన దరఖాస్తుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: మరో రెండు గ్యారంటీల అమలుకు సన్నాహాలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ప్రజాపాలన దరఖాస్తులపై సీఎం కేబినెట్ సబ్‌కమిటీ మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్‌కమిటీలో ఉన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. రూ.500లకు సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తే ఎంత వ్యయం అవుతుంది? ఎంత మందికి లబ్ధి చేకూరుతుందనే వివరాలు ఇవ్వాలని, ఈ మూడు గ్యారంటీల అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. వీటిలో రెండింటిని తక్షణమే అమలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ బడ్జెట్లోనే వాటికి అవసరమైన నిధులు కేటాయించాలని సీఎం ఆర్థిక శాఖకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లోపు మరోసారి కేబినెట్ సబ్‌కమిటీతో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

మొత్తం డేటా ఎంట్రీ

రాష్ట్రవ్యాప్తంగా గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమంలో ఐదు గ్యారంటీలకు అర్హులైన వారి నుంచి గ్రామసభలు, వార్డు సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించిన విషయం విదితమే. ఐదు గ్యారంటీలకు మొత్తంగా 1,09,01,255 దరఖాస్తులు వచ్చాయి. జనవరి 12వ తేదీ నాటికే వీటికి సంబంధించిన డేటా ఎంట్రీ రికార్డు సమయంలో పూర్తి చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు.

ఒకే పేరుతో రెండు మూడు

ఒకే పేరుతో రెండు మూడు దరఖాస్తులు కొందరు ఇచ్చారని, కొన్నింటికి ఆధార్, రేషన్‌కార్డు నంబర్లు లేవని అధికారులు చెప్పారు. అలాంటి దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని, అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన జరపాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అర్హులైన వారెవరూ నష్టపోకుండా ఒకటికి రెండుసార్లు సరిచూడాలని చెప్పారు. దరఖాస్తుల్లో తప్పులుంటే వాటిని సరిదిద్దుకునేందుకు ఎంపీడీఓ ఆఫీసుల్లో లేదా తదుపరి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో మరోసారి అవకాశమిచ్చే ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. గ్యారంటీల అమలుకు లేనిపోని నిబంధనలు పెట్టి ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దని చెప్పారు. దరఖాస్తు చేసిన వారిలో అర్హులైన వారందరూ లబ్ధి పొందేలా చూడాలన్నారు. దరఖాస్తు చేయని వారుంటే.. నిరంతర ప్రక్రియగా మళ్లీ దరఖాస్తు చేసే అవకాశం కల్పించాలని సీఎం ఆదేశించారు. సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, హోంశాఖ సెక్రటరీ జితేందర్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం నుంచి అవకాశం ఇవ్వండి

లోక్‌సభ టికెట్‌కు దరఖాస్తు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి సతీమణి మల్లు నందిని

- అదే సీటు ఆశిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వీహెచ్
- రెండో రోజు 34 దరఖాస్తులు.. రేపటితో ముగియనున్న గడువు



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు తెరపైకి కొత్త ముఖాలు వస్తున్నాయి. ఈసారి ఎంపీలుగా పోటీ చేసే జాబితాలో పలువురు మంత్రుల కుటుంబ సభ్యుల పేర్లు ఉన్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని తనకు ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆమె గురువారం గాంధీభవన్‌లో దరఖాస్తు సమర్పించారు. కాగా, ఇదే సీటుకు మరో సీనియర్ నేత మాజీ ఎంపీ వి.హనుమంతరావు కూడా దరఖాస్తు చేయడం గమనార్హం. ఈ స్థానంలో ఆయన పోటీ చేస్తారనే చర్చ చాలాకాలంగా జరుగుతోంది. ఇదే సీటు కోసం కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మరో రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లు కూడా పోటీలో ఉన్నారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తే.. ఖమ్మం లోక్‌సభ సెగ్మెంట్ నుంచి బరిలో ఉంటారనే వార్తలు కూడా వస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఖమ్మం కాంగ్రెస్ పార్టీ హాట్‌సీటుగా మారిందనే చెప్పవచ్చు.

రెండోరోజు 34 మంది దరఖాస్తు

రెండోరోజు 34 మంది దరఖాస్తులు సమర్పించారు. ఆయా పార్లమెంట్ స్థానాల వారీగా చూస్తే మహబూబాబాద్‌కు 9, నాగర్‌కర్నూల్‌కు 8, వరంగల్‌కు 6, భువనగిరికి 6, ఖమ్మంకు 2, నిజామాబాద్‌కు 3 దరఖాస్తులు వచ్చాయి. భువనగిరి సీటుకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు ఉస్మానియా విద్యార్థినేత, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ దరఖాస్తు సమర్పించారు. నిజామాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత దరఖాస్తు అందజేశారు. మొత్తంగా చూస్తే ఇప్పటివరకు 41 మంది దరఖాస్తు చేశారు. కాగా ఈనెల 3వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువు ఉండటంతో శుక్ర, శనివారాల్లో భారీగా దరఖాస్తులు వస్తాయని గాంధీభవన్‌వర్గాలు అంచనా వేస్తున్నాయి.

డ్రగ్స్ కేసులో సరైన సాక్ష్యాలు లేవు

పలువురు సినీ నటులపై కేసు కొట్టివేత
దర్యాప్తు తీరుపై ఎక్సైజ్ శాఖపై కోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన టాలీవుడ్ డ్రగ్స్ కేసులో పలువురు సినీ నటులకు ఊరట లభించింది. డ్రగ్స్ కేసులో సరైన సాక్ష్యాలు లేవంటూ పలువురిపై కేసులను నాంపల్లి కోర్టు కొట్టేసింది. టాలీవుడ్ నటులే టార్గెట్‌గా 2017లో ఎక్సైజ్ కేసులు నమోదు చేయగా.. ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దాదాపు ఆరు నెలల పాటు సుదీర్ఘ విచారణ జరిపిన సిట్ 8 కేసులను నమోదు చేసింది. నిందితుల నుంచి గోళ్లు, వెంట్రుకలను కూడా నమూనాలుగా తీసుకుంది. అప్పటి నుంచి ఈ కేసులపై న్యాయస్థానంలో విచారణ సాగుతోంది. కాగా, శాంపిళ్లను ఎఫ్ఎస్ఎల్‌కు పంపగా.. డైరెక్టర్ పూరీ జగన్నాథ్, హీరో తరుణ్ శాంపిల్స్‌ను పరిశీలించింది. వాళ్ల శరీరంలో ఎలాంటి డ్రగ్స్ ఆనవాళ్లు లభించలేదని ఎఫ్ఎస్ఎల్ తేల్చింది. ఈ నివేదిక ఆధారంగా, సాక్ష్యాలు లేని కారణంగా 8 కేసుల్లో ఆరు కేసులను కొట్టివేస్తూ న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. సరైన ఆధారాలు, సాక్ష్యాలు లేకపోవడంతో పాటు డ్రగ్స్ కేసులో పాటించాల్సిన విధానాన్ని కూడా పాటించలేదని ఎక్సైజ్ శాఖపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చాలా కాలం విచారణ జరిపినా బలమైన సాక్ష్యాలను కోర్టుకు సమర్పించడంలో విఫలమైందని వ్యాఖ్యానించింది.

టాలీవుడ్‌లో ప్రకంపనలు..

2017 జూలైలో ఎక్సైజ్ శాఖ డ్రగ్స్ కేసు నమోదు చేసింది. డ్రగ్స్ సరఫరా చేస్తున్న కెల్విన్‌ను అరెస్టు చేసిన పోలీసులు, అతని సెల్‌ఫోన్, బ్యాంకు ఖాతాల ఆధారంగా దాదాపు 60 మందిని ప్రశ్నించారు. బాలానగర్, సికింద్రాబాద్, గోల్కొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. సిట్ అధికారులు 30 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టాలీవుడ్‌లో ఈ డ్రగ్స్ కేసు అప్పట్లో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. దీంతో ప్రభుత్వం అకున్ సబర్వాల్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. కేసులన్నింటినీ సిట్‌కు బదిలీ చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తూ సినీరంగానికి చెందిన 12 మందిని పిలిచి ప్రశ్నించారు. దర్యాప్తు పూర్తైన తర్వాత అధికారులు 12 నేరా భియోగ పత్రాలను వివిధ కోర్టులలో దాఖలు చేశారు. అయితే వీరిపై నేరాలు నిరూపణ కాకపోవడంతో న్యాయస్థానం ఆరు కేసులను కొట్టివేసింది. ప్రధాన నిందితుడు కెల్విన్‌పై నమోదైన కేసు ఇంకా విచారణ దశలో ఉంది.

నేటి నుంచి సీపీఐ జాతీయ సమితి సమావేశాలు

ఈ నెల 4న పాలస్తీనా సంఘీభావ సభ: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సాక్షి, హైదరాబాద్: సీపీఐ జాతీయ సమితి సమావేశాలను శుక్రవారం నుంచి ఈ నెల 4వరకు మఖ్దూం భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తాజా రాజకీయ పరిణామాలు, ఇండియా కూ టమి.. తదితర అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి 150 మంది జాతీయ సమితి ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఈ నెల 4వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాలస్తీనా సంఘీభావ సభను నిర్వహిస్తామన్నారు. ఈ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు హాజరు అవుతారని చెప్పారు. గురువారం మఖ్దూంభవన్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, టి.శ్రీనివాస రావు, ఎన్.బాలమల్లేశ్, కలవేని శంకర్‌లతో కలసి కూనంనేని మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ పాత్ర ఎలా ఉండాలి?, ఇండియా కూటమి నేపథ్యంలో సీట్ల సర్దుబాటు వంటి అంశాలపై ప్రధానంగా చర్చ జరగనుందని కూనంనేని వివరించారు. ప్రజల చైతన్య స్థాయిని మరింత పెంచేందుకు ప్రయత్నిస్తామని, మతం వేరు, రాజకీయం వేరు అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని, అందుకు వీలుగా తమ కార్యకలాపాలను రూపొందిస్తామని కూనంనేని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ దుర్మార్గ పాలనకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని, దేశంలో అత్యంత ప్రమాదకర పార్టీగా బీజేపీ మారిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విస్తృతంగా ప్రచారం జరుగుతోందని, మేడిగడ్డ ప్రాజెక్ట్ పనికి రాదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఆ ప్రాజెక్టు పరిస్థితిపై వాస్తవాలు ప్రకటించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో లోపాలు, అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 312

శుక్రవారం 2-2-2024





SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

పదేళ్ల ఎన్డీయే పాలన పురోగతిని వివరించేందుకే ప్రాధాన్యం

వేగవంతమైన వృద్ధి దిశగా మరిన్ని సంస్కరణలు

2047 నాటికి 'వికసిత్ భారత్'గా నిలిపే లక్ష్యంతో ముందుకు..

- పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు..
- అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకూ చేరాయన్న నిర్మలమ్మ
- ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో ఎలాంటి మార్పుల జోలికి వెళ్లని తీరు
- రక్షణ రంగానికి పెంపు.. 6.2 లక్షల కోట్లు కేటాయింపు
- పర్యాటక ప్రాంతంగా లక్షద్వీప్ అభివృద్ధి
- 'రూఫ్ టాప్ సోలార్'తో కోటి ఇళ్లకు 300 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్
- రైల్వే శాఖకు 2.52 లక్షల కోట్లు.. 40 వేల బోగీల ఆధునీకరణ
- ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలకు 'ఆయుష్మాన్ భారత్' వర్తింపు

"ఈ బడ్జెట్ 'వికసిత్ భారత్' 4 స్తంభాలైన యువత, పేదలు, మహిళలు, రైతులను మరింత శక్తివంతం చేస్తుంది. ఇది దేశ భవిష్యత్తును సృష్టించే బడ్జెట్. గ్రామాలు, నగరాల్లో పేదల కోసం 4 కోట్లకుపైగా ఇళ్లు నిర్మించాం. మరో 2 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తొలుత 2 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీ'లుగా తీర్చిదిద్దాలనేది లక్ష్యం.

- ప్రధాని నరేంద్ర మోదీ

నిర్మలమ్మ లెక్కలకు మోదీ మార్కులు

వేసుకుందాం.. వందకు వంద!



పేపరు ముందే లీకయిందో లేక, పాఠాలన్నీ బైపోసన పట్టేశారో గానీ... పరీక్షల ముందు విద్యార్థులు పడే టెన్షన్లో పదో వంతు కూడా మోదీ సర్కారులో కనిపించలేదు. బడ్జెట్లో సాధికారత అటుంచితే... ప్రవేశపెట్టడంలో మాత్రం సాధికారత కనిపించింది. 'ప్రోగ్రెస్ రిపోర్టు'లో వందకు వంద మార్కులు వేసుకుంది. ఎన్నికల తరుణంలోనూ తాయిలాల జోలికి పోకుండా.. గత పదేళ్ల పనితీరు వివరిస్తూ, దేశాన్ని తదుపరి దశకు తెచ్చామని చెప్పుకునేందుకే పరిమితమైంది. అభివృద్ధి చెందిన దేశంగా కొంతవరకూ మార్చగలిగామంటూ.. మరింత ముందుకెళ్లి పూర్తిగా వికసిత్ భారత్ సాధించడానికి మరో పాతికేళ్లు పడుతుందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. మామూలు రైళ్లను వందే భారత్ స్థాయిలో అప్‌గ్రేడ్ చేస్తామనటం.. రూఫ్‌టాప్ సోలార్‌తో ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు... ఇవన్నీ తమ హయాంలో దేశం కాస్త వికసించిందనే విశ్వాసంతో చేసిన ప్రకటనలే. కాకుంటే జనరల్ బోగీలు లేవనే ఆందోళనలు.. ఫుట్‌పాత్‌లకే పరిమితమయ్యే జీవితాలనూ చూడాలి. అందరితో కలిసి ప్రగతివైపు వెళతామన్న నిర్మలమ్మ మాటలు నిజమైతేనే వీళ్లూ వికసిస్తారు. అయినా ఇది ఓటాన్ అకౌంటేగా!. ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్లో ఇవి నెరవేరుతాయేమో!

▲ ఇప్పుడంతా 'కృత్రిమ మేధ (ఏఐ)'దే రాజ్యం. ఈ చిత్రం సహా బడ్జెట్ కవరేజీలోని ప్రతీకాత్మక చిత్రాలు, ఇలస్ట్రేషన్లను వినూత్నంగా 'ఏఐ'తో రూపొందించాం.

-గ్రాఫిక్స్: సీతారాం

మొత్తం బడ్జెట్	పన్నుల ఆదాయం	ఆదాయ లోటు	పన్నేతర ఆదాయం	అప్పుల ద్వారా సమీకరణ
₹47,65,768 కోట్లు	₹26,01,574 కోట్లు	₹16,85,494 కోట్లు	₹3,99,701 కోట్లు	₹16,81,944 కోట్లు

ఇళ్ల నిర్మాణ కోసం ప్రత్యేక పథకం

మధ్యతరగతికి సొంతింటి వరం

కోటి ఇళ్లకు 'సూర్యోదయం'

రక్షణకు రూ. 6.21 లక్షల కోట్లు

సాగుకు రూ. 1.27 లక్షల కోట్లు

ఎలక్ట్రిక్.. ఇక ఫుల్ చార్జ్

రైల్వే కారిడార్లకు గ్రీన్ లైట్
రూ.2.52 లక్షల కోట్లతో రైలు బడ్జెట్ కూత

బడ్జెట్ కథనాలు 2,6,7,8,9,10 పేజీల్లో

ఉమ్మడి ప్రాజెక్టులు బోర్డు నియంత్రణలోకి..

- కృష్ణా బోర్డు నియంత్రణలో శ్రీశైలం, సాగర్ నుంచి నీటి విడుదలకు తెలంగాణ, ఏపీ అంగీకారం
- జలవిద్యుత్ కేంద్రాలు మినహా మిగిలిన 10 ఔట్‌లెట్లపై బోర్డు నియంత్రణకు ఓకే
- రెండు ప్రాజెక్టుల్లోని ప్రతి విభాగం వద్ద పరస్పరం ఉద్యోగుల నియామకానికి నిర్ణయం

- కేఆర్ఎంబీ సమావేశం అనంతరం ఇరు రాష్ట్రాల ఈఎన్సీల వెల్లడి
- దీనిపై మీడియాలో వార్తలతో తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి నష్టనివారణ చర్యలు
- నీటివాటాలు తేలేదాకా ప్రాజెక్టులను అప్పగించేది లేదని స్పష్టీకరణ
- గత నెల 27న కేంద్రానికి రాసిన లేఖ మీడియాకు విడుదల
- జనవరి 17 నాటి భేటీలో తాము ప్రాజెక్టుల అప్పగింతను ఒప్పుకోలేదని పునరుద్ఘాటన

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నియంత్రణలోకి తీసుకెళ్లడానికి తెలంగాణ, ఏపీ నీటి పారుదల శాఖల ఈఎన్సీలు గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో అంగీకరించారు. ఇకపై శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలను కేఆర్ఎంబీ ప్రత్యక్ష నియంత్రణలో జరపాలని, ఇందుకోసం రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతి

మిగతా 11వ పేజీలో ▶



ఇదండీ వ్యంగ్యం



నేటి నుంచి పల్లెల్లో 'ప్రత్యేక' పాలన

ముగిసిన సర్పంచ్, వార్డు సభ్యుల పదవీకాలం

- గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలనకు ప్రభుత్వం ఉత్తర్వులు
- ఒక్కో పంచాయతీ లేదా కొన్ని జీపీలను కలిపి ప్రత్యేక అధికారుల నియామకానికి ఆదేశం

11లో


ఆశలు.. అంచనాలే..

- రాష్ట్రానికి ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు లేని కేంద్ర బడ్జెట్
- విభజన హామీల ఊసే లేదు.. ప్రాజెక్టుల ప్రస్తావన లేదు
- కేవలం కేంద్ర ప్రాజెక్టులు, కార్యక్రమాల ద్వారానే లబ్ధి
- కేటాయింపుల్లో స్పష్టత వస్తేనే రాష్ట్ర ప్రయోజనాల లెక్కలు తేలే అవకాశం

8లో



బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ గురువారం గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో తన చాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రమాణం చేయించారు 11లో







గురువారం కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు రాష్ట్రపతి భవన్‌కు వచ్చి తనను కలిసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్వీట్ తినిపిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



దేశ భవిష్యత్తును సృష్టించే బడ్జెట్

యువత ఆకాంక్షలను ప్రతిబింబిస్తోంది
మధ్యంతర బడ్జెట్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ 'వికసిత భారత్'నాలుగు స్తంభాలైన యువత, పేదలు, మహిళలు, రైతులను మరింత శక్తివంతం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ బడ్జెట్ దేశ భవిష్యత్తును సృష్టించే బడ్జెట్ అని కొనియాడారు. గురువారం బడ్జెట్ అనంతరం ఆయన టీవీలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 2047 నాటికి 'వికసిత భారత్'పునాదిని బలోపేతం చేసే హామీని ప్రస్తుత బడ్జెట్ ఇస్తోందని చెప్పారు. ఇది మధ్యంతర బడ్జెట్ అయినప్పటికీ సమగ్రంగా, వినూత్నంగా ఉందని, దేశ పురోభివృద్ధిపై పూర్తి విశ్వాసాన్ని కలిగిస్తోందని ప్రశంసించారు. భారతదేశ యువత ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని వెల్లడించారు. పరిశోధన, ఆవిష్కరణల కోసం బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించినట్లు తెలిపారు. స్టార్టప్ కంపెనీలకు పన్ను మినహాయింపులు ప్రకటించినట్లు గుర్తుచేశారు. గ్రామాలు, నగరాల్లో పేదల కోసం 4 కోట్లకు పైగా ఇళ్లు నిర్మించామని, మరో 2 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. తొలుత 2 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీ'లుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, ఆ సంఖ్యను 3 కోట్లకు పెంచామని వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడిందని, ఇకపై అంగన్‌వాడీ సభ్యులు, ఆశావర్కర్లు సైతం లబ్ధి పొందుతారని పేర్కొన్నారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

తాజా బడ్జెట్‌లో ద్రవ్య లోటును అదుపులో ఉంచుతూనే మూలధన వ్యయాలను భారీగా పెంచినట్లు నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మూలధన వ్యయం కోసం రూ.11,11,111 కోట్లు కేటాయించారని, ఆర్థికవేత్తల భాషలో చెప్పాలంటే ఇది తీపి కబురేనని వ్యాఖ్యానించారు. దీనివల్ల 21వ శతాబ్దంలో ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతుందని, కోట్లాది మంది యువతకు నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 'వందే భారత్ స్టాండర్డ్'కింద 40 వేల ఆధునిక కోచ్‌లను తయారు చేసి, సాధారణ ప్యాసింజర్ రైళ్లలో చేర్చాలని బడ్జెట్‌లో ప్రకటించారని, ఇది దేశవ్యాప్తంగా వివిధ రైల్వే మార్గాల్లో లక్షల మంది ప్రయాణికులకు ప్రయాణ సౌలభ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని వెల్లడించారు.

కోటి కుటుంబాలకు ఉచిత విద్యుత్

పేద, మధ్య తరగతి వర్గాలకు సాధికారత కల్పించడం, వారికి కొత్త ఆదాయ అవకాశాలను సృష్టించడంపై బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రధాని మోదీ చెప్పారు. సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్ల ద్వారా కోటి కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుతుందని అన్నారు. మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా ప్రజలు ఏటా రూ.15 వేల నుంచి రూ.18 వేల అదనపు ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. ఆదాయపు పన్ను ఉపశమన పథకంతో దాదాపు కోటి మంది మధ్య తరగతి ప్రజలకు గణనీయమైన లబ్ధి కలుగుతుందన్నారు. నానో డీఏపీ వినియోగం, పశువుల కోసం కొత్త పథకం, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ఆత్మనిర్భర్ ఆయిల్ సీడ్ అభియాన్ వంటి పథకాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని, ఖర్చులు తగ్గుతాయని వివరించారు.

బహీ ఖాతా తరహా పౌచ్‌లో బడ్జెట్ ట్యాబ్



న్యూఢిల్లీ: కట్టలకొద్దీ బడ్జెట్ ప్రతులతో పార్లమెంట్‌లోకి అడుగుపెట్టే సంస్కృతికి ఫుల్‌స్టాప్ పడి చాలా కాలమైంది. కాగితరహితమైన బడ్జెట్‌ను ఈసారీ విత్తమంత్రి నిర్మల విశిష్టమైన బహీ ఖాతా తరహాలో ఎరుపు రంగు పౌచ్‌లో ట్యాబ్‌ను తీసుకొచ్చారు. బ్రీఫ్‌కేస్ విధానాన్ని వదిలేసి గత మూడేళ్లుగా ఆమె ఇలాగే పౌచ్‌లోనే ట్యాబ్‌ను తీసుకొస్తున్నారు. బడ్జెట్ ప్రసంగం చేయడానికి పార్లమెంట్‌కు రావడానికి ముందు ఆమె కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయం బయట సహాయ మంత్రులు, శాఖ ఉన్నతాధికారులతో ట్యాబ్ పట్టుకుని గ్రూప్ ఫొటో దిగారు. 2020 లోనూ ఆమె బహీ ఖాతానే తెచ్చారు. 2021లో తొలిసారిగా పౌచ్‌లో ట్యాబ్‌ను పట్టుకొచ్చారు. అదే సంస్కృతిని ఈసారీ కొనసాగించారు. 2019లో సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌తో కలుపుకుంటే 2014 ఏడాది నుంచి మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 12వ బడ్జెట్ ఇది. నిర్మలకు ఇది ఆరో బడ్జెట్. దశాబ్దాలుగా బడ్జెట్‌ను సాయంత్రం ఐదు గంటలకు ప్రవేశపెట్టేవారు. ఈ ఆనవాయితీకి వాజ్‌పేయీ చెల్లుచీటీ ఇచ్చారు. వాజ్‌పేయీ హయాంలో నాటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా ఉదయం 11 గంటలకే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆనాటి నుంచి అదే సంస్కృతి కొనసాగుతోంది. బడ్జెట్ వివరాలను బ్రీఫ్‌కేస్‌కు బదులు బహీఖాతాలో తీసుకురావడంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి.చిదంబరం స్పందించారు. ''ఈ సంస్కృతి ఇలాగే కొనసాగుతోంది. భవిష్యత్తులో మా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అయితే ఆర్థిక మంత్రి బడ్జెట్‌ను ఐప్యాడ్‌లోనే తీసుకొస్తారు''అని వ్యాఖ్యానించారు.



GYAN పద్దు!

G గరీబ్ · Y యువ · A అన్నదాత · N నారీ

ఈ నాలుగు వర్గాలే ప్రాధాన్యతగా ముందుకు
బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
2047 నాటికి దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చడమే లక్ష్యమని వెల్లడి

న్యూఢిల్లీ: దేశ సుస్థిర, సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా, దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశంలో పేదలు, యువత, రైతులు, మహిళల సాధికారత, సంక్షేమమే తమ ప్రాధాన్యత అని ప్రకటించారు. గత పదేళ్లలో అభివృద్ధి ఎంతో వేగం పుంజుకుందని పేర్కొన్నారు. ఆమె గురువారం పార్లమెంటులో 2024–25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సీతారామన్ ప్రసంగ సారాంశం ఆమె మాటల్లోనే..

''గత పదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ సకారాత్మకంగా గణనీయ మార్పు సాధించింది. దేశ ప్రజలు ఎంతో ఆశగా, నమ్మకంతో భవిష్యత్తు వైపు చూస్తున్నారు. ప్రజల ఆశీర్వాదంతో, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఎన్నో సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొంది. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' మంత్రంతో, ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ముందడుగు వేస్తోంది. ఆర్థిక వ్యవస్థ నూతన శిఖరాల దిశగా సాగుతోంది. రెండోసారి ఘన విజయం సాధించిన తర్వాత మోదీ సర్కారు.. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్' మంత్రాన్ని చేపట్టి దేశంలోని అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి చర్యలు చేపట్టింది. అవినీతి, బంధుప్రీతి తగ్గాయి. సామాజిక న్యాయం అందుతోంది.

ఆత్మనిర్భర్ భారత్‌తో అమృత కాలానికి..

ప్రపంచాన్ని వణికించిన మహమ్మారి విసిరిన సవాళ్లను ఎదుర్కొని.. ఆత్మనిర్భర్ భారత్‌తో అమృతకాలానికి పునాదులు వేసుకున్నాం. అద్భుతమైన భవిష్యత్తు దిశగా సాగుతున్నాం. అందరికీ ఇళ్లు, ప్రతి ఇంటికీ నీళ్లు, విద్యుత్, వంటగ్యాస్, బ్యాంకు ఖాతాలు వంటివాటితో దేశంలోని ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి.

వికసిత్ భారత్ దిశగా..

అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ప్రజలందరికీ సమాన అవకాశాలతో ప్రకృతితో కలసి సాగుతూ.. 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపొందే దిశగా అడుగులు వేస్తాం. వచ్చే ఐదేళ్లలో అనూహ్య ప్రగతి సాధించబోతున్నాం. మనకు అవకాశాలకు కొదవలేదు. ఆకాశమే హద్దు. ఈ అద్భుతమైన పనితీరు చూపిన మా ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం. 'వికసిత భారత్' దిశగా చేపట్టే రోడ్‌మ్యాప్‌ను జూలైలో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌లో వెల్లడిస్తాం.

ప్రపంచవ్యాప్తంగా సవాళ్లు ఎదురవుతున్నా..

కొన్నేళ్లుగా యుద్ధాలు, వివాదాలతో ప్రపంచ పరిణామాలు సంక్లిష్టంగా మారుతున్నాయి. కీలక ఖనిజాలు, సాంకేతికతలు, సరుకుల రవాణాకు ఆటంకం కలుగుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అధిక వడ్డీరేట్లు, అప్పుల భారం, పర్యావరణ సమస్యలు సవాలుగా మారుతున్నాయి. వీటిని దీటుగా ఎదుర్కొంటూ, సరైన పరిష్కారాలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్నాం.ఇండియా–మధ్యప్రాచ్య దేశాలు– యూరప్ ఎకానమిక్ కారిడార్ మనదేశానికి ఒక గేమ్ చేంజర్. ప్రపంచ వాణిజ్యానికి కీలకంగా మారనున్న ఈ కారిడార్‌కు మూలం భారత్ అన్న విషయం చరిత్రలో నిలిచిపోతుంది.

మరిన్ని సంస్కరణలు తెస్తాం

సుస్థిర, సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి కోసం, అందరికీ అవకాశాలు అందించడం కోసం మరిన్ని సంస్కరణలు తెస్తాం. రాష్ట్రాలు, ఇతర భాగస్వాములతో చర్చించి అమలు చేస్తాం. ప్రపంచంతో పోటీపడేలా పరిశ్రమలకు తోడ్పాటుఅందిస్తాం. తూర్పు ప్రాంతం, అక్కడి ప్రజలు దేశ అభివృద్ధిని ముందుండి నడిపించేలా దృష్టిసారిస్తాం.

లక్షాధికారులను చేసేలా..

83 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలతో 9 కోట్ల మంది ప్రయోజనం పొందుతున్నారు. వారిలో కోటి మంది ఇప్పటికే లక్షాధికారులు (లక్‌పతి దీదీ) అయ్యారు. త్వరలో మూడు కోట్ల మందిని 'లక్‌పతి దీదీ'గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

నాలుగు వర్గాలకు ప్రాధాన్యత

పేదలు, మహిళలు, యువత, రైతులు.. ఈ నాలుగు వర్గాల అవసరాలు, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ నాలుగు వర్గాల వారికి ప్రభుత్వ మద్దతు అవసరం. వారు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుంది.

జీడీపీ అంటే.. ఈ మూడు.. : స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దేశం దూసుకుపోతోంది. అదే సమయంలో కీలకమైన మరో మూడు అంశాల 'జీడీపీ.. గవర్నెన్స్ (పరిపాలన), డెవలప్‌మెంట్ (అభివృద్ధి), పర్ఫార్మెన్స్ (పనితీరు)'పై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజలే కేంద్రంగా పారదర్శక, బాధ్యతాయుతమైన పరిపాలన అందించేందుకు.. సమ్మిళిత అభివృద్ధి కోసం కృషి చేస్తోంది.

పేదల సంక్షేమమే.. దేశ సంక్షేమం..

పేదలకు సాధికారత కోసం ప్రభుత్వం వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేసింది. ఫలితంగా గత పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రభుత్వం వివిధ పథకాల కింద రూ.34 లక్షల కోట్లను నేరుగా జన్‌ధన్ ఖాతాల్లో జమ చేసింది. దీనిద్వారా వృధా వ్యయం, అక్రమాలకు చెక్‌పడి ప్రభుత్వానికి రూ.2.7లక్షల కోట్లు మిగిలాయి. పీఎం స్వానిధి పథకం ద్వారా 78 లక్షల మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించాం. పీఎం జన్‌మన్ యోజన ద్వారా ఆదివాసీలు, విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతివృత్తుల వారు ప్రయోజనం పొందారు.

రైతులు మనకు అన్నదాతలు

దేశంలో రైతు కేంద్రిత విధానాలు అమలు చేస్తున్నాం. పంటలకు మద్దతు ధరలను క్రమంగా పెంచుకుంటూ వస్తున్నాం. కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా దేశ వ్యాప్తంగా 11.8కోట్ల మంది రైతుల ఖాతాల్లో ఏటా నగదు జమ అవుతోంది. నాలుగు కోట్ల మంది రైతులకు ఫసల్ బీమా యోజన అందుతోంది. ఈనామ్ ద్వారా 1,361 మార్కెట్లతో 1.8 కోట్ల మంది రైతులకు సేవలు అందుతున్నాయి.

యువత సాధికారతతోనే దేశ శ్రేయస్సు

యువతకు తగిన ప్రోత్సాహాన్ని, సాధికారతను అందించడంపైనే దేశ శ్రేయస్సు ఆధారపడి ఉంది. ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానం–2020 దేశంలో గుణాత్మక సంస్కరణలకు మార్గం వేసింది. పీఎంశ్రీ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతోంది. స్కిల్ ఇండియా మిషన్ ద్వారా 1.4కోట్ల మంది యువత శిక్షణ పొందారు. ప్రభుత్వం ఏడు ఐఐటీలు, 16 ట్రిపుల్ ఐటీలు, 7 ఎయిమ్స్, 390 యూనివర్సిటీలతోపాటు 3 వేల కొత్త ఐటీఐలను నెలకొల్పింది. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు పీఎం ముద్రా యోజన ద్వారా 22.5 లక్షల కోట్ల రుణాలు అందించాం. స్టార్టప్ ఇండియా, స్టార్టప్ క్రెడిట్ గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పుడు వారు 'ఉద్యోగ దాత'లు అవుతున్నారు. క్రీడలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహానికి.. ఆసియన్ గేమ్స్‌లో మన క్రీడాకారులు సాధించిన పతకాలే నిదర్శనం.

నారీ శక్తి ముందడుగు..

గత పదేళ్లలో మహిళల సాధికారత, ఆత్మగౌరవం కోసం తీసుకున్న చర్యలతో 'నారీ శక్తి' ముందడుగు వేస్తోంది. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు 30 కోట్ల ముద్ర రుణాలు అందించాం. ఉన్నత విద్యను అభ్యసించే మహిళలు 28శాతం పెరిగారు. 'స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథ్స్)' కోర్సుల్లో చేరుతున్నవారిలో 43శాతం మంది మహిళలే. ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఇవన్నీ ఉద్యోగాలు/ఉపాధిలో మహిళ భాగస్వామ్యం పెంచాయి. ట్రిపుల్ తలాక్ రద్దు, లోక్‌సభ/అసెంబ్లీలలో మూడో వంతు రిజర్వేషన్లు, పీఎం ఆవాస్ యోజన కింద 70శాతం మహిళా లబ్ధిదారులకే మంజూరు వంటివి మహిళల ఆత్మగౌరవానికి తోడ్పడుతున్నాయి.

పేదలకు మరో రెండు కోట్ల ఇళ్లు

- పీఎం ఆవాస్ యోజన ద్వారా గత ఐదేళ్లలో మూడు కోట్ల ఇళ్లను నిర్మించాలన్న లక్ష్యానికి దాదాపు పూర్తి చేసుకుంటున్నాం. వచ్చే ఐదేళ్లలో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మిస్తాం.
- రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు ద్వారా కోటి ఇళ్లకు ప్రతి నెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుంది. ప్రజలకు ఏటా రూ.15 వేల నుంచి రూ.18 వేలు ఆదా అవుతాయి. దీనితో ఎంతో మందికి ఉపాధి కూడా లభిస్తుంది.
- అద్దె ఇళ్లలో నివసిస్తున్న మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు త్వరలో కొత్త పథకాన్ని ప్రారంభిస్తాం.
- దేశంలో మెడికల్ కాలేజీల సంఖ్యను గణనీయంగా పెంచుతాం. దీనిపై ప్రతిపాదనల కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం.
- మహిళల్లో సర్వైకల్ కేన్సర్ నివారణ కోసం 9–14 ఏళ్ల మధ్య వయసు బాలికలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడతాం.
- గర్భిణులు, శిశువుల సంక్షేమం, పోషకాహారం అందించడం కోసం అంగన్‌వాడీలను 'సక్షం అంగన్‌వాడీ అండ్ పోషణ్ 2.0'గా అప్‌గ్రేడ్ చేస్తాం.
- చిన్నారుల్లో వ్యాధుల నివారణ కోసం టీకాల కార్యక్రమాన్ని విస్తృతం చేస్తాం.
- ఆశా, అంగన్‌వాడీ వర్కర్లకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వర్తింపజేస్తాం.
- రైతులకు ప్రయోజనం కలిగేలా ఫుడ్ ప్రాసెసింగ్, పంటల నిల్వ, రవాణా సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తాం. నానో డీఏపీ వినియోగాన్ని పెంచుతాం.
- వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఇతర నూనె గింజల దిగుబడి పెరిగేలా పరిశోధన, ఆధునిక వ్యవసాయ విధానాలపై పరిశోధనలను ప్రోత్సహిస్తాం.
- పశువుల్లో ఫుట్ అండ్ మౌత్ వ్యాధి నియంత్రణకు చర్యలు చేపడతాం.
- మత్స్య పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఐదు సమీకృత ఆక్వాపార్క్‌లను ఏర్పాటు చేస్తాం.
- సరికొత్త టెక్నాలజీల రూపకల్పన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు రూ.లక్ష కోట్లతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తాం.
- రక్షణ రంగం కోసం డీప్–టెక్ సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి కొత్త పథకాన్ని ప్రారంభిస్తాం.
- దేశంలో పర్యాటకాన్ని పెంచేందుకు ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఇందుకోసం రాష్ట్రాలకు వడ్డీ రహిత రుణాలు ఇస్తాం.

బడ్జెట్ ప్రసంగం 56 నిమిషాలే

నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాల్లో ఇదే అతి చిన్నది..

న్యూఢిల్లీ: లోక్‌సభలో గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం కేవలం 56 నిమిషాల్లో ముగిసింది. ఆమె ఇప్పటిదాకా ఆరు సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అన్ని బడ్జెట్ ప్రసంగాల్లో ఇదే అతి చిన్నది కావడం విశేషం. ఈసారి క్లుప్తంగా ముగించారు. ఈ ఏడాది జూలైలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని నిర్మలా సీతారామన్ ప్రకటించగానే కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు బల్లలు చరుస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రసంగాన్ని ప్రతిపక్ష సభ్యులు శ్రద్ధగా విన్నారు. అయోధ్యలో జరిగిన బాలరాముడి ప్రాణప్రతిష్టకు సంకేతంగా నిర్మలా సీతారామన్ నీలం రంగు ఎంబ్రాయిడరీ పట్టు చీర ధరించారు. ఈ రంగును తమిళంలో 'రామా నీలం'అని పిలుస్తారు. బడ్జెట్ ట్యాబ్ ఉన్న ఎరుపు రంగు సంచితో సభలోకి అడుగుపెట్టారు. 56 నిమిషాల్లో బడ్జెట్ ప్రసంగం పూర్తిచేశారు. నిర్మలా సీతారామన్ 2019లో 2.17 గంటలు, 2020లో 2.40 గంటలు, 2021లో 1.50 గంటలు, 2022లో 92 నిమిషాలు, 2023లో 87 నిమిషాలపాటు బడ్జెట్ ప్రసంగం చేశారు. ఆమె తన బడ్జెట్ ప్రసంగంలో తమిళ కవులు, మేధావులను ప్రస్తావించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి మాత్రం అలాంటి ప్రస్తావన తీసుకురాలేదు. ప్రధాని మోదీ పేరును 8 సార్లు ప్రస్తావించారు. నిర్మలా సీతారామన్ కుమార్తె వాంగ్మయి పరకాల, బంధువులు కృష్ణమూర్తి లక్ష్మీనారాయణ్, విద్యా లక్ష్మీనారాయణ్ లోక్‌సభలో గ్యాలరీ కూర్చొని బడ్జెట్ ప్రసంగాన్ని వీక్షించారు. బడ్జెట్ ప్రవేశపెట్టడానికంటే ముందు నిర్మలా సీతారామన్, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీతారామన్‌కు రాష్ట్రపతి చక్కెర కలిపిన తీపి పెరుగు తినిపించారు. అభినందనలు తెలియజేశారు.


ఇదీ బడ్జెట్ సమగ్ర స్వరూపం (అంకెలు రూ.కోట్లలో)

అంశం	2022-23 వాస్తవ గణాంకాలు	2023-2024 బడ్జెట్ అంచనాలు	2023-2024 సవరించిన అంచనాలు	2024-2025 బడ్జెట్ అంచనాలు
1. రెవెన్యూ వసూళ్లు	23,83,206	26,32,281	26,99,713	30,01,275
• పన్ను ఆదాయం	20,97,786	23,30,631	23,23,918	26,01,574
• పన్నేతర ఆదాయం	2,85,421	3,01,650	3,75,795	3,99,701
2. మూలధన వసూళ్లు	18,09,951	18,70,816	17,90,773	17,64,494
• రుణాల రికవరీ	26,161	23,000	26,000	29,000
• ఇతర వసూళ్లు	46,035	61,000	30,000	50,000
• అప్పులు, ఇతర వసూళ్లు	17,37,755	17,86,816	17,34,773	16,85,494
మొత్తం ఆదాయం (1+2)	41,93,157	45,03,097	44,90,486	47,65,768
మొత్తం వ్యయం (3+6)	41,93,157	45,03,097	44,90,486	47,65,768
3. రెవెన్యూ ఖాతా	34,53,132	35,02,136	35,40,239	36,54,657
4. వడ్డీ చెల్లింపులు	9,28,517	10,79,971	10,55,427	11,90,440
5. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు	3,06,264	3,69,988	3,21,190	3,85,582
6. మూలధన ఖాతా	7,40,025	10,00,961	9,50,246	11,11,111
వాస్తవ మూలధన వ్యయం (5+6)	10,46,289	13,70,949	12,71,436	14,96,693
7. రెవెన్యూ లోటు (3-1)	10,69,926	8,69,855	8,40,527	6,53,383
8. నికర రెవెన్యూ లోటు (7-5)	7,63,662	4,99,867	5,19,337	2,67,801
9. ద్రవ్య లోటు	17,37,755	17,86,816	17,34,773	16,85,494
10. ప్రాథమిక లోటు	8,09,238	7,06,845	6,79,346	4,95,054

2014 ముందునాటి ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం

లోక్‌సభలో ప్రవేశపెడతాం.. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో 2014 సంవత్సరం కంటే ముందు జరిగిన ఆర్థిక దుర్వినియోగంపై శ్వేతపత్రం తీసుకొస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2014 మే నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగా, అంతకు ముందు పదేళ్లపాటు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం పాలించింది. 'ఇప్పుడు మనం ఎక్కడ ఉన్నాం, అలాగే, 2014 ముందు వరకు మనం ఎక్కడున్నామో తెలుసుకునేందుకు ఇది సరైన సమయం. అప్పటి ఆర్థిక దుర్వినియోగంపై పాఠాలు చెప్పే లక్ష్యంగా దీన్ని తీసుకొస్తాం. ప్రభుత్వం శ్వేతపత్రం రూపొందించి లోక్‌సభలో ప్రవేశపెడుతుంది'అని గురువారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. '2014లో మోదీ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించాక ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దే బాధ్యత మీద పడింది. దీంతో అంచెలంచెలుగా దీన్ని గాడిన పెట్టేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషిచేసింది'అని చెప్పారు. దేశ ప్రజలకు ఆశలు కల్పించేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు, అవసరమైన సంస్కరణలను తీసుకొచ్చేందుకు ఇది సరైన సమయమన్నారు. 'అన్నిటికంటే దేశం ముందు'అనే బలీయమైన విశ్వాసంతో ప్రభుత్వం విజయవంతంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. నాటి సంక్షోభ పరిస్థితులను అధిగమించామని, ఇప్పుడు ఆర్థిక పరిస్థితి పటిష్టంగా ఉందని ఆమె పేర్కొన్నారు. దేశ ప్రజలు బంగారు భవిష్యత్తుపై ఆశావాదంతో ఉన్నారని, మోదీ ప్రభుత్వం 'సబ్ కా సాథ్.. సబ్‌కా వికాస్'మంత్రంతో నాటి సవాళ్లను విజయవంతంగా అధిగమించిందని చెప్పారు.



ఎక్స్‌ను ముంచెత్తిన 'ఆదాయపన్ను' మీమ్స్



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం ముగియగానే ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా సోషల్ మీడియాలో ట్రెండింగ్ జాబితాలో ఆదాయపన్ను (#IncomeTax) తొలి స్థానంలో నిలిచింది. అయితే ఆదాయపన్ను శ్లాబ్‌లలో నిర్మలమ్మ ఎలాంటి మార్పులు చేయకపోవడంతో నెటిజన్లు తమ అసంతృప్తిని 'మీమ్స్' రూపంలో వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాపులర్ కామెడీ షో తారక్ మెహతా కా ఉల్టా చష్మాలోని 'జెతాలాల్' పాత్రధారి నిట్టూరుస్తూ చెప్పే డైలాగులతో కూడిన మీమ్స్ 'ఎక్స్'ను ముంచెత్తాయి. అలాగే కొందరు విచిత్ర హావభావాలతో కూడిన ఫొటోలను పోస్ట్ చేసి వాటికి తమ సొంత డైలాగులను జత చేశారు. 'బేకార్ హై భయ్యా.. మై తొ టూట్ గయా అబ్' అని ఓ నెటిజన్ పేర్కొనగా 'కుచ్ నహీ బద్‌లా యార్.. ఆజ్ భీ సబ్ కుచ్ వైసే కా వైసే హీ హై' అంటూ మరొకరు వ్యాఖ్యానించారు. ఇంకొకరేమో ట్యాక్ శ్లాబ్‌లలో మార్పుల కోసం చూసి చూసి అస్థిపంజరంలా మారామన్నట్లుగా ఓ అస్థిపంజరం ఫొటోను పోస్టు చేశారు. ఈ పోస్టులను ఒకవేళ నిర్మలమ్మ చూస్తే ఆమె స్పందన 'జైసా చల్ రహా హై.. వైసా చల్ నే దే' అన్నట్లుగా ఉంటుందంటూ మరొకరు ఓ వ్యాఖ్యను జోడించారు.

పోలీసులపై ప్రభుత్వ పెత్తనం ఉండదు

- రాష్ట్ర పునర్‌నిర్మాణంలో పోలీసుల సలహాలు తీసుకుంటాం
- డ్రగ్స్, సైబర్‌క్రైం నియంత్రణకు చర్యలు తీసుకోవాలి
- ఐపీఎస్ ఆఫీసర్ల గెట్ టు గెదర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీజీపీ రవిగుప్తా

సాక్షి, హైదరాబాద్: ఆర్థికంగా, సామాజికంగా ధ్వంసమైన తెలంగాణను పునర్‌నిర్మించాల్సిన అవసరం ఉందని, ఇందులో పోలీసులు కీలకపాత్ర పోషించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఐపీఎస్ అధికారుల గెట్ టు గెదర్ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులపై ప్రభుత్వ పెత్తనం ఉండబోదన్నారు. పోలీసులను సబార్డినేట్లుగా చూసే పద్ధతి తమ ప్రభుత్వంలో ఉండదన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన ఓ అవకాశంగా మాత్రమే ఈ అధికారాన్ని తాము భావిస్తున్నామని, ప్రజలకు సేవ చేయడంలో అందరినీ కలుపుకొనిపోతామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, పునర్‌నిర్మాణంలో పోలీసులు ఇచ్చే సలహాలు, సూచనలను వినమ్రంగా స్వీకరిస్తామని తెలిపారు.

పోలీసుల పాత్ర క్రియాశీలకం కావాలి..

గత పదేళ్ల కాలంలో రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతిన్నదని, ఈ పరిస్థితి నుంచి తెలంగాణను బయటపడేయాల్సిన సమయం వచ్చిందని సీఎం అన్నారు. ఈ పనిలో పోలీసు ఆఫీసర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. రాష్ట్రంలో డ్రగ్స్ క్రయ, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా చేయాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు అతిపెద్ద ముప్పుగా పరిణమించాయని, వాటిని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఆఫీసర్లను సీఎం కోరారు. ఇందుకోసం అభివృద్ధి చెందిన దేశాల్లో అనుసరిస్తున్న పద్ధతులపై అధ్యయనం చేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కష్టపడుతున్నారని సీఎం అభినందించారు. పోలీసుల సమస్యలు తెలుసుకోవడానికి, వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ రవిగుప్తా, అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి, సీఐడీ అడిషనల్ డీజీ షికా గోయల్, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గద్దర్ అవార్డుల నిర్ణయం భేష్

గద్దర్ కుటుంబం హర్షం

అల్వాల్: ప్రజాయుద్ధనౌక గద్దర్ పేరిట కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడంపై ఆయన సతీమణి విమలా గద్దర్, కుమారుడు సూర్య, కూతురు వెన్నెల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇస్తున్న నంది అవార్డులను ఇక నుండి గద్దర్ పేరుతో ఇవ్వడం, ఇకముందు గద్దర్ జయంతి రోజే కళాకారులకు పురస్కారాలను బహూకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆయన సేవలను గుర్తించి సముచితస్థానాన్ని కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గానికి, కాంగ్రెస్ పార్టీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆ భూములు కొన్నదెవరు ?

- కొన్నారు..తిన్నారు' కథనంపై ఇంటెలిజెన్స్ ఆరా
- రెవెన్యూ, పోలీస్ విభాగాల్లో ఉక్కిరిబిక్కిరి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తక్కువ ధరలకే ఫార్మాసిటీ పరిసరాల్లో భూములు కొన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎవరనే దానిపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నారు. 'కొన్నారు..తిన్నారు'శీర్షికన గురువారం సాక్షి ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని కొందరు రెవెన్యూ, పోలీసు అధికారులతోపాటు, పలువురు ప్రజాప్రతినిధులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మాజీ సీఎస్ కొనుగోలు చేసిన భూములతోపాటు మాజీ ఐపీఎస్ అధికారి, వారి బంధువులు కొల్లగొట్టిన భూముల వివరాలు సేకరిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ, ఆ సమయంలో జరిగిన భూ లావాదేవీలు, సరిహద్దు గ్రామాల్లో వెలిసిన ఫాంహౌస్‌లు, వాటి వెనుక ఉన్న పెద్దలు, ఉన్నతాధికారులపై వివరాలు సేకరిస్తున్నారు. కొత్తపల్లి సహా కుర్మిద్ద, నక్కర్తిమేడిపల్లి, ముచ్చర్ల, ఆ పరిసర ప్రాంతాల్లో ముందే భూములు కొనుగోలు చేసి, ఫార్మాసిటీ భూ సేకరణలో భాగంగా ప్రభుత్వానికి అప్పగించి పెద్ద మొత్తంలో లబ్ధి పొందిన వారి వివరాలు కూడా సేకరిస్తున్నారు. భూదాన్ బోర్డు భూములను అన్యాక్రాంతం చేసిన నేతలతోపాటు వారికి సహకరించిన అప్పటి అధికారుల వివరాలు కూడా ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉంటే మరోవైపు యాక్షన్ ఫర్ యాంటీ కరప్షన్ కమిటీ సంస్థ ఈడీ, సీబీఐలకు ఫిర్యాదు చేసింది. అయితే ఈ అంశంపై సంబంధిత విభాగాలు కేసు నమోదు చేసి, విచారణ జరిపిస్తాయా? వేచి చూడాల్సిందే.

కేటీపీఎస్‌లో ఎత్తయిన చిమ్నీలు నేలమట్టం

ఓఅండ్‌ఎం(పాత ప్లాంట్)లో కాలం చెల్లిన యంత్రాలు తుక్కుగా మారిన వైనం



పాల్వంచలోని ఓఅండ్‌ఎం కర్మాగారంలో నేలమట్టమవుతున్న చిమ్నీలు

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ ఓఅండ్‌ఎం(పాత ప్లాంట్)లో కాలంచెల్లిన అతి ఎత్తయిన చిమ్నీలను పటిష్టమైన భద్రత నడుమ మంగళవారం నేలమట్టం చేశారు. ఇప్పటికే మూతబడిన ఈ కర్మాగారాన్ని ముంబైకి చెందిన హెచ్‌ఆర్ కమర్షియల్ సంస్థ ఆధ్వర్యాన విడివిభాగాలు, యంత్రాలను తుక్కుగా మార్చి తరలిస్తున్నారు. ఇందులో భాగంగా యూనిట్లలోని చిమ్నీలను అత్యంత భద్రత నడుమ గురువారం కూల్చివేశారు. 1965–67 సంవత్సరంలో ఓఅండ్‌ఎం కర్మాగారంలోని 'ఏ'స్టేషన్‌లో 60 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 1, 2, 3, 4వ యూనిట్లలోని చిమ్నీలను 90 మీటర్ల ఎత్తుతో నిర్మించారు. 'బీ'స్టేషన్‌లో 120 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5, 6 యూనిట్లలో 100 మీటర్ల ఎత్తుతో, 'సీ'స్టేషన్‌లో 120 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 7, 8వ యూనిట్లలో 110 మీటర్ల ఎత్తుతో చిమ్నీలు నిర్మించారు. వీటిలో 1 నుంచి 6 యూనిట్ల చిమ్నీలను ఏకకాలంలో కూల్చేశారు. కాగా, ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్లే రహదారి వెంట పాల్వంచలో కనిపించే ఈ చిమ్నీల జ్ఞాపకాలను పదిలంగా భద్రపర్చుకునేందుకు పలువురు స్థానికులు కూల్చివేత దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించారు.

విలువలు లోపించాయి

ప్రస్తుత రాజకీయాలపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జె.చలమేశ్వర్

- ముగ్గురు సీఎంలపై 'మూడు దారులు' పుస్తక పరిచయ సభ
- ప్రజలను మెప్పించి సీఎం అయిన జగన్‌మోహన్‌రెడ్డి : పుస్తక రచయిత దేవులపల్లి అమర్



జస్టిస్ జె. చలమేశ్వర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దేవులపల్లి అమర్. చిత్రంలో కల్లూరి భాస్కరం

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో రాజ్యాంగ విలువలు లోపించాయని, అధికారం వచ్చాక తాము ఏది చేసినా చెల్లుతుందనే ధోరణి కొనసాగుతోందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జె.చలమేశ్వర్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా గురువారం ప్రముఖ పాత్రికేయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్.. దివంగత నేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి, వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబునాయుడు గురించి రచించిన 'మూడు దారులు'పుస్తక పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ జె.చలమేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ పరంగా విధివిధానాలు వేరైనా.. ముగ్గురి గమ్యం ఒక్కటేనని అన్నారు. పాదయాత్ర అనంతరం వై.ఎస్. రాజశేఖరరెడ్డి వ్యక్తిత్వంలో చాలా మార్పు వచ్చిందని అన్నారు. ఒక సందర్భంలో వైఎస్‌ను కలిసినప్పుడు ఈ విషయాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నానని తెలిపారు. నేరుగా ప్రజల చెంతకు వెళ్లి, వారికి నమ్మకం కల్పించిన నాయకుడే అధికారాన్ని పొందగలుగుతాడని ఆయన పేర్కొన్నారు. వైఎస్ తన పాదయాత్ర ద్వారా ప్రజల్లో ఆ నమ్మకాన్ని కల్పించి జననేతగా నిలిచారన్నారు.

చంద్రబాబు స్వయం ప్రకాశితుడు కాదు..

ఒక పాత్రికేయునిగా తాను చూసిన వాస్తవ సంఘటనలను తన అభిప్రాయాలుగా మూడు దారలుగా తీసుకువచ్చానని రచయిత దేవులపల్లి అమర్ అన్నారు. ఉత్తరాది రాజకీయ నాయకులకు దక్షణాదిలో కొనసాగుతున్న వాస్తవ రాజకీయ పరిణామాలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఇదే పుస్తకాన్ని 'డక్కన్ పవర్ ప్లే'పేరుతో ఇంగ్లిష్‌లో కూడా తీసుకువచ్చానని చెప్పారు. కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలో అసమ్మతి నేతగా కొనసాగి, ప్రజల మెప్పుతో ఆ పార్టీనే తనపైన ఆధారపడేలా ప్రభావితం చేసిన గొప్ప నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని పేర్కొన్నారు. నాలుగు గోడల మధ్య నుంచి ముఖ్యమంత్రిగా వచ్చిన వ్యక్తి చంద్రబాబు నాయుడని ఆయన అభిప్రాయపడ్డారు. పొత్తులతోనే ఆయన ముఖ్యమంత్రిగా అయ్యారుకానీ, చంద్రబాబు స్వయం ప్రకాశితుడు కారని చెప్పారు. ఒంటరిగా పోటీ చేసిన ప్రతీసారి బాబు ఓడిపోయారన్నారు. 1993లో ఎన్‌టీఆర్ తనకు జరిగిన మోసాన్ని తిప్పికొట్టి 1994లో మళ్లీ ముఖ్యమంత్రిగా నిలిచారని, కానీ కొద్ది రోజుల్లోనే ఆయనకు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు సీఎంగా మారారని అన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రికి భిన్నంగా ప్రయాణం చేశారని, ఓదార్పు యాత్రకు కాంగ్రెస్ నిరాకరిస్తే ఆ పార్టీనే వదిలి ప్రజల చెంతకు చేరారని అన్నారు. కక్షసాధింపుతో ఆ పార్టీ ప్రభుత్వం కేసులు పెట్టినా 16 మాసాలు జైల్లో ఉండి, అనంతరరం ప్రజల మెప్పుతో 2019లో ఏపీ ముఖ్యమంత్రిగా పదవి చేపట్టారని కొనియాడారు. సీనియర్ పాత్రికేయుడు కల్లూరి భాస్కరం, చక్రధర్, రామకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


మావోల సరికొత్త ఎత్తుగడ

- హెలికాప్టర్ దాడులు తిప్పికొట్టేలా కేడర్‌కు శిక్షణ
- షెల్టర్ జోన్ల కోసం బంకర్ల నిర్మాణం
- కొత్తగా స్నైపర్ టీమ్‌ల ఏర్పాటుకు కసరత్తు
- గతేడాదే వెలుగు చూసిన 80 పేజీల డాక్యుమెంట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్ అడవుల్లో బంకర్ వెలుగుచూసిన నేపథ్యంలో మావోయిస్టులు సరికొత్త ఎత్తుగడలు అనుసరిస్తున్నట్టు తెలిసింది. దశాబ్దంన్నర కాలంగా బస్తర్ అడవుల్లో మావోయిస్టులు నిర్వహిస్తున్న జనతన సర్కార్‌ను నిర్వీర్యం చేసేందుకు భద్రతాదళాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. వందల సంఖ్యలో క్యాంపులు ఏర్పాటు చేస్తూ, ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ క్రమంగా అడవులపై పట్టు సాధిస్తున్నాయి. దీంతో పోలీసుల వ్యూహాలకు ప్రతివ్యూహాలు అమలు చేసే పనిలో మావోయిస్టులు ఉన్నారు. ఈ మేరకు 80 పేజీలతో కూడిన ప్రత్యేక డాక్యుమెంట్‌ను గోండు భాషలో తయారు చేశారు. ఇందులో ఉన్న రణతంత్ర వివరాలపై గతంలోనే జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే, దీనిని ఆతర్వాత కొందరు హిందీలోకి అనువదించినట్టు తెలిసింది.

ఆకాశదాడులు తిప్పికొట్టేలా..

డ్రోన్లు, హెలికాప్టర్లతో భద్రతాదళాలు తమపై రెండేళ్లుగా దాడులు చేస్తున్నాయంటూ మావోయిస్టులు ఆరోపిస్తుండగా, మావోయిస్టుల ఏరివేతకు వాయు దాడులు చేయడం లేదని భద్రతాదళాలు చెబుతున్నాయి. డ్రోన్లు ఉపయోగించినా నిఘా కోసమే తప్ప దాడులకు కాదంటున్నారు. ఇలా భిన్నవాదనలు ఉన్నా, ఆకాశ దాడులను తట్టుకోవడంతో పాటు తిప్పికొట్టే వ్యూహాలపై మావోయిస్టులు తీవ్రంగా ఆలోచించారు. ఈమేరకు రక్షణ వ్యూహాల్లో డ్రోన్లు, హెలికాప్టర్ల దాడుల నుంచి తప్పించుకునే అంశంపై డాక్యుమెంట్‌లో చర్చించారు. తాము సంచరిస్తున్న ప్రాంతాల్లో డ్రోన్లు లేదా హెలికాప్టర్లు ఎదురైతే వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని నిర్ణయించారు. డ్రోన్లు, హెలికాప్టర్ దాడులను తిప్పికొట్టేలా 'చెట్లపై నుంచి రాకెట్ లాంచర్లు పేల్చడం'పై కేడర్‌కు శిక్షణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. డ్రోన్లపై తేలికగా దాడులు చేసేందుకు వీలుగా కొండపై ఎత్తయిన ప్రాంతాల్లో గస్తీ బృందాలు ఏర్పాటు చేయడం, అక్కడి నుంచే లాంగ్ పైప్ బాంబులను ప్రయోగించే దానిపై ఫోకస్ చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.



గతేడాది వెలుగు చూసిన మావోయిస్టుల సరికొత్త రణతంత్రం డాక్యుమెంట్లు

మూడడుగుల బంకర్లు

డ్రోన్లు, హెలికాప్టర్ల కంట పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా డాక్యుమెంట్‌లో చర్చించారు. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు అడవిలో ఆరుబయట ప్రాంతంలో కాకుండా పైనుంచి చూస్తే కనిపించకుండా ఉండే చెట్ల కిందే విశ్రమించాలని నిర్ణయించారు. ఒకే చోట ఎక్కువ కాలం ఉంటే...కనీసం మూడు అడుగుల లోతుతో బంకర్లు నిర్మించాలని డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు.

కొత్తగా మావోయిస్టు స్నైపర్ టీమ్‌లు

మావోయిస్టులకు ఇప్పటికే బెటాలియన్లు, ప్లాటూన్లు, లోకల్ గెరిల్లా స్క్వాడ్, యాక్షన్స్ టీమ్‌లు ఉన్నాయి. అయితే అబూజ్‌మడ్ అడవుల్లో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ క్యాంపులు పెరిగిపోతున్నాయి. ఒకేసారి వందల మందితో కూడిన బెటాలియన్లు అడవుల్లో నలుదిశలా కూంబింగ్ చేస్తున్నాయి. దీంతో భద్రతాదళాలపై అందుబాటులో ఉన్న కేడర్‌తో అంబూష్ దాడి చేయడం మావోయిస్టులకు సాధ్యం కావడం లేదు. కనీసం కూంబింగ్ స్పీడ్‌కు బ్రేకులు వేయడం సైతం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్తగా స్నైపర్ టీమ్‌లు ఏర్పాటు చేసే అంశంపై మావోయిస్టులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. అడవుల్లోకి వచ్చే భద్రతాదళాలపై స్నైపర్ టీమ్ దాడి చేసి కనీసం ఒక్కరిని గాయపరచగలిగినా భద్రతా దళాల ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని, తద్వారా కూంబింగ్ స్పీడ్‌కు బ్రేకులు పడతాయనేది మావోయిస్టుల వ్యూహంగా ఉన్నట్టు తెలిసింది.

అగ్రనేతల సమావేశం?

దంతెవాడ – బీజాపూర్ జిల్లా సరిహద్దులో వెలుగుచూసిన బంకర్‌లో మావోయిస్టు అగ్రనేతల సమావేశం జరిగినట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జనవరి రెండో వారంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బడే చొక్కారావును మావోయిస్టు పార్టీ నియమించింది. అంతకుముందు ఆ పార్టీకి చెందిన కేంద్ర కమిటీ సభ్యులతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన నాయకులు తాజాగా వెలుగు చూసిన బంకర్‌లోనే సమావేశమైనట్టు తెలుస్తోంది.

కుక్కల దాడిలో బాలుడు మృతి

గుడిసెలో నిద్రిస్తుండగా ఘటన

శంషాబాద్ రూరల్: వీధికుక్కలు దాడి చేసి గాయపర్చడంతో ఓ ఏడాది వయసున్న బాలుడు మృతి చెందాడు. శంషాబాద్ పట్టణంలోని సామ ఎన్‌క్లేవ్ సమీపంలోని జీఎన్ఎన్‌యూఆర్‌ఐ గృహ సముదాయాల వద్ద కూలీ పని చేసుకుంటూ సూర్యకుమార్ కుటుంబం గుడిసెల్లో నివాసముంటోంది. అతనికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. రెండో కుమారుడు 20 రోజుల కిందట జన్మించాడు. చిన్న కొడుకుతో భార్య పుట్టింటి వద్ద ఉంటోంది. సూర్యకుమార్, అతని తల్లి, పెద్ద కొడుకు నాగరాజు(ఏడాది)తోపాటు గత నెల 31న రాత్రి గుడిసెలో నిద్రపోయారు. అర్ధరాత్రి నాగరాజు నిద్రలేచి ఏడుస్తుంటే పాలు తాగించి పడుకోబెట్టాడు. తర్వాత వీధికుక్కలు నాగరాజుపై దాడి చేయడంతో పాటు రోడ్డుపైకి లాక్కొచాయి. బాలుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ విషయాన్ని అక్కడ ఉన్న ఓ వ్యక్తి గమనించి సూర్యకుమార్‌కు చెప్పాడు. వచ్చి చూడగా నాగరాజు అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో పంజగుట్ట మాజీ సీఐ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: బోధన్ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సోహైల్ తప్పించుకోవడానికి కారణమయ్యారంటూ తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పంజగుట్ట మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు పిటిషన్ దాఖలు చేశారు. డిసెంబర్ 24న నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి పట్టుబడిన సోహైల్ తప్పించుకోవడానికి సహకరించారని దుర్గారావుపై పోలీసులు కేసు నమోదు చేయడం తెలిసిందే. అయితే, కేసులో నిందితుడిగా చేర్చినప్పటి నుంచి ఆయన పరారీలో ఉన్నారు. దీంతో వెస్ట్‌జోన్ పోలీసులు మాజీ సీఐ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ముందస్తు బెయిల్ కోరుతూ దుర్గారావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారణకు రానుంది.




'సూర్యోదయ్ యోజన' ప్రధాని దూరదృష్టిని ప్రతిఫలిస్తోంది. ఒక కోటి కుటుంబాలు తమ ఇళ్ల వద్ద సౌరశక్తి వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి ఈ పథకం వీలు కల్పిస్తుంది. దీనివల్ల వారికి నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుంది. ఏటా రూ.15 నుంచి 18 వేల వరకు ఆదా అవుతుంది.

- అమిత్ షా, కేంద్ర హోమ్‌మంత్రి



'వాస్తవ వృద్ధి'ని 7.3 శాతంగా అంచనా వేయడం ఓ కల్పిత కథ. ప్రస్తుత ధరలలో జీడీపీ పెరుగుదలను వాస్తవ వృద్ధి కోసం తగ్గించారు. ద్రవ్యోల్బణం 6 శాతం, ఆహార ద్రవ్యోల్బణం 10 శాతం అని ఆర్బీఐ అంచనా వేసినప్పుడు, దాన్ని 1.6 శాతంగా తీసుకున్నారు. ఇది మోసపూరితం.

- సీతారాం యేచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి



గత పదేళ్లలో ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు? ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు, 2022 నాటికి అందరికీ పక్కా ఇళ్లు, 100 స్మార్ట్ సిటీలు... వేటి గురించీ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. 2014లో 4.6 శాతంగా ఉన్న వ్యవసాయ వృద్ధి రేటు ఈ ఏడాది 1.8 శాతానికి ఎలా పడిపోయింది? ఈ మధ్యంతర బడ్జెట్‌లో జవాబుదారీతనం, విజన్ రెండూ కొరవడ్డాయి.

- మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు



సాగు సాయం ఇంతేనా?

అభిప్రాయం



డా॥ దొంతి నరసింహారెడ్డి

భారత వ్యవసాయంలో సమూల పరివర్తన అవసరం ఉన్నది. అయితే, ఈ పరివర్తన ఎక్కడ అనేది కీలకంగా మారింది. సంపూర్ణ మార్పు కేంద్ర ప్రభుత్వ విధానాలలో రావాల్సిన అవసరం ఉన్నది. నూతన వ్యవసాయ విధానం ద్వారా ఈ మార్పునకు నాంది పలకాలి. బడ్జెట్ కేటాయింపుల ద్వారా ఈ మార్పునకు అవసరమైన నిధులు అందించాలి. కానీ తాజా మధ్యంతర బడ్జెట్‌లో ఆ మేరకు కేటాయింపులు లేవు. 2024 పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో 2024-25 కేంద్ర బడ్జెట్ కొన్ని నెలల కొరకే రూపొందించారు. పూర్తి స్థాయి బడ్జెట్ ఎన్నికల తరువాత జూలైలో కొత్త ప్రభుత్వం ప్రవేశపెడుతుంది.



మౌలిక వసతుల కల్పనకు 11 శాతం నిధులు పెంచిన కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయ రంగ మౌలిక వసతుల కల్పన మీద దృష్టి పెట్టలేదు. 2023-24లో వ్యవసాయ బడ్జెట్ రూ.1,15,532 కోట్లు ఉండగా ఇప్పుడు 2024-25లో కేవలం రూ. 1,17,529 కోట్లకు పెరిగింది. కేటాయింపులు ఎన్ని ఉన్నా, ప్రభుత్వ ఆలోచనలలో మార్పులు రాలేదని అర్థం అవుతున్నది. ఆహార సబ్సిడీ రూ. 2,05,250.01 కోట్లు మాత్రమే. ఆహార సబ్సిడీ తగ్గడం అంటేఆహార పంటల సేకరణ తగ్గటమే. ఇందువల్ల రైతు మీద భారం పెరుగుతుంది. ఎరువుల సబ్సిడీ రూ. 1,63,999.80 కోట్లు మాత్రమే. 2022-23లో అయిన ఖర్చు రూ. 2,51,339.36 కోట్లు. తగ్గించిన సబ్సిడీ ఎక్కడకు మరల్చినట్లు? సేంద్రియ ఎరువులు ప్రోత్సాహానికి మాత్రం కాదు. ఎందుకంటే, కొత్త పథకాలు లేవు. సహజ వ్యవసాయానికి రూ. 459 కోట్లు గత సంవత్సరం ఇచ్చి, దానిని రూ.100 కోట్లకు సవరించిన ప్రభుత్వం రాబోయే ఏడాదికి రూ.365 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది.

రైతుల కోసం కనీస మద్దతు ధరలు ప్రకటించినా, 11.8 కోట్ల మంది రైతులకు 'కిసాన్ యోజన' కింద ఆర్థిక సహాయం అందించినా, రైతుకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. రైతుల సగటు ఆదాయం పెరగలేదు. రెట్టింపు అసలే కాలేదు. ఆహార ద్రవ్యోల్బణం ఆందోళన కలిగిస్తున్నది. ఆహారం ధరలు పెరుగుతున్నాయి. దిగుమతి సుంకాలు తగ్గించడమే ఆహార దిగుమతులు పెరగడానికి కారణం.

మొత్తం కేంద్ర ప్రతిపాదిత బడ్జెట్ రూ. 47.66 లక్షల కోట్లు కాగా వ్యవసాయానికి ఇచ్చింది కేవలం 2.4 శాతానికి పడిపోయింది. వ్యవసాయానికి మొత్తం బడ్జెట్‌లో ఉండాల్సిన వాటా శాతం తగ్గింది. 2022-23 సంవత్సరం 4.26 శాతం ఉంటే, ఇప్పుడు అది దాదాపు సగానికి తగ్గింది.

వ్యవసాయ రంగ విధానాలు మొత్తం రైతుల సంక్షేమంతో పాటు భారతదేశంలో ఆహార భద్రతను నిర్ధారించడంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. వ్యవసాయ రంగంలో యాంత్రికీకరణ దిశగా కేంద్రం అనేక ఏళ్లుగా ప్రయత్నం చేస్తున్నది. కానీ, సగటు రైతుకు వాటి నుంచి ఎటువంటి లబ్ధి చేకూరలేదు. చిన్న రైతుకు ఉపయోగపడని భారీ యంత్రాల వల్ల, అధిక ధరల కారణంగా రైతులు ఆ యా యాంత్రికీకరణ పథకాల నుంచి లబ్ధి పొందలేక పోతున్నారు.

కేంద్ర ప్రభుత్వం వ్యవ సాయ రంగానికి అధిక సబ్సిడీని ఇస్తుంది అని భావిస్తుంటారు. కానీ, ఆ యా సబ్సిడీలు అన్నీ కంపెనీల వ్యాపారవృద్ధికీ, లాభాలకూ, గుత్తాధిపత్యం పెంచుకోవడానికీ ఉపయోగ పడుతున్నాయి. ఇటీవల వ్యవసాయ రంగంలో డ్రోన్లు ఉపయోగించటానికి దాదాపు 7-8 లక్షల వరకు సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇది కూడా డ్రోన్ల కంపెనీల ప్రోత్సాహానికి అని కూడా చెప్పింది. రసాయనిక ఎరువులు, రసాయన కీటక నాశకాలు, విత్తనాలు, విద్యుత్, సాగు నీరు, రుణాలు, యంత్రాలు, వగైరా సబ్సిడీలు కంపెనీల వ్యాపారాలు పెరగడానికే ఉపయోగపడ్డాయి. పామాయిల్ పెట్టుబడులు కూడా పెద్ద కమతాల కొరకే. సగటు రైతు ఇంకా చితికిపోతున్నాడు. కాగ్ ఇచ్చే నివేదికలు కొన్ని ఈ దిశగా మనకు అవగాహన పెంచుతున్నాయి. పంటల బీమా వల్ల కంపెనీలు దాదాపు రూ. 36 వేల కోట్ల రూపాయలు లబ్ధి పొందినట్టు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇటీవల ముగిసిన అంతర్జాతీయ వాతావరణ పరివర్తన సదస్సు 'కాప్28'లో ప్రపంచ వాతావరణ పరిస్థితులూ, ఆహార ఉత్పత్తిపై వాటి పరిణామాల ప్రభావం మీదా ఆందోళన వ్యక్తం అయ్యింది. ఆహార రంగంలో సంపూర్ణ పరివర్తన అత్యంత అవసరమని అనేక దేశాలు భావించాయి. రసాయన రహిత, కర్బన ఉద్గారాల రహిత వ్యవసాయం వైపు మళ్ళాలని, ఆ దిశగా పెట్టుబడులు పెరగాలని ఉమ్మడి ప్రకటనలు కూడా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో అటువంటి పెట్టుబడుల గురించి కనీస ప్రస్తావన చేయక పోవడం గమనార్హం.

వ్యాసకర్త వ్యవసాయ రంగ నిపుణులు

అతివకు ఆదాయమేదీ?

అభిప్రాయం



ప్రొ॥ ఇ. రేవతి

వ్యవస్థను వెంటాడుతున్న దీర్ఘకాలిక ప్రశ్నలకు కేంద్ర బడ్జెట్‌లో ఈసారీ జవాబు కన్పించలేదు. సంపద సృష్టి పెరిగిందనేది కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాత్కాలిక బడ్జెట్ ప్రసంగంలో కీలకాంశం. అది నిజమే అయితే ధనిక, పేద వర్గాల మధ్య అసమానతలు ఎందుకు పెరిగాయి? దిగువ మధ్య తరగతి ఇప్పటికీ ఎందుకు నాణ్యమైన జీవనం, విద్య అందుకోలేకపోతోంది?



ద్రవ్య లోటును 5.9 నుంచి 5.1కి తగ్గించామని చెప్పారు. పెట్టుబడి వ్యయం పెంపు వైమానిక, రైల్వే రంగాలకు కొంత ఊరటే. కానీ వ్యవసాయం పరిస్థితేమిటి? కోవిడ్ తర్వాత ఈ రంగం 1.8 నుంచి 2 శాతం ఉత్పత్తి పురోగతి సాధిస్తోంది. కానీ మళ్ళీ ఈ ఏడాది కొత్త సవాళ్ళు విసిరింది. దేశవ్యాప్తంగా కనీసం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావం వెరసి ఉత్పత్తి పతనానికి దారి తీసింది. పశు సంపద, పాడి పరిశ్రమ ప్రతికూల ఫలితాలనిస్తోంది. ఈ సవాళ్ళను ఎదుర్కొనే మార్గాలు బడ్జెట్‌లో కన్పించలేదు. ఎర్ర సముద్రంలో యుద్ధం, కొరియా ఘటనలు... ఇలాంటి అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది విదేశీ దిగుమతులకు అనేక సవాళ్ళు ఎదురయ్యాయి, విదేశీ వస్తువులు రావడం ఆలస్యమైంది. ఈ నేపథ్యంలోనే స్వదేశీ వస్తు తయారీ దిశగా ప్రణాళికలు ఏమయ్యాయనే ఆత్మ పరిశీలన అవసరం.

ఎన్నికల సమయం. అందుకేనేమో రైతు, యువత, మహిళ, పేదలు, మధ్య తరగతి వర్గాలే బడ్జెట్ లక్ష్యాలయ్యాయి. ఇవి తాత్కా లిక ప్రయోజనాలే కావడం ఇక్కడ అసలు సమస్య. ఫుడ్ ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించే మంత్రం బడ్జెట్‌లో కన్పిస్తోంది. కానీ మన ఉత్పత్తుల ఎగుమతులు ఈ ఏడాది తగ్గాయి. ఎగుమతులపై నిషేధమే దీనికి కారణం. పామాయిల్ పెంపునకు అవకాశం ఉంది. దీన్ని మనం వినియోగించుకోలేక పోయాం. డిజిటల్ ఫామ్ ఎక్విప్‌మెంట్ వంటి ఆధునిక వ్యవసాయ పద్ధతులను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. ఇవి కాస్త బాగానే ఉన్నాయి. కానీ వ్యవసాయ పరిశోధనకు స్థానమే ఇవ్వలేదు. వ్యవసాయ జీడీపీలో పరిశోధనకు కేటాయింపులు 0.4 శాతానికే పరిమితం చేశారు. ఇది దీర్ఘకాల ప్రయోజనాలకు విఘాతమే.

పనిలో మహిళా భాగస్వామ్యం 37 శాతం పెరిగిందనేది కేంద్రం వాదన. కానీ ఇప్పటికీ మహిళలు ఆదాయమే లేని పనుల్లోనే ఉన్నారనేది వాస్తవం. ఉదాహరణకు ఆమె తన కమతంలోనే పని చేస్తోంది. డబ్బులెవరిస్తారు? తన దుకాణంలోనే పని చేయాల్సి ఉంటుంది. డబ్బులిచ్చేదెవరు? వీళ్ళ భాగస్వామ్యాన్ని ఎలా లెక్కగడతారు? నిరుద్యోగం తగ్గుతోందని చెప్పారు. యువతే లక్ష్యంగా ఉద్యోగ కల్పనను ప్రస్తావించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహించడం ఈ సత్ఫలితాలిచ్చాయనేది కేంద్రం విశ్లేషణ. సోలార్ ప్రాజెక్టుల కల్పన కూడా ఉపాధికి మార్గమన్నారు. దీంతో ప్రైవేటు పెట్టుబడుల ప్రోత్సాహానికే ప్రాధాన్యమిచ్చారు. ఇక పేదరికం తగ్గిందని చెప్పారు. నీతి అయోగ్ బహుళ పేదరిక ప్రామాణికతపై అనేక సందేహాలున్నాయి. పేదల వినిమయం, పౌష్టికాహారం వంటి అంశాలను పేదరిక కొలమానంగా తీసుకోవాలి. పేదరిక నిర్ధారణకు ఎంచుకున్న పద్ధతుల వల్లే పేదరికం తగ్గిందనే వాదనలూ ఉన్నాయి. ఒకటి మాత్రం వాస్తవం. ఆదాయ వనరులు పేదలకు పెరగొచ్చు. కానీ కనీస అవసరాలకు ఖర్చు పెట్టలేని స్థాయిలో ఎక్కువ మంది పేదలున్నారు. ఎన్నికల కోణంలో కాకుండా, కేంద్ర బడ్జెట్ శాశ్వత పేదరిక నిర్మూలనకు పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త సెస్ డైరెక్టర్, హైదరాబాద్

ఇది భద్రలోక్ బడ్జెట్

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024 – 2025 ఆర్థిక సంవత్సరానికి గాను తాత్కాలిక (ఓట్ ఆన్ అకౌంట్) బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. ఈ బడ్జెట్ లక్ష్యం నాలుగు విభాగాల ప్రజలకు – పేదలు, యువకులు, రైతులు, మహిళలకు మేలు చేయడమేనని ఆమె పేర్కొన్నారు. ఈ నాలుగు వర్గాలకు బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో ఏ విధమైన మేలు చేసిందన్నది ఇక్కడి ప్రశ్న? 2014 వరకూ, అంటే తాము అధికారంలోకి వచ్చే ముందర అంతా చిందరవందరే అన్నట్లు 'మా ఆర్థిక నిర్వహణ ద్వారా 2014 ముందరి అన్ని ఆర్థిక సవాళ్ళనూ నేడు అధిగమించాం' అంటూ నిర్మలా సీతారామన్ బడ్జెట్ ఉపన్యాసంలో వ్యాఖ్యానించారు. ఇందులో ఎంత వాస్తవం ఉందో చూద్దాం.

కాంగ్రెస్ హయాంలో నాటి అత్యధిక పతన స్థాయి అయిన డాలర్‌తో పోలిస్తే 65 రూపాయలుగా రూపాయి విలువ ఉంది. నేడు రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే మరింత దారుణంగా దిగజారి 84 రూపాయల పరిధిలో ఉంది. ఇక, నిరుద్యోగం 2014లో 5.4 శాతంగా ఉండగా 2023 డిసెంబర్ నాటికి 8.7 శాతానికి పెరిగిపోయింది. 2013లో దేశంలో ధరలు భారీగా పెరిగిపోవడం (ద్రవ్యోల్బణం) కూడా 2014 ఎన్నికలలో కాంగ్రెస్ ఓటమికి కారణం. కాగా, 2022 నుంచీ మొదలుకొని దేశంలో ధరలు అడ్డూ ఆపూ లేకుండా పెరిగిపోతున్నాయి. ఇక స్థూల జాతీయోత్పత్తి విషయంలో కూడా మన పరిస్థితి కేవలం ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే, గుడ్డి వాళ్ళ రాజ్యంలో... ఒంటి కన్ను రాజులా (రఘురాం రాజన్ వ్యాఖ్యానించినట్లు) మాత్రమే ఉందన్నది నిజం. యూపీఏ హయాంలో జీడీపీ సాలీనా సగటున 8.1 శాతం మేర పెరగగా... ప్రస్తుత బీజేపీ హయాంలో (2014 నుంచి 2023 వరకు) అది సాలీన సగటున 5.4 శాతం మేరనే పెరిగింది. కోవిడ్ కాలంలోని ఆర్థిక పతన స్థితిని కాసేపు పక్కన పెట్టినా మొత్తంగా బీజేపీ పాలనలో జీడీపీ పెరుగుదల పరిస్థితి గొప్పగా ఏమీ లేదు.



అవినీతిని నిర్మూలించామంటూ ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ఉపన్యాసంలో చెప్పుకున్నారు. వాస్తవానికి అంతర్జాతీయ 'అవినీతి సూచి'లో భారత్ ర్యాంకు మొత్తం 180 దేశాలలో 2022 సంవత్సరంలో 85వ స్థానంలో ఉండగా 2023లో 93వ స్థానానికి దిగజారింది. ఇక అసమానతల విషయంలో నిత్య జీవితంలో దిగజారిపోతోన్న సామాన్య జనం జీవన ప్రమాణాలు ఒక ప్రక్కనా... పెరిగి పోతోన్న కార్పొరేట్లూ, ధనవంతుల సంపద రాసులు మరో పక్కనా కనపడుతూనే ఉన్నాయి.

అభిప్రాయం



డి. పాపారావు

ఈ స్థితిలో ప్రస్తుత బడ్జెట్ ఈ సమస్యలు వేటికీ జవాబు ఇవ్వలేదు. ఇది కేవలం తాత్కాలిక బడ్జెట్ మాత్రమేనంటూ సమస్యల పరిష్కారాల నుంచి తప్పించుకునే ధోరణి... ద్రవ్యలోటు తగ్గింపు పేరిట ప్రజా సంక్షేమం కోసం... వారి సమస్యల పరిష్కారం కోసం కొత్తగా ఏ వ్యయాలు చేయలేని దుఃస్థితి తాలూకు ఇరకాటం ఈ బడ్జెట్ రూప కల్పనలో దాగివున్న అసలు నిజాలు.

ఒక పక్కన ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రత్యక్ష పన్నుల వసూళ్ళు మూడు రెట్లు పెరిగాయి. అలాగే పరోక్ష పన్నుల ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. అలాగే, మానిటైజేషన్ ద్వారానూ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ద్వారానూ కూడా కేంద్ర ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరుతోంది. మరో పక్కన కొన్ని లెక్కల ప్రకారం దేశీయ అప్పులు 200 లక్షల కోట్ల రూపాయలను దాటిపోయాయి. ఇంత పెద్ద ఎత్తున సమకూరిన వనరుల ఫలం, ఫలితం మాత్రం ప్రజలకు దక్కడం లేదు. అంటే, బడ్జెట్‌ల క్రమంలో జరుగుతోంది పేదలను కొట్టి పెద్దలకు పెట్టడమే అనేది నిర్వివాదాంశం. పెరుగుతోన్న బిలియనీర్లు, ప్రపంచ ధనవంతుల జాబితాలో పైకి పాకుతోన్న వారి ర్యాంకులే దీనికి తార్కాణం!

ఇక ప్రస్తుత బడ్జెట్ కూడా ఈ యథాతథ స్థితికి మినహాయింపేమీ కాదు. ప్రస్తుత బడ్జెట్ అనంతరం జాతినుద్దేశించి తన సందేశంలో ప్రధాని మోదీ ఇది చరిత్రాత్మక బడ్జెట్ అన్నారు. ఇది కేవలం మాటల గారడీ. బడ్జెట్‌కు కొద్ది రోజుల ముందర ఈ బడ్జెట్ నుంచి ఏ సంచలనాలనూ ఆశించొద్దని ఆర్థిక మంత్రి చెప్పారు. బడ్జెట్ ప్రసంగంలోనూ ఆమె ఈ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పరిమితిని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని చెబుతోన్న చరిత్రాత్మక కేవలం... ధనవంతుల సేవలో తరిస్తోన్న బడ్జెట్‌ల పరంపరలో పదవ మైలు రాయిని చేరుకోవడం తాలూకుది మాత్రమే కావచ్చు!!

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు
మొబైల్: 98661 79615

పేదలకు ఒరిగిందేమీ లేదు!

అభిప్రాయం



డా॥ అందె సత్యం

ఓటాన్ అకౌంట్ లేదా తాత్కాలిక బడ్జెట్... విధానాల్లో మార్పులేవీ తీసుకురాలేదు. ప్రత్యక్ష, పరోక్ష పన్నులు, సుంకాల రేట్లు ఇతర ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి కొత్త విధానాలేవీ ప్రకటించలేదు. బడ్జెట్ పరిమాణం 45 లక్షల కోట్ల నుంచి 47.66 లక్షల కోట్లకు పెరిగింది. కేవలం ఐదు శాతం పరిమాణాన్ని పెంచారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే పెరుగుదలే ఇది కాదు. ఉపాధి హామీ పథకానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ. 73 వేల కోట్ల నుంచి రూ. 60 వేల కోట్లకు తగ్గించారు. ఈ ఏడాది మళ్లీ రూ.86 వేల కోట్లకు పెంచారు. దేశంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా లేదా వేతనం పెరిగిన దృష్ట్యా ఇది పెరుగుదల కాదు. దీన్ని ఇంకా పెంచాల్సి ఉంది. గ్రామీణాభివృద్ధికి గత సంవత్సరం రూ. 2.43 లక్షల కోట్లు ఖర్చు చేయగా, ఈ ఏడాది రూ. 1.77 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది గ్రామీణ అభివృద్ధి వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపెట్టనుంది. గత బడ్జెట్‌లో ఆహార సబ్సిడీకి రూ. 2.87 లక్షల కోట్లు ఖర్చు చేయగా, ఈ ఆర్థిక సంవత్సరంలో సబ్సిడీల కింద రూ. 2.13 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. రసాయన ఎరువులకు 1.68 లక్షల కోట్లు




కేటాయించారు. గతంలో రూ. 1.75 కోట్లు కేటాయించారు. ఈ విధంగా ముఖ్యమైన శాఖలన్నింటికీ బడ్జెట్ కేటాయింపులు నామమాత్రపు పెరుగుదల కానీ, లేదా తగ్గుదల కానీ ఉంది. వ్యవసాయ రంగానికి గత ఏడాది తగ్గించి తిరిగి ఈ సంవత్సరం పూర్వ స్థాయికి పెంచారు. అంటే అంతకు ముందు ఏడాది స్థాయికి మాత్రమే తీసుకువచ్చారు. అదే విధంగా గత ఏడాది బడ్జెట్‌లో రక్షణ శాఖకు రూ. 6 లక్షల కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ. 6.2 లక్షల కోట్లు కేటాయించారు. అందు వల్ల ఈ కేటాయింపులు యాంత్రికంగా కనిపిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్‌కు కేవలం రూ.7,500 కోట్లు చూపెట్టారు. ఇది ఏ మూలకూ సరిపోదు.

విధానపరంగా చూస్తే పేదలకు, మధ్య తరగతి ప్రజలకు ఈ బడ్జెట్ ఒత్తిడిని పెంచే విధంగా ఉంది. మధ్యతరగతి వేతన జీవులకు నామమాత్రపు ఆదాయాలు పెరిగినప్పటికీ పన్ను వెసులుబాటు కల్పించలేదు. దేశ వ్యాప్తంగా 5 ఆక్వా పార్కులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ పార్కులు మత్స్య రంగం అభివృద్ధి అయిన ప్రాంతాలకు మాత్రమే ఉపయోగపడనున్నాయి. నూనెగింజల ఉత్పత్తిలో దేశం కొరత ఎదుర్కొంటోంది. దీనికోసం ప్రత్యేకంగా ఒక సంస్థను ఏర్పాటు చేస్తామన్నారు. కానీ, ఉత్పత్తి చేయడానికి కావాల్సిన సబ్సిడీలు లేదా ప్రోత్సాహకాలు, మద్దతు ధరల గురించి ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావనా లేదు. వాటి గురించి తీవ్రంగా ఆలోచిస్తేనే నూనె గింజల దిగుమతుల మీద ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. రైల్వేలకు రూ. 2.5 లక్షల కోట్లు కేటాయించారు. కానీ, రైల్వే మీద ప్రత్యేక కేంద్రీకరణ ఉంటే తప్ప ఆశించిన స్థాయిలో విస్తరణ జరగడం లేదు. గత సంవత్సరం 25 లక్షల మందిని పేదరికం నుంచి బయటపడేశామని ఆర్థిక మంత్రి చెప్పారు. దేశ జనాభాతో పోలిస్తే ఇది చాలా స్వల్పం. ఈ నేపథ్యంలో పేదరిక నిర్మూలన కోసం చేపట్టాల్సిన పథకాలను పెంచాల్సి ఉంది. రూ. 47.66 లక్షల కోట్ల రూపాయల్లో అప్పులు, వడ్డీల కింద 20 శాతం అంటే రూ. 12 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ సంవత్సరం రూ. 169 లక్షల కోట్ల అప్పులుంటాయనే అంచనాలున్నాయి. కాబట్టి బడ్జెట్ అప్పులు, వడ్డీలకే హరించుకుపోతుంది.

వ్యాసకర్త ఆర్థిక విశ్లేషకులు

ప్రయోగాత్మక బడ్జెట్

అభిప్రాయం



ప్రొఫెసర్ డి. నర్సింహారెడ్డి

ఇది మధ్యంతర బడ్జెట్ అనీ, దీనికీ వచ్చే లోక్‌సభ ఎన్నికలకూ సంబంధం లేదనీ చెబుతున్నప్పటికీ పదేళ్ల మోదీ సర్కార్ ఘనతను చాటే ప్రయత్నం జరిగింది. కొన్ని అంశాల పరంగా చూస్తే మాత్రం ఈసారి బడ్జెట్ ప్రయోగాత్మకంగా ఉంది. గతంలో ఎప్పుడూ ఈ పద్ధతుల్లో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టలేదు. సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఒకట్రెండు రోజుల ముందు 'ఆర్థిక సర్వే' విడుదల చేస్తారు. ఈసారి 'ఇండియన్ ఎకానమీ రివ్యూ' పేరిట 2014 నుంచి ఈ పదేళ్లలో ఏం చేశారన్న దానిపై దృష్టి కేంద్రీకరించారు.

బడ్జెట్ ప్రసంగాన్ని రెండు భాగాలుగా చూస్తే... మొదటి భాగంలోని 'ఇండియన్ ఎకానమీ రివ్యూ'లో పదేళ్లలో సాధించిన దానిపై పొగడ్తలే నిండిపోయాయి. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పెనుసమస్య నిరుద్యోగం కాగా, గత పదేళ్లలో దాని పరిస్థితి ఏమిటన్న దానిపై ఈ రివ్యూలో ఎక్కడా ప్రస్తావనే లేదు. పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) అంచనాల ప్రకారం మాత్రం ఉపాధి అవకాశాలు పెరిగాయి, నిరుద్యోగం తగ్గింది అన్నట్టుగా ఉంది. వాస్తవానికి కోవిడ్ మహమ్మారి కారణంగా చాలామంది వలస, ఇతర కూలీలు, పేదలు తమ సొంత ఊళ్లకు వెళ్లిపోగా, కొంతమంది మాత్రమే తిరిగి వచ్చారు. అధికశాతం మహిళలు ఏదో ఒక పని చేసుకోవాల్సి రావడాన్ని కూడా ఉపాధి అవకాశాల కల్పనగా, వర్క్‌ఫోర్స్‌లో స్త్రీల ప్రాతినిధ్యం పెరిగినట్టుగా పేర్కొనడం సరికాదు. గత నవంబర్‌లో దేశంలో 9 శాతానికి పైగానే నిరుద్యోగం ఉందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) వెల్లడించిన విషయం తెలిసిందే.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇబ్బందుల కారణంగానే భారత స్టాక్ మార్కెట్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వంటివి వస్తున్నాయనేది గమనార్హం. ఆర్థిక మంత్రి నానో యూరియా ఇస్తామన్నారు కానీ వ్యవసాయ రంగంలో పెట్టుబడుల ప్రస్తావన లేదు. కొన్నేళ్లుగా వ్యవసాయానికి పెట్టుబడులను కేంద్రం ఒక పద్ధతి ప్రకారం తగ్గించుకుంటూ వస్తోందనే విమర్శలకు ఇది బలం చేకూర్చేలా ఉంది. సోలార్ విద్యుత్‌కు మరింత ప్రోత్సాహం, ప్రజారవాణా రంగంలో ఈ-వెహికిల్స్, టూరిజానికి ప్రోత్సాహం సానుకూల అంశాలే. ఐతే పర్యాటకంలో అండమాన్, లక్షద్వీప్ వంటి దీవులకు నష్టం జరగకుండా పకడ్బందీ ప్రణాళికలతో కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. నూతన విద్యావిధానం గురించి చెబుతున్నా కేంద్రం విద్యకు కేటాయిస్తున్న నిధులు తగ్గుతూ వస్తున్నాయి. వైద్యరంగం విషయానికొస్తే కొంత ప్రోత్సాహకరంగా కనిపిస్తోంది. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంలో భాగంగా... రైల్వేలు, రోడ్లు, బిల్డింగ్‌లకు (ఈ బడ్జెట్‌లో రూ.11 లక్షల కోట్లు) కేటాయింపులు పెంచుతున్నారు. వీటి ద్వారానే వృద్ధి రేటు అవకాశం ఉంటుందనేది నిర్వివాదాంశం.


వ్యాసకర్త పూర్వ డీన్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, హెచ్‌సీయూ

అవాకులు చవాకులే వారికి వార్తలా?

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాశ్



ఇష్టమైన పార్టీనో, నేతలనో పైకి ఎత్తడం, పాఠకులను పక్కదారి పట్టించడం యెల్లో మీడియాకు పెన్నుతో పెట్టిన విద్య అని చెప్పాలి. వార్తల వెనుక ఉండే నిజాలతో వారికి పనిలేదు. వార్తల ప్రయోజనాలు వారికి అవసరం లేదు. స్వలాభాపేక్ష ఒక్కటే లక్ష్యం.

ఇసుక తవ్వకాలు, విక్రయాలపై కొందరు నాయకుల అక్రమాలు ప్రచురిస్తున్నట్లు కనిపించినా... ఆ వంకతో, తమకు అనుకూలమైన వారికి 'ఈనాడు' ఎటువంటి ప్రయోజనాలు కల్పించిందో రాస్తే అదో భారతం అవుతుంది. ఆ మధ్య మిచ్ఛ్ తుఫాను వచ్చినప్పుడు... ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలలో విస్తారంగా వర్షాలు కురియడంతో పల్లపు ప్రాంతాలలో కొంత మేర ముంపునకు గురయ్యాయి. కానీ ప్రభుత్వమే ఆ పంటలను ముంచేసినట్లు చిత్రీకరిస్తూ ఏపీ ముఖ్యమంత్రి జగన్‌పై, వైసీపీ ప్రభుత్వంపై ఎన్నో అభాండాలను ప్రచురించింది. గోదావరి డెల్టా, కృష్ణా డెల్టా ఆధునీకరణ నిధులు ఏమయ్యాయి? వాటిని గతంలోనే చంద్రబాబు ప్రభుత్వం ఎటు మళ్ళించింది అనే వాస్తవాలను పక్కన పెట్టి పంటల ముంపు బాధ్యత ప్రభుత్వానిదే అన్నట్లు ప్రచురించింది. కృష్ణా డెల్టా ఆధునీకరణకు కేటాయించిన రూ. 175 కోట్లు కృష్ణ కరకట్టపై తాను అక్రమంగా నివాసం ఉంటున్న భవనం ప్రాంతాన్ని సుందరీకరణకు చంద్రబాబు వినియోగించారనే వాస్తవాన్ని యెల్లో పత్రికలు ఎందుకు ప్రచురించవు? గోదావరి ఆధునీకరణ నిధులను కూడా దాదాపు రూ.150 కోట్లు పుష్కరాల నెపంతో 'పచ్చ' కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు. ఈ వాస్తవాన్ని ఈ పత్రికలు కాదనగలవా?

ఒక ప్రభుత్వం చేస్తే సామాజిక న్యాయం, మరో ప్రభుత్వం చేస్తే సమాజ వ్యతిరేకం అవుతుందా? చంద్రబాబు పాలనలో బీసీలకు ఎనిమిది మంత్రి పదవులివ్వగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 11 మంత్రి పదవులు బీసీలకు లభించాయి? మరి ఏది సామాజిక న్యాయం అని చెప్పాలి! చంద్రబాబు ఎస్సీలకు రెండు మాత్రమే మంత్రి పదవులు ఇస్తే జగన్ ఐదుగురికి ఇచ్చారు. మరి ఎవరిది సామాజిక న్యాయం? రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎస్సీ వర్గానికి చెందిన మోషేన్ రాజును కౌన్సిల్ ఛైర్మన్‌గా జగన్ చేశారు. టీడీపీ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు 18 ఎమ్మెల్సీ పదవులు ఇవ్వగా, జగన్ 29 పదవులు (69 శాతం) ఇచ్చి సామాజిక న్యాయానికి బ్రహ్మరథం పట్టారు. ఈ వాస్తవాలు కనబడవా?

చంద్రబాబు హయాంలో ఏటా సగటున 324 మండలాల్లో కరువు తాండవించినా రైతులను కనికరించిన దాఖలాలు లేవు. జరిగిన పంట నష్టానికి సంబంధించి పరిహారాన్ని ఆ సీజన్ కాదుకదా, కనీసం ఆ ఏడాది ముగిసేలోగానైనా ఇచ్చిన దాఖలాలు లేవు. ఆ వాస్తవాన్ని వదిలేసి జగన్ ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లించలేదంటూ వార్తలు ప్రచురించడాన్ని ఏమనుకోవాలి? ప్రాథమిక పంట నష్టం అంచనాలు, తుది లెక్కలకు వ్యత్యాసం ఉంటుంది. దానిని వదిలేసి, పంట నష్టం లెక్కలను ప్రభుత్వం తక్కువ చేసి చూపిస్తున్నదంటూ అన్నదాతలను పక్కదారి పట్టించడం జర్నలిజంలో నైతిక ప్రమాణాలను మింగివేయడం కాదా?

బడి పిల్లలకు తగిన విద్యా బుద్ధులతో పాటు ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది వైసీపీ ప్రభుత్వం. నిత్యం సగటున 34.90 లక్షల మంది బడి పిల్లలకు 'గోరుముద్ద' అందుతుండగా, దానిలో ఆరు రోజులకు 16 రకాల వంటకాలను విద్యార్థులు రుచి చూస్తున్నారు. ఈ భోజనానికి బాబు హయాంలో ఏటా రూ.450 కోట్లు ఖర్చు చేయగా, జగన్ ప్రభుత్వంలో ఏటా సగటున రూ.1,450 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అయినా బడిపిల్లలకు సరైన పౌష్టికాహారమే లభించడం లేదంటూ వార్తలు ప్రచురించడాన్ని ఏమనాలి?

చంద్రబాబు హయాంలో 1996 లోక్‌సభ ఎన్నికలకు ముందు వామికొండ వద్ద, 1999 ఎన్నికలకు ముందు గండికోట వద్ద మరోసారి గాలేరు-నగరికి శంకు స్థాపన చేశారు. కానీ ఆ తొమ్మిదేళ్ళలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. వై.ఎస్.రాజశేఖర రెడ్డి 2004లో ముఖ్యమంత్రి అయిన తరువాత గాలేరు-నగరి సుజల స్రవంతి పథకాన్ని జలయజ్ఞంలో భాగంగా చేపట్టి 2009 నాటికే చాలావరకు పూర్తి చేశారు. గండికోట రిజర్వాయర్, పైడిపాలెం, వామికొండ, సర్వారాయ సాగర్ జలాశయాలతోపాటు ఈ ప్రాజెక్టు పనులు చాలావరకు 2009 నాటికి పూర్తి చేశారు. తర్వాత చంద్రబాబు వచ్చాక ప్రాజెక్టు మిగిలిన పనులు పడకేశాయి. అటుపై జగన్ అధికారంలోకి వచ్చాకే పెండింగ్ పనులకు కదలిక వచ్చింది. 2020-21 నుండి గండికోటలో ఏటా పూర్తి సామర్థ్యం మేరకు 28.85 టీఎంసీలను నిలువ చేస్తూ ఆయకట్టుకు నీళ్లందించి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

చంద్రబాబు హయాంలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతులకు 5 లక్షల రూపాయల పరిహారం ఇవ్వగా, దానిలో 1.5 లక్షలు అప్పుల కింద జమవేసుకొనేవారు. మిగిలిన మొత్తాన్ని డిపాజిట్ చేసి దాని వడ్డీని మాత్రమే ఆ రైతు కుటుంబానికి ఇచ్చేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ పరిహారాన్ని 7 లక్షల రూపాయలకు పెంచడమే కాక, ఎలాంటి సమస్య లేకుండా ఆ రైతు ఖాతాలోనే నేరుగా పరిహారం మొత్తాన్ని జమచేస్తున్నారు.

విద్యార్థుల చేతుల్లో ట్యాబులు కళకళలాడుతుంటే, వారి వద్ద పలకలు కూడా లేవంటూ ప్రచారం! విద్యార్థుల ఫీజులు రీయింబర్స్ చేస్తూ రకరకాల సంక్షేమ పథకాల కింద వారి ఖాతాలకే జమ చేస్తుంటే బడి మానేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందంటూ ఇంకో యెల్లో పత్రిక కథనాలు! 2022- 23లో జగన్ ప్రభుత్వం 3.32 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు సమీకరించిందని ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ వెల్లడించగా ఆ విషయాన్ని ప్రముఖంగా ప్రచురించడానికి మనసురాక అప్పులు పెరిగి పోతున్నాయంటూ గగ్గోలు! వార్తల్ని మింగేస్తున్న పత్రికలు ఇక సమాజాన్ని ఏం ఉద్ధరిస్తాయి?

వ్యాసకర్త మాజీ ఎమ్మెల్యే । 98481 28844

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.11.30 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** స్వాతి రా.1.58 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** ఉ.6.10 నుండి 7.53 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.49 నుండి 9.37 వరకు, తదుపరి ప.12.37 నుండి 1.25 వరకు, **అమృతఘడియలు:** సా.4.23 నుండి 6.07 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.51.

క్లుప్తంగా...

భారం మోపని కేంద్ర బడ్జెట్

● బీజేపీ నేత ఈటల రాజేందర్



సాక్షి, న్యూఢిల్లీ: పన్ను రేట్లలో ఎలాంటి మార్పు లేకుండా.. ఎవరిపైనా భారం మోపకుండా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని బీజేపీ నేత ఈటల రాజేందర్ చెప్పారు. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తుందన్నారు. ఆయన గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓర్వలేకే బడ్జెట్‌పై విపక్షాలు విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు. పేదల కోసం ఇంతలా ఆలోచించే ప్రభుత్వం ఇంకేదైనా ఉందా? అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో భారత్‌ను 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం ముందుకెళ్తోందని ప్రశంసించారు.

రైల్వేకు రూ.5,071 కోట్ల కేటాయింపు భేష్

● బీజేపీ ఎంపీ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ లో రైల్వేకు సంబంధించి తెలంగాణకు రూ.5071 కోట్లు కేటాయించడం అభినందనీయమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఆశాజనకమైన నిధులు కేటాయించి మరోసారి రాష్ట్రంపై మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటడం హర్షణీయమని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ప్రధాని నరేంద్ర మోదీలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఉపకార దరఖాస్తులకు మార్చి 31వరకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల దరఖాస్తుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. జనవరి 31వ తేదీతో ఉపకార దరఖాస్తుల ప్రక్రియ ముగిసినప్పటికీ విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాల విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా గడువును మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ.. అర్హులైన విద్యార్థులంతా వెంటనే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు, ధ్రువపత్రాల అప్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేసింది. వాస్తవానికి గతేడాది డిసెంబర్ 30వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ ముగిసినప్పటికీ విద్యార్థుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉండింది. దీంతో జనవరి 31 వరకు గడువు పెంచారు. అయినప్పటికీ విద్యార్థులు పూర్తిస్థాయిలో దరఖాస్తులు సమర్పించకపోవడం, కొన్ని రకాల కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో గడువు పొడిగింపు ప్రభుత్వానికి అనివార్యమైంది. ఈ క్రమంలో ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి దరఖాస్తులు 12.65 లక్షలు వస్తాయని అధికారులు అంచనా వేశారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను గతేడాది ఆగస్టు 19వ తేదీ నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. డిసెంబర్ 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పించారు. అయితే వివిధ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ పూర్తి కాకపోవడం, ఎన్నికల ప్రక్రియ, విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరగడంతో ప్రభుత్వం నెల పాటు గడువును పొడిగించింది. జనవరి 31వ తేదీ నాటికి గడువు పూర్తి కాగా ఫ్రెషర్స్ కేటగిరీలో 4,20,262 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ కేటగిరీలో మరో 1.30 లక్షల మంది ఇంకా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంది.

ముగిసిన జేఈఈ మెయిన్స్ మొదటి విడత

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్) మొదటి విడత గురువారంతో ముగిసింది. గత నెల 24న ఈ పరీక్ష ప్రారంభమైంది. మెయిన్స్ కోసం దేశవ్యాప్తంగా 12.80 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఇందులో ఎంతమంది పరీక్షకు హాజరయ్యారన్న విషయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రటించాల్సి ఉంది. పరీక్ష ఫలితాలను ఈ నెల 12వ తేదీలోపు ప్రకటించే అవకాశముంది. రెండో విడత మెయిన్స్ పరీక్షను ఏప్రిల్‌లో నిర్వహిస్తారు. ఈ విడత పరీక్షకు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఇప్పటికే దరఖాస్తు చేసిన వా రు మళ్లీ చెయాల్సిన అవసరం లేదు. చాలా రాష్ట్రా ల్లో ఇంటర్ పరీక్షలకు సన్నద్ధమయ్యే హడావిడిలో తొలి దశ మెయిన్స్‌పై చాలా మంది విద్యార్థు లు పెద్దగా దృష్టి పెట్టలేదు. అనధికారికంగా అంది న సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా దరఖాస్తు చేసిన వారి లో 75 వేల మంది పరీక్షకు హాజరవలేదు. వీళ్లు, కొత్తగా దరఖాస్తు చేసేవారితో కలుపుకొని రెండో విడత పరీక్ష రాసేవారి సంఖ్య పెరిగే అవకాశం.

పరీక్ష కఠినమే.. గత ఏడాది కన్నా తేలికే

గత కొన్నేళ్లతో పోలిస్తే ఈసారి జేఈఈ మెయిన్స్ కాస్త కఠినంగానే ఉందని నిపుణులు చెబుతున్నారు. కోవిడ్ కాలంలో సిలబస్ తగ్గించడం వల్ల మెయిన్స్‌లోనూ ఈసారి కొన్ని టాపిక్స్ ఇవ్వలేదు. అయినప్పటికీ పేపర్ కఠినంగానే ఉందంటున్నారు. గత సంవత్సరం ఇంత కన్నా కఠినంగా పేపర్ ఇచ్చారని మేథ్స్ నిపుణుడు ఎంఎస్ రావు తెలిపారు. దాంతో పోలిస్తే ఈసారి ఫర్వాలేదని ఆయన అన్నారు. మేథ్స్‌లో ఈసారి కూడా సుదీర్ఘ ప్రశ్నలు ఇచ్చారు. దీనికి సమాధానాలు రాబట్టడానికి ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చిందని మెయిన్స్ పరీక్ష రాసిన హైదరాబాద్ విద్యార్థి విక్రమ్ తెలిపారు.

కొత్త లైన్లు లేవు.. ఉన్నవాటికే నిధులు

తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,071 కోట్లు కేటాయింపు

మధ్యంతర బడ్జెట్‌లో గతేడాది కంటే 15 శాతం నిధులు ఎక్కువ

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో రైల్వే శాఖకు సంబంధించి కొత్త ప్రాజెక్టుల మంజూరు, ఇప్పటికే మంజూరైన ప్రాజెక్టుల సర్వే లాంటి కొత్తవాటి జోలికి కేంద్రప్రభుత్వం పోలేదు. కొనసాగుతున్న ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుతోనే సరిపెట్టింది. అర్మూరు–ఆదిలాబాద్, వికారాబాద్–కృష్ణా లైన్లు సహా సికింద్రాబాద్–కాజీపేట మూడో లైన్‌లాంటి వాటి ఊసే లేకుండా రాష్ట్రానికి కేటాయింపులు చేసింది. గతేడాది బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.4418 కోట్లు కేటాయించగా, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గురువారం మధ్యంతర బడ్జెట్‌లో రూ.5,071 కోట్లను ప్రతిపాదించింది. ఇది అంతకుముందు బడ్జెట్ కంటే 15 శాతం ఎక్కువ కావటం విశేషం. 2022–23లో రూ.2,038 కోట్లు కేటాయించారు. ప్రధాన ప్రాజెక్టులకు కేటాయింపులు ఇలా...



కాజీపేట–విజయవాడ మూడో లైను: రూ.310 కోట్లు.

ఇది 2012–13లో మంజూరైంది. పూర్తి నిడివి 219 కి.మీ.. దీని అంచనా వ్యయం రూ.1857 కోట్లు. విజయవాడ–కొండపల్లి వైపు పని పూర్తి కాగా, ఇప్పుడు విజయవాడ–ఖమ్మం మధ్య నిర్వహిస్తున్నారు. గత బడ్జెట్‌లో రూ.337 కోట్లు కేటాయించారు.

కాజీపేట–బల్లార్షా మూడో లైను: రూ.300 కోట్లు.

ఈ ప్రాజెక్టు 2015–16లో మంజూరైంది. దీని నిడివి 202 కి.మీ.. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,063 కోట్లు. కాజీపేట హసన్‌పర్తి మధ్య పనులు జరగాల్సి ఉండగా, ఎగువ భాగంలో దాదాపు పూర్తయ్యాయి. గత బడ్జెట్‌లో రూ.450 కోట్లు కేటాయించారు.

మనోహరాబాద్–కొత్తపల్లి: రూ.350 కోట్లు

ఈ ప్రాజెక్టు 2006–07లో మంజూరు కాగా, నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. దీని నిడివి 151 కి.మీ.. అంచనా వ్యయం రూ.1160 కోట్లు. మూడొంతుల ఖర్చు రైల్వే భరించనుండగా, రాష్ట్రప్రభుత్వం ఒకవంతుతో పాటు భూసేకరణ వ్యయాన్ని భరిస్తుంది. సిద్దిపేట వరకు పనులు పూర్తి కావటంతో సికింద్రాబాద్–సిద్దిపేట మధ్య రైలు సర్వీసులు మొదలయ్యాయి. సికింద్రాబాద్–సిరిసిల్ల మధ్య భూసేకరణకు రాష్ట్రప్రభుత్వం నిధులు డిపాజిట్ చేయకపోవటంతో పనులు ఆగాయి. గత బడ్జెట్‌లో రూ.185 కోట్లు కేటాయించారు.

భద్రాచలం–సత్తుపల్లి:రూ.6 కోట్లు

ఇది 2010–11లో మంజూరైంది. నిడివి 54 కి.మీ. అంచనా వ్యయం రూ.704 కోట్లు. సింగరేణితో కలిపి రైల్వే ఈ సంయుక్త ప్రాజెక్టును చేపట్టింది. బొగ్గు తరలింపు ప్రధాన లక్ష్యంగా ఈ పనులు చేస్తున్నారు.

ఎంఎంటీఎస్ రెండో దశ: రూ.50 కోట్లు

నగర ట్రాఫిక్‌కు ఊరటనిచ్చే ఈ ప్రాజెక్టును 2012–13లో మంజూరు చేశారు. అంచనా వ్యయం రూ.817 కోట్లు. ఇందులో రాష్ట్రప్రభుత్వ వాటా రూ.450 కోట్లు. కానీ రాష్ట్రప్రభుత్వం రూ.130 కోట్లతోనే సరిపుచ్చింది. గత బడ్జెట్‌లో భారీగా నిధులు విడుదల కావటంతో పనులు వేగంగా సాగాయి. దీంతో ప్రాజెక్టు సిద్ధమైంది.

ఘట్‌కేసర్–యాదాద్రి ఎంఎంటీఎస్: రూ.10 కోట్లు

రాష్ట్రప్రభుత్వం తన వాటా నిధులివ్వలేదన్న ఉద్దేశంతో రైల్వే శాఖ పనులు చేపట్టలేదు. గత బడ్జెట్‌లో నామమాత్రంగా రూ.10 లక్షలతో సరిపెట్టింది. కానీ ఈసారి రూ.10 కోట్లు కేటాయించటంతో పనులు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది.

చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్:రూ.46 కోట్లు

సికింద్రాబాద్ స్టేషన్ ఇరుకుగా మారటంతో దానికి ప్రత్యామ్నాయంగా చర్లపల్లిలో టెర్మినల్ నిర్మించారు. ఇందులో 6 ప్లాట్‌ఫామ్స్, 5 పిట్ లైన్లు ఉంటాయి. రైల్వే కోరినంత భూమిని రాష్ట్రప్రభుత్వం కేటాయించలేదన్న విమర్శ ఉంది. దీంతో దీన్ని ఆశించినస్థాయిలో కాకుండా చిన్నదిగానే నిర్మించారు. పనులు దాదాపు పూర్తయ్యాయి.

భద్రాచలం–కొవ్వూరు: రూ.10 లక్షలు

ఇది కీలకప్రాజెక్టు అయినప్పటికీ నిధుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. గత బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించగా ఈసారి నామమాత్రపు నిధులతోనే సరిపెట్టారు.

మణుగూరు–రామగుండం: రూ.5 కోట్లు

కీలక ప్రాజెక్టుకు తొలిసారి భారీ నిధులు

కాజీపేట మీదుగా సికింద్రాబాద్–విజయవాడ మార్గం ఇరుకుగా మారటంతో దానికి ప్రత్యామ్నాయ లైను అవసరం ఏర్పడింది. నడికుడి మీదుగా బీబీనగర్– గుంటూరు మార్గాన్ని దీనికి ప్రత్యామ్నాయ మార్గంగా అభివృద్ధి చేయాలని 2019లో నిర్ణయించారు. 248 కి.మీ. మేర రెండోలైన్ నిర్మించాల్సి ఉంది. రూ.2853 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. రెండు లైన్లు పూర్తయితే ఈ మార్గంలో రైళ్ల సంఖ్యను పెంచుతారు. కానీ పనులు మాత్రం మొదలు కాలేదు. గత బడ్జెట్‌లో రూ.60 కోట్లు ప్రతిపాదించగా, సవరించిన అంచనాల్లో దాన్ని రూ.10 కోట్లకు కుదించారు. అవి కూడా విడుదల కాలేదు. తొలిసారిగా ఆ ప్రాజెక్టుకు రూ.200 కోట్లను తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

కాజీపేట వ్యాగన్ ఫ్యాక్టరీకి రూ.150 కోట్లు

కాజీపేటలో నిర్మిస్తున్న వ్యాగన్ ఫ్యాక్టరీకి రూ.150 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.140 కోట్లు ప్రతిపాదించారు. తొలుత వ్యాగన్ పీరియాడిక్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాపుగా మంజూరు చేసిన దీన్ని.. గత బడ్జెట్‌లో వ్యాగన్ తయారీ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేశారు. అంచనా వ్యయాన్ని రూ.521 కోట్లకు పెంచారు. గతేడాది నుంచి పనులు ఊపందుకున్నాయి. ఆ ప్రాంతాన్ని చదును చేయటం, కొన్ని షెడ్లు నిర్మించటం, ఒక ఆర్‌యూబీని సిద్ధం చేయటం.. తదితరాలు పూర్తి చేశారు. ఇప్పుడు మెరుగ్గానే నిధులు వచ్చినందున వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనులు వేగంగా సాగుతాయని అంచనా వేస్తున్నారు. ఆ తదుపరి సంవత్సరం నాటికి అది పూర్తయి పని ప్రారంభించనుంది.

'కవచ్'లో అదే నిర్లక్ష్యం

ఇటీవల వరుస రైలు ప్రమాదాలు జనాన్ని భయపెడుతున్నాయి. పరస్పరం రైళ్లు ఢీకొనకుండా నిరోధించే కవచ్ వ్యవస్థను వేగంగా ఏర్పాటు చేయాలన్న ఒత్తిడి పెరిగింది. సొంత పరిజ్ఞానంతో రైల్వే దీన్ని అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. ఇందుకు పరీక్షలు సనత్‌నగర్–వికారాబాద్, వికారాబాద్–వాడీ మధ్య నిర్వహించారు. ఈ క్రమంలో ఆయా మార్గాల్లో దాదాపు 1200 కి.మీ. మేర ఈ వ్యవస్థను ఏర్పాటు కాగా, దేశంలోని మిగతా చోట్ల ఇప్పటివరకు ఏర్పాటు కాలేదు. 160 కి.మీ. వేగంతో రైళ్లు దూసుకెళ్లేటప్పుడు ఈ వ్యవస్థ ఎలా పనిచేస్తుందనే పరీక్షలను ఇతర జోన్లలో ఇటీవలే నిర్వహించారు. తాజా బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు కవచ్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.10 కోట్లు మాత్రమే కేటాయించారు. ఒక కి.మీ.కు 50 లక్షలు ఖర్చయ్యే పనిలో ఈ మొత్తం నామమాత్రమే. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా కవచ్ వ్యవస్థ ఏర్పాటు కాదని దాదాపు స్పష్టమైంది.

15 రోడ్లు అప్‌గ్రేడ్ చేయండి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని జిల్లా కేంద్రాలు, పారిశ్రామిక కారిడార్లు, పర్యాటక, తీర్థ స్థలాలు, సమీప రాష్ట్రాలను కలిపే ముఖ్యమైన 15 రాష్ట్ర రహదారులను గుర్తించి వాటిని జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో జరిగిన భేటీలో వినతిపత్రం సమర్పించారు. ఈ రహదారులపై ఇప్పటికే రాష్ట్రం ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని కోమటిరెడ్డి కేంద్రమంత్రి గడ్కరీకి గుర్తుచేశారు. ఇందులో మొదటి ప్రాధాన్యతగా 780 కిలోమీటర్ల పొడవైన 6 రహదారులను జాతీయ రహదారులుగా 2024–25 వార్షిక ప్రణాళికలో పెట్టి అభివృద్ధి చేయాలని కోరారు.

మొదటి ప్రాధాన్యంగా అభివృద్ధి చేయాలని కోరిన 6 రోడ్లు(780కి.మీ)

◆ చౌటుప్పల్–(ఎస్‌హెచ్65)–ఆమనగల్లు–షాద్‌నగర్–సంగారెడ్డి (ఎస్‌హెచ్65) 182 కి.మీ ◆ మరికల్ (ఎస్‌హెచ్167)– నారాయటపేట–రామసముద్రం (ఎస్‌హెచ్150) 63 కి.మీ ◆ పెద్దపల్లి (ఎస్‌హెచ్1)– కాటారం (ఎస్‌హెచ్353సి) 66 కి.మీ ◆ పుల్లూరు (ఎస్‌హెచ్44)–అలంపూర్–జెట్‌ప్రోల్–పెంట్లవెల్లి–కొల్లాపూర్–లింగాల–అచ్చంపేట– డిండి (ఎస్‌హెచ్765)–దేవరకొండ(ఎస్‌హెచ్176)–మల్లేపల్లి (ఎస్‌హెచ్167)–నల్లగొండ (ఎస్‌హెచ్–565) 225 కి.మీ

◆ వనపర్తి –కొత్తకోట–గద్వాల – మంత్రాలయం (ఎస్‌హెచ్167) 110 కి.మీ ◆ మన్నెగూడ (ఎస్‌హెచ్163)–వికారాబాద్–తాండూరు–జహీరాబాద్–బీదర్ (ఎస్‌హెచ్–50) 134 కి.మీ



ఢిల్లీలో గడ్కరీతో భేటీ అయిన మంత్రి కోమటిరెడ్డి

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం జాతీయ రహదారి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలి

భారతమాల పథకం ఫేజ్–1లో భాగంగా రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం సంగారెడ్డి–నర్సాపూర్–తూప్రాన్–చౌటుప్పల్') గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్ మాత్రమే మంజూరై ప్రస్తుతం భూసేకరణ కొనసాగుతోందని కేంద్రమంత్రి దృష్టికి కోమటిరెడ్డి తీసుకెళ్లారు. కాగా దక్షిణభాగానికి కూడా జాతీయ రహదారి హోదా గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. నల్లగొండ జిల్లాలో ట్రాన్స్‌పోర్ట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి (ఎస్‌హెచ్65) పక్కన 25 ఎకరాలు గుర్తించామని, దీని ఏర్పాటుకు రూ.65 కోట్లు వన్ టైం గ్రాంట్ క్రింద మంజూరు చేయాలని కోరారు. దీని ద్వారా నల్లగొండ జిల్లాతో పాటు తెలంగాణవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతకు ట్రాన్స్‌పోర్ట్ ఫీల్డ్‌లో మెరుగైన ఉపాధి దొరుకుతుందని కోమటిరెడ్డి అన్నారు. మంత్రి వెంట తాండూరు, జడ్చర్ల ఎమ్మెల్యేలు బి.మనోహర్‌రెడ్డి, జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

వ్యవసాయ రంగానికి 'అగ్రిషో'తో మేలు

● 'అగ్రి షో– కిసాన్ 2024'ను ప్రారంభించిన మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్: వ్యవసాయ యాంత్రీకరణలో కీలక భూమిక పోషిస్తున్న కంపెనీలు, నిపుణులు, ప్రగతిశీల రైతుల మరిన్ని ఆలోచనలకు ఈ వినూత్న కార్యక్రమం మరింత పదును పెడుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. వ్యవసాయ రంగ అభి వృద్ధికి కృషి చేస్తున్న విభిన్న వాటాదారులను ఒక చోటుకు చేర్చే అగ్రి షో– కిసాన్ 2024 కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల గురువారం హైటెక్స్‌లో ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఇలాంటి అగ్రి షోల వల్ల వ్యవసాయ రంగం మరింత ముందుకు సాగుతుందని అన్నారు. అగ్రి షో ఈనెల 3వ తేదీ వరకు కొనసాగనుంది. దీనిలో వ్యవసాయ యంత్రాలు, నూతనంగా రూపొందించిన పనిముట్లు, ట్రాక్టర్లు, వాటర్–ఇరిగేషన్ సొల్యూషన్స్, వివిధ రకాల పనిముట్లు, వినూత్న ఆవిష్కరణలు, అంకుర సంస్థలు, కాంట్రాక్ట్ ఫార్మింగ్ సొల్యూషన్స్‌సహా విస్తృతమైన ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తారు. కాగా, మొక్కలను పెంచడమంటే భావితరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వడమేనని మంత్రి అన్నారు. గురువారం నగరంలోని నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్, అగ్రికల్చర్ ప్రదర్శనను మంత్రి తుమ్మల ప్రారంభించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం ప్రేమికులు ఎంతోమంది ఉన్నారని, ఇళ్లు, టెర్రస్, బాల్కనీలో మొక్కలు పెంచుకునే ఆసక్తి ఉన్నవారికి ఈ మేళాతో ఎంతో ఉపయోగమన్నారు.

టీడీపీ తరఫున లోకేశ్ పిటిషన్ ఎలా వేశారు?

నిబంధనల ప్రకారం అధ్యక్షుడి అనుమతి ఎందుకు తీసుకోలేదు?

- ఉపన్యాసాలు, ఉపోద్ఘాతాలు వద్దు.. సబ్జెక్ట్‌పై వాస్తవాలు చెప్పండి
- సమాచారం లేకుండా వాదనలు వినిపించడానికి వస్తే ఎలా?
- ఇంకా సమయం కావాలనడం.. కోర్టు సమయాన్ని వృథా చేయడమే
- టీడీపీ న్యాయవాదులపై తెలంగాణ హైకోర్టు సీజే ధర్మాసనం ఆగ్రహం
- 'వ్యూహం'పై వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్ : వ్యూహం చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) కమిటీ జారీ చేసిన 'యు'సర్టిఫికెట్ రద్దు చేయాలన్న పిటిషన్‌పై సింగిల్ జడ్జి విచారణ జరిపి తీర్పు ఇచ్చారు.. ఇక్కడకు అప్పీల్ వచ్చింది.. సమాచారం ఇవ్వడానికి ఇంకా సమయం కావాలని కోరడం ఆమోదయోగ్యం కాదంటూ టీడీపీ న్యాయవాదులపై తెలంగాణ హైకోర్టు సీజే ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పార్టీ అధ్యక్షుడి(అచ్చెన్నాయుడు, ఏపీ) అనుమతి లేకుండా పిటిషన్ వేయడానికి రిట్ పిటిషనర్(లోకేశ్)కు ఏం అధికారం ఉందని ప్రశ్నించింది. 'విచారణకు వచ్చే ముందు సిద్ధమై రావాలి కదా.. కోర్టు సమయం వృథా చేయడం సమర్థనీయం కాదు.. ఉపోద్ఘాతాలు, ఉపన్యాసాలతో కాలయాపన వద్దు.. సబ్జెక్ట్‌పై వాస్తవాలు వెల్లడించండి. ఒక్క పిటిషన్‌పై సమాచారం లేకుండా ఇంత సుదీర్ఘంగా వాదనలు వింటే.. ఇతర పిటిషన్ల విచారణ ఆగిపోతుందని తెలుసుకోవాలి కదా. జడ్జిమెంట్లపై కూడా సరిగా అవగాహన లేకుండా వాదనలు వినిపిస్తున్నారు. ఒక హైకోర్టు తీర్పును మరో హైకోర్టు తీర్పుగా పేర్కొంటున్నారు. కనీస ప్రిపరేషన్ లేకుండా వస్తే ఎలా? పార్టీ నిబంధనల ప్రకారం ఏపీ అధ్యక్షుడి అనుమతి ఎందుకు తీసుకోలేదు. అడిగిన సమాచారం లేకుండా సాంకేతిక కారణాలు అని చెప్పడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. భోజన విరామంలో సమయం వచ్చినా ఎందుకు వినియోగించుకోలేదు'అని మండిపడింది. నేటి (శుక్రవారం) వరకు సమయం కావాలని టీడీపీ న్యాయవాదులు అడగడాన్ని తప్పుబట్టింది.




కారణాల వెల్లడి అవసరం లేదు..

వ్యూహం చిత్రానికి సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికెట్ రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఈ నెల 22న తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, దర్శకుడు రాంగోపాల్ వర్మ తెలంగాణ హైకోర్టులో వేర్వేరుగా అప్పీల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. నిర్మాత తరఫున సీనియర్ న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. 'చిత్రానికి 'యు'సర్టిఫికెట్ జారీ చేసిన తర్వాత.. అందుకు కారణాలు తెలియజేయాల్సిన అవసరం సీబీఎఫ్‌సీ రివైజింగ్ కమిటీకి లేదు. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం సర్టిఫికెట్ జారీపై నిర్ణయం తీసుకునే అధికారం చైర్మన్‌కు ఉంటుంది. ఆయన జారీ చేసిన తర్వాత అడ్డుకోవడం సరికాదు. సింగిల్ జడ్జి తీర్పును కొట్టివేసి, చిత్ర విడుదలకు ఆదేశాలు జారీ చేయాలి'అని విజ్ఞప్తి చేశారు.

సింగిల్ జడ్జి తీర్పు చైర్మన్‌కు చేరింది

టీడీపీ తరఫున సీనియర్ న్యాయవాది మురళీధర్, మరో న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా వారిపై కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'వ్యక్తిగత పరువు నష్టానికి పార్టీ తరఫున పిటిషన్ వేయడం సరికాదన్న నిర్మాత వాదనకు.. మీరు పార్టీ రిజిస్ట్రేషన్, పార్టీ సీనియారిటీ అంటూ వాదనలు వినిపించడం ఏమిటో అర్థం కావడం లేదు. వాదనలు సూటిగా వినిపించండి'అని అసహనం వ్యక్తం చేసింది. అధ్యక్షుడి అనుమతి కాపీని నేడు కోర్టుకు అందజేస్తామని వారు మరోసారి కోరగా, అందుకు ధర్మాసనం నిరాకరించింది. అనంతరం సీబీఎఫ్‌సీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ వాదనలు వినిపిస్తూ.. సింగిల్ జడ్జి తీర్పు కాపీ సీబీఎఫ్‌సీ చైర్మన్‌కు చేరిందని, కమిటీ ఏర్పాటులో ఉన్నారన్నారు. ఒకట్రెండు రోజుల్లో పూర్తి వివరాలు తెలుస్తాయని చెప్పారు. వాదనలు పూర్తి కావడంతో ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది.

'బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి'



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన ఓటాన్ అన్ అకౌంట్ బడ్జెట్ తెలంగాణకు మొండి చేయి చూపిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. తెలంగాణ విభజన సందర్భంగా ప్రకటించిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించకుండా.. కంటి తుడుపుగా యాక్సిల్ అండ్ వీల్ అనే పరిశ్రమను స్థాపిస్తామని చెప్పారని విమర్శించారు. వాటికి నిధులు కేటాయించలేదని చెప్పారు. కాళేశ్వరానికి జాతీయ హోదా ప్రకటించలేదని తెలిపారు. ఇప్పుడు పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ప్రకటించని కేంద్రం తెలంగాణపై చిన్నచూపు చూపుతోందన్నారు.


నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వండి

సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో తగిన ప్రాధాన్యమివ్వాలని ఆల్ ఇండియా బేడ బుడగ జంగం వెల్ఫేర్ ఫెడరేషన్ (ఏబీబీజేడబ్ల్యూఎఫ్) ఆర్గనైజింగ్ చైర్మన్ కడమంచి ముత్తయ్య కోరారు. ఈ మేరకు గురువారం టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలను కలిసి వినతి పత్రం సమర్పించారు. గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా నామినేటెడ్ పదవుల్లో బేడ బుడగ జంగాలకు అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధిష్టానంతో మాట్లాడిన తగిన అవకాశం కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని ముత్తయ్య తెలిపారు.

చిన్న దేశాలే.. రిచ్చెస్ట్..

ఒక దేశంలో ఏడాదికాలంలో ఉత్పత్తి అయ్యే మొత్తం వస్తువులు, సేవల విలువను జీడీపీగా చెప్తారు. జనాభా ఎక్కువగా ఉన్న దేశాల జీడీపీ ఎక్కువగా ఉన్నా.. తలసరి జీడీపీ బాగా తక్కువగా ఉంటుంది. అంటే అవి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలే అయినా.. పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల కిందే లెక్క. అదే తలసరి జీడీపీ ఎక్కువగా ఉన్న దేశాలు బాగా అభివృద్ధి చెందినవి అన్నమాట.







రాష్ట్రాలకు రూ. 75 వేల కోట్ల వడ్డీలేని రుణాలు

వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసే చర్యల్లో భాగంగా సంస్కరణల బాటపట్టే రాష్ట్రాలకు 50 ఏళ్లపాటు రూ. 75 వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తామని కేంద్రం తెలిపింది. 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న లక్ష్యసాధన కోసం ఈ మేరకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఇందుకోసం రాష్ట్రాలు ఎన్నో అభివృద్ధి ఆధారిత సంస్కరణలను చేపట్టాల్సి ఉందన్నారు. అన్ని రంగాల సమ్మిళిత అభివృద్ధి సాధన దిశగా మోదీ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని చెప్పారు.



అంతరిక్షానికి అదనంగా రూ. 2,000 కోట్లు

అంతరిక్షంలో భారత కేంద్రం ఏర్పాటు లక్ష్యంగా కలిగిన అంతరిక్ష విభాగానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంటే రూ.2 వేల కోట్లు అదనంగా కేటాయించారు. ఈ విభాగానికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.13,042.75 కోట్లు కేటాయించారు. 2023-24 సవరించిన అంచనాల ప్రకారం ఈ విభాగానికి రూ.11,070.07 కోట్ల కేటాయింపులు జరిగాయి. 2035 కల్లా భారత్ అంతరిక్ష కేంద్రాన్ని నెలకొల్పాలని, 2040 కల్లా భారతీయ వ్యోమగామి చంద్రునిపై కాలు మోపాలని ప్రధాని మోదీ లక్ష్యంగా నిర్దేశించిన సంగతి తెలిసిందే. ఇలావుండగా స్పేస్ టెక్నాలజీకి కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. 2023-24లో రూ.8,180 కోట్లు కేటాయించగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.10,087 కోట్లుగా ప్రతిపాదించారు.



మహిళా శిశు అభివృద్ధికి రూ.26 వేల కోట్లు

మధ్యంతర బడ్జెట్‌లో మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు రూ.26 వేల కోట్ల కేటాయింపులు దక్కాయి. 2023-24 బడ్జెట్‌తో పోలిస్తే ఇది 2.52 శాతం అధికం. అత్యధికంగా సాక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0లకు రూ.21,200 కోట్లు కేటాయించారు. మిషన్ శక్తికి రూ.3,145.97 కోట్లు ప్రతిపాదించారు. మహిళలకు భద్రత, రక్షణ అలాగే వారు తమ హక్కులు పొందడం, పలు ప్రభుత్వ పథకాలు చేరువ చేయడం లక్ష్యంగా మిషన్ శక్తి (సంబల్)కి కేంద్రం శ్రీకారం చుట్టింది. కాగా మిషన్ వాత్సల్య (బాలల రక్షణ సేవలు, బాలల సంక్షేమ సేవలు)కు రూ.1,472 కోట్లు కేటాయించారు. సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం..2023-24లో మహిళా శిశు అభివృద్ధి శాఖకు రూ.25,448.68 కోట్లు కేటాయించారు. అటానమస్ సంస్థలకు రూ.168 కోట్ల నుంచి రూ.153 కోట్లకు బడ్జెట్ తగ్గింది. ఈ సంస్థల్లో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీ, నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్, నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ ఉన్నాయి.

ఇది కార్పొరేట్ల బడ్జెట్

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ఓటర్లను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. ఈ బడ్జెట్ దారిద్ర్య రేఖకు దిగువనున్నవారికి ప్రయోజనం కల్పించేది కాదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. కేంద్రం ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ, మరోవైపు రాయితీలకు కోత పెడుతోందన్నారు.

సాగుకు రూ. 1.27 లక్షల కోట్లు

:... వ్యవసాయ రంగం ...:

వ్యవసాయ విభాగానికి	వ్యవసాయ పరిశోధన, విద్యకు
రూ.1,17,528 కోట్లు	రూ. 9,941 కోట్లు
పీఎం కిసాన్ పథకానికి మళ్లీ రూ.60 వేల కోట్లే	ఆహార మంత్రిత్వ శాఖ బడ్జెట్‌కు కోత..



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను వ్యవసాయ మంత్రిత్వ శాఖకు కేంద్రం రూ.1.27 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-2024)తో పోల్చుకుంటే కేటాయింపులు స్వల్పంగా పెంచింది. రూ.1,27,469.88 కోట్లలో వ్యవసాయ విభాగానికి రూ.1,17,528 కోట్లు కేటాయించగా, వ్యవసాయ పరిశోధన, విద్య (డేర్) విభాగానికి రూ.9,941 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర సవరించిన అంచనాల ప్రకారం.. వ్యవసాయ విభాగానికి రూ.1,16,788.96 కోట్లు, డేర్‌కు రూ.9,876.60 కోట్లు కేటాయించారు. పీఎం కిసాన్ పథకానికివ్యవసాయ విభాగం పరిధిలోని ప్రతిష్టాత్మక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.60 వేల కోట్లు కేటాయించగా, వచ్చే ఏడాదికి ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా రూ.60 వేల కోట్లే కేటాయించారు. ఈ పథకం కింద కేంద్రం రైతులకు మూడు వాయిదాలుగా సంవత్సరానికి రూ.6 వేలు చొప్పున అందజేస్తోంది.

ప్రజా పంపిణీకి రూ.8 వేల కోట్ల తగ్గింపు..

వినియోగదారుల వ్యవహారాలు,ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే కేటాయింపులు తగ్గాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను ఈ శాఖకు రూ.2.13 లక్షల కోట్ల పైచిలుకు కేటాయించారు. ఇందులో వినియోగదారుల వ్యవహారాలకు 302.62 కోట్లు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దీని బడ్జెట్ రూ.309.26 కోట్లు కావడం గమనార్హం. ఇక ఆహార, ప్రజా పంపిణీ విభాగానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,21,924.64 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది కొంత కోత విధించి రూ.2,13,019 కోట్ల బడ్జెట్ మాత్రమే కేంద్రం కేటాయించింది. దేశవ్యాప్తంగా ఉన్న రేషన్ షాపుల ద్వారా 80 కోట్లకు పైగా ప్రజలకు ఈ విభాగం ఆహార ధాన్యాలు పంపిణీ చేస్తోంది.

రసాయనాలు ఎరువుల శాఖకు రూ.1.68 లక్షల కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సరానికి రసాయనాలు, ఎరువుల శాఖకు రూ.1.68 లక్షల కోట్లు కేటాయించారు. ఎరువుల విభాగానికి కేటాయింపులు రూ.1,88,947.29 కోట్ల నుంచి రూ.1,64,150.81 కోట్లకు తగ్గించారు. ఇక రసాయనాలు, పెట్రో రసాయనాల విభాగానికి కేటాయింపులు గణనీయంగా తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.572.63 కోట్లు కేటాయించగా, వచ్చే ఏడాదికి కేవలం రూ.139.05 కోట్లు మాత్రమే కేటాయించారు. అయితే ఫార్మాస్యూటికల్స్ విభాగానికి మాత్రం కేటాయింపులు పెరగడం గమనార్హం. దీనికి కేటాయింపులు రూ.2,697.95 కోట్ల నుంచి రూ.4,089.95 కోట్లకు పెరిగాయి. అలాగే హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలోని సహకార శాఖకు కూడా రూ.747.84 కోట్ల నుంచి రూ.1,183.39 కోట్లకు కేటాయింపులు పెరిగాయి. ఇక మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ శాఖకు రూ.7,105.74 కోట్లు, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖకు రూ.3,290 కోట్లు కేటాయించారు.

నీళ్లకు నిధులు పెరిగాయ్

జలశక్తి శాఖకు రూ. 98,418 కోట్లు కేటాయింపు
గతేడాదికన్నా రూ. 2 వేల కోట్లు అధికం
పీఎంకేఎస్‌వై ప్రాజెక్టుకు రూ. 11,391 కోట్లు
గతంకన్నా రూ. 3 వేల కోట్లు పెరుగుదల


సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2024 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేంద్ర జలశక్తి శాఖకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యతనిచ్చింది. గతేడాది జలశక్తి శాఖకు మొత్తంగా కేటాయించిన నిధుల కంటే దాదాపు రూ. 2 వేల కోట్ల మేర కేటాయింపులను పెంచింది. గతేడాది జలశక్తి శాఖకు రూ. 96,549 కోట్లు కేటాయించగా ఈ ఏడాది ఆ కేటాయింపులను రూ. 98,418 కోట్లకు పెంచింది. ముఖ్యంగా ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద నిధుల మొత్తాన్ని రూ. 8,781 కోట్ల నుంచి రూ. 11,391 కోట్లకు పెంచింది. దీనికిందే ఉన్న సమగ్ర సాగునీటి సత్వర ప్రాయోజిత కార్యక్రమం (ఏఐబీపీ) పథకానికి గతేడాదికి సమానంగా రూ. 2,500 కోట్లు కేటాయించింది. ఏఐబీపీ పథకంలో తెలంగాణ, ఏపీకి సంబంధించి వివిధ ప్రాజెక్టులకు ఈ నిధులు కేటాయించే అవకాశం ఉంది. దీంతోపాటే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో భేటీ సమయంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోరగా పీఎంకేఎస్‌వై పథకం కింద ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిధుల్లోనే ఆ మొత్తాలను కేటాయించాల్సి ఉంటుంది. ఇక ఆయకట్టు అభివృద్ధి పథకం (కాడా) కింద రూ. 1,400 కోట్లు కేటాయించగా దీని కింద సైతం తెలంగాణకు సంబంధించి 11 ప్రాజెక్టులున్నాయి.



నదుల అనుసంధానానికి పెరిగిన కేటాయింపులు...

నదుల అనుసంధాన కార్యక్రమానికి కేంద్రం నిధులు పెంచింది. గతేడాది కేవలం రూ. 1,500 కోట్లు కేటాయించిన మోదీ ప్రభుత్వం.. ఈ ఏడాది దాన్ని రూ. 4 వేల కోట్లకు పెంచింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ సాగు, తాగునీటి అవసరాలను తీర్చే కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రక్రియ ఇప్పటికే మొదలవ్వడం, నాలుగు రోజుల కిందటే మధ్యప్రదేశ్, రాజస్తాన్ మధ్య పర్బతి-కాలిసింద్-చంబల్ నదులను తూర్పు రాజస్తాన్ కాలువతో కలిపే అనుసంధాన ప్రక్రియపై ఒప్పందాలు జరిగిన నేపథ్యంలో కేటాయింపులు పెంచినట్లు తెలుస్తోంది. అయితే గోదావరి-కావేరి అనుసంధాన ప్రక్రియపై ఎలాంటి ముందడుగు ఉంటుందన్నది తేలాల్సి ఉంది. గతేడాది తుంగభద్ర జలాలపై ఆధారపడి కర్ణాటక చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర సాయం కింద రూ. 5,300 కోట్లు ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించగా ఈ ఏడాది దాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. అలాగే తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టులు ముఖ్యంగా ఏపీలోని పోలవరం ఎత్తిపోతల పథకానికి నిధుల కేటాయింపు అంశాల ప్రస్తావన లేదు.

ఆదాయ పన్ను శ్లాబ్‌లు యథాతథం..



సాక్షి,అమరావతి: మధ్యతరగతి, వేతనజీవుల ఆశలపై ఆర్థిక మంత్రి నీళ్లు కుమ్మరించారు. ఎన్నికల వేళ ప్రవేశపెడుతున్న బడ్జెట్ కావడంతో కాసింత ఉపశమన మాటలు వస్తాయనుకున్న వారికి గతంలో చేసిన గొప్పలను ఏకరువు పెట్టి సరిపెట్టారు. మధ్యంతర బడ్జెట్ కావడంతో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో ఎటువంటి మార్పులు చేయడం లేదన్నారు. వ్యక్తిగత ఆదాయ పన్నుల శ్లాబుల్లో ఎటువంటి మార్పులు లేవన్నారు. గత పదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 3 రెట్లకుపైగా పెరగ్గా పన్ను రిటర్నులు దాఖలు చేసే వారి సంఖ్య 2.4 రెట్లు పెరిగిందని పేర్కొన్నారు. 2013- 14 ఆర్థిక సంవత్సరానికి దేశంలో పన్ను చెల్లించాల్సినవసరం లేని ఆదాయ పరిమితి రూ.2.2 లక్షలు ఉంటే ఇప్పుడు 7 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారు ఒక్క రూపాయి పన్ను చెల్లించాల్సిన పని లేదన్నారు.

కొత్త పన్నుల విధానం ఎన్నుకున్న వారికే ఇది వర్తింపు

7 లక్షల వరకు పన్ను చెల్లించక్కర్లేదన్న ఆర్థిక మంత్రి మాటలపై మధ్యతరగతి ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇది కేవలం కొత్త పన్నుల విధానం ఎంచుకున్నవారికి మాత్రమే వర్తిస్తుందని, పాత పన్నుల విధానంలో ఉన్న వారికి ఈ రిబేటు పరిమితి రూ.5 లక్షలే ఉందన్న విషయాన్ని వారు గుర్తుచేశారు. నాలుగేళ్ల కిందట కొత్త పన్నుల విధానం తీసుకొచ్చారు. పాత విధానంతో పోలి స్తే తక్కువ పన్ను రేట్లతో అన్ని వయసుల వారికి ఒకే విధమైన శ్లాబ్ రేట్ల ను ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానం ఎంచుకుంటే సెక్షన్ 80సీ, గృహ రుణాలు, స్టాండర్డ్ డిడక్షన్, ఆరోగ్య బీమా వంటి పలు సెక్షన్ల కింద లభించే ప్రయోజనాలను పొందడానికి వీలుండదు. మొత్తం ఆదాయం మీద పన్ను చెల్లించా ల్సి వస్తుంది. కొత్త పన్నుల విధానంలో 7 లక్షల వరకు ఎటువంటి పన్ను చెల్లించన వరం లేకుండా సెక్షన్ 87ఏ కింద రిబేటు ప్రకటించింది. దీనికింద రూ.25,000 ప్రయో జనం లభిస్తుంది. అదే పాత పన్నుల విధానం ఎంచుకుంటే సెక్షణ్ 87ఏ రిబేటు పరిమితిని రూ.5 లక్షల ఆదాయం వరకు పరిమితం చేశారు. పాత పన్నుల విధానం ఎంచుకున్న వారికి కేవలం రూ.12,500 మాత్రమే ప్రయోజనం లభిస్తుంది. పాత విధానం నుంచి కొత్త విధానంలోకి మార్చాలన్న ఉద్దేశ్యంతో నిర్మాల ఈ నిర్ణయం తీసుకున్నారు. రిటైల్ వ్యాపారుల ఊహాజనిత ఆదాయం పరిమితిని రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లకు, వృత్తినిపుణుల ఊహాజనిత ఆదాయ పరిమితిని రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో పన్ను రిటర్నులు సులభంగా దాఖలు చేసే విధంగా పలు చర్యలు తీసుకున్నామని, దీంతో 2013- 14లో 93 రోజులుగా ఉన్న రిఫండు సమయాన్ని ఇప్పుడు పదిరోజులకు తగ్గించినట్లుగా తెలిపారు.

'లఖ్‌పతి దీదీ' కిందకు 3 కోట్ల మంది మహిళలు



న్యూఢిల్లీ: స్వయం సహాయక బృందాల్లో సభ్యత్వం తీసుకుని పొదుపు బాటలో పయనిస్తూ తమ దక్షతతో వ్యాపారం చేస్తూ లఖ్‌పతి దీదీ (లక్షాధికారి)లుగా అవతరిస్తున్న మహిళల సంఖ్యను మరింత పెంచడంపై దృష్టిపెట్టినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ విషయాన్ని తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. '' 83 లక్షల స్వయం సహాయక బృందాలు(ఎస్‌హెచ్‌జీ)ల్లో దాదాపు తొమ్మిది కోట్ల మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. వేల కోట్ల రుణాలు తీసుకుంటూ స్వయం ఉపాధి సాధిస్తూ, చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటున్నారు. కష్టించి వ్యాపారాన్ని నిలబెట్టుకుని తమ కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలుస్తున్నారు. ఇలా దేశవ్యాప్తంగా దాదాపు కోటి మంది మహిళలు ఏటా కనీసం రూ. 1 లక్ష ఆర్జిస్తున్నారు. స్వయం ఉపాధి ద్వారా ఇలా పొదుపు సంఘాల మహిళలు దేశ సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేస్తూ సాధికారత, స్వావలంభన సాధిస్తూ అందరికీ స్ఫూర్తిప్రదాతలయ్యారు. ఇలాంటి లక్షాధికారి(లఖ్‌పతి దీదీ)ల సంఖ్యను రెండు నుంచి మూడు కోట్లకు పెంచడమే మా ప్రభుత్వ లక్ష్యం'' అని నిర్మల లోక్‌సభలో వ్యాఖ్యానించారు.

ఆశ, అంగన్‌వాడీలకు 'ఆయుష్మాన్ భారత్'

న్యూఢిల్లీ: ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు హెల్త్‌కేర్ కవరేజీని కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించారు. వారిని ఆయుష్మాన్ భారత్ బీమా పథకం పరిధిలోకి తీసుకువస్తున్నట్లు 2024-25 బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. సక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 కింద అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నతీకరించడం ద్వారా న్యూట్రిషన్ డెలివరీ వేగవంతం అవుతుందని చెప్పారు. ఇప్పుడున్న ఆస్పత్రుల మౌలిక వసతులను వినియోగించుకుని మరిన్ని మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలనే ప్రణాళికలో ప్రభుత్వం ఉందని తెలిపారు. దీనిని పరిశీలించడానికి ఓ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కేటాయింపులను రూ. 6,800 కోట్ల నుంచి రూ. 7,500 కోట్లకు పెంచినట్లు నిర్మల చెప్పారు. సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణ కోసం 9 నుంచి 14 ఏళ్ల మధ్య ఉన్న బాలికలకు వ్యాక్సినేషన్‌ను ప్రోత్సహిస్తామన్నా రు. సమగ్ర ఆచరణ కోసం వివిధ మాతా శిశు హెల్త్‌కేర్ స్కీంలను ఒకే గొడుగు కిందకు తెస్తామన్నారు. మిషన్ ఇంద్రధనుష్ మరింత సమర్థంగా అమలు చేయడంలో భాగంగా కొత్తగా రూపొందించిన యు-విన్ పోర్టల్‌ను దేశవ్యాప్తంగా తీసుకొస్తున్నామని తెలిపారు.

గ్రామీణాభివృద్ధికి.. రూ. 1.77 లక్షల కోట్లు



➤ 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు రూ.1.77 లక్షల కోట్లు ప్రకటించారు. గతేడాది రూ.1.57 లక్షల కోట్ల కంటే 12 శాతం ఎక్కువగా కేటాయించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.86,000 కోట్లు కేటాయించగా, గత బడ్జెట్‌లో చేసిన రూ.60,000 కోట్ల కంటే ఇది 43 శాతం ఎక్కువ. వచ్చే ఐదేళ్లలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ పథకానికి రూ.54,500 కోట్లు కేటాయించారు. 'లఖ్ పతి దీదీ'ల లక్ష్యాన్ని రెండు కోట్ల నుంచి 3 కోట్లకు పెంచినట్లు సీతారామన్ ప్రకటించారు. జాతీయ జీవనోపాధి మిషన్-అజీవికకు రూ.15,047 కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయించిన రూ.14,129.17 కోట్ల కంటే ఇదిదాదాపు 6% ఎక్కువ. కాగా, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజనకు కేటాయింపులు తగ్గాయి. ఈ బడ్జెట్‌లో రూ.12,000 కోట్లు కేటాయించారు.

పర్యావరణ శాఖకు.. రూ. 3,265 కోట్లు



➤ కేంద్ర ప్రభుత్వం 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో పర్యావరణ శాఖకు రూ.3,265 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఈ మొత్తం రూ.3,231 కోట్లు ఉండగా, ఈ సారి కొద్దిగా పెరిగింది. అలాగే కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, కేంద్ర జూ అథారిటీ, జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ,ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ సంస్థలకు గతేడాది బడ్జెట్‌లో 158.60 కోట్లు కేటాయించగా, ఈ సారి రూ.192 కోట్లు కేటాయించారు. కాగా, స్వయంప్రతిపత్తి సంస్థలైన జీబీ పంత్ హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, భారత అటవీ పరిశోధన, అభి వృద్ధి మండలి, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలకు కేంద్రం గతేడాది బడ్జెట్‌లో రూ.573.73 కోట్లు కేటాయించగా, తాజా మధ్యంతర బడ్జె ట్‌లో రూ.391 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇక అడ వుల్లో జంతు ఆవాసాల సమీకృత అభివృద్ధికి రూ.450 కోట్లను కేటాయించింది. అలాగే అడవుల పరిరక్షణ, పచ్చ దనం పెంపునకు సంబంధించి జాతీయ గ్రీన్ ఇండియా మిషన్‌కు గత బడ్జెట్‌లో రూ.160 కోట్లు ఉన్న కేటాయింపులను ఈ సారి రూ.220 కోట్లకు పెంచింది.

సామాజిక న్యాయం, సాధికారతకు.. రూ. 14,225 కోట్లు



➤ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు రూ.14,225.47 కోట్లు కేటాయించారు. సామాజిక న్యాయం, సాధికారత శాఖకు రూ.13,000 కోట్లు కేటాయించగా.. వికలాంగుల సాధికారత శాఖకు రూ.1,225.27 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ రూ.11,078.33 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది 28.4% పెరిగింది. వికలాంగుల సాధికారత విభాగం కింద జాతీయ వికలాంగుల సంక్షేమానికి రూ.615 కోట్లు కేటాయించారు. సామాజిక న్యాయం, సాధికారత శాఖ కింద షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి పథకానికి రూ.9,559.98 కోట్లు కేటాయించగా, బలహీన వర్గాల అభివృద్ధి కార్యక్రమానికి రూ.2,150 కోట్లు కేటాయించారు. జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్, వెనుక బడిన తరగతుల జాతీయ కమిషన్, సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్‌కు మొత్తం రూ.7,175 కోట్లు కేటాయించారు.

గిరిజన మంత్రిత్వ శాఖకు.. రూ. 13వేల కోట్లు




➤ 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు కేంద్రప్రభుత్వం రూ.13,000 కోట్లు కేటాయించింది. ఇది గత కేటాయింపుల కంటే భారీ అనగా 70 శాతం ఎక్కువ. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గిరిజన మంత్రిత్వ శాఖకు రూ.7,605 కోట్లు కేటాయించారు. 2024-25లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) నిర్మాణానికి కేంద్రం రూ.6,399 కోట్లు కేటాయించింది. ఇది 2023-24లో కేటాయించిన రూ.2,471.81 కోట్ల కంటే 150 శాతం ఎక్కువ. ప్రధాన మంత్రి ఆది ఆదర్శ్ గ్రామ యోజనకు కేటాయింపులు రూ.300 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు పెంచారు. ఈ పథకం కింద విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి-ఆదాయ కల్పన వంటి రంగాల్లోని అంతరాలను తగ్గించడానికి గిరిజన ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిధులను అందిస్తారు. గిరిజన పరిశోధనా సంస్థలకు ఆర్థిక సహాయాన్ని రూ.50 కోట్ల నుంచి రూ.111 కోట్లకు పెంచారు. కాగా, జాతీయ ఫెలోషిప్, ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్య, స్కాలర్‌షిప్ కోసం బడ్జెట్ కేటాయింపులు 2023-24లో రూ.230 కోట్ల నుంచి 2024-25లో రూ.165 కోట్లకు తగ్గించారు.

ప్రపంచంలో ‘రక్షణ’కు భారీ బడ్జెట్లు!

లోవీ ఇనిస్టిట్యూట్ ఆసియా పవర్ ఇండెక్స్-2023 ప్రకారం.. 2030నాటికి ఇండియా రక్షణ వ్యయం 15.19 లక్షల కోట్లకు పెరగనుంది.

చాలా దేశాలు తమ శత్రుదేశాల నుంచి ముప్పును ఎదుర్కోవడానికి, తమ ఆధిపత్యాన్ని చాటడానికి రక్షణ రంగంపై భారీగా ఖర్చు చేస్తుంటాయి. అత్యాధునిక యుద్ధ విమానాలు, క్షిపణులు, ట్యాంకులు, తుపాకులు వంటి ఆయుధాలను కొనుగోలు చేయడమో, తయారు చేసుకోవడమో జరుగుతుంది. కొన్నేళ్లుగా పలు దేశాల మధ్య యుద్ధాలు, ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు, ఆధిపత్య ధోరణులు వంటివి వాటితో మిలటరీ బడ్జెట్ భారీగా పెరిగిపోతూ వస్తోంది. ఇందులోనూ ప్రపంచంలో అమెరికా టాప్‌లో ఉండగా.. చైనా, ఇండియా, యూకే, సౌదీ అరేబియా వంటి దేశాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.





కోటి ఇళ్లకు ‘సూర్యోదయం’

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సూర్యోదయ్ పథకం ద్వారా కోటి గృహాలపై సోలార్ ప్యానెళ్లను బిగించడం ద్వారా ఒక్కో కుటుంబం నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా పొందొచ్చని ఆర్థికమంత్రి నిర్మల చెప్పారు. జనవరి 22వ తేదీన అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత ఢిల్లీలో ప్రధాని మోదీ ప్రధాన్‌మంత్రి సూర్యోదయ్ యోజన పథకాన్ని ప్రారంభించిన విషయం తెల్సిందే. కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా పేద, మధ్యతరగతి ప్రజల కరెంటు బిల్లులను తగ్గించడమే కాకుండా, ఇంధన రంగంలో భారత్ స్వావలంబన దిశగా పయనించేందుకు దోహదం చేస్తుందని ఆనాడు మోదీ పేర్కొన్న విషయం విదితమే. ఈ పథకాన్ని నిర్మల తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. ‘‘ఈ పథకం పూర్తిగా అమల్లోకి వస్తే ఒక్కో కుటుంబం నెలకు 300 ఉచిత విద్యుత్‌ను సొంతంగా తయారుచేసుకోవచ్చు. వాడకం పోగా అధికంగా ఉత్పత్తి అయిన మిగులు విద్యుత్‌ను డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు అమ్మి నగదు లబ్ధి పొందొచ్చు. ఇలా సంవత్సరానికి దాదాపు రూ.18,000 వరకు నగదు ఆదా చేసుకోవచ్చు. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌తో ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ పెట్టుకోవచ్చు. ఇళ్లపై సోలార్ ప్యానెల్ వ్యవస్థ అమర్చుకునే వారికి సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకయ్యే ఖర్చులో 40 శాతం వరకు కేంద్రం రాయితీ ఇస్తుంది.’’అని నిర్మల చెప్పారు.

సముద్రజలాలపై పవన విద్యుత్..

‘‘2070 ఏడాదికల్లా భారత్ కర్బన తటస్థత(కార్బన్ నెట్ జీరో)ను సాధించగలదు. సముద్ర జలాలపై పవన విద్యుత్ ప్రాజెక్ట్‌లకు మొదలుపెట్టే సంస్థలకు ఆర్థిక సాయం చేస్తాం. కనీసం 1 గిగావాట్ స్థాపక సామర్థ్యమున్న ప్రాజెక్టులకు ప్రాధాన్యతమిస్తాం. మరోవైపు భారత్‌లో సౌరవిద్యుత్ ఉత్పత్తి స్థాపక సామర్థ్యం 73 గిగావాట్లుగా ఉంది. అదే తరహాలో పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 45 గిగావాట్లుగా ఉంది. బయోమాస్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 10 గిగావాట్లుగా ఉంది. 2030 ఏడాదికల్లా 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో 50 శాతం విద్యుత్‌ను శిలాజేతర ఇంధన వనరుల నుంచే ఉత్పత్తిచేయాల్సి ఉంది’’అని నిర్మల చెప్పారు.

:... సౌర విద్యుత్ ...:

300
సొంతంగా సౌరవిద్యుత్ ఉత్పత్తితో నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్

18,000
మిగులు విద్యుత్ అమ్మకాలతో ఏటా రూ. 18,000 వరకు ఆదా



కేవలం ఇంటి అవసరాల కోసమే కాకుండా యువత ఈ పథకాన్ని అద్భుత ఉపాధి అవకాశంగా మలుచుకోవచ్చు. యువత సరఫరాదారు, వ్యాపారిగా మారి పెద్ద మొత్తంలో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల బిగింపు, పంపిణీ వ్యాపారంలో దిగి అంకుర సంస్థలను నడిపించవచ్చు. దీంతో దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలూ మెరుగవుతాయి. సాంకేతిక నైపుణ్యమున్న యువత ఈ రంగంలో తయారీ, నిర్వహణ బాధ్యతలనూ తీసుకోవచ్చు.



విదేశాంగ శాఖకు రూ. 22,154 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో విదేశాంగ శాఖకు రూ. 22,154 కోట్లు కేటాయించారు. గతేడాది 18,050 కోట్లు ఇవ్వగా.. 2024-25 బడ్జెట్‌లో రూ. 4,104 కోట్లు పెంచి ఇచ్చారు. ఇక పొరుగుకు మొదట (నైబర్‌హుడ్ ఫస్ట్) పాలసీ కింద ఎక్కువ సాయాన్ని భూటాన్ అందుకోనుంది. ఈ దేశానికి ఈ బడ్జెట్‌లో రూ. 2,068 కోట్లు సాయాన్ని ప్రతిపాదించారు. గతేడాది బడ్జెట్‌లో ఈ హిమాలయ దేశానికి రూ. 2,400 కోట్లు ఇచ్చారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగించడానికి గాను ఆ దేశంలోని చబహర్ పోర్టుకు రూ. 100 కోట్లు కేటాయించారు. ఇక మాల్దీవులకు అభివృద్ధి సాయంలో గతేడాది కంటే రూ. 170 కోట్లు తగ్గించి ఈ బడ్జెట్‌లో రూ. 600 కోట్లు కేటాయించారు. అఫ్గానిస్తాన్‌కు రూ. 200 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ. 120 కోట్లు, నేపాల్‌కు రూ. 700 కోట్లు, శ్రీలంకకు రూ. 75 కోట్లు, మారిషస్‌కు రూ. 370 కోట్లు, మయన్మార్‌కు రూ. 250 కోట్లు అభివృద్ధి సాయం ప్రతిపాదించారు. ఆఫ్రికా దేశాల కోసం ప్రత్యేకంగా రూ. 200 కోట్లు ప్రకటించారు. లాటిన్ అమెరికా, యురేసియా ప్రాంతాల్లోని దేశాలకు అభివృద్ధి సాయంగా రూ. 4,883 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.

ఐఎంఈసీ ఓ గేమ్ చేంజర్

బడ్జెట్ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. వ్యూహాత్మకంగా, ఆర్థిక పరంగా భారత్ ఇతర దేశాలకు ఇండియా మిడిల్ ఈస్ట్ యూరోప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఈసీ) ఓ గేమ్ చేంజర్ అని చెప్పారు. ప్రపంచ వాణిజ్యానికి ఈ కారిడార్ వందల ఏళ్ల పాటు ఆధారభూతంగా ఉంటుందని అన్నారు. భారత నేలపై నుంచి ఈ కారిడార్ ప్రారంభమైందనే విషయం చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని చెప్పారు.


రక్షణకు రూ. 6.21 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో రక్షణ శాఖకు కేటాయింపులను గత ఏడాది కంటే స్వల్పంగా పెంచింది. 2023-24 బడ్జెట్‌లో రూ.5.94 లక్షల కోట్లు కేటాయించగా ఇప్పుడు రూ.6.21 లక్షల కోట్లు కేటాయించారు. మిలిటరీ కేపిటల్ వ్యయం కింద పెద్ద ఎత్తున కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధ ఓడల కొనుగోలు కోసం రక్షణ శాఖకు రూ. 1.72 లక్షల కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపు గత ఏడాది 1.62 లక్షల కోట్లుగా ఉంది. మిలిటరీ అవసరాల కోసం అత్యాధునిక సాంకేతికను సమకూర్చుకునేందుకు ‘ఆత్మ నిర్భరత’ను వేగవంతం చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. మొత్తం రెవెన్యూ వ్యయం రూ.4,39,300 కోట్లు కాగా, ఇందులో రక్షణ శాఖ పింఛన్లకు 1,41,205 కోట్లు, రక్షణ సర్వీసులకు 2,82,772 కోట్లు, రక్షణ మంత్రిత్వ శాఖ (సివిల్)కు రూ.15,322 కోట్లు కేటాయించారు. విమానాలు, ఏరో ఇంజిన్ల కోసం రూ. 40,777 కోట్లు, ఇతర పరికరాల కోసం 62,343 కోట్లను కేటాయించారు. నేవీ వాహనాల కోసం రూ.23,800 కోట్లు, డాక్‌యార్డ్ ప్రాజెక్టుల కోసం రూ.6,830 కోట్లు కేటాయించారు. రెవెన్యూ వ్యయం కోసం ఆర్మీకి రూ.1,92,680 కోట్లు, నేవీకి రూ.32,778 కోట్లు, భారత వాయుసేనకు రూ. 46,223 కోట్లు కేటాయించారు. మొత్తమ్మీద రక్షణ శాఖకు ఈసారి కేటాయింపులు స్వల్పంగానే పెరిగాయని, ఇది మిలిటరీపై ప్రభుత్వ ప్రాధాన్యతను తెలియజేస్తుందని జాతీయ భద్రత అధ్యయన కేంద్రంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్ కుమార్ బెహెరా చెప్పారు. కేపిటల్ వ్యయం కోసం రూ.10వేల కోట్లను పెంచడాన్ని ఆరోగ్యకర సంకేతంగానే భావించాలన్నారు.

:... రక్షణ ...:
ఆయుధాలు, విమానాలు, యుద్ధ ఓడల కొనుగోలుకు
1.72 లక్షల కోట్లు

:... డీఆర్‌డీఓ ...:
23,855 కోట్లు



ఆత్మ నిర్భరత, ఎగుమతులను ప్రోత్సహించే లక్ష్యంతో రూ.6,21,540 కోట్లను కేటాయించగా, మొత్తం కేంద్ర బడ్జెట్‌లో ఇది 13.04 శాతంగా ఉంది. సాంకేతిక నిపుణులు, కంపెనీలకు దీర్ఘకాల రుణాలు ఇచ్చేందుకు రూ. లక్ష కోట్లు కార్పస్ ఫండ్ కేటాయించారు. రక్షణ స్టార్టప్‌లకు పన్ను రాయితీలు ఇచ్చి రక్షణ రంగంలో ఆవిష్కరణలకు పెద్దపీట వేయనున్నారు. కేపిటల్ వ్యయం కోసం కేటాయింపులను 2022-23 వాస్తవ కేటాయింపులతో పోలిస్తే ఈసారి 20.33 శాతం నిధులను ఎక్కువగా కేటాయించారు. సరిహద్దు మౌలిక వసతుల కోసం రూ.6,500 కోట్లు, భారత తీరప్రాంత గస్తీదళానికి రూ.7,651 కోట్లు, డీఆర్‌డీఓకు రూ.23,855 కోట్లు కేటాయించారు. నిధుల పెంపుదలతో సాయుధ బలాలకు అధునాతన ఆయుధాలు సమకూర్చేందుకు వీలవుతుందని రక్షణ శాఖ వెల్లడించింది.

:... హోంశాఖ ...:
2 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖకు 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో అంతర్గత, సరిహద్దు భద్రతకు ప్రాధాన్యమిస్తూ రూ. 2,02,868.70 కోట్లు కేటాయించారు. అమిత్‌షా నేతృత్వంలోని ఈ శాఖకు 2023-24లో రూ.1,96,034.91 కోట్లను కేటాయించారు. ఈసారి బడ్జెట్‌లో అత్యధిక నిధులను కేంద్ర బలగాలైన సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్‌కు ఇచ్చారు. పారామిలిటరీ బలగాల కిందకు వచ్చే పోలీసులకు రూ. 1,32,345.47 కోట్లను, కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌కు 37,277.74 కోట్లను కేటాయించారు. లద్దాఖ్‌కు రూ.5,958 కోట్లు, అండమాన్ నికోబార్ దీవులకు రూ. 5,866.37 కోట్లు, చండీగఢ్‌కు రూ. 5,862.62 కోట్లు, పుదుచ్చేరికి 3269 కోట్లు, దాద్రా నగర్ హవేలి-డామన్ డయ్యూకు 2,648.97 కోట్లు, లక్షద్వీప్‌కు 1,490.10 కోట్లు, ఢిల్లీకి 1,168.01 కోట్లు కేటాయించారు. మంత్రిమండలి, కేబినెట్ సెక్రటేరియట్, పీఎంఓ ఖర్చుల కోసం 1,248.91 కోట్లు ఇచ్చారు. 2023-24 బడ్జెట్‌లో పారామిలిటరీ బలగాలైన సీఆర్‌పీఎఫ్‌కు 32,809.65 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల మేరకు 31,389.04 కోట్లు ఇచ్చారు.ఇంటెలిజెన్స్ బ్యూరోకు రూ.3,195.09 కోట్లు (2023-24లో 3,268.94 కోట్లు), వామపక్ష ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేక మౌలిక సదుపాయాల పథకం కింద 3,199.62 కోట్లు, సరిహద్దు ప్రాంత అభివృద్ధి కార్యక్రమాల కోసం 335 కోట్లు, సేఫ్ సిటీ ప్రాజెక్టుల కోసం 214.44 కోట్లు, ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు రూ.330 కోట్లు కేటాయించారు.



సీబీఐకి రూ.928.46 కోట్లు

న్యూఢిల్లీ: 2024-25 కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి రూ.928.46 కోట్లు కేటాయించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇది గతేడాది కంటే రూ.40.4 కోట్లు తక్కువ. సీబీఐ శిక్షణా కేంద్రాల ఆధునీకరణ, టెక్నికల్, ఫోరెన్సిక్ సపోర్ట్ యూనిట్ల ఏర్పాటు, సమగ్ర ఆధునీకరణ, భూమి కొనుగోలు, ఏజెన్సీకి కార్యాలయాలు, నివాస భవనాల నిర్మాణం వంటి పలు ప్రాజెక్టులకు కేటాయింపులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలోని ప్రధాన దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ.. బ్యాంకు రుణ మోసాలు, విదేశాల్లోని కోర్టులలో కొనసాగుతున్న ఉన్నత స్థాయి కేసులతో పాటు కృత్రిమ మేధస్సు, క్రిప్టోకరెన్సీ, డార్క్‌నెట్‌ల ఆధిపత్యంతో అభివృద్ధి చెందుతున్న నేరాలను పరిష్కరిస్తుంది. ఇది పలు రాష్ట్రాలు, హైకోర్టులు, సుప్రీంకోర్టు అప్పగించిన క్రిమినల్ కేసులను కూడా డీల్ చేస్తుంది.



‘ఈ-కోర్టు’కు 825 కోట్లు

న్యూఢిల్లీ: దిగువ న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలను ఆధునీకరించేందుకు, కేసుల వివరాలను కంప్యూటర్‌లో డిజిటల్ రూపంలో పొందుపరిచేందుకు రూపొందిస్తోన్న ప్రతిష్టాత్మక ఈ-కోర్ట్ ప్రాజెక్ట్ 3వ దశకోసం బడ్జెట్‌లో ఈ ఆర్థిక సంవత్సరం రూ. 825 కోట్లు కేటాయించారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ. 1,500 కోట్లు పెంచాలని ప్రతిపాదించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఈ ప్రాజెక్టు రూ.7,210 కోట్ల ఆర్థిక వ్యయంతో కేబినెట్ ఆమోదం పొందిన విషయం తెలిసిందే. 2024-25 బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.1,500 కోట్లు కేటాయించాలని కూడా తాజా అంచనాలు రూపొందించారు. 4 సంవత్సరాలలో పూర్తవుతుందని భావిస్తున్న ఈ ప్రాజెక్టులో కోర్టు రికార్డులు, వారసత్వ కేసులు, పెండింగ్ కేసులు అన్నింటినీ డిజిటల్ రూపంలో చేస్తారు. 3,108 కోట్ల పత్రాలను డిజిటలైజ్ చేసేందుకు రూ. 2,038.40 కోట్లు అవుతుందని అంచనా. 25 పెటా బైట్ల స్టోరేజీతో క్లౌడ్ టెక్నాలజీ సాంకేతికతను ఈ వ్యవస్థకోసం ఉపయోగించడం గొప్ప అడుగుగా ప్రభుత్వం అభివర్ణించింది. దీనికి సంబంధించిన హార్డ్‌వేర్‌ను రాష్ట్రాలకు కేంద్రమే అందిస్తుంది. కేంద్రం, రాష్ట్రాలు, 25 రాష్ట్రాల హైకోర్టులతో ఒక త్రైపాక్షిక ఒప్పందం జరుగుతుంది.



జనగణన, ఎన్‌పీఆర్‌కు రూ. 1,277 కోట్లు

న్యూఢిల్లీ: 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో జనాభా గణన, ఎన్‌పీఆర్ కోసం రూ.1,277.80 కోట్లు కేటాయించారు. దీంతో ఈ ఏడాది కూడా జనాభా లెక్కించే అవకాశం లేదని సంకేతాన్నిచ్చినట్లైంది. జనాభా లెక్కలు, ఎన్‌పీఆర్‌ల కోసం ప్రభుత్వానికి రూ.12,000 కోట్లకు పైగా ఖర్చు అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. డిసెంబర్ 24, 2019న జరిగిన కేంద్ర మంత్రివర్గం సమావేశం రూ.8,754.23 కోట్ల వ్యయంతో జనాభా గణన-2021, రూ.3,941.35 కోట్ల వ్యయంతో జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పీఆర్) ప్రతిపాదనను ఆమోదించింది. 2020, ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30, 2020 వరకు దేశవ్యాప్తంగా జనాభా గణన, ఎన్‌పీఆర్‌ను అప్‌డేట్ చేయడానికి సంబంధించిన హౌస్ లిస్టింగ్ దశ షెడ్యూల్ చేసింది. అయితే కోవిడ్-19 వ్యాప్తి కారణంగా దీన్ని వాయిదా వేశారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల జరిగే నేపథ్యంలో 2024లో జనాభా గణన చేపట్టే అవకాశం లేదని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఎన్యూమరేటర్ల ద్వారా కాకుండా సొంతంగా జనాభా గణన ఫారమ్‌ను పూరించే హక్కును వినియోగించుకోవాలనుకునే పౌరులకు ఎన్‌పీఆర్‌ను తప్పనిసరి చేశారు. ఇందుకు సెన్సస్ అథారిటీ స్వీయ గణన పోర్టల్‌ను రూపొందించగా.. అది ఇంకా ప్రారంభం కాలేదు. స్వీయ-గణన సమయంలో, ఆధార్ లేదా మొబైల్ నంబర్ తప్పనిసరిగా సేకరిస్తారు.

రైల్వే కారిడార్లకు గ్రీన్ లైట్


2.52 లక్షల కోట్ల రూపాయలతో రైలు బడ్జెట్ కూత

40 వేల బోగీలు ఇక ‘వందే భారత్’

దేశంలో 40,000 సాధారణ రైలు బోగీలను వందే భారత్ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరించనున్నట్లు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రయాణికుల భద్రత, సదుపాయాలు, సౌకర్యాలను పెంపొందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. వందే భారత్, అమృత్ భారత్ రైళ్ల విజయవంతం కావడం ఇతర బోగీలను సైతం ఆధునీకరించాల్సిన అవసరాన్ని వెల్లడించిందని రైల్వే మంత్రి అశ్వనీ కుమార్ పేర్కొన్నారు. ‘మన వద్ద దాదాపు 40,000 సంప్రదాయ బోగీలున్నాయి. వీటిని ఆధునీకరించవచ్చు. రైల్వేల సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గతేడాది రైల్వేలు 5,200 కి.మీ. మేర నూతన మార్గాన్ని అందుబాటులోకి తెచ్చాయి. ఇది మొత్తం స్విట్జర్లాండ్ నెట్‌వర్క్ పరిమాణంతో సమానం. ఈ ఏడాది మరో 5,500 కి.మీ. నిర్మాణం జరుగుతుంది. 2014లో రోజుకు కేవలం నాలుగు కి.మీ. నుంచి ఇప్పుడు 15 కి.మీ. మేర కొత్త ట్రాక్‌లను నిర్మిస్తున్నాం. నెట్‌వర్క్ ఏర్పాటులో ఇది గణనీయమైన పురోభివృద్ధి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి మూలధన వ్యయంలో రైల్వేలు 82 శాతం ఆర్జించాయి’ అని అశ్వనీ కుమార్ తెలిపారు.

న్యూఢిల్లీ: సరుకు రవాణాను సులభతరం చేస్తూ బడ్జెట్‌లో ప్రకటించిన మూడు మల్టీ మోడల్ ఆర్థిక కారిడార్ల నిర్మాణంతో రైలు ప్రయాణికుల టికెట్ వెయిటింగ్ లిస్ట్ కష్టాలు తీరనున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. రైల్వేల సరుకు రవాణా సామర్థ్యాన్ని మెరుగుపరచి జీడీపీ వృద్ధి రేటును పరుగులు తీయించేందుకు ప్రత్యేకంగా మూడు ఆర్థిక కారిడార్లను నెలకొల్పనున్నట్లు బడ్జెట్‌లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇంధనం, ఖనిజాలు, సిమెంట్ కారిడార్లు, పోర్టు కనెక్టివిటీ కారిడార్లు, అధిక రద్దీ సాంద్రత కారిడార్లు ఇందులో ఉంటాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో రైల్వే శాఖకు రూ.2.52 లక్షల కోట్లు కేటాయించారు. బడ్జెట్ కేటాయింపులపై రైల్వే మంత్రి అశ్వని కుమార్ గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆర్థిక కారిడార్లలో భాగంగా కొత్తగా 40,000 కి.మీ. మేర రైల్వే ట్రాక్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇది నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు 2030-31 నాటికి ప్రయాణికులకు టికెట్ వెయిటింగ్ ఇబ్బందులను తొలగిస్తుందన్నారు. మూడు కారిడార్లపై బడ్జెట్‌లో ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఇవి కేవలం సరుకు రవాణా కోసం మాత్రమే కాకుండా మల్టీ మోడల్ కారిడార్ల మాదిరిగా పని చేస్తాయన్నారు. ప్రత్యేక కారిడార్లలో భాగంగా 434 ప్రాజెక్టులను సుమారు రూ.11 లక్షల కోట్ల వ్యయంతో చేపడుతున్నట్లు తెలిపారు.

3 మల్టీ మోడల్ ఆర్థిక కారిడార్లతో కొత్తగా 40,000 కి.మీ. ట్రాక్‌ల నిర్మాణం	తీరనున్న టికెట్ వెయిటింగ్ కష్టాలు.. ప్రయాణికులకు ఊరట
దూసుకెళ్లనున్న సరుకు రవాణా	వందే భారత్ ప్రమాణాలకు అనుగుణంగా 40 వేల సాధారణ బోగీల మార్పు




అమృత చతుర్భుజం..


‘ప్రధానంగా ఇంధనం, లోహాలు, సిమెంట్ కారిడార్లు రహదారులపై కాలుష్యాన్ని తగ్గిస్తాయి. సరుకు రవాణా చౌకగా జరుగుతుంది. ఓడ రేవులతో రైలు మార్గం అనుసంధానం కూడా అవుతుంది’ అని రైల్వే మంత్రి చెప్పారు. మూడో కారిడార్‌ను అమృత చతుర్భుజంగా అభివర్ణించారు. ‘రైల్వే ట్రాఫిక్ సాంద్రత అధికంగా ఉండే రూట్లలో అమృత చతుర్భుజం ఏర్పాటవుతుంది. రానున్న 6 నుంచి 8 సంవత్సరాలలో మూడు కారిడార్ల ద్వారా మొత్తంగా దాదాపు 40 వేల కి.మీ. మేర కొత్తగా రైల్వే ట్రాక్‌లను నిర్మిస్తాం. దీనిద్వారా రైల్వేల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. మన ఆర్థిక వ్యవస్థలో ఇది విప్లవాత్మక మార్పు తెస్తుంది. అంతేకాకుండా ఇది 90 శాతం కర్బన ఉద్గారాలను తగ్గిస్తుంది. రైల్వేలు అత్యంత కాలుష్య రహిత రవాణా మార్గాలు. ఇతర మార్గాలతో పోలిస్తే రైలు రవాణా 40 - 50 శాతం చౌక’ అని అశ్వనీ కుమార్ తెలిపారు.



తెలంగాణకు రూ. 5,071 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: రైల్వేల అభివృద్ధి నిమిత్తం తాజా బడ్జెట్‌లో తెలంగాణకు రూ.5,071 కోట్లు కేటాయిచినట్లు రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. 2009-14 కాలంతో పోలిస్తే 2023-24 నాటికి పదేళ్లలో కేటాయింపులు పది రెట్లు పెరిగాయన్నారు. రాష్ట్రంలో రైల్వేల్లో పెట్టుబడులు కూడా గణనీయంగా పెరిగినట్లు చెప్పారు.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,138 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. 2009-14 కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు రూ.889 కోట్లు కేటాయించినట్లు వివరించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేసిన కేంద్రమంత్రి.. పనులు సాగుతున్నాయన్నారు. గురువారం పార్లమెంటులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రైల్ భవన్‌లో అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడారు. నూతన ట్రాక్ నిర్మాణం 2009-14 మధ్య సగటున ఏడాదికి 17 కి.మీ. మేర జరిగితే, 2014-24 మధ్య 69 కి.మీ. మేర జరిగిందన్నారు. 2024-25లో 142 కి.మీ. ట్రాక్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 2009-14 కాలంలో సగటున ఏడాదికి 41 కి.మీ. మేర విద్యుదీకరణ జరిగితే 2014-24 మధ్య 116 కి.మీ. చేసినట్లు తెలిపారు. 2023-24లో 100% విద్యుదీకరణ పూర్తయిందని అశ్విని వైష్ణవ్ చెప్పారు. రూ.31,221 కోట్ల విలువతో 2,338 కి.మీ. మేర 14 ప్రాజెక్టుల (నూతన ట్రాక్)కు సంబంధించి పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం 40 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, 53 లిఫ్టులు, 27 ఎస్కలేటర్లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 40 స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు అశ్విని వైష్ణవ్ వివరించారు.







కేంద్ర పన్నుల్లోంచి రాష్ట్రానికి పెరిగిన వాటా

గతేడాదితో పోలిస్తే రూ.2,423 కోట్లు అధికం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర పన్నుల్లో భాగంగా 2024-25 లో తెలంగాణకు రూ.25,639.84 కోట్ల(2.102 శాతం) వాటా రానుంది. అందులో కార్పొరేట్‌ పన్ను రూ.8,051.77 కోట్లు, ఆదాయపు పన్ను రూ.8,872.10 కోట్లు, సెంట్రల్‌ జీఎస్టీ రూ.7,838.82 కోట్లు, కస్టమ్స్‌ రూ.523.20 కోట్లు, కేంద్ర ఎక్సైజ్‌ డ్యూటీ రూ.312.84 కోట్లు, సర్వీస్‌ ట్యాక్స్‌ రూ.0.86 కోట్లు రాను న్నాయి. కాగా, గత బడ్జెట్‌లో కేంద్ర పన్నుల రూపంలో తెలంగాణకు రూ.23,216.52 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. గతేడాదితో పోలిస్తే ఈసారి రాష్ట్రానికి వస్తున్న పన్నుల వాటా రూ.2,423 కోట్లు అధికం.



అభివృద్ధి, సంక్షేమాలకే పెద్దపీట

కేంద్ర బడ్జెట్‌పై కిషన్‌రెడ్డి స్పందన

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజాకర్షక పథకాల కంటే అభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. వికసిత భారత్‌ సంకల్ప లక్ష్యాలను ఈ బడ్జెట్‌ ప్రతిబింబించిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌ గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం జీవైఏఎన్‌ నినాదం(జి-గరీబ్‌ కల్యాణ్‌-పేదల సంక్షేమం, వై-యువత సాధికారత, ఏ-అగ్రికల్చర్‌- వ్యవసాయం, ఎన్‌-నారీశక్తి సాధికారత)తో పనిచేసిందని, దీని ఫలితంగానే పేదరికం గణనీయంగా తగ్గడంతోపాటు వివిధ రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. వచ్చే 25 ఏళ్లలో దేశం సాధించాల్సిన ప్రగతిని నిర్దేశించుకుని, ఏయే రంగాలపై దృష్టి సారించాలో తెలియజేసేలా బడ్జెట్‌ రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు.



సొంత డబ్బాలా బడ్జెట్‌ ప్రసంగం

బీఆర్‌ఎస్‌ ఎంపీల ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి నిర్మల బడ్జెట్‌ ప్రసంగం సొంత డబ్బాలా ఉందని, లేనిపోని గొప్పలు చెప్పే ప్రయత్నం చేశారని బీఆర్‌ఎస్‌ విమర్శించింది. బడ్జెట్‌ ప్రసంగం రాజకీయ ప్రసంగాన్ని తలపించిందని, ఏ వర్గానికీ సంతృప్తి లేకుండా పోయిందని ఆ పార్టీ ఎంపీలు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు, రంజిత్‌ రెడ్డి ఎద్దేవా చేశారు. గతంలోలాగే నిరాశాజనక బడ్జెట్‌ రూపొందించారని మండిపడ్డారు. ఒక్క కొత్త సంక్షేమ పథకాన్ని కూడా ప్ర స్తావించలేదన్నారు. ద్రవ్యోల్బ ణం, పతాక స్థాయికి చేరుకున్నా నియంత్రణ చర్యల ప్రస్తావన లేదన్నారు.

ఆశలు.. అంచనాలే

రాష్ట్రానికి ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు లేని కేంద్ర బడ్జెట్‌

విభజన హామీల ఊసు లేదు..ప్రాజెక్టుల ప్రస్తావన లేదు

కేవలం కేంద్ర ప్రాజెక్టులు, కార్యక్రమాల ద్వారానే లబ్ధి

స్టార్టప్‌ల ఏర్పాటుకు మరింత ఊతం లభించే అవకాశం

రాష్ట్రానికి 8 లక్షల వరకు గృహాలు లభించే చాన్స్‌

70 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణకు, కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి నిధులు!

ఆయుష్మాన్‌ భారత్‌ పరిధిలోకి 70 వేల మంది అంగన్‌వాడీ సిబ్బంది, 25 వేల మంది ఆశా వర్కర్లు

కేటాయింపుల్లో స్పష్టత వస్తేనే రాష్ట్ర ప్రయోజనాల లెక్కలు తేలే అవకాశం



సాక్షి, హైదరాబాద్‌: కేటాయింపుల్లో స్పష్టత ఉండని కేంద్ర ప్రభుత్వ ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌ రాష్ట్రానికి ఆశలు, అంచనాలనే మిగిల్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను గురువారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు చూపెట్టలేదు. కేవలం దేశ వ్యాప్తంగా అమలు చేయాలని తలపెట్టిన పలు ప్రాజెక్టులు, కార్యక్రమాల ద్వారానే రాష్ట్ర ప్రజానీకం కూడా లబ్ధి పొందనున్నారు. మధ్యంతర బడ్జెట్‌ కావడంతో ఇందులో తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలోని హామీల అమలు, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా లాంటి అంశాలు ప్రస్తావనకు రాలేదు. అయితే దేశ వ్యాప్తంగా అమలు చేయనున్న కార్యక్రమాల ద్వారా తెలంగాణ ప్రజలకు లబ్ధి కలుగుతుందని, ప్రతిపాదించిన నిధుల్లో తెలంగాణకు ఎంత కేటాయిస్తారన్న దానిపై స్పష్టత వస్తేనే ఈ బడ్జెట్‌ ద్వారా రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనాల లెక్క తేలుతుందని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు.

ఇళ్ల నుంచి సౌర విద్యుత్‌ వరకు

తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్‌ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతిపాదించిన స్టార్టప్‌లు, ఆయుష్మాన్‌ భారత్‌, గృహ నిర్మాణం, ఉపాధి హామీ నిధుల పెంపు, మెట్రో రైళ్లు, 300 యూనిట్ల వరకు గృహ వినియోగానికి ఉచితంగా సోలార్‌ పవర్‌ ప్యానెళ్లు లాంటి పథకాలు తెలంగాణకు ఉపయుక్తం కానున్నాయి. ముఖ్యంగా స్టార్టప్‌ల అభివృద్ధిలో దేశంలోనే టాప్‌ స్థానంలో తెలంగాణ కొనసాగుతోంది. ఒక్క హైదరాబాద్‌ వేదికగానే 3,500 నుంచి 4,000 స్టార్టప్‌లున్నాయని అంచనా. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే స్టార్టప్‌ల ఏర్పాటులో తెలంగాణ నాలుగు శాతం అదనపు వృద్ధిని నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో స్టార్టప్‌ల కోసం కేటాయించిన రూ.43 వేల కోట్ల బడ్జెట్‌ తెలంగాణ అభివృద్ధికి, హైదరాబాద్‌లో స్టార్టప్‌ల ఏర్పాటుకు మరింత ఊతమిస్తుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కొత్త నగరాల్లో మెట్రో రైళ్లను విస్తరిస్తామని బడ్జెట్‌ సందర్భంగా కేంద్రం వెల్లడించింది. దీంతోపాటు వందేభారత్‌ రైళ్ల తరహాలో సాధారణ రైలు బోగీల అభివృద్ధి, రైల్‌ కారిడార్‌ల ఏర్పాటు కోసం రూ.11.11 లక్షల కోట్లు కేటాయించింది. ఈ కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 70 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ, కొత్త లైన్ల నిర్మాణానికి నిధులు దక్కే అవకాశాలున్నాయి. ఈసారి దేశ వ్యాప్తంగా 2 కోట్ల మందికి కొత్త గృహాలు నిర్మించే ప్రతిపాదనలను చేసిన నేపథ్యంలో మన రాష్ట్రానికి 6-8 లక్షల గృహాల నిర్మాణానికి ఈ పథకం కింద నిధులు వచ్చే అవకాశముందని తెలుస్తోంది. అదే విధంగా 300 యూనిట్ల వరకు విద్యుత్‌ కోసం గృహాలకు ఉచితంగా సోలార్‌పవర్‌ ప్యానెళ్లు అందజేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ఈ ఉచిత ప్యానెళ్ల వల్ల కూడా లక్షలాది మంది గృహ వినియోగదారులకు ఊరట కలగనుంది. ఇక రాష్ట్రంలో 61 లక్షల ఉపాధి హామీ కార్డులున్నాయి. ఈసారి బడ్జెట్‌లో కేంద్రం గత ఏడాది కంటే ఉపాధి నిధులను పెంచింది. దీంతో వచ్చే ఏడాదిలో కార్డుల సంఖ్యతో పాటు ఉపాధి హామీ వేతనం కూడా పెరిగే అవకాశాలున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అంచాన వేస్తున్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ, ఆశా సిబ్బందిని ఆయుష్మాన్‌ భారత్‌ పరిధిలోకి తీసుకురానుండడంతో రాష్ట్రంలోని 35వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, మరో 35 వేల మంది హెల్పర్లతో పాటు 25 వేల మంది ఆశా వర్కర్లకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం లభించనుంది.

కేటాయింపులు తేలాలి

జాతీయ రహదారులు, స్టార్టప్‌ల కార్పస్‌ ఫండ్‌ పేరిట కేటాయించిన నిధుల వల్ల తెలంగాణకు ఏం ప్రయోజనం చేకూరుతుందనేది కేటాయింపుల్లో స్పష్టత వస్తేనే కానీ తేలదని ఆర్థిక శాఖ అధికారులు చెపుతున్నారు. హైవేల నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.1.68 లక్షల కోట్లు కేటాయించారు. ప్రస్తుతం రాష్ట్రంలో హైవేల నిమిత్తం 1,200 కిలోమీటర్ల కొత్త ప్రతిపాదనలున్నాయి. అయితే రాష్ట్రంలోని ఏ రహదారికి ఎంత కేటాయిస్తారనేది కేటాయింపుల్లో స్పష్టత వస్తేనే తేలనుంది. స్టార్టప్‌ల కార్పస్‌ ఫండ్‌ కింద కేంద్రం రూ.లక్ష కోట్ల వరకు దీర్ఘకాలిక రుణాలను అందజేస్తామని ప్రకటించింది. ఈ ఫండ్‌ను ఏ రాష్ట్రానికి ఎంత కేటాయిస్తారనే లెక్కలు తేలితేనే మన రాష్ట్రంలోని ఎంత మంది యువత ఈ రుణాలను ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందుతారో తేలనుంది.

మనదీ ఓటాన్‌ అకౌంటేనా?

కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో రాష్ట్రం కూడా అటు వైపే మొగ్గు చూపనున్నట్టు తెలుస్తోంది. ఈ నెల 15 నుంచి అసెంబ్లీ బడ్జెట్‌ సమావేశాలు జరుగుతాయని తెలుస్తోంది. ఈ సమావేశాల్లో భాగంగా పూర్తిస్థాయి బడ్జెట్‌ పెడతారా? ఓటాన్‌ అకౌంట్‌కు వెళతారా అన్న దానిపై పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదు. వాస్తవానికి కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏ మేరకు నిధులు వస్తాయన్న అంచనాలతోనే రాష్ట్ర బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. గ్రాంట్‌ ఇన్‌ఎయిడ్‌, కేంద్ర పన్నుల్లో వాటాతో పాటు పలు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు (సీఎస్‌ఎస్‌) నిధుల కేటాయింపులను అంచనా వేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాను పేర్కొంటూ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. అయితే కేంద్రం పెట్టిన ఓటాన్‌ అకౌంట్‌లో ప్రజలపై విధించే ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానంలో ఎలాంటి మార్పు లేదని ప్రకటించారు కానీ, రాష్ట్రాలకు ఇచ్చే నిధుల విషయంలో విధాన నిర్ణయాన్ని ప్రకటించలేదు. దీంతో అసలు కేంద్రం నుంచి ఎన్ని నిధులు వస్తాయన్న దానిపై రాష్ట్ర ఆర్థిక శాఖ కూడా అంచనాకు వచ్చే అవకాశం లేదని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్‌ అకౌంట్‌ వైపే మొగ్గు చూపుతుందని అంటున్నారు. గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా 2019-20 ఆర్థిక సంవత్సరంలోనూ కేంద్రం ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌నే ప్రవేశపెట్టింది. తెలంగాణలో కూడా ఆరు నెలల కాలానికి గాను ఓటాన్‌ అకౌంట్‌ పెట్టి ఆ తర్వాత సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం గమనార్హం.



దేశీయ పర్యాటక కేంద్రాల అభివృద్ధి

ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పెరుగుతాయి

టూరిస్ట్‌ కేంద్రాల అభివృద్ధికి రాష్ట్రాలకు లోన్లు

న్యూఢిల్లీ: దేశీయ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు పోర్టు కనెక్టివిటీ, పర్యాటక మౌలిక వసతులు, ఇతర సదుపాయాలను లక్షద్వీప్‌తో పాటు మన దీవుల్లో ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ తెలిపారు. దీంతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. మన ఆర్థిక బలం దేశాన్ని వ్యాపార, కాన్ఫరెన్స్‌ టూరిజంనకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మార్చిందని చెప్పారు. పర్యాటకం వైపు దేశ మధ్యతరగతి ప్రజలు కూడా ఆకర్షితులు అవుతున్నారని అన్నారు. పర్యాటకం, అలాగే ఆధ్యాత్మిక పర్యాటకంతో స్థానిక వ్యాపారాలకు అవకాశం పెరుగుతుందని చెప్పారు. మంచి టూరిస్ట్‌ సెంటర్లను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్రాలను ప్రోత్సహిస్తామన్నారు. ఇలాంటి అభివృద్ధి కోసం రాష్ట్రాలకు వడ్డీలేని దీర్ఘకాలిక లోన్లను ఇస్తామని తెలిపారు. టూరిస్ట్‌ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలకు, సేవలకు రేటింగ్‌ ఇచ్చేందుకు ఒక ఫ్రేమ్‌ వర్క్‌ను రూపొందిస్తామన్నారు. అరవై ప్రాంతాల్లో జీ20 సదస్సులను విజయవంతంగా నిర్వహించడం ద్వారా భారతదేశంలోని భిన్నత్వం ప్రపంచానికి తెలిసిందన్నారు.

'లక్షద్వీప్‌'ప్రస్తావన...

పర్యాటక కేంద్రాల అభివృద్ధి విషయంలో లక్షద్వీప్‌ను ఆర్థిక మంత్రి ప్రత్యేకంగా ప్రకటించడం పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది. జనవరి 4న ప్రధాని మోదీ లక్షద్వీప్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. అడ్వెంచర్‌ టూరిజం ఇష్టపడేవారు లక్షద్వీప్‌ను కూడా తమ జాబితాలో చేర్చుకోవాలని అప్పట్లో పేర్కొన్నారు. ప్రధాని పర్యటనపై మాల్దీవులకు చెందిన ఓ మంత్రి, ఇతర నేతలు అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయడం, దానిపై వివాదం చెలరేగడం తెలిసిందే. ఈ నేపథ్యంలో చాలా మంది భారత టూర్‌ ఆపరేటర్లు మాల్దీవుల పర్యటనను రద్దు చేశారు.



'ఉపాధి'కి రూ.86 వేల కోట్లే

లిబ్‌టెక్‌ ఇండియా డైరెక్టర్‌ చక్రధర్‌ బుద్ధా

సాక్షి, హైదరాబాద్‌: జాతీయ ఉపాధి హామీ చట్టం కింద నమోదైన కుటుంబాల ఉపాధి అవసరాలను తీర్చడానికి, కనీసం రూ.3 లక్షల కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో కేంద్రం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని లిబ్‌టెక్‌ ఇండియా (ఉపాధి హామీ అమలుతీరు పరిశోధనా సంస్థ) డైరెక్టర్‌ చక్రధర్‌ బుద్ధా పెదవి విరిచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి (మార్చి 31 నాటికి) ఉపాధి హామీ కూలీ బకాయిలు రూ.17 వేల కోట్లకు చేరుకుంటాయని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది మునుపటి సంవత్సర బకాయిలు తీర్చడానికే బడ్జెట్‌లో 15 నుంచి 20 శాతం వెచ్చించాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు కేవలం 35 రోజులు పని కల్పనకే సరిపోతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల పెంపుదల కోసం కేంద్రాన్ని డిమాండ్‌ చేస్తూ లేఖ రాయాలని కోరారు.

'ఉపాధి హామీ'కి పెరగని నిధులు: డీబీఎఫ్‌

కేంద్ర బడ్జెట్‌ 2023-24లో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెరగలేదని ఉందని దళిత బహుజన ఫ్రంట్‌ (డీబీఎఫ్‌) జాతీయకార్యదర్శి పి.శంకర్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ సాంకేతికతల జోక్యాల కారణంగా గతేడాది కూలీలు ఎదుర్కొన్న సవాళ్లను కూడా బడ్జెట్‌ పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. పెద్దసంఖ్యలో ఉపాధి హామీ పథకంపై ఆధారపడిన గ్రామీణ ప్రజల సంక్షేమాన్ని దెబ్బతీయడమే కాకుండా చట్టం ద్వారా జీవించే హక్కును కూడా కేంద్రం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు.



స్కూళ్లకు నిధులు

యూజీసీకి 60 శాతం కోత

న్యూఢిల్లీ: యూనివర్సిటీ గ్రాంట్స్‌ కమిషన్‌ (యూజీసీ)కి కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో గ్రాంట్లను 60.99 శాతం మేర కోత వేసింది. గత ఏడాది సవరించిన అంచనాల ప్రకారం రూ.6,409 కోట్లు కేటాయించగా, ఈసారి కేవలం 2,500 కోట్లు కేటాయించింది. అయితే, 2024-25 బడ్జెట్‌లో స్కూళ్లకు కేటాయింపులు పెంచింది. పాఠశాల విద్యకు గత ఏడాది సవరించిన అంచనాల (రూ.72473.80) కన్నా దాదాపు రూ.500 కోట్ల మేర పెంచి 73008.10 కోట్లు కేటాయించింది. ఉన్నత విద్యకు మాత్రం గత ఏడాది రూ.57244.48 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.9,600 కోట్లు కోతవేసి 47619.77 కోట్లు కేటాయించడం గమనార్హం. కేంద్రం ఐఐఎంలకు వరుసగా రెండో ఏడాది కూడా కోత విధించింది. గత ఏడాది సవరించిన అంచనాల మేరకు రూ.608.23 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారు. అలాగే, ఐఐటీలకు గత ఏడాది సవరించిన అంచనాల మేరకు రూ.10384.21 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.10324.50 కోట్లు కేటాయించారు. అలాగే, కేంద్ర విశ్వవిద్యాలయాలకు నిధులను 28 శాతం పెంచారు. వీటికి గత ఏడాది రూ.12000.08 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ.15472 కోట్లు కేటాయించడం విశేషం. కాగా, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే గ్రాంట్లను రూ.8,200 కోట్ల మేర పెంచగా, కేంద్రపాలిత ప్రాంతాలకు రూ.308 కోట్ల మేర పెంచారు.

390 వర్సిటీలు... 3000 ఐటీఐలు

2014 నుంచి ఇప్పటివరకు పదేళ్లలో పెద్ద ఎత్తున ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ వెల్లడించారు. 7 ఐఐటీలు, 16 ఐఐఐటీలు, 7 ఐఐఎంలు, 15 ఎయిమ్స్‌ విద్యాసంస్థలను, 390 యూనివర్సిటీలను ఏర్పాటుచేసినట్లు బడ్జెట్‌ ప్రసంగంలో చెప్పారు. అలాగే, 3,000 ఐటీఐలను కూడా స్థాపించామన్నారు. యువతను ఎంతవరకు సాధికారికంగా మార్చామన్నదానిపై మన ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. సంస్కరణలకు జాతీయ విద్యావిధానం-2020 నాంది పలుకుతోందని, 'పీఎం శ్రీ'పథకం ద్వారా నాణ్యమైన బోధనను అందించడంతోపాటు విద్యార్థులను మరింత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. స్కిల్‌ ఇండియా మిషన్‌ కింద మూడు వేల ఐటీఐలను ఏర్పాటుచేసి ఇప్పటివరకు 1.4 కోట్ల మందికి శిక్షణ ఇచ్చామని, 54 లక్షల మంది యువకుల ప్రతిభకు మెరుగులు దిద్దామని తెలిపారు.



ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంచవచ్చని భావించిన ఉద్యోగులు

కొత్త పథకాలపై ఆశలు పెట్టుకున్న పలు వర్గాలు

పెట్రోల్‌, డీజిల్‌ ధరల తగ్గింపు ప్రకటించవచ్చనే అంచనాలు

కానీ చిన్న చిన్న మినహాయింపులకే పరిమితమైన కేంద్ర ఆర్థిక మంత్రి

బడ్జెట్‌.. ఆశలు.. మధ్యంతరమే!

'ఓటాన్‌ అకౌంట్‌' కావడంతో ఎలాంటి మార్పులకూ వెళ్లని ఎన్డీయే సర్కారు

న్యూఢిల్లీ: సుస్థిర ఆర్థిక వృద్ధి లక్ష్యమంటూ మోదీ సర్కారు ప్రవేశపెట్టిన 2024-25 ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌.. అన్ని వర్గాల ఆశలను మధ్యంతరంగానే వదిలేసింది. మరో రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలున్న నేపథ్యంలో.. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంచవచ్చని, కొత్త పథకాలు ప్రకటించవచ్చని, పెట్రోల్‌ ధరలు తగ్గించేలా చర్యలు చేపట్టవచ్చని ఎన్నో అంచనాలు వెలువడ్డాయి. కానీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ బడ్జెట్‌లో పన్నులు సహా ఇతర అంశాలు వేటిలోనూ పెద్దగా మార్పులూ చేయలేదు. వేతన జీవులు, వివిధ వర్గాల వారు ఎంతో ఆశ పెట్టుకున్న పన్ను మినహాయింపులు, శ్లాబ్‌ రేట్ల మార్పు వంటివాటి జోలికి వెళ్లలేదు. ఎలాంటి ఉపశమనం కల్పించలేదు. కొత్తగా భారమూ వేయలేదు.

ఆర్థిక వృద్ధి, సంస్కరణలపై ఫోకస్‌..

కొత్త సంక్షేమ కార్యక్రమాలు, పథకాల ప్రస్తావన పెద్దగా తీసుకురాని కేంద్ర ఆర్థిక మంత్రి.. తన ప్రసంగం పొడవునా ఆర్థిక వృద్ధి దిశగా చేపట్టే చర్యలనే ఎక్కువగా వివరించారు. గత పదేళ్ల పాలనకు సంబంధించి కూడా పన్నుల ఆదాయంలో వృద్ధి, వివిధ రంగాల్లో అభివృద్ధిని ప్రస్తావిస్తూ.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని చెప్పే ప్రయత్నం చేశారు. ఆర్థికవృద్ధి మరింత వేగం పుంజుకునేలా మూలధన వ్యయానికి రూ.11.1 లక్షల కోట్లను కేటాయించామన్నారు. వచ్చే ఐదేళ్లలో ఆర్థిక వృద్ధి అనూహ్య స్థాయిలో వేగం పుంజుకుంటుందని.. రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి మరిన్ని సంస్కరణలను అమల్లోకి తెస్తామని ప్రకటించడం గమనార్హం. అంతేకాదు.. భవిష్యత్తులో ద్రవ్యలోటును తగ్గించడంతోపాటు అప్పులు తీసుకోవడాన్ని కూడా తగ్గిస్తూ వెళ్లాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు వివరించారు. ఎన్డీయే పాలనతో ప్రజలు సంతృప్తితో ఉండటంతోనే రెండోసారి భారీ మెజార్టీ ఇచ్చారని.. ఇప్పుడు మూడోసారి గెలిస్తే సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి దిశగా శరవేగంగా చర్యలు చేపడతామని ప్రకటించడం విశేషం.

సబ్సిడీలకు కోత వేస్తూ..

కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను తగ్గించుకుంటూ వస్తున్న ఎన్డీయే సర్కారు.. దాన్ని ప్రస్తుత బడ్జెట్‌లోనూ కొనసాగించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఆహారం, ఇంధనం, ఎరువుల సబ్సిడీలకు కేటాయింపులను 8శాతం మేర తగ్గించారు. అయితే గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మాత్రం కోత పెట్టలేదు.

మరోవైపు మధ్యతరగతి వారి సొంతింటికలను తీర్చేందుకు కొత్తగా పథకాన్ని తెస్తామని ప్రకటించి కాస్త ఊరటనిచ్చారు. వచ్చే ఐదేళ్లలో 2 కోట్ల అందుబాటు ధరల గృహాలను నిర్మిస్తామని ప్రకటించారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా..

కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ రంగానికి కేటాయింపులను 11 శాతం పెంచారు. విమానయానాన్ని మరింత ప్రోత్సహించేలా టైర్‌-2, 3 స్థాయి నగరాలకూ కొత్తగా విమాన సర్వీసులతోపాటు ఉడాన్‌ పథకం కింద 517 కొత్త మార్గాలను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. రైల్వేను మరింత మెరుగుపర్చే దిశగా.. 40వేలకుపైగా బోగీల్లో 'వందే భారత్‌'ప్రమాణాల స్థాయిలో సౌకర్యాల కల్పనకు నిర్ణయం తీసుకున్నారు. పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించేందుకు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్రాలకు వడ్డీ రహిత రుణాలు ఇస్తామని తెలిపారు. దీనితోపాటు మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల కోసం రాష్ట్రాలకు రూ.1.3లక్షల కోట్ల దీర్ఘకాలిక రుణాలు ఇస్తామని ప్రతిపాదించారు. విద్యుత్‌ రంగంలో సంస్కరణల్లో భాగంగా రూఫ్‌టాప్‌ సోలార్‌ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు ప్రకటించారు.



స్టార్టప్‌లకు పన్ను ప్రయోజనాలు.. మరో ఏడాది

అంకుర సంస్థలకు, వాటిలో సావరీన్ వెల్త్ లేదా పెన్షన్ ఫండ్లు చేసే పెట్టుబడులకు ఇస్తున్న పన్ను పరమైన ప్రయోజనాలను కేంద్రం మరో ఏడాది పాటు 2025 మార్చి వరకు పొడిగించింది. వాస్తవానికి ఇవి ఈ ఏడాది మార్చి 31తో ముగియాల్సి ఉంది. దేశీయంగా స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నట్లు బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పటివరకు 1.17 లక్షల స్టార్టప్‌లను గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన అంకుర సంస్థలు స్టార్టప్ ఇండియా యాక్షన్ ప్లాన్ కింద పన్నులపరమైన ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు.



పన్ను మినహాయింపును పెంచాలి..

సంక్రమించని వ్యాధులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వీటి నివారణలో భాగంగా ఆరోగ్య సంరక్షణ కోసం పన్ను మినహాయింపును పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రుల మౌలిక వసతులను ఉపయోగించుకోవడం ద్వారా వైద్య విద్యను పెంపొందించే వ్యూహాన్ని స్వాగతిస్తున్నాను. వైద్య, నర్సింగ్ కళాశాలల సంఖ్యను అధికం చేయడానికి మార్గం సుగమం కావడంతోపాటు పారా–మెడికల్ శిక్షణ సామర్థ్యం కూడా పెరుగుతుంది.

– ప్రతాప్ సి రెడ్డి, చైర్మన్, అపోలో హాస్పిటల్స్



మధ్య తరగతికి... సొంతింటి వరం!



- ఇళ్ల నిర్మాణం కోసం ప్రత్యేక పథకం
- పేదలకు మరో రెండు కోట్ల ఇళ్లు
- రియల్టీలో డిమాండ్ బూస్ట్
- పెరగనున్న ఉపాధి కల్పన
- స్వాగతించిన పరిశ్రమ వర్గాలు

న్యూఢిల్లీ: దేశ హౌసింగ్ రంగానికి మరింత ఊతమిచ్చే దిశగా ఆర్థిక మంత్రి సీతారామన్ కీలక ప్రకటన చేశారు. కరోనా అనంతరం సొంతిళ్ల కోసం డిమాండ్ పెరగ్గా.. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా హౌసింగ్ రంగానికి, పేద, మధ్య తరగతి వాసులకు మంత్రి తీపి కబురు చెప్పారు. ముఖ్యంగా కీలకమైన సార్వత్రిక ఎన్నికల ముందు అందుబాటు ధరల ఇళ్లకు ప్రోత్సాహంపై దృష్టి సారించారు. ''అద్దె ఇళ్లల్లో లేదా మురికివాడలు, అనధికారిక కాలనీల్లో నివసించే అర్హత కలిగిన మధ్యతరగతి ప్రజలు.. ఇంటి కొనుగోలుకు లేదా ఇంటి నిర్మాణానికి వీలుగా ప్రభుత్వం ఓ పథకాన్ని ప్రారంభిస్తుంది''అని మంత్రి సీతారామన్ తెలిపారు. అలాగే, వచ్చే ఐదేళ్ల కాలంలో పీఎం ఆవాస్ యోజన (గ్రామీణ్) పథకం కింద గ్రామీణ పేదల కోసం మరో రెండు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఇది రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి దోహదం చేస్తుందని, ఉపాధి కల్పనకు దారితీస్తుందని ప్రాపర్టీ డెవలపర్లు, కన్సల్టెంట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు.

అందరికీ ఇళ్లు

''కరోనా వల్ల అవరోధాలు ఎదురైనప్పటికీ పీఎం ఆవాస్ యోజన పథకం అమలును కొనసాగించాం. మూడు కోట్ల ఇళ్ల లక్ష్యానికి చేరువలో ఉన్నాం. వచ్చే ఐదేళ్లలో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మించి ఇస్తాం ''అని మంత్రి సీతారామన్ ప్రకటన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ ఇళ్లు సమకూర్చడమనే లక్ష్యంతో కేంద్ర సర్కారు 2016లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకాన్ని ప్రారంభించింది. 2024 మార్చి నాటికి 2.95 కోట్ల పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది.

పరిశ్రమ డిమాండ్లు..

షాపూర్జీ పల్లోంజీ రియల్ ఎస్టేట్ ఎండీ, సీఈవో వెంకటేష్ గోపాలకృష్ణన్ ప్రభుత్వ చర్యలను గుర్తిస్తూనే.. ఈ రంగం పూర్తి సామర్థ్యాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు వచ్చే బడ్జెట్‌లో లక్షిత చర్యలను ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. ''పట్టణ, సుస్థిరాభివృద్ధికి ప్రకటించిన చర్యలు దేశీయ రియల్ ఎస్టేట్‌పై దీర్ఘకాలంలో సానుకూల ప్రభావం చూపిస్తాయి'' అని గోద్రేజ్ ప్రాపర్టీస్ ఎండీ, సీఈవో గౌరవ్ పాండే పేర్కొన్నారు. మూలధన వ్యయాలను పెంచడం , అందుబాటు ధరల ఇళ్లపై ప్రభుత్వం మరింతగా దృష్టి సారించడాన్ని టాటా రియల్టీ ఎండీ, సీఈవో సంజయ్ దత్ ప్రస్తావించారు. ''ఊహించినట్టుగానే బడ్జెట్‌లో భారీ ప్రకటనలు ఏవీ లేవు. కానీ, మౌలిక వసతులను మెరుగు పరచడానికి, దేశవ్యాప్త అనుసంధానతపై దృష్టిని కొనసాగించడం.. రియల్ ఎస్టేట్ వృద్ధికి మేలు చేస్తుంది''అని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి తెలిపారు.

ప్రోత్సాహకరం..

బడ్జెట్ ప్రతిపాదనలపై క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు బొమాన్ ఇరానీ స్పందించారు. ఈ తరహా చర్యలు ప్రోత్సాహకరమని, హౌసింగ్ మార్కెట్ వృద్ధికి సాయపడతాయన్నారు. మౌలిక వసతుల అభివృద్ధిపై స్థిరమైన దృక్పథం హౌసింగ్ రంగానికి ఊతమిస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ పథకం ద్వారా హౌసింగ్ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తన మద్దతు కొనసాగించడం ప్రశంసనీయమని నరెడ్కో ప్రెసిడెంట్ జి.హరిబాబు పేర్కొన్నారు. పట్టణ మధ్యతరగతి వాసులకు కొత్త పథకాన్ని ప్రకటించడం సామాన్యుల్లోనూ, రియల్ ఎస్టేట్ పరిశ్రమలోనూ విశ్వాసాన్ని పెంచుతుందన్నారు. నూతన పథకానికి సంబంధించి మరింత స్పష్టత కోసం చూస్తున్నట్టు చెప్పారు.

ఎన్నో సానుకూలాంశాలు..



ఆర్థిక వ్యవస్థగా, అపార వాగ్దాన వ్యవస్థగా, అభివృద్ధి చెందిన దేశం వైపు భారత్ పయనిస్తున్న విశ్వాసాన్ని ప్రదర్శిస్తోంది. గ్రామీణ, పర్యాటకం, మహిళా సాధికారత, సాంకేతికతపై దృష్టి సారించి ప్రజా పనుల కోసం మూలధన వ్యయాన్ని నిరంతరం పెంచడం పట్ల సంతోషిస్తున్నాము. రూ.1 లక్ష కోట్ల నిధి వంటి ఎన్నో సానుకూలాంశాలు ఉన్నాయి. ఇది గొప్ప బడ్జెట్.

– సంజీవ్ పురీ, చైర్మన్, ఐటీసీ.

ప్రజాకర్షక చర్యలు ప్రకటించలేదు..



సీతారామన్ ప్రెజెంటేషన్ అతి చిన్న ప్రసంగాల్లో ఒకటి. తక్కువ మాటల్లో ఎక్కువ విషయాలు ఉన్నాయి. ఇది స్వాగతించదగినది. నిశ్శబ్ద విశ్వాసాన్ని తెలియజేస్తుంది. ఎన్నికల ముందు బడ్జెట్‌లలో సంప్రదాయంగా ఊహించినట్లుగా ఎలాంటి ప్రజాకర్షక చర్యలు ప్రకటించలేదు. ఆర్థిక లోటు లక్ష్యం అనుకున్నదానికంటే మెరుగ్గా ఉంది.

– ఆనంద్ మహీంద్రా, చైర్మన్, మహీంద్రా గ్రూప్

భవిష్యత్తును ప్రతిబింబించేలా..



60 బిలియన్ డాలర్ల వార్షిక ఎఫ్‌డీఐ స్థాయిని మరింత పెంచడానికి కొన్ని సాహసోపేతమైన చర్యలు అవసరం. డిజిటల్ అవస్థాపనపై మరింత ఊపుతో పాటు బ్యాంకింగ్, విద్యుత్ రంగ సంస్కరణలు మెరుగైన వికసిత్ భారత్‌కు ఆవశ్యకమైనవి. మధ్యంతర బడ్జెట్ ప్రజాకర్షక చర్యలకు దూరంగా ఉన్నందున వర్తమానాన్ని చాకచక్యంగా నిర్వహిస్తూ భవిష్యత్తును ప్రతిబింబించే సమయం, దృక్పథం రెండింటినీ సూచిస్తుంది.

– జి.పి.హిందూజా, చైర్మన్, హిందూజా గ్రూప్

ఆవిష్కరణలకు దన్ను..



దేశీ ఫార్మా 2030 నాటికి 120–130 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్న నేపథ్యంలో వర్ధమాన రంగాల్లో పరిశోధనల కోసం రూ. 1 లక్ష కోట్ల కేటాయింపనేది ఆవిష్కరణలకు దన్నుగా నిలవగలదు. వ్యాపారాల నిర్వహణను సులభతరం చేయడం, స్థానికంగా తయారీని ప్రోత్సహించే చర్యలు స్వాగతించతగ్గవి.

– సతీష్ రెడ్డి, చైర్మన్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్

నిబద్ధతను ప్రతిబింబిస్తుంది..



వివేకవంతమైన, సమ్మిళిత బడ్జెట్. సబ్కా సాథ్ సబ్‌కా వికాస్‌కు అనుగుణంగా అవసరాలు, ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ గరీబ్ కళ్యాణ్, నారీ శక్తి, యువ (యువ సాధికారత), అన్నదాత (రైతుల సాధికారత) గురించి ఉద్ఘాటించడం ప్రభుత్వ దార్శనికత, అందరి సమగ్ర అభివృద్ధికి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

– పవన్ ముంజాల్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హీరో మోటో

డిజిన్వెస్ట్‌మెంట్ టార్గెట్... రూ. 50,000 కోట్లు

- 2024–25లో ప్రభుత్వ లక్ష్యం
- ఈ ఏడాది రూ. 30,000 కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024–25) డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ. 50,000 కోట్ల సమీకరణ లక్ష్యాన్ని ప్రకటించారు. వెరసి ఈ ఏడాది (2023–24)కి రూ. 30,000 కోట్ల సవరించిన అంచనాలకంటే అధికంగా డిజిన్వెస్ట్‌మెంట్ టార్గెట్‌ను ప్రభుత్వం నిర్దేశించుకుంది. నిజానికి గతేడాది ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో ఆర్థిక శాఖ రూ. 51,000 కోట్ల సమీకరణకు ప్రతిపాదించింది. అయితే ఆపై ప్రభుత్వం రూ. 30,000 కోట్లకు లక్ష్యాన్ని సవరించింది. కాగా.. 2024–25 ఏడాదికి లోక్‌సభలో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రభుత్వ ఆస్తుల మానిటైజేషన్‌ను ప్రతిపాదించకపోవడం గమనార్హం! తద్వారా నిధులను సమకూర్చుకునేందుకు ఎలాంటి ప్రణాళికలనూ ప్రకటించలేదు. గత బడ్జెట్ అంచనాలలో ఈ మార్గంలో రూ. 10,000 కోట్లను అందుకోవాలని ఆకాంక్షించిన సంగతి తెలిసిందే.

ఇదీ తీరు..

డిజిన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం 7 సీపీఎస్‌ఈలలో మైనారిటీ వాటాల విక్రయం ద్వారా రూ. 12,504 కోట్లను సమకూర్చుకుంది. ఈ జాబితాలో ప్రభుత్వ రంగ దిగ్గజాలు కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఆర్‌వీఎన్‌ఎల్, ఇరెడా తదితరాలున్నాయి. మార్చికల్లా వాటాల ఉపసంహరణ(డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా మొత్తం రూ. 30,000 కోట్లను అందుకోగలమని ప్రభుత్వం భావిస్తోంది. 2018–19, 2017–18ని మినహాయిస్తే.. ప్రతి బడ్జెట్‌లో ప్రతిపాదించిన డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను చేరుకోకపోవడం గమనార్హం! 2017–18కి బడ్జెట్ అంచనాలు రూ. లక్ష కోట్లు కాగా.. అంతకుమించి రూ.1,00,056 కోట్లను సమీకరించడం ద్వారా ప్రభుత్వం రికార్డు నెలకొల్పింది. ఈ బాటలో 2018–19లోనూ బడ్జెట్ అంచనాలు రూ.80,000 కోట్లను అధిగమిస్తూ సీపీఎస్‌ఈలలో వాటాల విక్రయం ద్వారా రూ. 84,972 కోట్ల నిధులు అందుకుంది.

బయో–ఫౌండ్రీకి స్కీము



న్యూఢిల్లీ: పర్యావరణ అనుకూల చర్యల్లో భాగంగా త్వరలో బయో–తయారీ, బయో–ఫౌండ్రీ కోసం కొత్తగా స్కీమును ప్రారంభించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బయో–ఫార్మా, బయో–ప్లాస్టిక్స్, బయోడిగ్రేడబుల్ పాలిమర్స్ మొదలైన వాటికి ఇది ఊతమివ్వనుంది. ప్రపంచ ఎకానమీని మార్చేయగలిగే సత్తా ఈ స్కీముకు ఉంటుందని కేంద్ర సైన్స్, టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్‌ను సాకారం చేయాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యానికి ఇది తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. 2014లో కేవలం 10 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీ బయో ఆర్థిక వ్యవస్థ గడిచిన ఎనిమిది, తొమ్మిదేళ్లలో 140 బిలియన్ డాలర్లకు చేరిందని సింగ్ చెప్పారు.

ఆర్‌బీఐ, బ్యాంకింగ్ నుంచి డివిడెండ్ల ధమాకా



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), బ్యాంకింగ్‌సహా ఇతర ప్రభుత్వ రంగ ఫైనాన్షియల్ సంస్థల నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1.02 లక్షల కోట్ల డివిడెండ్లు వస్తాయన్నది తాజా బడ్జెట్ అంచనా. మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2023–24 బడ్జెట్ అంచనా రూ.48,000 కోట్లయితే, ఊహించని రీతిలో రూ.1.04 లక్షల కోట్లు ఒనగూరుతాయన్నది తాజా బడ్జెట్ సవరిత అంచనా. ఆర్‌బీఐ ఒక్కటే గత ఏడాది మేలో రూ.87,416 కోట్ల డివిడెండ్ చెల్లించడంతో డివిడెండ్ రాబడులకు ఊతం లభించినట్లయ్యింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా లభించిన డివిడెండ్లు రూ.39,961 కోట్లు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్‌ఈ) నుంచి ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరంలో డివిడెండ్ చెల్లింపులు రూ.43,000 కోట్లని బడ్జెట్ అంచనా. మొత్తంగా డివిడెండ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,54,407 కోట్లు ఉంటే, 2024–25లో విలువ స్వల్పంగా రూ.1.50 లక్షల కోట్లకు తగ్గుతుందని తాజా బడ్జెట్ అంచనావేసింది.

ప్చ్.. నచ్చలే!

- మెప్పించని బడ్జెట్
- ఫెడరల్ రిజర్వ్ ప్రతికూల సిగ్నల్స్
- సెన్సెక్స్ నష్టం 107 పాయింట్లు
- 21,700 స్థాయి దిగువకు నిఫ్టీ
- కీలక రంగాల్లో లాభాల స్వీకరణ
- ఎదురీదిన ప్రభుత్వ బ్యాంకు షేర్లు



ముంబై: సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ స్టాక్ మార్కెట్‌ను మెప్పించకలేకపోయింది. మౌలిక వసతుల రంగానికి అంచనాల కంటే తక్కువ కేటాయింపులు, ఆదాయం పన్ను శ్లాబులు యథాతథంగా కొనసాగింపు నిర్ణయాలు నిరాశపరిచాయి. మరోవైపు ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య పాలసీ నిర్ణయాల వెల్లడి సందర్భంగా చైర్మన్ పావెల్ ఈ మార్చిలోనూ కీలక వడ్డీ రేట్ల తగ్గింపు ఉండకపోవచ్చనే సంకేతాలిచ్చారు. ఇన్వెస్టర్లు క్యాపిటల్ గూడ్స్, మెటల్, రియల్టీ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఫలితంగా సెన్సెక్స్ 107 పాయింట్లు నష్టపోయి 71,645 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 28 పాయింట్లు దిగివచ్చి 21,698 వద్ద నిలిచింది.

ఇంట్రాడేలో ఒడిదుడుకులు...

సార్వత్రిక ఎన్నికల ముందు ప్రజాకర్షక బడ్జెట్ ఉండొచ్చనే అంచనాలతో ఉదయం స్టాక్ మార్కెట్ లాభాలతో మొదలైంది. సెన్సెక్స్ 247 పాయింట్లు పెరిగి 71,999, నిఫ్టీ 55 పాయింట్ల లాభంతో 21,781 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. జనరంజక బడ్జెట్ సమర్పణ ఆశలతో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగ సమయం(గంటసేపు)లో సెన్సెక్స్ 400 పాయింట్లు పెరిగి 72,151 వద్ద, నిఫ్టీ 107 పాయింట్లు బలపడి 21,833 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అయితే స్టాక్ మార్కెట్‌కు ఉత్సాహాన్నిచ్చే ప్రకటలేవీ వెలువడకపోవడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ పాల్పడ్డారు. ఫలితంగా ఆరంభ లాభాలు కోల్పోయిన సూచీలు చివరికి నష్టాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 576 పాయింట్ల పరిధిలో నిఫ్టీ 174 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- బడ్జెట్ ప్రకటన రోజు గత ఆరేళ్లలో స్టాక్ మార్కెట్ నాలుగు పర్యాయాలు లాభపడగా., రెండుసార్లు నష్టాలు చవిచూసింది. 2023, 2022, 2021, 2019 ఏడాదిల్లో పెరిగింది. కాగా, 2020, 2024 ఏడాదిల్లో పతనాన్ని చవిచూసింది.
- బాండ్లపై రాబడులు తగ్గడంతో ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. పీఎస్‌బీ, ఐఓబీ, యూకో బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ షేర్లు 7–5%, కెనరా బ్యాంక్, పీఎన్‌బీ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ షేర్లు 4–3% పెరిగాయి. మహారాష్ట్ర బ్యాంక్, ఎస్‌బీఐలు 2–1% లాభపడ్డాయి. ఎన్‌ఎస్‌ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిథ్యం వహించే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 3.11% లాభపడింది.
- రైల్వే సంబంధిత స్టాకులు ఆరంభ లాభాలు కోల్పోయి నష్టాలు మూటగట్టుకున్నాయి. ఇర్కాన్ 3.69%, రైల్వే వికాస్ నిగమ్ 3.49%, రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ 3%, జుపిటర్ వేగన్స్ 2% పతనమమయ్యాయి. ఐఆర్‌సీటీసీ 1.50%, టెక్స్‌మాకో రైల్ ఇంజనీరింగ్, టిటాఘర్ రైల్వే సిస్టమ్స్ 1% నష్టపోయాయి.

చరిత్రాత్మకంగా పరిశీలిస్తే మధ్యంతర బడ్జెట్ వేళ ఈక్విటీ మార్కెట్లు పెద్దగా స్పందించలేదు. ఈ ఏడాది అదే పునరావృతమైంది. మూలధన వ్యయాలకు కేటాయింపుల స్వల్ప పెంపు, ద్రవ్య లోటు 5.5% నుంచి 5.1%కి తగ్గింపు లక్ష్యం మినహా ఉత్సాహాన్నిచ్చే ఇతర ప్రకటలేవీ వెలువడలేదు. ప్రసంగం తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చే వరకు వడ్డీరేట్ల తగ్గింపు యోచన సముచితంకాదని ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యలతో అమెరికా పదేళ్ల బాండ్లపై రాబడులు 4% పెరగడం ప్రతికూల ప్రభావం చూపింది

– యస్ సెక్యూరిటీస్ ఎండీ అమర్ అంబానీ

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బాధ్యతాయుత, వినూత్న, సమిళిత మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించారు. ఆర్థిక ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ., ప్రైవేట్ మూల పెట్టుబడులకు అవకాశం కల్పించారు. జాతీయ ప్రాముఖ్యతలున్న రంగాల వృద్ధికి మరోసారి పటిష్ట పునాదులు వేశారు''

– బీఎస్‌ఈ ఎండీ సుందరరామన్ రామమూర్తి

ఎలక్ట్రిక్.. ఇక ఫుల్ చార్జ్!

తయారీ, చార్జింగ్ ఇన్‌ఫ్రాపై కసరత్తు

న్యూఢిల్లీ: చార్జింగ్, తయారీ మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించనున్నట్లు వివరించారు. రవాణా కోసం ఉపయోగించే సీఎన్‌జీలోనూ, పైపుల ద్వారా సరఫరా చేసే సహజ వాయువులోను కంప్రెస్ట్ బయోగ్యాస్‌ను కలపడం తప్పనిసరని ఆమె పేర్కొన్నారు. మరోవైపు మధ్యంతర బడ్జెట్‌లో చర్యలను స్వాగతించిన క్వాంటమ్ ఎనర్జీ ఎండీ సి. చక్రవర్తి .. కొన్ని ఆకాంక్షలు మాత్రం నెరవేరలేదని పేర్కొన్నారు. 2024 మార్చితో ముగిసిపోనున్న ఫేమ్ 2 సబ్సిడీ ప్రోగ్రామ్‌ను పొడిగిస్తారని ఆశలు నెలకొన్నప్పటికీ ఆ దిశగా ప్రతిపాదనలు లేవని ఆయన తెలిపారు. గడువు పొడిగించి ఉంటే ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమకు గట్టి మద్దతు లభించి ఉండేదన్నారు. అలాగే లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్‌లు, సెల్స్‌పై జీఎస్‌టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించి ఉంటే ఈవీల ధరలు మరింత అందుబాటు స్థాయిలోకి వచ్చేందుకు ఆస్కారం లభించేదని చక్రవర్తి తెలిపారు. సోలార్ రూఫ్‌టాప్ స్కీములు.. స్వచ్ఛ విద్యుత్ లక్ష్యాల సాధనకు తోడ్పడగలవని సీఫండ్ సహ వ్యవస్థాపకుడు మయూరేష్ రౌత్ తెలిపారు. మరోవైపు, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఫేమ్ స్కీముకు కేటాయింపులను బడ్జెట్‌లో కేంద్రం రూ. 2,671 కోట్లుగా ప్రతిపాదించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను సవరించిన అంచనాల (రూ. 4,807 కోట్లు) కన్నా ఇది 44 శాతం తక్కువ. ప్రస్తుతమున్న ఫేమ్ 2 ప్లాన్‌ను మరోసారి పొడిగిస్తారా లేదా అనే దానిపై స్పష్టత లేని పరిస్థితుల్లో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆటోమొబైల్‌కు పీఎల్‌ఐ బూస్ట్ ..

వాహన పరిశ్రమకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) స్కీము కింద బడ్జెట్‌లో కేటాయింపులను కేంద్రం ఏకంగా 7 రెట్లు పెంచి రూ. 3,500 కోట్లుగా ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనా ప్రకారం ఇది రూ. 484 కోట్లు. కాగా, అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్, బ్యాటరీ స్టోరేజీకి కేటాయింపులను రూ. 12 కోట్ల నుంచి రూ. 250 కోట్లకు పెంచారు.

ఈవీల షేర్లు అప్ ..

బడ్జెట్‌లో సానుకూల ప్రతిపాదనల నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల సంస్థల షేర్లు పెరిగాయి. బీఎస్‌ఈలో జేబీఎం ఆటో 2.48 శాతం పెరిగి రూ. 1,963 వద్ద, గ్రీవ్స్ కాటన్ సుమారు 1 శాతం పెరిగి రూ. 165 వద్ద ముగిశాయి. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ మాత్రం లాభాల స్వీకరణతో 0.69 శాతం క్షీణించి రూ. 1,729 వద్ద ముగిసింది. అయితే, ఒక దశలో 6 శాతం ఎగిసి 52 వారాల గరిష్టమైన రూ. 1,849 స్థాయిని తాకింది.



స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	107	71,645
నిఫ్టీ ▽	28	21,698

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,290	△ 125
డోజోన్స్	38,372	△ 223
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,622	▽ 8
డాక్స్	16,859	▽ 45
షాంఘై	2,771	▽ 18
నికాయ్	36,011	▽ 275

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్	ఎస్‌బీఐ	82.63	83.65
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.21	106.79
€	యూరో	ఎస్‌బీఐ	88.73	91.10
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.04	57.32
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.66	55.58
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.53	62.85
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.17	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.48
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.43	12.50

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	62,599 ▽	86
బంగారం (99.5 స్వచ్ఛత)	62,348 ▽	86
వెండి (కిలో)	70,834 ▽	834

బల్క్‌డ్రగ్ పార్క్‌లకు 'ప్రోత్సాహం'

బల్క్‌డ్రగ్‌ల ప్రోత్సాహకానికి 2024–25 సంవత్సరం బడ్జెట్లో కేంద్రం రూ.1,000 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ కేటాయింపులు రూ.900 కోట్లు కేటాయించినప్పటికీ, సవరించిన తాజా అంచనాల ప్రకారం ఇది రూ.85 కోట్లకే పరిమితమైంది. ఈ ప్రకారం చూస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో అయినా వాస్తవ కేటాయింపులు రూ.1,000 కోట్లను పూర్తి స్థాయిలో ఖర్చు చేస్తుందా? అన్నది చూడాల్సి ఉంది.



జనవరిలో 'తయారీ'కి కొత్త ఆర్డర్ల బూస్ట్



న్యూఢిల్లీ: భారత్ మొత్తం పారిశ్రామికరంగంలో దాదాపు 70 శాతం వాటా కలిగిన తయారీ రంగం జనవరిలో సానుకూల ఫలితాన్ని నమోదుచేసుకుంది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జనవరిలో 56.5కి ఎగసింది. ఇది నాలుగు నెలల గరిష్ఠ స్థాయి. డిసెంబర్‌లో ఈ సూచీ 54.9గా (18 నెలల కనిష్ఠం) నమోదయ్యింది. ద్రవ్యోల్బణం భయాల ఉపశమనం, డిమాండ్ బాగుండడం, కొత్త ఆర్డర్లలో పురోగతి ఇందుకు ప్రధాన కారణంగా నిలిచినట్లు నెలవారీ సర్వే పేర్కొంది. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే పేర్కొంటారు. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు.

97.5% రూ.2,000 నోట్లు వచ్చేశాయ్..!



ముంబై: బ్యాంకింగ్ వ్యవస్థలోకి 97.5 శాతం రూ.2,000 బ్యాంక్ నోట్లు తిరిగి వచ్చేసినట్లు బ్యాంకింగ్ రెగ్యులేటర్– రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేర్కొంది. ఇంకా ప్రజాబాహుళ్యంలో రూ.8,897 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు ఉన్నట్లు పేర్కొంది. ''రూ. 2,000 బ్యాంకు నోట్ల ఉపసంహరణ ప్రకటించిన 2024 మే 19న వ్యాపారం ముగిసే సమయానికి చెలామణిలో ఉన్న రూ. 2,000 బ్యాంకు నోట్ల మొత్తం విలువ రూ. 3.56 లక్షల కోట్లు. 2024 జనవరి 31వ తేదీన వ్యాపారం ముగిసే సమయానికి ఈ విలువ రూ. రూ.8,897 కోట్లకు తగ్గింది'' అని ఆర్‌బీఐ తాజా ప్రకటన వివరించింది.

మహీంద్రా ఎక్స్‌యూవీ400 ఈఎల్ ప్రో..



వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా హైదరాబాద్ మార్కెట్లో ఎలక్ట్రిక్ ఎక్స్‌యూవీ400 ఈఎల్ ప్రో ప్రవేశపెట్టింది. 34.5తోపాటు 39.4 కిలోవాట్ అవర్ ప్యాక్‌లలో ఇది లభిస్తుంది. పరిచయ ఆఫర్ ధర రూ.16.7 లక్షల నుంచి ప్రారంభం. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

2024లో ఆటో సూపర్‌స్టార్ట్

జనవరిలో దూసుకుపోయిన విక్రయాలు

ముంబై: దేశ ఆటోమొబైల్ పరిశ్రమకు కొత్త సంవత్సరం శుభారంభం ఇచ్చింది. పలు ఆటో సంస్థలు 2024 జనవరిలో గత సంవత్సరం ఇదే నెలతో పోల్చితే గణనీయమైన అమ్మకాలు జరిపాయి. మారుతీ సుజుకి ఇండియా, టాటా మోటార్స్, హ్యుందాయ్ మోటార్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఆటో, హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా జనవరి అమ్మకాల్లో మంచి వృద్ధిని నమోదు చేశాయి. మొత్తం అమ్మకాలలో దేశీయ పరిమాణం జనవరిలో 2,78,155 నుండి 3,82,512 యూనిట్లకు పెరిగింది. ఇక ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 102 శాతం పెరిగి 36,883 యూనిట్లుగా ఉన్నాయి.



అయిదేళ్లలో లక్ష ఎలక్ట్రిక్ ఆటోలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రెన్యువబుల్ ఎనర్జీ సొల్యూషన్స్ సంస్థ జీరో21 తాజాగా ప్రాజెక్ట్ గగన్‌ను ప్రారంభించింది. దీని కింద వచ్చే అయిదేళ్లలో 1 లక్ష ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలను ఆవిష్కరించాలని నిర్దేశించుకుంది. సంప్రదాయ ఇంధనాలతో నడిచే వాహనాలను రెట్రో ఫిట్టింగ్ ప్రక్రియ ద్వారా ఎలక్ట్రిక్‌కి మార్చడం లేదా కొత్త ఎలక్ట్రిక్ వాహనాలకు ఎక్స్చేంజ్ చేయడం ద్వారా దీన్ని సాధించాలని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా కన్వర్షన్ కిట్‌ను రూపొందించినట్లు సంస్థ వ్యవస్థాపకులు రాణి శ్రీనివాస్ తెలిపారు. దీనితో ఏదైనా ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌తో (ఐసీఈ) నడిచే త్రీ–వీలర్లను కేవలం నాలుగు గంటల్లోనే ఎలక్ట్రిక్ వాహనంగా మార్చవచ్చని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల నిర్వహణ ఖర్చులు తగ్గి, డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ఆర్థిక ప్రయోజనం లభించగలవని శ్రీనివాస్ వివరించారు. ప్రధానంగా ఆటో రిక్షా యజమానులు, ఫ్లీట్ ఆపరేటర్లను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్ట్ గగన్‌ను చేపట్టినట్లు ఆయన చెప్పారు. రోడ్‌సైడ్ అసిస్టెన్స్ (ఆర్‌ఎస్‌ఏ)ని కూడా ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలతో వాయు, ధ్వని కాలుష్యం తగ్గగలదని శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే జీరో21 సంస్థ ప్యాసింజర్, లోడ్ క్యారియర్ సెగ్మెంట్లలో ఎలక్ట్రిక్ త్రీ వీలర్లను తయారు చేస్తోంది. అలాగే రెట్రోఫిట్ కిట్‌లను కూడా అందిస్తోంది.



ద్రవ్యలోటు కట్టడిలో తగ్గేదేలే..!

4.5 శాతం లక్ష్యం బాటలో పురోగతి

ప్రభుత్వ ఆదాయాలు– వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం– ద్రవ్యలోటు కట్టడిలో తన చిత్తశుద్ధిని కేంద్రం తాజా బడ్జెట్ ద్వారా ఉద్ఘాటించింది. ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే 2024–2025 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 5.1 శాతానికి తగ్గుతుందని మధ్యంతర బడ్జెట్ అంచనావేసింది. 2025–26 నాటికి ఈ లోటును 4.5 శాతానికి తగ్గాలన్నది ప్రభుత్వ రోడ్‌మ్యాప్ అన్న సంగతి తెలిసిందే. గడచిన ఆర్థిక సంవత్సరం (2022–23) ద్రవ్యలోటు 6.4 శాతం. మార్చితో ముగిసే ప్రస్తుత (2023–24) ఆర్థిక సంవత్సరంలో ఈ లక్ష్యాన్ని 5.9 శాతంగా గత ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన సమర్పించిన బడ్జెట్ నిర్దేశించుకుంది. అయితే ఇది 5.8 శాతానికే పరిమితమవుతుందని 2024–25 మధ్యంతర బడ్జెట్ పేర్కొంది. భారీ పన్ను ఆదాయాలు ద్రవ్యలోటు అంచనా సానుకూలంగా 5.9 శాతం నుంచి 5.8 శాతానికి తగ్గడానికి కారణంగా వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు విలువలో రూ.17,34,773 కోట్లు ఉంటే, 2024–25 రూ.16,85,494 కోట్లకు తగ్గుతుందని మధ్యంతర బడ్జెట్ పేర్కొంది. ఇక స్థూల, నికర మార్కెట్ రుణాలు 2024–25లో వరుసగా రూ.14.13 లక్షల కోట్లు, రూ.11.75 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్ తెలిపింది. ఈ రెండు సంఖ్యలూ 2023–24తో పోల్చితే తక్కువే కావడం గమనార్హం. ప్రభుత్వం తక్కువ రుణాలను తీసుకోవడం వల్ల ప్రైవేట్ రంగానికి పెద్ద ఎత్తున రుణాల లభ్యత సులభతరం అవుతుందని ఆర్థికమంత్రి వ్యాఖ్యానించారు.



ద్రవ్యలోటును తగ్గించడానికి భారతదేశం నిర్దేశించిన లక్ష్యాలను మెరుగుపరిచిందనే సందేశాన్ని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు విస్తృత స్థాయిలో పరిగణనలోకి తీసుకోవాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బడ్జెట్ అనంతర సమావేశంలో అడిగిన ఒక ప్రశ్నకు ఆమె సమాధానం చెబుతూ, ''మేము ఇంతకుముందు ఇచ్చిన ద్రవ్యలోటు రోడ్‌మ్యాప్‌ను అనుసరించడంలో, మెరుగుపరచడంలో ఎంతో పురోగతి సాధిస్తున్నాం. ఇది ప్రతి రేటింగ్ సంస్థకు సూటిగా పంపుతున్న ఒక స్పష్టమైన సందేశం. ఏజెన్సీలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి'' అని అన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి భారీ డివిడెండ్లు, పన్ను సమీకరణలో మెరుగుదల ద్రవ్యలోటు కట్టడిలో లక్ష్య సాధనకు దోహదపడుతున్న అంశాలు. గ్లోబల్ రేటింగ్ దిగ్గజ సంస్థలు– ఫిచ్, ఎస్‌అండ్‌పీ, మూడీస్‌లు దేశానికి అతి దిగువస్థాయి ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ రేటింగ్‌ను ఇస్తున్నాయి. చెత్త స్థాయికి ఈ రేటింగ్ కేవలం ఒకమెట్టు ఎక్కువ. అధిక రేటింగ్ కోసం కేంద్రం పలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, అంతగా ఫలితం ఇవ్వడంలేదు. ఒకదేశంలో పెట్టుబడులను పెట్టడానికి అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, ఆయా సంస్థలు ఈ రేటింగ్‌లనే ప్రాతిపదికగా తీసుకుంటాయి.

రేటింగ్ ఏజెన్సీలూ... గుర్తించండి!



కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

2-2-2024	
విశాఖ	545–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	72.00
1-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	520–00
వరంగల్	522–00
రిటైల్ ధర	5.80

ఆర్థిక వృద్ధికి దారితీస్తుంది..



నాలుగేళ్లలో మూలధన వ్యయం మూడు రెట్లు పెరిగినప్పటికీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి జీడీపీలో 3.4 శాతం కేటాయించడం ద్వారా ఈ వేగాన్ని స్థిరంగా ఉంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆధునిక, స్థిర మౌలిక సదుపాయాలను నిర్మించడానికి రూ.11.1 లక్షల కోట్లు వెచ్చించనున్నారు. ఇది ఉపాధి అవకాశాలు, ఆదాయ అర్జన పరంగా అద్భుత ఆర్థిక వృద్ధికి దారితీస్తుంది.

– నంద కిషోర్, ఎండీ, రామ్‌కీ ఎస్టేట్స్, ఫామ్స్

సమగ్ర రోడ్ మ్యాప్..



2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన ఆర్థిక స్థితిని సాధించేందుకు వీలు కల్పించే సుస్థిర ఆర్థిక వృద్ధికి సమగ్ర రోడ్ మ్యాప్‌ను ఆర్థిక మంత్రి వివరించారు. పరిశోధన, ఆవిష్కరణ, బయో మానుఫ్యాక్చరింగ్, బలమైన అవస్థాపన అభివృద్ధి, సాంకేతికతతో నడిచే డిజిటల్ పరివర్తనపై సీతారామన్ నొక్కి చెప్పడం ప్రజలు కేంద్రీకృతంగా భారత్ సమ్మిళిత అభివృద్ధిని అందించడానికి శుభపరిణామం.

– కిరణ్ మజుందార్ షా, చైర్‌పర్సన్, బయోకాన్

సమతూక బడ్జెట్



ఇటు సామాజిక అటు ఆర్థిక అవసరాల మధ్య సమతూకం పాటించే విధంగా బడ్జెట్ ఉంది. అలాగే వృద్ధిని వేగవంతం చేసేలా, వర్ధమాన పరిశ్రమలకు తోడ్పాటు అందించేదిగా ఉంది.

– కృష్ణ బోదనపు, ఎండీ, సైయంట్

సౌర, పవన విద్యుత్‌కి ఊతం..



రూఫ్‌టాప్ సోలార్, పవన విద్యుత్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టడం స్వాగతించతగ్గ పరిణామం. అలాగే సీఎన్‌జీ, పీఎన్‌జీలో దశలవారీగా సీబీజీని కలపడాన్ని తప్పనిసరి చేయడం, నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు కేటాయింపులు పెంచడంపై హర్షణీయం. –మసూద్ మలిక్, రీ సస్టెయినబిలిటీ సీఈవో

జాతీయం / అంతర్జాతీయం

జార్ఖండ్‌లో ఉత్కంఠకు తెర

కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై వీడిన సందిగ్ధత

- ముఖ్యమంత్రిగా నేడే చంపయ్ సోరెన్ ప్రమాణం
- గవర్నర్ నుంచి అందిన ఆహ్వానం
- 10 రోజుల్లోగా బలనిరూపణ చేసుకోవాలని ఆదేశం
- తొలుత గవర్నర్ నుంచి పిలుపు రాకపోవడంతో ఆందోళనకు గురైన జేఎంఎం కూటమి నేతలు
- 43 మంది ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు తరలించేందుకు యత్నం
- చివరి నిమిషంలో విమానాల టేకాఫ్‌కు అనుమతి నిరాకరణ
- ఎయిర్‌పోర్టు నుంచి వెనక్కి వెళ్లిపోయిన ఎమ్మెల్యేలు

రాంచీ: జార్ఖండ్‌లో ఉత్కంఠకు తెరపడింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాజీనామా చేసి 24 గంటలు గడిచిపోయిన తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని జేఎంఎం శాసనసభాపక్ష నేత చంపయ్ సోరెన్‌ను జార్ఖండ్ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ గురువారం రాత్రి ఆహ్వానించారు. ప్రమాణ స్వీకారం అనంతరం అసెంబ్లీలో 10 రోజుల్లోగా బలనిరూపణ చేసుకోవాలని ఆదేశించారు. జార్ఖండ్ కొత్త ముఖ్యమంత్రిగా చంపయ్ సోరెన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై తొలుత సందిగ్ధత నెలకొంది. గవర్నర్ నుంచి పిలుపు రాకపోవడంతో జేఎంఎం–కాంగ్రెస్–ఆర్జేడీ కూటమి నేతలు ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చంపయ్ సోరెన్ మరోసారి స్పష్టం చేశారు. ఆయన గురువారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. తమకు మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉందని, ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ(ఎంఎల్) ఎమ్మెల్యేలు ఉన్నారు. గవర్నర్‌తో భేటీ అనంతరం చంపయ్ సోరెన్ మీడియాతో మాట్లాడారు. కొత్త ప్రభుత్వాన్ని కొలువుదీర్చే విషయంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ చెప్పారని వెల్లడించారు. గవర్నర్‌ను చంపయ్ సోరెన్ కలవడానికి కంటే ముందు జేఎంఎం–కాంగ్రెస్–ఆర్జేడీ కూటమి ఓ వీడియోను విడుదల చేసింది. చంపయ్‌కి మద్దతిస్తున్న 43 మంది ఎమ్మెల్యేలు ఈ వీడియోలో కనిపించారు. మరోవైపు, బీజేపీ బారి నుంచి తమ ఎమ్మెల్యేలను కాపాడుకోవడంపై దృష్టి పెట్టారు. 43 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పాలిత తెలంగాణ రాజధాని హైదరబాద్‌కు గురువారం రెండు ప్రత్యేక విమానాల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వారిని గచ్చిబౌలీలోని ఎల్లా హోటల్‌కు చేర్చాలని నిర్ణయించారు. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా చివరి నిమిషంలో రాంచీ నుంచి ప్రత్యేక విమానాల టేకాఫ్‌కు ఎయిర్‌పోర్టు అధికారుల నుంచి అనుమతి లభించలేదు. రెండు గంటలపాటు విమానాల్లోనే కూర్చుండిపోయిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు చేసేది లేక సర్క్యూట్ హౌజ్‌కు తిరిగి వచ్చారు. వీరిలో హేమంత్ సోరెన్ సోదరుడు, ఎమ్మెల్యే బసంత్ సోరెన్ కూడా ఉన్నారు. నూతన ప్రభుత్వ ఏర్పాటులకు ఎట్టకేలకు గవర్నర్ నుంచి ఆహ్వానం రావడంతో ఊహాగానాలకు తెరపడింది.



రాంచీలోని ప్రత్యేక కోర్టు వద్ద సోరెన్‌ను కస్టడీలోకి తీసుకున్న ఈడీ అధికారులు



గవర్నర్‌ను కలిసి వస్తున్న చంపయ్ సోరెన్

రాంచీ జైలుకు హేమంత్ సోరెన్

మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) నేత, మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అధికారులు రాంచీలోని హోత్వార్ జైలుకు తరలించారు. ఈడీ అధికారులు ఆయనను బుధవారం 7 గంటల సుదీర్ఘ విచారణ తర్వాత అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. గురువారం రాంచీలోని 'ప్రత్యేక మనీ లాండరింగ్ నిరోధక చట్టం కోర్టు'లో సోరెన్‌ను ప్రవేశపెట్టారు. తదుపరి విచారణ నిమిత్తం 10 రోజులపాటు ఆయనను తమ కస్టడీకి అప్పగించాలని కోరారు. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశారు. రాంచీలో 8.5 ఎకరాల భూములు అక్రమంగా సోరెన్ ఆధీనంలో ఉన్నాయని, అందుకే మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద దర్యాప్తు ప్రారంభించామని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై న్యాయస్థానం తమ తీర్పును శుక్రవారానికి రిజర్వ్ చేసింది. సోరెన్‌ను ఒకరోజుపాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దాంతో అధికారులు ఆయనను జైలుకు తరలించారు. గురువారం రాత్రంతా సోరెన్ జైలులో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సుప్రీంకోర్టులో సోరెన్ పిటిషన్

తన అరెస్టు అక్రమమంటూ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టనుంది.

అయోధ్యకు 11 రోజుల్లో 25 లక్షల మంది

అయోధ్య: ఈ నెల 22వ తేదీన ప్రాణప్రతిష్ఠ జరిగినప్పటి నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు 11 రోజుల్లో అయోధ్యలోని రామాలయాన్ని 25 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. అదే సమయంలో విరాళాలు, కానుకల రూపంలో ఆలయానికి రూ.11 కోట్ల ఆదాయం సమకూరింది. ఆలయ ట్రస్ట్ ఆఫీస్ ఇన్‌చార్జి ప్రకాశ్ గుప్తా ఈ వివరాలు వెల్లడించారు. గత 11 రోజుల్లో చెక్కులు, ఆన్‌లైన్ ద్వారా రూ.3.50 కోట్లు, ఆలయం లోపల ఏర్పాటు చేసిన నాలుగు హుండీల్లో రూ.8 కోట్లు సమకూరినట్లు వివరించారు.

పాక్‌లో 21 మంది ఉగ్రవాదులు హతం

కరాచీ: నిషేధిత బలోచ్ లిబరేషన్ ఆర్మీ ముజాహిద్ బ్రిగేడ్‌కు చెందిన 21 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు పాకిస్తాన్ సైన్యం ప్రకటించింది. బలోచిస్తాన్‌లోని మచ్ పట్టణం, కొల్పూర్ ప్రాంతాల్లో చేపట్టిన ఆపరేషన్‌లో సుమారు 21 మంది ఉగ్రవాదులు మృతి చెందారని సైన్యం తెలిపింది. నలుగురు సైనికులు, మరో ఇద్దరు పౌరులు కూడా ఈ సందర్భంగా ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. బుధవారం ఉగ్రవాదులు తమ వారిని విడిపించుకునే లక్ష్యంతో సెంట్రల్ మచ్ జైలుపైకి ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. బలగాలు దీటుగా స్పందించడంతో చీకటిమాటున కొందరు సమీప కొండ ప్రాంతంలోకి పరారైనట్లు సైన్యం వివరించింది.

31 డ్రోన్ల విక్రయానికి అమెరికా ఆమోదం

వాషింగ్టన్: భారత్‌కు సుమారు రూ.33 వేల కోట్ల విలువైన 31 ఎంక్యూ–9బీ అనే అత్యాధునిక డ్రోన్ల విక్రయానికి అమెరికా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గత ఏడాది జూన్‌లో భారత ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో కుదిరిన భారీ ఒప్పందంలో భాగమని అమెరికా రక్షణ శాఖ తెలిపింది. 31 ఎంక్యూ–9బీ రిమోట్లీ పైలటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ మరియు సంబంధ పరికరాలను విక్రయించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ధ్రువీకరణను గురువారం కాంగ్రెస్‌కు అందించినట్లు వెల్లడించింది.

జైపూర్ లిటరేచర్ ఫెస్ట్ ప్రారంభం

జైపూర్ నుంచి ప్రత్యేక ప్రతినిధి: జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌తో రాజస్తాన్ పర్యాటకానికి గణనీయమైన మేలు జరగడమే కాకుండా నగరానికీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దియా కుమారి అన్నారు. గురువారం జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌ను ఆమె ప్రారంభించారు. ముగ్గురు బుకర్, ఐదుగురు పులిట్జర్ విజేతలతోపాటు ప్రపంచవ్యాప్తంగా 500 మంది సాహితీవేత్తలు ఈ వేడుకకు వచ్చారు.

జ్ఞానవాపి మసీదులో పూజలు ప్రారంభం

- సెల్లార్‌లో లక్ష్మీదేవి, వినాయకుడికి హారతులు
- 31 సంవత్సరాల తర్వాత మొదలైన పూజలు

వారణాసి: కాశీలోని జ్ఞానవాపి మసీదు సెల్లార్‌లో బుధవారం అర్ధరాత్రి పూజలు ప్రారంభమయ్యాయి. ఇక్కడున్న హిందూ దేవతల విగ్రహాలకు అర్చకులు హారతులు ఇచ్చారు. ఈ మసీదులో హిందూ దేవతలకు పూజలు జరగడం 31 సంవత్సరాల తర్వాత మొదటిసారి అని కాశీ విశ్వనాథ్ ఆలయ ట్రస్టు అధ్యక్షుడు నరేంద్ర పాండే చెప్పారు. పూజల కోసం వ్యాసుడి సెల్లార్ 31 ఏళ్ల తర్వాత తెరుచుకుందని అన్నారు. దక్షిణ సెల్లార్‌ను బుధవారం రాత్రి 10.30 గంటలకు తెరిచినట్లు వెల్లడించారు. అనంతరం కోర్టు ఉత్తర్వులను పాటిస్తూ పూజలు నిర్వహించామని, ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. కాశీ విశ్వనాథ ఆలయ సమీపంలోనే ఉన్న జ్ఞానవాపీ మసీదు భూగర్భ గృహంలో హిందూ దేవతలకు పూజలు చేసుకోవడానికి వారణాసి జిల్లా కోర్టు బుధవారం అంగీకరించిన సంగతి తెలిసిందే. కోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడిన కొన్ని గంటల వ్యవధిలోనే పూజలు ప్రారంభం కావడం గమనార్హం. పూజల విషయంలో కోర్టు ఉత్తర్వుల ప్రకారమే నడుచుకున్నామని వారణాసి జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.రాజలింగం చెప్పారు. మసీదు ప్రాంగణంలోని సెల్లార్‌ను శుభ్రం చేసిన తర్వాత లక్ష్మీదేవికి, వినాయకుడికి హారతి ఇచ్చినట్లు స్థానికులు చెప్పారు.



జ్ఞానవాపి మసీదు బేస్‌మెంట్‌లో పూజలు...

అమెరికాలో మరో భారతీయ విద్యార్థి మృతి

వాషింగ్టన్: అమెరికాలోని సిన్సినాటిలో భారతీయ విద్యార్థి ఒకరు చనిపోయారు. అతడి మరణానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఇండియానా రాష్ట్రంలోని పర్డ్యూ యూనివర్సిటీలో చదువుకుంటున్న నీల్ ఆచార్య ఆదివారం నుంచి కనిపించకుండా పోయాడు. ఇతడు మృతి చెందినట్లు పోలీసులు సోమవారం ధ్రువీకరించారు. వారం రోజుల వ్యవధిలో ఇలాంటి ఘటన ఇది రెండోది కావడం గమనార్హం. మూడు రోజుల క్రితం ఎంబీఏ చదువుకుంటున్న వివేక్ సైనీ(25) అనే భారతీయ విద్యార్థిని జూలియన్ ఫాక్‌నర్ అనే డ్రగ్స్ బానిస సుత్తితో కొట్టి దారుణంగా పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే.

వీసా ఫీజులు పెంచిన అమెరికా

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వం హెచ్–1బీ, ఎల్–1, ఈబీ–5 తదితర నాన్ ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తుల ఫీజులను పెంచుతున్నట్లు ప్రకటించింది. తాజా పెంపు ప్రకారం..భారతీయ టెక్కీలు ఎక్కువగా దరఖాస్తు చేసుకునే హెచ్–1బీ వీసా ఫీజు ప్రస్తుతమున్న 460 డాలర్ల నుంచి ఏకంగా 780 డాలర్లకు పెరిగింది. హెచ్–1బీ రిజిస్ట్రేషన్ ఫీజు కూడా 10 అమెరికన్ డాలర్ల నుంచి 215 డాలర్లకు పెరగనుంది. రిజిస్ట్రేషన్ ఫీజు పెంపు వచ్చే ఏడాది నుంచి అమల్లోకి రానుంది. అదే విధంగా, ఎల్–1 వీసా ఫీజు 460 డాలర్ల నుంచి 1,385 డాలర్లకు, ఇన్వెస్టర్ల వీసాగా పిలిచే ఈబీ–5 కేటగిరీ వీసా ఫీజును ప్రస్తుతమున్న 3,675 డాలర్ల నుంచి ఏకంగా 11,160 డాలర్లకు పెంచుతున్నట్లు ఫెడరల్ ప్రభుత్వం బుధవారం ఒక నోటిఫికేషన్లో వివరించింది. 2016 తర్వాత మొదటిసారిగా చేపట్టిన వీసా ఫీజుల పెంపు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు కానుంది.

ఇరాన్‌లో మరో 4 అణు విద్యుత్ ప్లాంట్లు

టెహ్రాన్: ఇరాన్ ప్రభుత్వం మొత్తం 5 వేల మెగావాట్ల సామర్థ్యముండే నాలుగు అణు విద్యుత్‌ప్లాంట్ల నిర్మాణం చేపట్టింది. దేశ తూర్పు తీర పట్టణం సిరిక్ సమీపంలో వీటి నిర్మాణం మొదలైందని ఇరాన్ అణు విభాగం అధిపతి మహ్మద్ ఎస్లామి తెలిపినట్లు అధికార వార్తా సంస్థ ఇర్నా పేర్కొంది. సుమారు 20 బిలియన్ డాలర్ల(సుమారు రూ.1.64 లక్షల కోట్లు) వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టుతో 4 వేల మందికి ఉద్యోగాలు దొరుకుతాయని ఎస్లామి చెప్పారు. తొమ్మిదేళ్లలో వీటి నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. ఆ తర్వాత ఏటా 35 టన్నుల అణు ఇంధనాన్ని ఉపయోగించుకుంటుంది. రష్యా సహకారంతో నిర్మించిన వెయ్యి మెగావాట్ల అణుప్లాంట్ ఇరాన్‌లో ఇప్పటికే పనిచేస్తోంది.

ఉక్రెయిన్‌కు ఈయూ భారీ సాయం

బ్రస్సెల్స్: రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు సాయం చేసేందుకు యూరోపియన్ యూనియన్ సిద్ధంగా ఉంటుందని యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ చార్లెస్ మైకేల్ చెప్పారు. గురువారం బ్రస్సెల్స్‌లో సమావేశమైన ఈయూలోని 27 సభ్య దేశాల నేతలు ఉక్రెయిన్‌కు 54 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.48 లక్షల కోట్లు)సాయం ప్యాకేజీని అందించేందుకు అంగీకరించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన తీర్మానంపై కేవలం గంటలోపే చర్చించి ఆమోదించినట్లు వివరించారు. సాయానికి సంబంధించిన తీర్మానాన్ని వీటో చేస్తామంటూ సభ్య దేశం హంగేరీ ప్రధాని విక్టర్ ఓర్బాన్ కొంతకాలం చేస్తున్న హెచ్చరికలను కూడా పట్టించుకోలేదన్నారు.

ఎన్నికల్లో గెలవాలనే అందర్నీ జైలుకు పంపుతోంది: మమత

శాంతిపూర్(పశ్చిమబెంగాల్): త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యంతోనే బీజేపీ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలందరినీ జైళ్లకు పంపుతోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఒకవేళ తనను జైలుకు పంపినా బయటకు రాగలనని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలకు గాను రాష్ట్రంలో కాంగ్రెస్‌తో జట్టుకట్టేందుకు తమ టీఎంసీ పార్టీ ఆసక్తి చూపినా ఆ పార్టీ తిరస్కరించిందన్నారు.

రాజ్యసభ వైస్ చైర్మన్‌గా వేమిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ వైస్ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎంపికయ్యారు. నలుగురు మహిళలు సహా మొత్తం 8 మంది సభ్యులతో కూడిన వైస్ చైర్మన్ల ప్యానెల్‌ను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ పునర్నియామకం చేశారు. ప్యానెల్‌లో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో పాటు రమీలాబెన్ బేచర్ భాయ్ బారా, సీమా ద్వివేది, డాక్టర్ అమీ యాజ్ఞిక్, మౌసమ్ నూర్, కనకమేడల రవీంద్ర కుమార్, ప్రొఫెసర్ మనోజ్ కుమార్ ఝా, లెఫ్టినెంట్ జనరల్ డీపీ వత్స్ (రిటైర్డ్) ఉన్నారు. చైర్మన్ ధన్‌ఖడ్ గైర్హాజరైన సందర్భాల్లో వీరు సభను నిర్వహిస్తారు.

క్లుప్తంగా...

రాష్ట్ర అభివృద్ధికి సహకరించండి

న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్ జనరల్ పాండియన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డి.జె. పాండియన్‌ను కోరారు. గురువారం పాండియన్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌లో భారీ ఎత్తున మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు తెలిపారు. మూసీ నది అభివృద్ధిలో భాగంగా పర్యావరణాన్ని కాపాడుతూ, కాలుష్య రహితంగా మారుస్తామని అన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా హైదరాబాద్‌లో రెండోదశ మెట్రోరైల్ ప్రాజెక్టుకు, రాష్ట్రంలో సాంకేతిక నైపుణ్యాలు అందించే శిక్షణ సంస్థల ఏర్పాటుకు, ఇతర ప్రాజెక్టులకు సహకరించాలని కోరారు. అనంతరం పాండియన్ మాట్లాడుతూ రాష్ట్ర పురోభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంద్రవెల్లిలో 'తెలంగాణ పునర్నిర్మాణ' సభ

హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/కైలాస్‌నగర్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా మొదటి సభ ఇంద్రవెల్లిలో దళిత–గిరిజన ఆత్మగౌరవ సభ ఏర్పాటు చేశారని, ఇప్పుడు మళ్లీ మూడేళ్ల తర్వాత సీఎం హోదాలో తిరిగి అక్కడే శుక్రవారం 'తెలంగాణ పునర్నిర్మాణ సభ' ఏర్పాటు చేస్తున్నట్లు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఇంద్రవెల్లి సభ వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల అమలుకు మొదటి రోజు నుంచే కృషి చేశారని, ఇప్పుడు రెండు గ్యారంటీలు అమలవుతున్నాయని, వంద రోజులలో ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేస్తామని వివరించారు. ఇంద్రవెల్లిలో సీఎం రేవంత్ పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరిస్తారని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సీఎం రేవంత్ ముందుగా కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో పూజలు చేస్తారు. ఆలయ గోపురంతోపాటు వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. అనంతరం ఇంద్రవెల్లి స్తూపం వద్దకు చేరుకుని గిరిజన అమరవీరులకు నివాళులర్పిస్తారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న అమరవీరుల స్మృతివనానికి భూమిపూజ చేస్తారు.

హర్కర బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా హర్కర వేణుగోపాలరావు గురువారం ఇక్కడి బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో వేదపండితులు పూజలు నిర్వహించిన అనంతరం పదవీ బాధ్యతలను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన హర్కరను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీలు వీహెచ్, సుబ్బరామిరెడ్డి, మధుయాష్కీ, దీపాదాస్ తదితర ప్రజాప్రతినిధులు అభినందించారు.

ప్రభుత్వోద్యోగులకు వేతనాలొచ్చేశాయ్

1న జీతాలపై ఉద్యోగ సంఘాల హర్షం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వోద్యోగులకు వేతనాలు విడుదలయ్యాయి. దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేయగా.. వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నేళ్ల తర్వాత ఒకటో తేదీన వేతనాలు వచ్చాయంటూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'ఒకటో తేదీన ఖాతాలో వేతనం జమ అయ్యిందంటే నా భార్య నమ్మడం లేదు. ఏదేమైనా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి నా కృతజ్ఞతలు'.. అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ ఖాతాకు ఓ ఉద్యోగి సందేశాన్ని జత చేయడం విశేషం.

'హామీలు అమలు చేయండి'

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, మాణిక్‌రావు డిమాండ్ చేశారు. వారు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాల కంటే.. దేశంలో ఎక్కడైనా ఒక్క ఉద్యోగం ఎక్కువగా ఇచ్చి ఉంటే ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశారు. ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌పై విమర్శలు కాదు.. ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం చేయడంతో కొత్త ఇన్నింగ్స్ మొదలవుతుందని, ఇక రేవంత్ రెడ్డి ఆటలు సాగవని హెచ్చరించారు.

కాంగ్రెస్ ట్రాప్‌లో పడొద్దు

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాగ్రత్తగా ఉండాలి

- మంచి ఉద్దేశంతో సీఎంను కలిసినా బద్నాం చేస్తారు
- విమర్శలకు తొందరొద్దు.. తగిన సమయం ఇద్దాం
- కాంగ్రెస్ నేతల పరస్పర దూషణలు త్వరలోనే చూస్తాం
- పార్లమెంట్ ఎన్నికల వ్యూహంపై నేతలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం



గురువారం కేసీఆర్ నివాసంలో జరిగిన సమావేశానికి హాజరైన కడియం, కేటీఆర్, మల్లారెడ్డి, హరీశ్‌రావు, తలసాని, జగదీశ్‌రెడ్డి, సునీత, సబితారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'మంచి ఉద్దేశంతో ముఖ్యమంత్రిని కలిసినా మీ వ్యక్తిత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నాలు జరుగుతాయి. కాంగ్రెస్ నేతల ట్రాప్‌లో ఎమ్మెల్యేలెవరూ పడొద్దు. ముఖ్యంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాగ్రత్తగా ఉండాలి' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశించారు. ఎమ్మెల్యేగా గురువారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నందినగర్‌లోని తన నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలతో కేసీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈ భేటీలో పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలిచేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. త్వరలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, ఇతర అంశాలపై కూడా పలు సూచనలు చేశారు.

ప్రజల సమక్షంలోనే వినతిపత్రాలు ఇవ్వండి

'నియోజకవర్గాల అభివృద్ధి పనుల కోసం ప్రజల సమక్షంలోనే మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వండి. వారి నివాసాలు, క్యాంప్ ఆఫీసులకు వెళ్లకుండా వారి కార్యాలయాల్లో కలిసి సమస్యలు విన్నవించండి. కాంగ్రెస్ పార్టీని విమర్శించడంలో తొందర అవసరం లేదు. వారిని పెద్దగా తిట్టాల్సిన అవసరం కూడా లేదు. కాంగ్రెస్ నేతలు వాళ్లను వాళ్లే తిట్టుకోవడం త్వరలోనే చూస్తాం. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం అంత సులువు కాదు. అవి హామీలు అమలు చేయకపోతే ప్రజల నుంచే వ్యతిరేకత ప్రారంభమవుతుంది. బీఆర్ఎస్‌పై ప్రజలు నమ్మకం కోల్పోలేదు. ప్రతిపక్షంలో ఉన్నామని అధైర్యపడొద్దు, ప్రతిపక్షంలో ఉండటం తప్పుకాదు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సన్నద్ధం కావాలి' అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

రాజీలేని పోరాటం చేసేది బీఆర్ఎస్ మాత్రమే

'తెలంగాణను సాధించి, స్వరాష్ట్రాన్ని పదేళ్ల కాలంలో ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా ప్రగతి పథంలో నడిపించాం. బీఆర్ఎస్ మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతుంది. ప్రభుత్వ విధానాలను నిశితంగా అధ్యయనం చేస్తూ గాడి తప్పిన ప్రతీ సందర్భంలో ఎండగడదాం. ప్రజాక్షేత్రంలో ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో అండగా నిలబడాలి' అని కేసీఆర్ ఆదేశించారు.

ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం

అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో కార్యక్రమం

- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నేతలు
- అధినేతకు కేటీఆర్, హరీశ్ సహా ముఖ్య నేతల స్వాగతం



వాకింగ్ స్టిక్ సాయంతో అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: గజ్వేల్ శాసనసభ్యుడిగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం మధ్యాహ్నం 12:15 గంటలకు అసెంబ్లీకి చేరుకున్న కేసీఆర్... స్పీకర్ చాంబర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యేగా దైవసాక్షిగా ప్రమాణం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కేసీఆర్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారితోపాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ మంత్రులు పాల్గొన్నారు.

పార్టీ నేతల ఘన స్వాగతం

గతేడాది డిసెంబర్‌లో ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో జారి పడటంతో కేసీఆర్ తుంటి ఎముక విరగడం తెలిసిందే. దీంతో ఆయనకు వైద్యులు తుంటి మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. ఫలితంగా అప్పుడు ఎమ్మెల్యేగా ప్రమాణం చేయలేకపోయారు. ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్న కేసీఆర్ గురువారం ఊతకర్ర సాయంతో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చారు. తొలిసారిగా అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్‌కు బీఆర్ఎస్ నేతలు ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రులు కె. తారక రామారావు, హరీశ్‌రావు, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులతోపాటు బీఆర్ఎస్ నేతలు కేసీఆర్ వెంట స్పీకర్ చాంబర్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణం అనంతరం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాసనసభ ప్రాంగణంలోని పీవీ హాల్‌లో కేసీఆర్‌కు పార్టీ నేతలు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.

చాంబర్‌లో పనులు పూర్తికాకపోవడంతో

ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందిన కేసీఆర్... అసెంబ్లీలో తనకు కేటాయించిన చాంబర్‌లో ప్రత్యేక పూజలు చేయాలని భావించారు. అయితే వసతుల కల్పన పనులు పూర్తి కాకపోవడంతో నందినగర్‌లోని తన నివాసానికి తిరిగి వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా జనసమూహంలోకి వచ్చిన కేసీఆర్‌ను కలిసేందుకు బీఆర్ఎస్‌కు నేతలు పోటీ పడ్డారు.

హైదరాబాద్ ఖ్యాతిని పెంచాలి

మున్సిపల్ బడ్జెట్ ప్రతిపాదనలపై అధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధాని ఖ్యాతిని పెంచేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, అందుకనుగుణంగా ప్రణాళికలు తయారు చేయాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో 2024–25 రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ డ్రగ్స్ ఫ్రీ నగరంగా మార్చడం, గ్రీన్‌అండ్ క్లీన్ సిటీగా అభివృద్ధి చేయడం, మూసీనదిని ప్రక్షాళన చేసి హైదరాబాద్ షాన్‌ను పెంచడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని చెప్పారు. గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా మార్చడానికి, మురుగునీటి కాల్వలను నిర్మించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మూసీ ప్రక్షాళన పనులు జూన్ నాటికి పూర్తి చేసి సుందరీకరణ చేయాలని చెప్పారు. హెచ్ఎండీఏలో ప్రత్యామ్నాయ వనరులు పెంచడానికి ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ ఉన్న ఖాళీ భూముల్లో పెట్టుబడులు పెట్టి టౌన్‌షిప్‌ల నిర్మాణం చేపట్టి ఆదాయాన్ని సృష్టించాలని సూచించారు. 2031 మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో మార్కింగ్ చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ కింద 39 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, వాటిని వేగవంతంగా పరిష్కరించాలన్నారు. పారిశ్రామికవాడల్లో టెండర్ల ద్వారా భూములు దక్కించుకున్నవారు వారు వాటిని ఖాళీగా ఉంచితే వెనక్కి తీసుకోవాలని, ఇది సాధ్యం కాకుంటే వాటిల్లో ప్రభుత్వానికి రావాల్సిన వాటాను రాబట్టాలని చెప్పారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మునిసిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ రుసుము మినహాయింపు

మేడారం భక్తులకు ఉపశమనం

సాక్షి, హైదరాబాద్: ఏటూరు నాగారం అభయారణ్యం అటవీశాఖ రుసుము నుంచి మేడారం వచ్చే భక్తులకు మినహాయింపునిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. జాతర ముగిసే వరకు అక్కడ అటవీ శాఖ వసూలు చేస్తున్న పర్యావరణ రుసుమును నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. తన సూచన మేరకు తీసుకున్న ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి 29 దాకా పర్యావరణ రుసుము (ఎన్విరాన్ మెంట్ ఇంపాక్ట్ ఫీజు) వసూలు నిలిపివేస్తున్నట్లు అటవీ శాఖ తెలిపింది. ఈ మేరకు గురువారం చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకోసం ములుగు జిల్లా అటవీ అధికారి తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఏటూరు నాగారం అభయారణ్యం పరిధిలో పస్రా, తాడ్వాయి, ఏటూరు నాగారం నుంచి వచ్చే వాహనాలకు నామమాత్రపు పర్యావరణ రుసుమును ఇప్పటిదాకా అటవీ శాఖ వసూలు చేస్తోంది. ఇలా వచ్చే ఆదాయాన్ని అటవీ ప్రాంతాల రక్షణకు, ప్లాస్టిక్‌ను తొలగించేందుకు, వన్యప్రాణుల రక్షణకు అటవీ శాఖ వినియోగిస్తోంది. కాగా, వివిధ వర్గాల నుంచి విజ్ఞప్తి మేరకు జాతర ముగిసే దాకా ఈ ఫీజు వసూలు నిలిపివేస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులు అటవీ ప్రాంతాన్ని వీలైనంత పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని అటవీశాఖ విజ్ఞప్తి చేసింది.

ఇన్‌చార్జి మంత్రులకు రూ.1,190 కోట్లు

- నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున కేటాయింపు
- రూ.2 కోట్లు విద్యా సౌకర్యాల కల్పన, రూ. కోటి తాగునీటి కోసం
- రూ.50 లక్షలు కలెక్టరేట్‌లు, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు...

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రుల అనుమతితో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రూ.1,190 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి కేటాయించే రూ.10 కోట్లలో 20 శాతం అంటే రూ.2 కోట్లు విద్యారంగంలో మౌలిక సౌకర్యాల కల్పనకు, 10 శాతం అంటే కోటి రూపాయలు తాగునీటి సౌకర్యానికి, మరో 5 శాతం అంటే రూ.50 లక్షలు జిల్లా కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం వినియోగించాల్సి ఉంటుంది. ఇవి పోను మిగిలిన నిధులను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రుల అనుమతితో ప్రతిపాదించిన పనులకు సంబంధించిన అనుమతుల పర్యవేక్షణ, అమలు బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. ఈ పనులకు సంబంధించిన అన్ని వివరాలను ప్రణాళిక శాఖకు పంపాలని గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మంత్రులకు కేటాయించిన అభివృద్ధి నిధుల వివరాలు:

మంత్రి	జిల్లా (అసెంబ్లీ నియోజకవర్గాలు)	కేటాయింపు (రూ.కోట్లలో)	విద్య	తాగునీరు	నిర్వహణ (రూ.కోట్లలో)
పొన్నం ప్రభాకర్	హైదరాబాద్ (15)	150	30	15	7.5
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి	కరీంనగర్(13)	130	26	13	6.50
రాజనర్సింహ	మహబూబ్‌నగర్(14)	140	28	14	7.00
వెంకట్‌రెడ్డి	ఖమ్మం (10)	100	20	10	5.00
శ్రీధర్‌బాబు	రంగారెడ్డి(14)	140	28	14	7.00
పి.శ్రీనివాస్‌రెడ్డి	వరంగల్(12)	120	24	12	6.00
కొండా సురేఖ	మెదక్ (10)	100	20	10	5.00
సీతక్క	ఆదిలాబాద్(10)	100	20	10	5.00
టి.నాగేశ్వరరావు	నల్లగొండ (12)	120	24	12	6.00
జూపల్లి కృష్ణారావు	నిజామాబాద్ (09)	90	18	09	4.50

పుస్తక ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 9వ తేదీ నుంచి 19 వరకు జరగనున్న హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన పోస్టర్‌ను సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం అత్తాపూర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో పుస్తక పఠనాన్ని పెంపొందించేందుకు ఈ ప్రదర్శన ఎంతో దోహదం చేస్తుందన్నారు. బుక్ ఫెయిర్ నిర్వహణకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయసహకారాలను అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోయ చంద్రమోహన్‌లు జాతీయ పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవానికి హాజరుకావాలని జూపల్లిని ఆహ్వానించారు.

నేటి నుంచి పల్లెల్లో 'ప్రత్యేక' పాలన

- గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలనకు ప్రభుత్వం ఉత్తర్వులు
- ఒక్కో పంచాయతీ లేదా కొన్ని జీపీలను కలిపి ప్రత్యేక అధికారుల నియామకానికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది. గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన వివిధ శాఖల గెజిటెడ్, ఇతర అధికారులు బాధ్యతలు చేపట్టనున్నారు. 2018 నూతన పంచాయతీరాజ్ చట్టానికి అనుగుణంగా ప్రత్యేక అధికారుల నియామకానికి వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం నాటికి సర్పంచ్‌లు, పాలకమండళ్ల సభ్యుల (వార్డు సభ్యులు) పదవీకాలం ముగియడంతో పంచాయతీరాజ్ చట్టానికి అనుగుణంగా మళ్లీ వారు ఎన్నికయ్యే దాకా గ్రామ పంచాయతీల్లో వివిధ విధులు, అధికారుల నిర్వహణకు స్పెషల్ ఆఫీసర్ లేదా పర్సన్ ఇన్‌చార్జి లేదా పర్సన్ ఇన్‌చార్జీల కమిటీని నియమించే వెసులుబాటు కల్పించారు. దీంతో గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల నియామకానికి చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు అధికారాలు కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీచేసింది. వివిధ కేటగిరీల అధికారులు.. అంటే తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, ఎంపీవోలు, ఎంఈవోలు సమాన, ఆపై ర్యాంక్ వారిని నియమించేలా కలెక్టర్లకు అధికారాలు కల్పిస్తూ ఉత్తర్వులిచ్చింది. శుక్రవారం నుంచి తమ పరిధుల్లోని ఒక్కో జీపీకి లేదా రెండు, మూడు జీపీలను కలిపి ఒక గ్రూపుగా స్పెషల్ ఆఫీసర్లను నియమించవచ్చని పేర్కొంది. జీపీలకు ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారు సర్పంచ్‌లు, పాలకమండళ్ల సభ్యుల పదవీకాలం ముగియగానే వెంటనే బాధ్యతలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు పీఆర్ ఆర్‌డీ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలోని అతిచిన్న జిల్లా అయిన మేడ్చల్–మల్కాజిగిరిలోని 5 మండలాల్లో ఉన్న 61 గ్రామ పంచాయతీలకు పలువురు జిల్లాస్థాయి అధికారులను సైతం ప్రత్యేక అధికారులుగా నియమించారు.

నదుల అనుసంధానంలో సగం వాటా ఇవ్వాలి

- తొలి దశలో తరలించే 148 టీఎంసీల్లో 74 టీఎంసీలు కేటాయించాలి
- తుపాకులగూడెం నుంచే నీళ్లు తీసుకెళ్లండి.. ఇచ్చంపల్లికి అంగీకరించేదే లేదు
- కేంద్రానికి తేల్చిచెప్పిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరి నదుల అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల్లో 74 టీఎంసీలను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. గోదావరి–కావేరి అనుసంధానంపై తెలంగాణ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి వీలుగా గురువారం జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్ విభాగం చీఫ్ ఇంజనీర్ దేవేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ ఈఎన్సీ (ఓఅండ్‌ఎం) బి. నాగేంద్రరావు, అంతర్రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్ కుమార్, ఎస్ఈ కోటేశ్వరరావు, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, కృష్ణా బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. విజయకుమార్లు హాజరయ్యారు. గోదావరి–కావేరి అనుసంధానంలో తెలంగాణకు 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారని, అయితే పూర్వ నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాగునీటి లభ్యత లేదని, ఆ ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉందని... దీనికోసం 45 టీఎంసీలు సరిపోవని, వాటిని 74 టీఎంసీలకు చేర్చాలని కోరింది. ఇక రెండో దశలో 530 టీఎంసీలను గోదావరి–కావేరి అనుసంధానంలో తరలించనున్నందున అందులో 175 టీఎంసీలైనా కేటాయించాలని పట్టుబట్టింది. ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ కడితే అది మరో బాబ్లీలాగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం)లో నీటిని నిల్వ చేస్తే వెనుకవైపు 12 కి.మీ. దాకా నీళ్లుంటాయని.. అందులో 8వ కిలోమీటర్‌పై ఇచ్చంపల్లిని ప్రతిపాదించారని గుర్తుచేసింది. ఇక ఇచ్చంపల్లి బ్యారేజీ కట్టి 87 మీటర్ల మేర నీటిని నిల్వ చేస్తే ఆ నీరు మేడిగడ్డ బ్యారేజీ దాకా ఉండే అవకాశం ఉందని... దీనివల్ల మేడిగడ్డ నుంచి విడుదలయ్యే నీటి ప్రవాహానికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని తెలంగాణ పేర్కొంది. మేడిగడ్డ నుంచి సీతమ్మసాగర్ దాకా లైడార్ సర్వే చేయించామని గుర్తుచేయగా ఆ ఫలితాలు ఇవ్వాలని ఎన్‌డబ్ల్యూడీఏ కోరింది. అయితే ఆ వివరాలు ఇవ్వడానికి సిద్ధమేనని, కానీ మేడిగడ్డ వద్ద స్టిమ్యులేషన్ అధ్యయనం చేయాలని తెలంగాణ కోరింది. ఇక గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) నుంచే నీటిని తరలించాలని... 83 మీటర్లపైన వచ్చే నీటిని గోదావరి–కావేరి అనుసంధానంలో మళ్లించడానికి అభ్యంతరాలేమీ లేవని తెలిపింది. తెలంగాణ అభ్యంతరాలపై మళ్లీ సమావేశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. అనుమానాలన్నీ నివృత్తి చేశాకే నదుల అనుసంధానంలో ముందుకెళతామని హామీ ఇచ్చింది.

ఉమ్మడి ప్రాజెక్టులు బోర్డు నియంత్రణలోకి..

▶ మొదటి పేజీ తరువాయి

కాంపొనెంట్ (విభాగం) వద్ద తెలంగాణ నుంచి ఒకరు, ఏపీ నుంచి మరొక ఉద్యోగిని పెట్టాలని నిర్ణయించారు. జలవిద్యుత్ కేంద్రాలు మినహా మిగిలిన 10 ఔట్‌లెట్లు (శ్రీశైలం ప్రాజెక్టు స్పిల్‌వేతోపాటు రివర్ స్లూయిస్, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్, నాగార్జునసాగర్ ఫ్లడ్ కెనాల్–హెడ్ రెగ్యులేటర్–పరిసరాలు, ఏఎంఆర్ ఎత్తిపోతల పథకం– పంప్‌హౌస్ పరిసరాలు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేతోపాటు రివర్, చూట్ స్లూయిస్, నాగార్జునసాగర్ రైట్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్)లను బోర్డు నియంత్రణలోకి తీసుకెళ్లడానికి ఇరువురు ఈఎన్సీలు అంగీకారం తెలిపారు. ఇరు రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు కూడా 10 కాంపోనెంట్ల వద్ద మూడేసీ షిఫ్టులు (ఒక్కో షిఫ్టు 8 గం ఉండేలా ఇరు 30 మంది చొప్పున బోర్డు నియంత్రణలో పనిచేయడానికి అంగీకరించారు. అయితే నీటి విడుదల మాత్రం బోర్డుకు చెందిన త్రిసభ్య కమిటీ (బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయిపూరే, తెలంగాణ ఈఎన్సీ సి. మురళీధర్, ఏపీ ఈఎన్సీ సి.నారాయణరెడ్డి)ల నేతృత్వంలోని కమిటీ నిర్ణయం మేరకు జరుగుతుందనే అంగీకారం ఇరువురి మధ్య కుదిరింది. అయితే నాగార్జునసాగర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనులు తెలంగాణ, శ్రీశైలం పనులను ఏపీ చేపట్టాలని నిర్ణయించారు.

గంటన్నరపాటు సమావేశం...

కేఆర్ఎంబీ చైర్మన్ శివనందన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్, అంతర్రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్ కుమార్, నాగార్జున సాగర్ చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, కృష్ణా బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.విజయకుమార్లు హాజరవగా ఏపీ నుంచి ఆ రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్సీ సి. నారాయణరెడ్డితోపాటు ఆ రాష్ట్ర అధికారులు హాజరయ్యారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించాలని తాము సమ్మతించినట్లు ఈ సమావేశం అనంతరం ఇరు రాష్ట్రాల ఈఎన్సీలు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వెల్లడించారు.



సమావేశ అనంతరం బయటికి వస్తున్న మురళీధర్ తదితరులు

అప్పటిదాకా అప్పగింత కుదరదు...

ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతపై మీడియాలో వార్తలు రావడంతో తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా రంగంలోకి దిగారు. నీటి వాటాలు తేలేదాకా, శ్రీశైలం, సాగర్ ఆపరేషనల్ ప్రొటోకాల్స్‌పై స్పష్టత వచ్చేదాకా ప్రాజెక్టులను అప్పగించేది లేదంటూ తేల్చిచెప్పారు. దీనిపై జనవరి 27న కేంద్ర జలశక్తి శాఖకు రాసిన లేఖను బహిర్గతం చేశారు. కేంద్ర జలశక్తి శాఖ జనవరి 17న ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ప్రాజెక్టుల అప్పగింతకు తెలంగాణ అంగీకరించకున్నా అంగీకరించినట్లు పేర్కొంటూ మినిట్స్ విడుదల చేసిందని ఆ లేఖలో ఆయన ఆరోపించారు. ఆ సమావేశంలో తాము లేవనెత్తిన పలు అంశాలను మినిట్స్‌లో పేర్కొనలేదని గుర్తుచేశారు. ఆ మినిట్స్‌ను సవరించాలని లేఖలో కోరారు. మరోవైపు కృష్ణా బోర్డు సమావేశం ముగిసిన వెంటనే ప్రాజెక్టుల అప్పగింతకు సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు.

తొలుత భేటీకి వెళ్లరాదనుకొని...

అసలు కృష్ణా బోర్డు సమావేశాలకు హాజరు కాకూడదని అధికారులు తొలుత భావించినప్పటికీ తెలంగాణ అభిప్రాయాలను స్పష్టంగా బోర్డుకు చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు స్వయంగా హాజరయ్యారు. అయితే లేఖకు కట్టుబడే ఉండాలని సమావేశంలో తెలంగాణ భావించగా తద్విరుద్ధంగా పరిణామాలు చోటుచేసుకున్నాయి. సాగర్ పరిధిలో మొత్తం 8 కాంపోనెంట్లు ఉండగా అందులో 7 తెలంగాణ అధీనంలో ఉన్నాయి. వాటిలో ఐదింటిని అప్పగించడానికి, శ్రీశైలం పరిధిలో 7 కాంపోనెంట్లు ఉండగా అందులో తెలంగాణ అధీనంలో ఉన్న కాంపోనెంట్‌ను అప్పగించడానికి నిర్ణయం తీసుకున్నట్లు సమావేశం అనంతరం ఈఎన్సీ (జనరల్) సి. మురళీధర్ ప్రకటన చేశారు. దాంతో విస్తుపోవడం తోటి అధికారుల వంతైంది. ఈ విషయం ప్రసార, సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నష్టనివారణ చర్యల్లో భాగంగా జనవరి 27న కేంద్ర జలశక్తి శాఖకు రాసిన లేఖను నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా మీడియాకు విడుదల చేశారు. దాంతో అధికారులు ముక్కున వేలేసుకున్నారు. ఈఎన్సీ ఒకదారిలో నడుస్తుండగా నీటిపారుదల శాఖ కార్యదర్శి మరోదారిలో నడుస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

ప్రజలను ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోంది

- తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించడం ఇలాగేనా?
- కృష్ణా బోర్డు ప్రాజెక్టుల అప్పగింతపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



సాక్షి, హైదరాబాద్: కృష్ణాబోర్డుకు ప్రాజెక్టులను అప్పగించడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి గందరగోళంలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల స్వాధీనం అంశానికి సంబంధించి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పలుమార్లు ప్రస్తావించిన అంశాలనే పేర్కొంటూ 27వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఇవాళ ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణా బోర్డుకు అప్పగిస్తున్నట్లు రెండు రాష్ట్రాల ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు మీడియా ముందు ప్రకటించారు. 27వ తేదీ లేఖ ప్రామాణికమా? ఇవాల్టి మీటింగ్‌లో అంగీకారం ప్రామాణికమా? ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను పూర్తిగా తప్పుదోవ పట్టిస్తోంది. 'కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించేందుకు అంగీకరించారని తాను చెబితే.. హరీశ్‌రావు వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు' అని వారంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షిస్తామని గొప్పగా చెప్పిన ప్రభుత్వం ఈరోజు ఎందుకు ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇక నుంచి చుక్క నీరు తీసుకోవాలన్నా కృష్ణా బోర్డు అనుమతి తప్పనిసరి అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 'వేసవిలో తాగునీటి కోసం నీరు తీసుకునే అధికారం రాష్ట్రానికి ఉంటుందా? జలవిద్యుత్ హౌజ్‌ల గురించి చర్చ లేదని చెప్పున్నారు కానీ, నీరు లేకుండా విద్యుత్ ఎలా వస్తుంది? బోర్డు అనుమతి లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేయడం సాధ్యమా?' అని హరీశ్‌రావు నిలదీశారు. శనివారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారని, ఇవాళ ఈఎన్సీ కృష్ణా బోర్డు మీటింగ్‌కు వెళ్లి ప్రాజెక్టుల నిర్వహణ బోర్డుకు అప్పగించేందుకు అంగీకరించి వచ్చారని ఆయన దుయ్యబట్టారు. 2021లో కేంద్రం గెజిట్ ఇచ్చి ఒత్తిడి తీసుకొచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు ఇచ్చేందుకు అంగీకరించలేదని హరీశ్ గుర్తు చేశారు.

టీవీ5 సాంబశివరావుపై చీటింగ్ కేసు

- ఫోర్జరీ సంతకాలతో మాదాపూర్‌లో పెట్రోల్ బంక్‌కు స్థలం లీజు

గచ్చిబౌలి: టీవీ 5 వైస్ ప్రెసిడెంట్ సాంబశివరావుపై చీటింగ్ కేసు నమోదైంది. ఫోర్జరీ సంతకాలతో యజమాని ప్రమేయం లేకుండా స్థలాన్ని హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌కు లీజుకు ఇచ్చారని సాంబశివరావుతోపాటు మరికొందరిపై మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సరనాల శ్రీధర్ ఫిర్యాదులో పేర్కొన వివరాల ప్రకారం..''నా భార్య పేరు మీద మాదాపూర్‌లో సర్వే నంబరు 64 పరిధిలోకి వచ్చే హుడా టెక్నో ఎన్‌క్లేవ్‌లోని సెక్టార్–3లోని ప్లాట్ నంబరు–26లో 600 చదరపు మీటర్ల (717.60 చదరపు గజాలు) స్థలం ఉంది. 2018లో సాంబశివరావు తమను కలిసి, ఆయిల్ సంస్థలతో మంచి సత్సంబంధాలు ఉన్నాయని, తనకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చాలా పెట్రోల్ బంక్‌లు నిర్వహిస్తున్నట్టు నమ్మించాడు. హెచ్‌పీసీఎల్‌లో డీజీఎం స్థాయి హోదాలో ఉన్న తన స్నేహితుడు టి.రాజేశ్‌తో కలిసి తనకు హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ డీలర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించి మోసం చేశాడు. ఏళ్లు గడిచినా వారిద్దరూ మాట నిలబెట్టుకోలేదు. తమకు తెలియకుండా పెట్రోల్ బంక్ డీలర్‌షిప్‌ను డాక్టర్ కొల్లి సౌమ్య పేరు మీదకు బదలాయించారు. డాక్టర్ కొల్లి సౌమ్య, సాంబశివరావు, హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు తమ స్థలంలో పెట్రోల్ బంక్ నడుపు



తున్నట్టు లెటర్ అందింది. దీంతో షాక్‌కు గురై 2021లో సాంబశివరావును ప్రశ్నిస్తే..ఈ డీలర్‌షిప్ ఒప్పందానికి ఒప్పుకోవాలని బెదిరింపులకు గురిచేశాడు. లేకపోతే ఇతర బంకులు, డీలర్‌షిప్‌లు ఇబ్బందుల్లో పెడతానంటూ రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, పోలీసు అధికారులతో తనకున్న పరిచయాలతో బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో భయభ్రాంతులకు గురైన తాము ఆ డీలర్‌షిప్‌ను తమ పేరు మీదకు బదలాయించాలని కోరాం. దీంతో కొంత నగదు చెల్లిస్తే డీలర్‌షిప్‌ను బదలాయిస్తానని చెప్పారు. దీంతో వేరే దారిలేక 2021, మార్చిలో రూ.లక్షల్లో నగదు బదలాయించాం. కానీ, డీలర్‌షిప్‌ను బదలాయించకుండా, కాలం గడిచినా స్పందన లేకపోవడంతో ఉద్దేశపూర్వకంగానే 30 ఏళ్ల పాటు కబ్జా చేయాలని పథకం వేశారు. మరోవైపు హెచ్‌పీసీఎల్ ప్రతినిధులను సంప్రదించి పెట్రోల్ బంక్‌కు సంబంధించి ల్యాండ్ రికార్డులను పరిశీలించగా.. స్థల యజమానితో ఎలాంటి లీజు ఒప్పందాలు, అద్దె ఒప్పందాలు లేకుండా ఇప్పటి



లీజు వివాదం నెలకొన్న మాదాపూర్‌లోని హిందుస్తాన్ పెట్రోల్ బంక్ ఇదే

వరకు అద్దె చెల్లించకుండా ఫోర్జరీ సంతకాలతో సాంబశివరావు అతని బృందం స్థలాన్ని లీజుకు ఇచ్చినట్టు తెలిసిందని''జనవరి 31న సాయంత్రం మాదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీగా రెమా రాజేశ్వరి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళా భద్రత విభాగం డీఐజీగా 2009 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి రెమా రాజేశ్వరిని నియమిస్తూ డీజీపీ రవిగుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రామగుండం సీపీగా విధులు నిర్వర్తిస్తున్న రెమా రాజేశ్వరిని ఆ బాధ్యతలను మల్టీజోన్–2 ఐజీ డాక్టర్ తరుణ్‌జోషికి అప్పగించి నూతన విధుల్లో చేరాలని సూచించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు రామగుండం సీపీగా తరుణ్‌జోషికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు డీజీపీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.

సాక్షి కరీంనగర్

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



పత్తి ధర రూ.6,600

జమ్మికుంట: స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో గురువారం క్వింటాల్ పత్తి గరిష్ట ధర రూ.6,600, మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.6,000 పలికింది.



రాజన్నకు భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను గురువారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/19.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రతీ నియోజకవర్గానికి రూ.10 కోట్లు

సాక్షి,పెద్దపల్లి: ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆమోదంతో అభివృద్ధి పనులు చేపట్టాలని సదరు జీవోలో పేర్కొంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాలకుగాను ఒక్కోదానికి రూ.10 కోట్ల చొప్పున మొత్తం 130 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ప్రతీ అసెంబ్లీ పరిధిలో రూ.2 కోట్లు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం, రూ.కోటి మంచి నీటి వసతి కల్పించేందుకు, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ ఖర్చులకు రూ.50 లక్షలు ఖర్చు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

పూలే విగ్రహ ఏర్పాటుకు తీర్మానం చేయాలి



జెడ్పీ చైర్‌పర్సన్ విజయకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసేలా జెడ్పీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు వరాల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయకు వినతిపత్రం అందించారు. బహుజనుల ఆశాజ్యోతి పూలే అణగారిన వర్గాల కోసం చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే మహనీయులను స్మరించుకున్న వారమవుతామని పేర్కొన్నారు. నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, జాడి శ్రీనివాస్, ఉయ్యాల విష్ణువర్దన్, సత్తు సంతోష్ ఉన్నారు.

కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు పొడిగింపు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్లు, డీజేల వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలను ఈ నెల 29 వరకు పొడిగిస్తున్నట్లు సీపీ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత ఏసీపీల అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించొద్దని ఆయన పేర్కొన్నారు.

ట్రాన్స్‌పోర్టు యూనియన్ సమ్మె నోటీసు



కరీంనగర్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16న అఖిల భారత సమ్మెతోపాటు గ్రామీణ భారత్ బంద్ పాటించాలని నిర్ణయించారు. గురువారం తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ సామ్యుల్‌జాన్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, ఆల్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడారు. రవాణా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, హిట్ అండ్ రన్ (106)(1)(2) రద్దు చేయాలని, ఎంవీ యాక్ట్ -2019 చట్ట సవరణ చేయాలని, ప్రభుత్వమే ఆన్‌లైన్ యాప్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. 3 నెలలపాటు ఆటోల మీద ఈఎంఐ మారటోరియం ప్రకటించాలని, ప్రమాద బీమా రూ.5 లక్షలు వర్తింపజేయాలన్నారు. ఆటో డ్రైవర్ల ఇన్సూరెన్స్ ప్రభుత్వమే భరించాలని, జీవన భృతి నెలకు రూ.4,500 కోరారు. నాయకులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఇందిరాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 10.30 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు. మిగతా వివరాలకు 94400 20690, 76749 15262, 81067 64653 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యువర్ అటెన్షన్ ప్లీజ్..



ఉమ్మడి జిల్లాకు కేటాయింపులు ఇలా..

కొత్తపల్లి- మనోహరాబాద్ (148.9 కిమీ) : రూ.350 కోట్లు

కాజీపేట- బల్లార్షా మూడోలైన్ : రూ.300 కోట్లు

బల్లార్షా-రామగుండం ఎలక్ట్రిక్ అప్‌గ్రేడేషన్ : రూ.18.43 కోట్లు

మణుగూరు-రామగుండం (200 కి.మీ) : రూ.5 కోట్లు

మందమర్రి-రాఘవాపురం : రూ.5 లక్షలు

రాఘవాపురం-రామగుండం (ఆర్వోబీ): రూ.10,000

పెద్దపల్లి-కరీంనగర్-నిజామాబాద్ (177 కి.మీ): రూ.1000

పెద్దపల్లి బైపాస్-కరీంనగర్ లైన్ (2.169 కి.మీ)

కనెక్ట్ బల్లార్షా- కాజీపేట మెయిన్‌లైన్ : రూ.1000

కొలనూరు- పెద్దపల్లి-ఆర్వోబీ: రూ.10,000

రైల్వేకు పెద్దపీట

ఉమ్మడి జిల్లాకు రూ.673.43 కోట్లు

- గతేడాది రూ.647 కోట్లు
- మనోహరాబాద్-కొత్తపల్లికి రూ.350 కోట్లు
- కాజీపేట-బల్లార్షా మూడోలైన్‌కు రూ.300 కోట్లు
- మణుగూరు-రామగుండం కోల్‌కారిడార్ లైన్‌కు రూ.5 కోట్లు
- ఊసేలేని తిరుపతికి అదనపు సర్వీసులు
- పెద్దపల్లి-నిజామాబాద్ డబ్లింగ్‌కు కలగని మోక్షం

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

కేంద్రం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం పెరిగింది. గతేడాది కేటాయించిన రూ.647 కోట్ల కంటే స్వల్పంగా పెంచింది. రూ.673.43 కోట్లు కేటాయించింది. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌కు పెద్దపీట వేసింది. గతేడాది రూ.185 కోట్లు కేటా యించగా ఈసారి ఏకంగా రూ.350 కోట్లు కేటాయించడం, కాజీపేట-బల్లార్షా మూడోలైన్ కోసం రూ.300 కోట్లు ఇస్తామని ప్రకటించడం విశేషం.

కొత్తపల్లి-మనోహరాబాద్‌కు రూ.350 కోట్లు

ఉమ్మడి జిల్లా వాసులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ పనుల కోసం కేంద్రం రూ.350 కోట్లు కేటాయించింది. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.112 కోట్ల వరకు వెచ్చించాలి. గతేడాది రూ.185 కోట్లను మాత్రమే కేటాయించడం గమనార్హం. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని 2016లో కేంద్రాన్ని ఒప్పించింది. రూ.1,167 అంచనా వ్యయంతో ప్రారంభించి ఇప్పటి వరకూ మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు లైన్ పూయి, రైలుసేవలు అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 151 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గం ఇప్పటి వరకూ 75 కి.మీ పూర్తయింది. ప్రస్తుతం సిరిసిల్ల-సిద్దిపేట(37 కి.మీ) భూసేకరణలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఈ నిధులతో సమసిపోనున్నాయి.

కాజీపేట-బల్లార్షా మూడోలైన్ రూ.300 కోట్లు

కాజీపేట-బల్లార్షా మూడోలైన్‌కు రూ.300 కోట్లు కేటాయించింది. గతేడాది రూ.450 కోట్లు కేటాయించిన కేంద్రం ఈసారి పనులు పూర్తవుతున్న నేపథ్యంలో రూ.300 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే ఈ మార్గంలో మూడు లైన్లలోనూ రైళ్లు తిరుగుతుండడం విశేషం.

రామగుండం-మణుగూరుకు రూ.5 కోట్లే

కోల్‌కారిడార్‌గా పిలుస్తోన్న రామగుండం(రాఘవాపురం)-మణుగూరు రైల్వేలైన్‌కు ఈసారి నిధులు తగ్గాయి. రామగుండం- మణుగూరు మధ్య ప్రస్తుతం ఉన్న 290 కి.మీలను 200 కి.మీలకు తగ్గించేందుకు భూపాల్లి మీదుగా వేస్తున్న ఈలైన్ అంచనా విలువ రూ.3వేల కోట్లు. 2022 డిసెంబరులో ఈ మార్గానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఎంతో ఆర్థిక ప్రాముఖ్యత ఉన్న ఈలైన్‌కు ఇంత తక్కువ కేటాయించడం తీవ్ర నిరాశకు గురిచేసింది.

పెద్దపల్లి బైపాస్‌కు..

పెద్దపల్లి-కరీంనగర్ మార్గాన్ని కాజీపేట-బల్లార్షా మార్గంతో కలుపుతున్న పెద్దపల్లి బైపాస్‌లైన్‌కు రూ.1000 కేటాయించారు. ఈ మార్గంలో పనులు వేగిరమైనప్పటికీ భూసేకరణ, స్టేషన్ నిర్మాణ పనులు ఇప్పటికే ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో రూ.1000 కేటాయించడం గమనార్హం.

ఊసేలేనివి ఇవే..

డిమాండ్ ఉన్న కరీంనగర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల పెంపుపై కేంద్రం ఎలాంటి ప్రకటన చేయకపోవడం నిరాశకు గురిచేసింది. వాస్తవానికి ఈ రైళ్లలో కోచ్‌లు సరిపోక కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, మంచిర్యాల, మందమర్రి నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లి-నిజామాబాద్ డబ్లింగ్ పనులకు బడ్జెట్‌లో చోటు దక్కకపోవడం గమనార్హం.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన.. - IIలో▸

ఉత్తుత్తి బడ్జెట్



కేంద్రం బడ్జెట్ కేటాయింపులు అంతా ఎన్నికల జిమ్మిక్. ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేవు. కాంగ్రెస్ హయాంలో నేను తెచ్చిన తిరుపతి రైలు కనీసం సర్వీసులు కూడా పెంచలేదు. మణుగూరు - రామగుండం కోల్ కారిడార్ కు రూ. 5 కోట్లు ఇవ్వడం ఏంటి? ఇలా అయితే ఈ ప్రాజెక్టులు ఎన్నడు పూర్తవుతాయి? ఇదంతా ఉత్తుత్తి బడ్జెట్. - పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి

త్వరలో తిరుపతి రైళ్లపై..



గతేడాది కంటే ఈసారి దాదాపు రూ.30 కోట్ల బడ్జెట్ పెరిగింది. ఉమ్మడి జిల్లాకు కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనం. తిరుపతి రైళ్ల విషయంలో త్వరలో ప్రకటన చేయిస్తాం. అమృత్ పథకం కింద కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లను ఆధునికీకరిస్తున్నాం. జిల్లాకు నిధులు పెంచడంలో కీలకంగా వ్యవహరించిన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు కృతజ్ఞతలు. - బండి సంజయ్, ఎంపీ

అందుబాటులోకి తేవాలి



మనోహరాబాద్-కొత్తపల్లి పనులను నేను ఎంపీగా ఉన్న సమయంలో ప్రారంభించాం. ఈసారి రూ.350 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. ఉమ్మడి జిల్లా వాసులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టును మేం సిద్దిపేట వరకు తీసుకొచ్చాం. ఒప్పందం ప్రకారం 2025 డిసెంబరు నాటికి కరీంనగర్ వరకు అందుబాటులోకి తేవాలి. - వినోద్, మాజీ ఎంపీ

అక్రమ మైనింగ్‌పై కొరడా

- అదనంగా తవ్విన ఐదు క్వారీలకు రూ.6.11 కోట్లు..
- ఖనిజ రవాణా వాహనాలకు రూ.5.12 లక్షల జరిమానా
- త్వరలో మరిన్ని దాడులు?

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



అక్రమ మైనింగ్‌పై జిల్లా మైనింగ్ శాఖ కొరడా ఝుళిపించింది. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ చేసిన ఐదు క్వారీలకు ఏకంగా రూ.6.11 కోట్ల జరిమానా విధించి షాకిచ్చింది. చాలారోజుల తర్వాత పలు క్వారీల్లో జరుగుతున్న తవ్వకాలపై దాడులు చేసింది. ఈ సందర్భంగా హుజూరాబాద్‌లోని రంగాపురంలో రెండు, తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి, తిమ్మాపూర్‌లోని మరో రెండు గ్రానైట్ క్వారీల్లో జిల్లా మైనింగ్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమతి పొందిన దాని కంటే అధికంగా తవ్వుకున్నట్లు గుర్తించారు. తెలంగాణ స్టేట్ మైనిగ్ అండ్ మినరల్ కన్సెషన్ (టీఎస్ ఎంఎంసీ) నిబంధనల ప్రకారం.. ఈ ఐదు క్వారీలకు సీనరేజీ చార్జీల కింద దాదాపు రూ.61 లక్షల వరకు జరిమానా విధించారు. నిబంధనల మేరకు పదింతల జరిమానా కలిపి, రూ.6.11 కోట్లుగా నిర్ధారించారు. అలాగే, ఖనిజ రవాణాలో అక్రమాలకు పాల్పడిన వాహనాలకూ రూ.5.12 లక్షలు ఫైన్ వేశారు. త్వరలో జిల్లా పరిధిలోని మరిన్ని గ్రానైట్ క్వారీలు, అక్రమంగా నడుస్తున్న ఇసుక క్వారీలపై దాడులు చేయనున్నారని సమాచారం. హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు క్వారీలపై ప్రత్యేక దృష్టి సారించారు. తవ్విన ఖనిజంతోపాటు ఎగుమతులు, రవాణా తదితర అంశాలపై క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నట్లు తెలిసింది.

‘బ్యూరోక్రసీ’ జాబితాలో మన కలెక్టర్



కరీంనగర్ అర్బన్: ప్రజాసేవలో తనదైన ముద్ర వేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతికి అరుదైన గౌరవం దక్కింది. పరిపాలనలో నిక్కచ్చిగా వ్యవహరించే మహిళా ఐఏఎస్‌లను గుర్తిస్తూ ఉమెన్ కాటలిస్ట్స్–2023 ఆధ్వర్యంలో టాప్ ఉమెన్ పెర్ఫార్మర్స్ ఆఫ్ ఇండియన్ బ్యూరోక్రసీ పేరిట జాబితా విడుదల చేశారు. ఇందులో మన రాష్ట్రం నుంచి ముగ్గురికి చోటు దక్కగా వారిలో కలెక్టర్ పమేలా సత్పతి ఒకరు. విధుల్లో పరిపూర్ణంగా సేవలందిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా సునాబెడ ప్రాంతానికి చెందిన ఆమె 28 ఏళ్ల వయసులో నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. కలెక్టర్‌గా యాదాద్రి భువనగిరి జిల్లాలో పని చేయగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు వచ్చారు. ప్రభుత్వ నిబంధనలను పక్కాగా అమలు చేస్తూ ఒత్తిడులకు లొంగరనే పేరుంది. పథకాలను క్షేత్రస్థాయికి చేర్చేందుకు పర్యటనలు చేస్తూ అధికారులను పరుగులు పెట్టిస్తారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేశారు. థర్డ్ జెండర్లతో ప్రత్యేకంగా సమావేశమై, వంద శాతం పోలింగ్ జరిగేలా కృషి చేశారు.

ఇక, పరిపాలనలో ముక్కుసూటిగా వ్యవహరించడం ఆమె ప్రత్యేకత. ఇటీవల నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బొకేలకు, శాలువాలకు బదులు నోట్‌బుక్స్, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్‌లు వంటివి తీసుకురావాలని సూచించగా కుప్పలు తెప్పలుగా వచ్చాయి. వాటిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. అంతేకాదు, గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన స్మితాసబర్వాల్ కూడా ఈ జాబితాలో ఉన్నారు.

పోలీసు కస్టడీకి కార్పొరేటర్ సాగర్

- కీలక డాక్యుమెంట్లు స్వాధీనం?



కరీంనగర్‌క్రైం: భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొని, అరెస్టయి, రిమాండ్‌లో ఉన్న కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను మరింత లోతుగా విచారించేందుకు పోలీసులు గురువారం కస్టడీకి తీసుకున్నారు. సాగర్‌పై నమోదు చేసిన కేసులకు సంబంధించి మరింత సమాచారం సేకరించేందుకు కరీంనగర్ సీతారాంపూర్‌లో గల ఆయన ఇంట్లో రూరల్ పోలీసులు సోదాలు చేసి, పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ప్రజలను బెదిరింపులకు గురిచేస్తూ భూకబ్జాలకు పాల్పడుతున్నాడని కొత్తపల్లి ఎస్సై చంద్రశేఖర్ అభ్యర్థన మేరకు సాగర్‌పై కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు రౌడీషీట్ తెరిచిన విషయం విధితమే. ఆయనను శుక్రవారం ఉదయం వరకు కస్టడీలోనే ఉంచనున్నట్లు తెలిసింది.

నేటి నుంచి ‘ప్రత్యేక’ పాలన

- ముగిసిన సర్పంచుల పదవీకాలం
- ఆదాయ పంచాయతీల కోసం జోరుగా పైరవీలు!
- కీలక గ్రామాలను తహసీల్దార్లకు అప్పగించారన్న ఆరోపణలు
- జిల్లాలో 313 గ్రామాలు



పోచంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

కరీంనగర్: గ్రామ పంచాయతీల్లో ఇక ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. సర్పంచుల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల బాధ్యతలను జిల్లా, మండల స్థాయి అధికారులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ జిల్లాలో 313 గ్రామాలు ఉండగా పెద్ద, మండల కేంద్ర పంచాయతీలకు జిల్లాస్థాయి అధికారులను, చిన్న గ్రామాలకు తహసీల్దార్లు, సూపరింటెండెంట్ స్థాయి అధికారులను నియమించాలని ఆదేశించింది. అయితే, జిల్లాలో ఇసుక, గ్రానైట్, మట్టి, ఇతర ఆదాయ వనరులు, స్టాంపు డ్యూటీతో ఎక్కువగా ఆదాయం వచ్చే పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాల్లో జోరుగా పైరవీలు జరిగాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆదాయం అధికంగా ఉన్న పంచాయతీల బాధ్యతలను తహసీల్దార్లకే అప్పగించారనే విమర్శలున్నాయి. పలుకుబడి ఉన్న పాత సర్పంచులు తమకు అనుకూలంగా ఉండే అధికారులను నియమించుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయన్న పుకార్లు గుప్పుమంటున్నాయి.

ఒకరోజు ముందైనా విడుదలవని జాబితా

శుక్రవారం వరకు అధికారులను నియమించాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ, ఒకరోజు ముందైనా సంబంధిత జాబితా విడుదల కాలేదు. పైరవీల కోసమే ఇలా చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గురువారంతో ముగియగా ఇప్పటికే చాలా గ్రామాల్లో కార్యదర్శులు సర్పంచుల నుంచి పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని గ్రామాల్లో సర్పంచులకు వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేసి, సన్మానించారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

ప్రభుత్వం తమకు రావలసిన బిల్లులను వెంటనే చెల్లించాలని సర్పంచులు పలుమార్లు కోరినప్పటికీ గత ప్రభుత్వం ఇవ్వలేదు. మరోవైపు 2020, 2021 సంవత్సరాల్లో కోవిడ్–19 కారణంగా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేక పోయామని, తమ పదవీకాలాన్ని రెండేళ్లు పెంచాలని లేదా పర్సన్ ఇన్‌చార్జీలుగా తమకే బాధ్యతలు అప్పగించాలని కొత్త ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలో భాగంగానే సర్పంచుల పదవీకాలం ముగిశాక ప్రత్యేకాధికారుల పాలనను అమలులోకి తెచ్చిందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి అభివృద్ధి పనులు ముందుకు సాగలేదు. అలాగే, తమ పదవీకాలం ముగియనుందని సర్పంచులు సమస్యలపై, అభివృద్ధిపై పెద్దగా దృష్టిపెట్టక పోవడంతో అనేక గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారుల పాలనలోనైనా పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నారు. ఇక, తమ పెండింగ్ బిల్లులను ఇవ్వాలని సర్పంచులు, కాంట్రాక్టర్లు కోరుతున్నారు. ఇటు నిధులలేమి, అటు పాత సర్పంచుల సహాయ నిరాకరణ నేపథ్యంలో గ్రామ కార్యదర్శి, ప్రత్యేకాధికారికి జాయింట్ చెక్‌పవర్ కల్పించి, గ్రామాభివృద్ధి కోసం నిధుల వ్యయం ఎలా చేస్తారో వేచిచూడాలి.

పోల్ క్లైంబింగ్ టెస్ట్‌లో 23 మంది పాస్



స్తంభం ఎక్కిన అభ్యర్థి

కొత్తపల్లి(కరీంనగర్): జూనియర్ లైన్ మెన్(జేఎల్ఎం) పోస్టుల భర్తీకి కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో గురువారం అభ్యర్థులకు నాలుగో విడత పోల్ క్లైంబింగ్ టెస్ట్ (స్తంభం ఎక్కే పరీక్ష) నిర్వహించారు. రాత పరీక్షలో అర్హత సాధించిన 52 మంది ఈ పరీక్ష జరిపారు. వీరిలో 23 మంది అర్హత సాధించగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. వరంగల్ నుంచి వచ్చిన సీజీఎం(హెచ్‌ఆర్‌డీ) ప్రభాకర్ పరిశీలకులుగా, కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్ చైర్మన్‌గా, బండారి చంద్రయ్య కన్వీనర్‌గా, డీఈలు విజయేందర్‌రెడ్డి, ఈశ్వరప్రసాద్ సభ్యులుగా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం వారిచే హామీ తీసుకొని, స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించారు. ఒక్కో అభ్యర్థి రెండు నిమిషాల్లో పోల్ ఎక్కి దిగితేనే అర్హులుగా ప్రకటించారు. మిగతావారిని అనర్హులుగా తేల్చేశారు. ఈ టెస్ట్‌ను వీడియో రికార్డింగ్ చేశారు. జాబితాను వరంగల్‌లోని కార్పొరేట్ ఆఫీస్‌కు పంపించారు. కార్పొరేట్ ఆఫీస్ స్థాయిలో జేఎల్ఎంల నియామకం జరగనుంది.

ముగిసిన జేఈఈ మెయిన్



పరీక్ష హాల్లోకి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్): మొదటి విడత జేఈఈ మెయిన్ పరీక్షలు జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఉమెన్స్, వివేకానంద, వాణినికేతన్ డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సిటీ కో–ఆర్డినేటర్ లలితకుమారి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. అయాన్ డిజిటల్ సెంటర్‌లో ఉదయం 680 మంది విద్యార్థులకు గానూ 667 మంది, మధ్యాహ్నం 680 మందికి 657 మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య కళాశాలలో ఉదయం 200 మందికి 194 మంది, మధ్యాహ్నం 200 మందికి 192 మంది వచ్చారు. అల్ఫోర్స్ కళాశాలలో ఉదయం 125 మందికి 121 మంది, మధ్యాహ్నం 125 మందికి 122 మంది హాజరయ్యారు. వివేకానంద కళాశాలలో ఉదయం 53 మందికి 49 మంది, మధ్యాహ్నం 22 మందికి 22 మంది పరీక్ష రాశారు. వాణినికేతన్ కళాశాలలో ఉదయం 109 మందికి 103 మంది, మధ్యాహ్నం 109 మందికి 106 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీ చేశారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి టగ్‌ఆఫ్‌ వార్‌ పోటీలకు అల్ఫోర్స్‌ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ ఈ టెక్నో స్కూల్‌ విద్యార్థులు ఎస్‌జీఎఫ్‌ రాష్ట్ర స్థాయి టగ్‌ ఆఫ్‌ వార్‌ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్‌ చైర్మన్‌ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. మానకొండూర్‌ మండలం చెంజర్లలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్‌ జోనల్‌ స్థాయి టగ్‌ ఆఫ్‌ వార్‌ పోటీల్లో పాఠశాలకు చెందిన స్మరణి, వి.ఆర్యన్‌ (9వ తరగతి) ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయిలో సైతం సత్తాచాటాలని ఆకాంక్షించారు.

జాతీయస్థాయి పతకాలు సాధించిన అచీవర్స్‌ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వెంకటేశ్వర్లు, పల్లవి

కరీంనగర్‌: జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్‌లో గల అచీవర్స్‌ ఆక్టివ్‌ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో జరిగిన లీడ్‌ ఐఐటీ, నీట్‌ ఫౌండేషన్‌ ఎంవోపై పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభచాటారు. ఎస్‌.మేఘన ప్రదీప్తి (9వ తరగతి), ఎం.ఐశ్వర్య (8వ తరగతి), ఎస్‌.ప్రణీత్‌సిద్ధార్థ్‌ (7వ తరగతి), పి.శ్రీనిధి, కె.అవినాష్‌ (6వ తరగతి) బంగారు పతకాలు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్‌ సీహెచ్‌ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ పల్లవి అభినందించారు.

రేపు జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్‌ టెస్ట్‌

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 3న కరీంనగర్‌లోని రత్నం గ్లోబల్‌ హైస్కూల్‌లో జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్‌ టెస్ట్‌ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆర్‌.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 63047 04413 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురికి కరీంనగర్‌ మున్సిఫ్‌ కోర్టు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ నర్సింహ్ తెలిపారు. నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 28 మందిని కరీంనగర్‌ ట్రాఫిక్‌ పోలీసులు గురువారం కరీంనగర్‌ మున్సిఫ్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపరిచారు. ఇందులో ఒక వ్యక్తికి పది రోజుల జైలు శిక్ష, మరో వ్యక్తికి ఐదురోజులు, ముగ్గురికి మూడురోజుల జైలు శిక్ష, వీరందరికీ కలిపి రూ.9,500 జరిమానా విధించారు. మిగతా 23 మందికి రూ.39,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ పేర్కొన్నారు.

ఆస్పత్రుల్లో లైవ్‌ సర్జరీలు

- ప్రారంభమైన ఆర్థోపెడిక్‌ వైద్యుల రాష్ట్ర సదస్సు



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థో వైద్యులు

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌లో మొట్ట మొదటిసారి నిర్వహిస్తున్న 9వ తెలంగాణ రాష్ట్ర ఆర్థోపెడిక్‌ వైద్యుల సదస్సు గురువారం వీ–కన్వెన్షన్‌లో ప్రారంభమైంది. సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్థో వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి రోజు కరీంనగర్‌లోని నాలుగు ఆస్పత్రుల్లో లైవ్‌ సర్జరీలు నిర్వహించగా, సదస్సుకు హాజరైన వైద్యులు వీక్షించారు. రెనే హాస్పిటల్‌లో ఆర్థోస్కోపీ– టోటల్‌ హిప్‌ రీప్లేస్మెంట్‌ సర్జరీని డాక్టర్‌ బంగారిస్వామి, చల్మెడ ఆనందరావు వైద్య కళాశాలలో ఎండోస్కోపిక్‌ స్పైన్‌ సర్జరీ డాక్టర్‌ కేతన్‌ దేశ్‌పాండే, ప్రతిమ వైద్య కళాశాలలో రోబోటిక్‌ ద్వారా మోకాలు కీలు మార్పిడి విధానం డాక్టర్‌ మోతీలాల్‌, హోటల్‌ శ్వేత కాన్ఫరెన్స్‌ హాల్‌లో పెల్విఎసిటాబులం సర్జరీ డాక్టర్‌ ఉదయ్‌కుమార్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని ప్రాంతాల నుంచి లైవ్‌ కవరేజీ చేపట్టి వైద్యులు, పీజీ విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ప్రారంభ కార్యక్రమంలో కరీంనగర్‌ రూరల్‌ ఏసీపీ టి.కరుణాకర్‌రావు, రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌ ఫౌండర్‌ డాక్టర్‌ బంగారి రజనీ ప్రియదర్శిని, కోర్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ జయప్రసాద్‌, కో డైరెక్టర్‌ డాక్టర్‌ విజయభాస్కర్‌, ఫ్యాకల్టీ మెంబర్లు శ్రీనివాస్‌ కాశా, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌ వేముల, సాయి తిరుమలరావు, సుధీర్‌ ద్వారక్‌నాయుడు, ఉదయ్‌కృష్ణ, సాయిలక్ష్మణ్‌ అన్నే, కిరణ్‌ కొక్కిరాల, శ్రీనివాస్‌ ఎగ్గన, ప్రవీణ్‌రెడ్డి, పవన్‌కుమార్‌, సూర్యప్రకాష్‌, సురేశ్‌ చీకట్ల, రాజు అయ్యంగార్‌, ముకేశ్‌ లడ్డా, కో ఆర్గనైజర్‌ అభిలాష్‌, ఉదయ్‌కుమార్‌, కె.వంశీధర్‌రెడ్డి, నర్సింహులు, శివకుమార్‌, అశోక్‌ రాజు, అతుల్‌, నాగరాజు, ప్రవీణ్‌, వంశీ భాట్ల తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమ్మె నోటీస్‌



సమ్మె నోటీస్‌ అందజేస్తున్న రమేశ్‌

కరీంనగర్‌టౌన్‌: దేశవ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించే కార్మికుల సమ్మె గ్రామీణ భారత్‌బంద్‌లో జిల్లాలోని ఆశాకార్యకర్తలు పాల్గొంటారని ఆశావర్కర్స్‌ యూనియన్‌ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎడ్ల రమేశ్‌ పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్‌ ఆఫీసర్‌ అబ్దుల్‌ ఖాదర్‌కు సమ్మె నోటీస్‌ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్‌ ప్లాట్‌ఫారం ఆఫ్‌ ట్రేడ్‌ యూనియన్‌ కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిలభారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్‌ మోర్చా ఐక్యంగా సమ్మెతో పాటు గ్రామీణ బంద్‌ నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలోని ఆశాకార్యకర్తలు భాగస్వాములు కావాలని కోరారు.

ఫొటో, వీడియో జర్నలిస్టుల నూతన కార్యవర్గం



షుకూరు



నరేశ్‌

కరీంనగర్‌ కల్చరల్‌: నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఫొటో, వీడియో జర్నలిస్టుల అసోసియేషన్‌ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా జిల్లా శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్‌ షుకూర్‌, ఉపాధ్యక్షులుగా ఏలేటి శైలేందర్‌రెడ్డి, సంపత్‌కుమార్‌, కంకణాల రఘు, ప్రధాన కార్యదర్శి వడ్లూరి నరేశ్‌, కోశాధికారి జన్నారం శ్రీనివాస్‌, సంయుక్త కార్యదర్శి ఎండీ సలీం, ప్రచార కార్యదర్శి సాయిని సతీశ్‌, కార్యవర్గ సభ్యులు ఎండీ అజీం, కె.రవికుమార్‌, డి.సంపత్‌కుమార్‌, ఎండీ నయీం, బి.సదానందం, సుధాకర్‌, కిరణ్‌, సంతోష్‌, మోసిన్‌, నర్సింగ్‌, అనిల్‌కుమార్‌, రాజశేఖర్‌ ఎన్నికయ్యారు.

విద్యుదాఘాతంతో దుకాణం దగ్ధం



కాలిపోయిన దుకాణం

ముస్తాబాద్‌(సిరిసిల్ల): ముస్తాబాద్‌ మండలకేంద్రంలో బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో ఫొటోస్టూడియో, గిఫ్ట్‌ ఆర్టికల్‌ దుకాణం దగ్ధమైంది. బందనకల్‌ గ్రామానికి చెందిన కొమ్మట శ్రీకాంత్‌ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చేసరికి కాలిపోయి కనిపించింది. దుకాణంలోని విద్యుత్‌ తీగల నుంచి షార్ట్‌ సర్క్యూట్‌ జరిగినట్లు భావిస్తున్నారు. దుకాణంలోని కంప్యూటర్‌, కెమెరాలు, గిఫ్ట్‌ ఆర్టికల్స్‌ కాలిపోయాయని, రూ.6లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని ఫొటోగ్రాఫర్లు కోరారు.

ఇంజినీరింగ్‌ ఫెయిల్‌.. యువకుడి ఆత్మహత్య



చరణ్‌తేజ

గోదావరిఖని: ఇంజినీరింగ్‌లో ఫెయిలయ్యాయనే మనస్తాపంతో పెద్దపల్లి జిల్లా రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని మార్కండేయకాలనీకి చెందిన బర్కం చరణ్‌తేజ (24) గురువారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని గురునానక్‌ కళాశాలతో ఇంజినీరింగ్‌ చదివిన చరణ్‌తేజ పరీక్షల్లో తప్పాననే కారణంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు వన్‌టౌన్‌ ఎస్‌ఐ సమ్మయ్య పేర్కొన్నారు. మృతుడి తండ్రి రవిశంకర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పారమితలో విజ్‌కిడ్‌ కాంటెస్ట్‌ బహుమతులు ప్రదానం



విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రసాద్‌రావు, తదితరులు

కరీంనగర్‌: ఇటీవల స్థానిక పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్‌కిడ్‌ కాంటెస్ట్‌ అవార్డుల ప్రదానోత్సవాన్ని జ్యోతినగర్‌లోని ఎక్స్‌ప్లోరికా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి చదివే దాదాపు 1000కి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, ప్రతీ తరగతిలో మొదటి ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున 12 మంది విద్యార్థులకు మొత్తం నగదు పురస్కారం రూ.2 లక్షల 40వేలు పారమిత విద్యాసంస్థల చైర్మన్‌ డాక్టర్‌ ఇ.ప్రసాదరావు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్‌ ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రాకేశ్‌, వినోద్‌రావు, వియూఎం ప్రసాద్‌, ప్రిన్సిపాల్స్‌ రితేశ్‌ మెహతా, శర్మిష్ఠ బసు, ప్రోగ్రాం హెడ్‌ గోపికృష్ణ, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్చురీకి గుర్తుతెలియని మృతదేహం



గుర్తుతెలియని మృతదేహం

రామడుగు(చొప్పదండి): మండలంలోని వెదిర గ్రామ శివారులో గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఓ వ్యక్తి మతిస్థిమితం లేకుండా మూడురోజుల నుంచి రహదారి వెంట తిరిగినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కాగా మృతదేహాన్ని పోలీసులు, పంచాయతీ కార్యదర్శి గౌరీ రమేశ్‌ పరిశీలించి అంబులెన్స్‌లో కరీంనగర్‌ ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చడం జరిగిందని, ఎవరైనా గుర్తిస్తే రామడుగు పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడు, మరో వ్యక్తి అరెస్టు

- సంతకాల ఫోర్జరీ, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని తేల్చిన పోలీసులు

కరీంనగర్‌ క్రైం: సర్పంచు, పంచాయతీ కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసి, ఓ ఇంటి స్థలంపై నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసిన ఎంపీటీసీ మాజీ సభ్యుడితోపాటు మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు కరీంనగర్‌ రూరల్‌ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. చొప్పదండి మండలంలోని రాగంపేటకు చెందిన దీటి మధు 2013లో ఆరెపల్లి శివారులోని సర్వే నంబర్‌ 311, ఓపెన్‌ ప్లాట్‌ నంబర్‌ 5లో 91 గజాల ఇంటి స్థలం కొనుగోలు చేశాడు. దాన్ని తన భార్య సరిత పేరిట రిజిస్ట్రేషన్‌ చేయించాడు. మున్సిపాలిటీ నుంచి అనుమతి తీసుకొని, ఆ స్థలంలో షెడ్డు వేసి, ఇంటి నంబర్‌ పొందాడు. తర్వాత గుంజ లక్ష్మణ్‌ అక్రమంగా ఆ స్థలంలోకి చొరబడి, గేటుకు ఉన్న ఇంటి నంబర్‌ ప్లేట్‌ను తొలగించి, మరో నంబర్‌ ప్లేట్‌ పెట్టాడు. ఈ స్థలం తనదని, తీగలగుట్టపల్లికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొమ్ము భూమయ్య వద్ద నుంచి కొనుగోలు చేశానని వాగ్వాదానికి దిగాడు. ఇక్కడినుంచి వెళ్లిపోకపోతే చంపుతామని బెదిరించాడు. దీనిపై బాధితుడు మధు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్‌ రూరల్‌ సీఐ ప్రదీప్‌కుమార్‌ భూమయ్య, లక్ష్మణ్‌లపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఈ ఇద్దరూ సర్పంచు, పంచాయతీ సెక్రటరీ సంతకాలను ఫోర్జరీ చేసి, ఆ ఇంటి స్థలంపై నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని తేల్చారు. దీంతో పోలీసులు గురువారం భూమయ్య, లక్ష్మణ్‌లను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాల మేరకు జిల్లా జైలుకు తరలించారు.

‘బిట్‌కాయిన్‌’లో నష్టపోయి..

- ఉస్మానియా ఎంకాం విద్యార్థి ఆత్మహత్య
- మృతుడిది జగిత్యాల జిల్లా కోరుట్ల



నవీన్‌(ఫైల్‌)

కోరుట్ల: బిట్‌ కాయిన్‌లో నష్టపోయి జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఎంకాం విద్యార్థి ఎర్ర నవీన్‌ (24) హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆయన మృతదేహాన్ని బుధవారం రాత్రి కోరుట్లకు తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. కోరుట్లలో వడ్రంగి పనిచేస్తున్న ఎర్ర శ్రీనివాస్‌ కుమారుడు నవీన్‌ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంకాం సెకండియర్‌ చదువుతున్నాడు. కొంతకాలంగా బిట్‌కాయిన్‌లో డబ్బు పెడుతున్నాడు. అందులో సుమారు రూ.4లక్షల వరకు పోగొట్టుకుని అప్పుల పాలైనట్లు తెలిసింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం వేకువజామున గడ్డి మందు తాగాడు. గమనించిన స్నేహితులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన మృతదేహానికి కోరుట్లో అంత్యక్రియలు నిర్వహించారు.

టన్ను ప్లాస్టిక్‌ సామగ్రి సీజ్‌

- వ్యాపారులకు జరిమానా



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ టీం

కరీంనగర్‌ కార్పొరేషన్‌: నిబంధనలకు విరుద్ధంగా నగరంలో ప్లాస్టిక్‌ వస్తువులు విక్రయిస్తున్న దుకాణాలపై ప్లాస్టిక్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ టీం గురువారం దాడులు నిర్వహించింది. టవర్‌సర్కిల్‌ ప్రాంతంలోని పలు దుకాణాలను తనిఖీ చేసిన బృందం ప్లాస్టిక్‌ వస్తువులు ఉన్నట్లు గుర్తించింది. ప్లాస్టిక్‌ కవర్స్‌, ప్లాస్టిక్‌ వాటర్‌ గ్లాస్‌లు, థర్మోకోల్‌ కప్స్‌ లాంటి దాదాపు ఒక టన్ను ప్లాస్టిక్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న దుకాణాలకు రూ.13,500 జరిమానా విధించారు. కాగా గతంలోనే వ్యాపారులతో సమావేశం నిర్వహించిన నగరపాలకసంస్థ కమిషనర్‌ బోనగిరి శ్రీనివాస్‌ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ప్లాస్టిక్‌ వస్తువుల విక్రయాలు చేపట్టొద్దని సూచించారు. దీంతో వ్యాపారులు 45 రోజులు గడువు కోరారు. గురువారంతో గడువు ముగియడంతో అధికారులు తనిఖీలు నిర్వహించి, ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ పర్యావరణ ఇంజినీర్‌ స్వామి, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బృందం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి పట్టణంలోని కూనారం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని హన్మంతునిపేట గ్రామానికి చెందిన గుర్రాల రాజు(26) దుర్మరణం చెందాడు. హిటాచీ కంపెనీలో (ఏటీఎం క్యాష్‌లోడింగ్‌) పనిచేస్తున్న గుర్రాల రాజు హన్మంతునిపేటలోని తన ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరాడు. కూనారం క్రాసింగ్‌ వద్ద మలుపు తిరుగుతుండగా వేగంగా వచ్చిన వ్యాన్‌ బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడని ఏఎస్‌ఐ రవీందర్‌రావు తెలిపారు.

తాటిచెట్టు పై నుంచి పడి వ్యక్తి..

వేములవాడరూరల్‌ : వేములవాడరూరల్‌ మండలం మల్లారంలోని రాజనగర్‌కు చెందిన గీత కార్మికుడు నాగుల నర్సయ్య(50) ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రోజు మాదిరిగానే కల్లు గీయడానికి వెళ్లిన నర్సయ్య ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి కిందపడి మృతిచెందినట్లు పేర్కొన్నారు. నర్సయ్య మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

టీచర్స్‌ కాలనీలో చోరీ

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్‌కాలనీలో బుధవారం చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఎరవెల్లి వేణుగోపాల్‌రావు దంపతులు ఉద్యోగ రీత్యా తాళం వేసి వెళ్లారు. వారు వచ్చే సరికి తాళం పగులగొట్టినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న 15 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు నిర్ధారించుకుని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించి దొంగను గుర్తించినట్లు సమాచారం.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

కరీంనగర్‌: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్షం బడ్జెట్‌ భేష్‌ అంటుంటే.. విపక్షాలు పెదవి విరిచాయి. ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్‌ అని అధికార పక్షం అంటుండగా.. సంపన్నవర్గాలకు కొమ్ముకాస్తూ పేదల నడ్డివిరిచేలా ఉందని విపక్ష పార్టీలకు చెందిన పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

ఉద్యోగులకు తీవ్ర నష్టం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ ఉద్యోగస్తులకు పూర్తిగా నిరాశజనకంగా ఉంది. కొత్త, పాత ఆదాయపు పన్ను అంశాల్లో ఏ విధానంలో చూసినా ప్రభుత్వ ఉద్దేశం పన్ను వసూలు చేయడం అనేది స్పష్టంగా కనబడుతుంది. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలి. టాక్సిబుల్‌ ఇన్‌కంను రూ.7 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలి. స్లాబులు కూడా 5శాతం నుంచి ఉండాలి. కానీ ఏకంగా 15 నుంచి 20శాతం విధిస్తున్నారు. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంలో ఏనాడు ఉద్యోగస్తులకు ఇన్‌ఎం ట్యాక్స్‌ విధానంలో లాభం జరగలేదు.

– ఊకంటి విజయేందర్‌రెడ్డి, ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు

నిరాశపర్చిన బడ్జెట్‌



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ నిరాశపర్చింది. 3 లక్షల కోట్లు బడ్జెట్‌ పెంచి చూపించినా 11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు చూపడం దేశ ఆర్థిక పరిస్థితికి నిదర్శనంగా కనిపిస్తుంది. దేశవ్యాప్తంగా కూడు, గూడు, గుడ్డ లేని కోట్లాదిమంది ప్రజలు నేటికీ ఉన్నారు. వారందరికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. నూటికి 60 శాతం ఉన్న రైతాంగాన్ని విస్మరించారు. – మిల్కూరి వాసుదేవారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

విద్యారంగాన్ని విస్మరించారు



కేంద్రం మధ్యంతర బడ్జెట్‌ విద్యారంగం, తెలంగాణ విద్యార్థి లోకాన్ని పూర్తిగా విస్మరించింది. విద్యారంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ప్రాధాన్యత నిధులు కూడా ఇవ్వలేదు. కరీంనగర్‌లో ఐఐఐటీ ఏర్పాటు చేయాలని విభజన హామీ చట్టంలో ఉన్నా స్థానిక ఎంపీ ఐఐఐటీని తీసుకురావడంలో విఫలమయ్యారు. విద్యార్థులపై భారంగా ఉన్న స్టేషనరీ వస్తువులపై జీఎస్టీ ఎత్తివేయకుండా, నిరుద్యోగ యువత ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఈ బడ్జెట్‌ ఉంది. – కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రగతిపథంలో నడిపించేలా..



పేదలు, రైతు సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. సోలార్‌ ఎనర్జీని సబ్సిడీల ద్వారా ప్రోత్సహించి ప్రతి కుటుంబానికి కరెంట్‌ బిల్లుల నుంచి ఉపశమనం కల్పించే బడ్జెట్‌. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతను ఇచ్చి బడ్జెట్‌ రూపొందించడం అభినందనీయం.

– పి.సుగుణాకర్‌రావు, బీజేపీ సీనియర్‌ నాయకుడు

అన్నివర్గాలకు మేలు చేసేలా..



మోదీ ప్రభుత్వం సబ్‌ కా సాత్‌, సబ్‌ కా వికాస్‌, సబ్‌ కా విశ్వాస్‌, సబ్‌ కా ప్రయాస్‌ లక్ష్యంగా పేదలకు ఇళ్ల నిర్మాణం, రక్షణ, ఉపరితల రవాణా, జాతీయ రహదారులు, రైల్వే, ఆహార ప్రజా పంపిణీ, హోంశాఖ, గ్రామీణాభివృద్ధి, ఎరువులు, రైతు సంక్షేమం, ఆయుష్మాన్‌ భారత్‌కు పెద్దపీట వేయడం శుభపరిణామం. – గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఇన్‌కం ట్యాక్స్‌లో మార్పులు లేవు



2024–25 సంవత్సరానికి ఇన్‌కం ట్యాక్స్‌లో ఎలాంటి మార్పులు లేవు. ఆదాయ పన్ను స్లాబ్‌ల ప్రకారం రూ.7 లక్షల వరకు కొత్త రిజిన్‌లో సెక్షన్‌ 87 ఏ ప్రకారం మినహాయింపు ఉంది. పాత టేబుల్‌ ప్రకారం రూ.5 లక్షల వరకు సెక్షన్‌ 87ఏ ప్రకారం కార్పొరేట్‌ పనుల్లో కొంత శాతం తగ్గించడం జరిగింది. సోలార్‌ పవర్‌ను ప్రోత్సహించడం కొంతవరకు హర్షించ దగ్గ విషయం.

– కె.వెంకటేశ్వర్లు, అడ్వకేట్‌

పబ్లిక్‌, ప్రైవేటు భాగస్వామ్యంతో..



వ్యవసాయ రంగ పురోభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ బడ్జెట్‌లో రూ.1.27 లక్షల కోలు కేటాయించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కి రూ.7,105 కోట్లు. ఆహార శుద్ధి పరిశ్రమలకు రూ.3,290 కోట్ల కేటాయింపు. ఎరువుల ఖర్చు రూ.3 వేల నుంచి రూ.600 తగ్గించేలా సంప్రదాయ ఎరువుల స్థానంలో నానో డీఏపీని విస్తరించడం, నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం వంటి చర్యలు వ్యవసాయ అభివృద్ధికి ఊతమిస్తాయి.

– డాక్టర్‌ సీహెచ్‌ శ్రీనివాస్‌, తెలంగాణ ఎకనామిక్‌ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఇన్‌కంటాక్స్‌ స్లాబ్‌ పెంచాలి



కోల్‌సిటీ(రామగుండం): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఇన్‌కంటాక్స్‌ స్లాబ్‌ పెంచాలి. రైల్వేకు గతంలో మాదిరిగా ప్రత్యేక బడ్జెట్‌ ఏర్పాటు చెయ్యాలి. ఖాళీలను భర్తీ చేయాలి. మహిళా లోకో పైలట్స్‌కు రైలింజన్‌లో టాయిలెట్స్‌, ఏసీలు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలి.

– అజ్మీరా వీరన్ననాయక్‌, రామగుండం బ్రాంచ్‌ సెక్రెటరీ, దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్‌ సంఘ్‌

ఎటువంటి మార్పు లేదు



కోల్‌సిటీ(రామగుండం):ఆదాయ పన్ను చెల్లింపుదారులను బడ్జెట్‌ నిరాశపరిచింది. గత ఏడాది ప్రకారమే పన్నులు ఉన్నాయి. ఎలాంటి మార్పులు చేయలేదు. బహుళ సెక్షన్ల రాయితీని అనుమతించే పాత పన్ను విధానంలో ఈ బడ్జెట్‌లో ఎటువంటి మార్పు లేదు.

– ఎం.వెంకటేశం, ఇన్‌కంట్యాక్స్‌ ప్రాక్టీషనర్‌, గోదావరిఖని

యథాతథంగా స్లాబ్‌లు



సిరిసిల్లకల్చరల్‌: రానున్న పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో ఆదాయపు పన్ను పరిమితిని ఈసారైనా పెంచుతారని ఆశించారు. వేతన జీవులకు ఈ విషయంలో నిరాశే మిగిలింది. పన్ను పరిమితిని పెంచాలని ఎన్నో ఏళ్లుగా ఉద్యోగులు డిమాండ్‌ చేస్తున్నారు. ఆదాయపు పన్ను స్లాబ్‌లు యథాతథంగా ఉంచుతున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. ఇది వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించింది. – పాకాల శంకర్‌గౌడ్‌, టీఎస్‌యూటీఎస్‌ అధ్యక్షుడు

విద్యకు కేటాయింపులు సరిపోవు



సిరిసిల్లకల్చరల్‌: బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించింది ఏ మాత్రం సరిపోదు. మొత్తం బడ్జెట్‌లో 2.61 శాతం మాత్రమే కేటాయించడం విద్యారంగ ప్రమాణాలు మెరుగుపరచదు. నినాదాలు, ఉపన్యాసాలతో ప్రామాణిక విద్య సాధ్యం కాదు. నిధుల కొరతతో కొత్త సంస్థల స్థాపన వీలుకాదు. మరిన్ని విద్యావకాశాలు పెంచేలా కేటాయింపులు ఉండాలి.

– దోర్నాల భూపాల్‌రెడ్డి, టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు

మార్పు చేయలేదు



సిరిసిల్లటౌన్‌: ఐటీ తదితర పన్నుల్లో ఏలాంటి మార్పులు చేయలేదు. ఇది సామాన్యులపై ఏలాంటి ప్రభావం చూపదు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌, దేశ భద్రత, దేశీయ టూరిజానికి ప్రాధాన్యత ఇచ్చారు. కమ్యూనికేషన్స్‌ వ్యవస్థ, టెంపుల్‌ టౌన్స్‌ అభివృద్ధికి నిధులు కేటాయించడం ఆహ్వానించదగిన అంశం.

– జిందం రమేశ్‌, ట్యాక్స్‌ కన్సల్టెంట్‌, సిరిసిల్ల

అనుకూల అంశాలను చేర్చాలి



సిరిసిల్లటౌన్‌: ఆదాయ పన్ను స్లాబుల్లో ఏలాంటి మార్పులు చేయలేదు. పన్నుల మినహాయింపుల అంశంలో మధ్య తరగతి ఉద్యోగుల ఆశలు అడియాసలయ్యాయి. జనరల్‌ బడ్జెట్‌లో నైనా ఉద్యోగులకు అనుకూల అంశాలను చేర్చాలి. – ఎం.ప్రశాంత్‌కుమార్‌, టీఎస్‌పీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి

టెక్స్‌టైల్‌ రంగానికి నిధులేవి?



సిరిసిల్లటౌన్‌: దేశంలో వ్యవసాయం తర్వాత అతిపెద్ద రంగమైన టెక్స్‌టైల్‌కు నిరాశ కలిగించిన బడ్జెట్‌ ఇది. వస్త్రోత్పత్తి ఖిల్లా సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్‌ కేటాయిస్తారన్న కార్మికుల ఆశలు గల్లంతు చేశారు. పరిశ్రమ సంక్షోభం నుంచి గట్టెక్కె అంశాలు ఏమాత్రం లేవు. కార్మికులు, శ్రమజీవులకు ప్రాధాన్యత లేదు. – కోడం రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ వెంకటేష్ గురువారం రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో ఉండాలని, ఎలాంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుని పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పార్క్ పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని పద్మనగర్ పార్క్ అభివృద్ధి పనులు త్వరితగతంగా పూర్తి చేయాలని 16వ డివిజన్ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ అన్నారు. పద్మనగర్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న పార్క్ అభివృద్ధి పనులను గురువారం ఆయన అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఇప్పటికే కొంత పనులు జరిగాయని, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

సదరంలో అక్రమాలపై దృష్టిపెట్టాలి

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీ చేసేందుకు నిర్వహించే సదరం శిబిరాల్లో జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్ దృష్టి సారించాలని వికలాంగుల హక్కుల పోరాట సంఘం నాయకులు వెన్నం శ్రీనివాస్, జక్కం సంపత్ ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల జరిగిన వినికిడి శిబిరంలో పరీక్షలు నిర్వహించకుండానే చాలా మందిని రిజక్ట్ చేశారని పేర్కొన్నారు. అదే విధంగా వికలాంగులు, వారి కుటుంబ సభ్యుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై చర్యలు చేపట్టాలని కోరారు.

నోట్‌బుక్స్, పెన్నులు అందజేత



నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేస్తున్న సదయ్య

కరీంనగర్: కరీంనగర్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రైవేట్ టీచర్ సదయ్య తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, కాస్మోటిక్ వస్తువులను అందజేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతమైన స్థానంలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీపాల్, ఉపాధ్యాయులు సారయ్య, రాజమౌళి, చిరంజీవి, శ్రీనివాస్, రమేశ్, సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

4న జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4న కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, సీహెచ్.సంపత్ రావు తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వయస్సు 16 ఏళ్ల లోపు ఉండాలని, 2008 మార్చి 20 తర్వాత పుట్టిన వారు అర్హులని అన్నారు. పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఈనెల 16 నుంచి 19 వరకు సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో మధ్యాహ్నం 2 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని అన్నారు.

మాయమాటలు చెప్పినా ఓటమి తప్పదు

కరీంనగర్ కార్పొరేషన్: మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ ఎన్ని మాయ మాటలు చెప్పినా వచ్చే లోకసభ ఎన్నికల్లో ఆయనకు ఓటమి తప్పదని పీసీసీ మాజీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ముక్కల ప్రవీణ, పార్లమెంట్ నియోజకవర్గాల కోఆర్డినేటర్ రహమత్ హుస్సేన్ అన్నారు. గురువారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని వినోద్‌కుమార్ అనడం సరికాదన్నారు. మాయమాటలు చెప్పే సంస్కృతి బీఆర్ఎస్ నేతలదేనని, కాంగ్రెస్ చెప్పింది చేస్తుందన్నారు. ఎంపీగా ఉన్న సమయంలో వినోద్‌కుమార్ చేసిందేమీ లేదని, మాయమాటలతో మభ్యపెట్టారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి సన్మానం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామ సర్పంచ్ జక్కం నర్సయ్య, ఉప సర్పంచ్ కూకట్ల తిరుపతితో పాటు వార్డుసభ్యులకు గురువారం పంచాయతీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో కె.మహేశ్వర్ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సల్మాన్, వార్డుసభ్యులు పోతర్ల క్రాంతికుమార్, మైలారం శ్రీనివాస్, మాదాసు శివరామకృష్ణ, చింతపూల శ్రీనివాస్, మీసాల మహేశ్వరి, దామరపల్లి పుష్పలత, మంద తిరుమల, కోఆప్షన్ సభ్యుడు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనపై సమావేశం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలనపై ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులతో మండలస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్ మాట్లాడుతూ ఈనెల 12న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అనంతరెడ్డి, సునీతారెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: డ్రాగన్ స్వార్డ్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మానేరు విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబర్చి పలు పతకాలు సాధించారు. కటాస్, స్పారింగ్ విభాగాల్లో ఇక్షిత, ధనుష్, విశ్వంత్, వర్షిత్, శివసాత్విక్‌లు బంగారు, రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను గురువారం మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితా రెడ్డి, పీఈటీలు మహేందర్, జహేద, కరాటే ఇన్‌స్ట్రక్టర్ కోడూరి శేఖర్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, అభినందించారు.

మహిళలకు స్వయం సిద్ధ రుణం

- కరీంనగర్ మండలానికి 4 యూనిట్లు కేటాయింపు
- రూ.5లక్షల వరకు వ్యక్తిగత రుణం మంజూరు

కరీంనగర్‌రూరల్: స్వశక్తి సంఘాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలతోపాటు స్త్రీ నిధి రుణాలను మంజూరు చేస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాలను గ్రూపు సభ్యులందరికీ కలిపి ఇస్తుండగా స్త్రీ నిధి రుణాలను వ్యక్తిగతంగా మంజూరు చేస్తున్నారు. అయితే తక్కువ మొత్తంలో రుణం ఇస్తుండటంతో మహిళలు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారని గుర్తించిన అధికారులు పెద్ద మొత్తంలో వ్యక్తిగత రుణం అందించేందుకు కొత్తగా స్వయం సిద్ధ పథకం అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా కరీంనగర్ మండలానికి మొదటి విడతలో 4 యూనిట్లు మంజూరు చేశారు.

చిరువ్యాపారాలకు ప్రాధాన్యం

ఈ పథకంలో చిరు వ్యాపారాలు, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. వివిధ రకాల పచ్చళ్ల తయారీ, బేకరీ ఉత్పత్తులు, చిప్స్ తయారీ, మినీ ఆయిల్ మిల్లులు, ఐస్‌క్రీమ్స్, స్వీట్ల తయారీ, బ్యూటీపార్లర్, డెయిరీ, పౌల్ట్రీఫామ్స్ ఏర్పాటు, హోటల్, ఇంటర్నెట్ సెంటర్ తదితర 36 రకాల వ్యాపారాలకు రుణసౌకర్యం కల్పిస్తారు. మహిళలు ఏ వ్యాపారంలో అనుభవం, శ్రద్ధ ఉంటుందో వాటిని ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంది.



సమావేశమైన స్వశక్తి సంఘం మహిళలు

రూ.5లక్షల వరకు రుణం

చిరు వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు ఎంపిక చేసిన మహిళలకు స్వయం సిద్ధ పథకం కింద రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. సంఘంలో కనీసం రెండేళ్లుగా సభ్యులై ఉండాలి. పొదుపుతో పాటు ఇతర రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్న వారు మాత్రమే అర్హులు. ఈ రుణానికి ఎలాంటి సబ్సిడీ లేదు. తీసుకున్న రుణాన్ని వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలోని స్వశక్తి సంఘాల సభ్యులకు మాత్రమే రుణసౌకర్యం కల్పించారు. ఎస్‌బీఐ పరిధిలోని ఎలబోతారం 2 యూనిట్లు, జూబ్లీనగర్ 2 యూనిట్ల చొప్పున మొత్తం నాలుగు కేటాయించారు. ఆయా గ్రామాల్లోని స్వశక్తి సంఘాల సభ్యుల నుంచి దరఖాస్తులు తీసుకుని రుణ మంజూరు కోసం అధికారులు బ్యాంకుకు పంపించారు.

ఒక యూనిట్‌కు రుణం మంజూరు

నాలుగు యూనిట్ల మంజూరు కోసం స్వశక్తి సభ్యుల నుంచి దరఖాస్తులను బ్యాంకుకు పంపించాం. మొదటి విడతలో జూబ్లీనగర్‌లో బట్టల దుకాణం ఏర్పాటు కోసం రుణం మంజూరైంది. మిగితా యూనిట్లకు త్వరలో రుణం మంజూరవుతుంది.

– భార్గవ్, ఐకేపీ ఏపీఎం, కరీంనగర్ రూరల్

4 నుంచి మహిళలకు ఉచిత వైద్యశిబిరం



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 4, 5, 6, 7 తేదీల్లో కరీంనగర్‌లో మహిళలకు ఉచిత క్యాన్సర్ అవగాహన, నిర్ధారణ పరీక్షల వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని ప్రతిమ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా కార్పొరేటర్లు, బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లకు దిశానిర్దేశం చేశారు. నగరంలోని గాంధీరోడ్‌లో గల టీటీడీ కల్యాణమండపంలో ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్, చల్మెడ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నాలుగు రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో రేడియాలజీ విభాగం, కల్పోస్కోపి, పాప్ స్మియర్, మామోగ్రఫీ, రొమ్ము క్యాన్సర్ పరీక్ష, గైనిక్ క్యాన్సర్ పరీక్ష, ఎక్స్‌రే వంటి వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ బోయినపల్లి మాధవి, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపహరిశంకర్, మహిళా కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

సర్పంచు కానుకతో ఆర్థిక భరోసా



ఎఫ్‌డీ పత్రాలు అందజేస్తున్న ఆర్డీవో, సర్పంచ్

కరీంనగర్‌రూరల్: ఆడపిల్లలకు ఆర్థిక చేయూత కల్పించేందుకు సర్పంచ్ కానుక దోహదపడుతుందని ఆర్డీవో కె.మహేశ్వర్ అన్నారు. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో గ్రామ సర్పంచ్ జక్కం నర్సయ్య ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన బేటీ బచావో బేటీ పడావో పథకం స్ఫూర్తితో జనవరి 2022 సంవత్సరం నుంచి ఆడపిల్ల పుట్టిన తల్లిదండ్రులకు సర్పంచ్ కానుకగా పోస్టాఫీసులో రూ.5వేలను జమ చేస్తున్నారు. గురువారం సర్పంచ్ పదవీకాలం ముగుస్తుండటంతో 13 మంది లబ్ధిదారులకు ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై డిపాజిట్ పత్రాలు అందజేశారు. ఆడపిల్లలను ఆదుకునేందుకు సర్పంచ్ నర్సయ్య రూ.5వేలు అందించడం అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతగా ఆడపిల్లల భవిష్యత్‌కు భరోసా కల్పించడం హర్షనీయమన్నారు. ఇప్పటివరకు మొత్తం 45 మందికి డిపాజిట్ పత్రాలు అందించినట్లు సర్పంచ్ నర్సయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కూకట్ల తిరుపతి, పంచాయతీ కార్యదర్శి సల్మాన్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ముక్కల తిరుపతి

కరీంనగర్: సమ సమాజం, శాస్త్రీయ విద్యావిధానం, విద్యార్థుల హక్కులు, సమస్యలపై పోరాడిన కామ్రేడ్ జార్జిరెడ్డి ఆశయాల సాధనకు విద్యార్థులందరూ కృషి చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ముక్కల తిరుపతి అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ హాస్టల్‌ను సందర్శించి మాట్లాడారు. జార్జిరెడ్డి స్థాపించిన పీడీఎస్‌యూ సంఘంలో చేరి విద్యారంగ సమస్యలపై పోరాడాలన్నారు. అనంతరం హాస్టల్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హాస్టల్ ప్రెసిడెంట్‌గా మనోహర్, సెక్రెటరీగా వివేక్, వైస్ ప్రెసిడెంట్‌గా చందు, కమిటీ సభ్యులుగా చింటు, అజయ్, తరుణ్, వేణులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'పిల్లల కోసం'

కరీంనగర్‌సిటీ: ప్రాథమిక స్థాయి విద్యలో గుణాత్మకమైన మార్పు తీసుకవచ్చేందుకు ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల జాతీయ సేవా పథకం వలంటీర్లు చేపట్టిన 'పిల్లల కోసం' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని ఎస్సారార్ కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. కళాశాల నుంచి సుమారు 120 మంది వలంటీర్లు ప్రతీ శనివారం వారికి కేటాయించిన ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు స్నేహపూర్వక బోధన చేపడుతున్నారని అన్నారు. వారి బోధనకు ఉపయోగపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన పుస్తకాన్ని, బ్యాడ్జిని బుధవారం వలంటీర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల కోసం జిల్లా నోడల్ అధికారి వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వరప్రసాద్, ప్రోగ్రాం అధికారులు డీ.డీ.నాయుడు, బి.సురేశ్‌కుమార్, బి.చంద్రమౌళి, బి.శారద, జిల్లా విద్యాధికారి కార్యాలయం సీఎంవో ఆంజనేయులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

కరీంనగర్: అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం జిల్లా సంక్షేమ అధికారి సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యుడు టేకుమల్ల సమ్మయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌కు బడ్జెట్‌ను పెంచి బలోపేతం చేయాలని, 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ చెల్లించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించాలని జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఈనెల 16న జరిగే సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రజిత, ఏ.రజిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రత దృష్ట్యా తీసుకునే చర్యల్లో భాగంగా కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ మాట్లాడుతూ సరైన ధ్రువపత్రాలు, పొల్యూషన్, ఇన్సూరెన్సులు లేని ఆటోలను గుర్తించి వాటిని సీజ్ చేసి ఈ–చలాన్ ద్వారా జరిమానాలు విధించామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఇషాక్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



కరీంనగర్ స్పోర్ట్స్: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కబీర్‌దామ్‌లో ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు జరుగనున్న 67వ జాతీయస్థాయి పాఠశాలల అండర్ 14 సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని విశ్వశాంతి పాఠశాల విద్యార్థిని సహ్లత్ సమా ఎంపికైంది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు డి రమేశ్, ఎస్.ఆంజనేయులు, ఏ.గిరిధర్, ఎం.రాజేశ్, పీఈటీలు పాష, చంద్రశేఖర్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

రాజకీయ పబ్బం కోసమే ఆరోపణలు



మాట్లాడుతున్న గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్‌టౌన్: రాజకీయ పబ్బం కోసమే మాజీ మేయర్ రవీందర్‌సింగ్ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై ఆరోపణలు చేస్తున్నారని మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్ అన్నారు. గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 10 గ్రామాల రైతులకు ఉపయోగపడే ప్రధాన కూరగాయల మార్కెట్‌పై వివాదం జరిగినప్పుడు అప్పుడు కార్పొరేటర్‌గా ఉన్న సంజయ్‌కుమార్ మార్కెట్‌ను కాపాడే ప్రయత్నం చేశారని అన్నారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు ఎంపీ చైర్మన్‌గా ఉండరనే విషయం తెలియకుండా రవిందర్‌సింగ్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మార్కెట్‌పై ఓట్ల రాజకీయం చేస్తే ఉత్తర తెలంగాణ భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు ప్రవీణ్ రావు, అనూప్, రమణారెడ్డి, శ్రీనివాస్, స్వామి, హరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల గోడు వినలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం

కరీంనగర్‌టౌన్: సర్పంచుల గోడును రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వినలేని స్థితిలో ఉందని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో సమస్యలు పరిష్కరించకుండా, తిరిగి గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులను నియమించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని అన్నారు. గత ప్రభుత్వం సర్పంచులతో వివిధ రకాల పనులు చేయించుకొని బిల్లులు చెల్లించకుండా నోట్లో మట్టి కొట్టిందన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచుల బిల్లుల సమస్యను పరిష్కరించకుండా తమకు పట్టదు అన్నట్లుగా వ్యవహరించి, సర్పంచుల పదవీకాలం పూర్తి కాగానే ప్రత్యేక అధికారులను నియమించి వారి సమస్యను గాలికి వదిలేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక అధికారులు వీరే

కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి: సర్పంచుల పదవీకాలం గురువారం ముగియడంతో గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. కరీంనగర్ మండలంలోని 17, కొత్తపల్లి మండలంలోని 8 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి, జెడ్పీ సీఈవో పవన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కరీంనగర్ మండలంలో..

బహదూర్‌ఖాన్‌పేటకు బి.రమణారెడ్డి (పీఆర్ ఏఈ), బొమ్మకల్‌కు పి.నవీన్‌కుమార్ (తహసీల్దార్), చామనపల్లికి బి.రమణారెడ్డి (పీఆర్, ఏఈ), చేగుర్తికి సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి (ఎంపీవో), చెర్లభూత్కూర్‌కు జి.సంపత్‌కుమార్ (సూపరింటెండెంట్), దుబ్బపల్లికి జి.నిర్మల(ఐసీడీఎస్ సూపర్‌వైజర్), దుర్శేడ్‌కు జి.రామకృష్ణ (బొమ్మకల్ పశువైద్యుడు), ఎలబోతారంకు ఎస్.మౌనిక (ఇరిగేషన్ ఏఈ), ఫకీర్‌పేటకు జె.నళినీకాంత్ (ఇరిగేషన్ ఏఈ), గోపాల్‌పూర్‌కు సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి (ఎంపీవో), ఇరుకుల్లకు ఎ.శంకర్ (నాయబ్ తహసీల్దార్), జూబ్లీనగర్‌కు దివ్యదర్శన్‌రావు (ఎంపీడీవో), మందులపల్లికి బి.సత్యం (మండల వ్యవసాయాధికారి), మొగ్దుంపూర్‌కు బి.సత్యం (మండల వ్యవసాయాధికారి), నగునూరుకు దివ్యదర్శన్‌రావు (ఎంపీడీవో), నల్లగుంటపల్లికు జి.రామకృష్ణ (బొమ్మకల్ పశువైద్యుడు), తాహెర్‌కొండాపూర్‌కు కె.శ్రీనివాస్‌రెడ్డి (స్టాటికల్ అధికారి).

కొత్తపల్లి మండలంలో..

ఆసిఫ్‌నగర్‌కు సీహెచ్ రంజిత్‌కుమార్ (ఏవో, కొత్తపల్లి), బద్దిపల్లికి ఎం.అనూష (ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్), చింతకుంటకు డి.శ్రీనివాస్ (ఎంపీవో), కమాన్‌పూర్‌కు కె.సుమలత(డిప్యూటీ తహసీల్దార్), మల్కాపూర్‌కు ఏ.శ్రీనివాస్‌రెడ్డి (ఎంపీడీవో), ఎలగందులకు పి.రాజేశ్ (తహసీల్దార్), ఖాజీపూర్‌కు జి.కాళిదాస్ (ఏఈ నీటిపారుదల శాఖ), నాగులమల్యాలకు ఎస్.నవీన్‌కుమార్(ఏఈఈ, నీటిపారుదల శాఖ)లను ప్రత్యేకాధికారులుగా నియమించారు.

అసత్య ప్రచారం తగదు

కరీంనగర్‌కార్పొరేషన్: నిత్యం కార్యకర్తలకు అండగా ఉండే రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై దురుసుగా ప్రవర్తించారంటూ అసత్య ప్రచార చేయడం తగదని డీసీసీ కార్యదర్శి, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు రోళ్ల సతీశ్ అన్నారు. వేదికపై నుంచి కార్యకర్తలను పంపించివేయడంలో భాగంగా, చనువుగా వ్యవహరించిన తీరును ట్రోలింగ్ చేయడం మానుకోవాలన్నారు.

కిసాన్‌నగర్‌లో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: నగరంలోని కిసాన్‌నగర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఫైర్ అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిసాన్‌నగర్‌లోని తుంగ రంజిత్ ఇంట్లో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా మంటలు రావడంతో స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ అధికారులు ఫైరింజన్‌తో వచ్చి మంటలు ఆర్పారు. జరిగిన ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు స్టేషన్ ఫైర్ అధికారి పరమేశ్వర్ తెలిపారు. ఇదిలా ఉండగా మంటలు రావడానికి కారణాలు తెలియరాలేదు.



ఫెరారీకి హామిల్టన్!

ఏడుసార్లు ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్, బ్రిటన్ దిగ్గజ రేసర్ లూయిస్ హామిల్టన్ మెర్సిడెస్ జట్టును వీడనున్నాడు. 2013 నుంచి మెర్సిడెస్ తరఫున పోటీపడ్డ హామిల్టన్ ఈ ఏడాది తర్వాత ఆ జట్టుతో బంధం తెంచుకోనున్నాడు. 39 ఏళ్ల హామిల్టన్ 2025 సీజన్‌లో ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం దాదాపు ఖరారైంది. హామిల్టన్ 2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020లలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాడు. 2021లో సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి తర్వాత హామిల్టన్ మరో రేసులో విజేతగా నిలువలేకపోయాడు.

సెమీస్‌లో వైదేహి-రష్మిక జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6-2, 6-1తో మూడో సీడ్ కరోల్ మొనెట్ (ఫ్రాన్స్)-యపీనా (రష్యా) జంటపై నెగ్గింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-15, 24-22తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మిథున్ 21-9, 13-21, 21-17తో కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అష్మిత 21-12, 15-21, 21-17తో యు పో పాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... మాళవిక 22-24, 7-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది.

భారత్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌పై పాకిస్తాన్‌లో అనాసక్తి



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైదానంలో పోటీ అంటేనే ఓ సమరాన్ని తలపిస్తుంది. పెద్ద హడావుడి, హంగు, ఆర్భాటం అంతా కనిపిస్తుంది. అయితే ఇదంతా క్రికెట్‌కే పరిమితం. టెన్నిస్ అంటే ఆసక్తి అంతంతమాత్రమే! ఇప్పుడు కూడా ఆరు దశాబ్దాల తర్వాత ఇరు జట్ల మధ్య పాక్ గడ్డపై ప్రతిష్టాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 పోటీలు జరగాల్సి ఉంటే... దేశంలో, రాష్ట్రంలో కాదుకదా... కనీసం వేదికైన ఇస్లామాబాద్‌లో కూడా చడీచప్పుడు లేనేలేదు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేవలం మీడియా, పాకిస్తాన్ టెన్నిస్ సమాఖ్య (పీటీఎఫ్) నిర్వాహకులు తప్ప ఇంకెవరి అడుగులు, చూపులు అటువైపు పడటం లేదు. మ్యాచ్‌ల కోసం పాస్‌లు, వీవీపీ పాస్‌లు కావాలనే ప్రతిపాదనలు కూడా రావట్లేదు. రేపు, ఎల్లుండి డేవిస్ కప్ మ్యాచ్ ఆడేందుకు పాకిస్తాన్‌కు వచ్చిన భారత టెన్నిస్ జట్టు సభ్యులకు అక్కడి భారత హైకమిషనర్ గీతిక శ్రీవాస్తవ విందు ఏర్పాటు చేసి ఆటగాళ్లకు బెస్టాఫ్ లక్ చెప్పారు.

మన గెలుపు హోరు వినిపించేనా!

కోహ్లి లేడు... కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా దూరమయ్యారు. గిల్, శ్రేయస్ బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టు ఆత్మవిశ్వాసాన్ని కాస్త దెబ్బ తీసిన పరిస్థితి. స్పిన్ మన బలం అనుకుంటే గత మ్యాచ్‌లో అరంగేట్ర స్పిన్నర్‌కే ఆటను అర్పించేశాం. ప్రత్యర్థిని చూస్తే దేనికైనా సిద్ధం అన్నట్లుగా దూకుడుతో 'సై' అంటోంది. రెండో టెస్టుకు ముందు భారత్ పరిస్థితి ఇది. ఇలాంటి సమయంలో విశాఖ తీరాన మన జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. 'బజ్‌బాల్'కు చెక్ పెట్టి 'భారత్ బాల్'తో సత్తా చాటాల్సి ఉంది.

2016లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యం ప్రదర్శించగా మ్యాచ్ 'డ్రా' అయింది. తర్వాతి నాలుగు టెస్టులు గెలిచి భారత్ చివరకు సిరీస్‌ను 4-0తో గెలుచుకుంది. 2021లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో భారత్ ఓటమి. తర్వాతి మూడు టెస్టులు గెలిచి భారత్ 3-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. గత రెండు సిరీస్‌ల తరహాలోనే టీమిండియా ఈసారీ కోలుకొని తగిన రీతిలో సమాధానమిస్తూ ముందంజ వేస్తుందా!

విశాఖపట్నంలో నేటి నుంచి రెండో టెస్టు

సమరానికి సిద్ధమైన భారత్, ఇంగ్లండ్	తీవ్ర ఒత్తిడిలో టీమిండియా	ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, విశాఖపట్నం: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 0-1తో వెనుకబడిన భారత జట్టు పోరును సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా రోహిత్ శర్మ నేతృత్వంలో ప్రతీకారానికి సిద్ధమైంది. మరోవైపు తమ జోరును కొనసాగిస్తూ సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీసీ-వీడీసీఏ స్టేడియంలో నేటి నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్‌తో పోలిస్తే ఇరు జట్లలోనూ మార్పులు ఖాయమయ్యాయి.

పటిదార్ అరంగేట్రం!

తొలి టెస్టు ఓటమి తర్వాతి ఇప్పుడు రెండో టెస్టుకు తుది జట్టు ఎంపిక కూడా భారత్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్ష పెడుతోంది. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో రెండు మార్పులు తప్పనిసరి. రాహుల్ స్థానంలో ఒక బ్యాటర్ స్థానం కోసం రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. గురువారం టీమ్ ప్రాక్టీస్, ఇతర అంశాలను బట్టి చూస్తే రజత్ వైపే ఎక్కువగా మొగ్గు ఉంది. భారత్ తరఫున పటిదార్ ఒకే ఒక వన్డే ఆడాడు. అశ్విన్, అక్షర్ మళ్లీ కీలకం కానుండగా జడేజా స్థానంలో మరో మాటకు తావు లేకుండా కుల్దీప్ మైదానంలోకి దిగుతాడు. అయితే కుల్దీప్ వస్తే బ్యాటింగ్ బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలో ఇంగ్లండ్ తరహాలో ఒకే ఒక పేసర్‌ను ఆడించి బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. అలా చేస్తే సిరాజ్ స్థానంలో సర్ఫరాజ్ అరంగేట్రం చేయవచ్చు. అయితే వీటన్నింటికంటే టాప్-4 బ్యాటింగ్ కీలకం కానుంది. ఓపెనర్లు రోహిత్, యశస్వి కాస్త ఓపిగ్గా ఆడితే భారీ స్కోరుకు కావాల్సిన శుభారంభం లభిస్తుంది. గిల్, అయ్యర్ ఇప్పటికైనా తమకు లభిస్తున్న వరుస అవకాశాలకు న్యాయం చేయాల్సి ఉంది.



హార్ట్‌లీ, స్టోక్స్

పిచ్, వాతావరణం

మంచి బ్యాటింగ్ వికెట్. కాస్త బౌన్స్‌తో పాటు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన భారత్ రెండు మ్యాచ్‌లూ (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలపై) గెలుచుకుంది. వర్ష సూచన లేదు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, పటిదార్, భరత్, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్. ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, రేహాన్, బషీర్, అండర్సన్.

అండర్సన్@184



41 ఏళ్లు దాటిన పేసర్ అండర్సన్ తన కెరీర్‌లో 184వ టెస్టులో బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో 22వ ఏడాది కానుండడం విశేషం. తను అరంగేట్రం చేసినప్పుడు ఇంకా పుట్టని రేహాన్, బషీర్‌లతో కలిసి అండర్సన్ బౌలింగ్ చేయబోతున్నాడు.



ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ తొలిసారి తన సొంత గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వైజాగ్‌కే చెందిన వికెట్‌కీపర్ భరత్‌కు 6 టెస్టుల స్వల్ప కెరీర్ తర్వాత ఈ అవకాశం దక్కడం విశేషం. ఈ టెస్టులో జట్టు అవకాశాల గురించి భరత్ మాట్లాడుతూ... 'అన్ని ప్రణాళికలతో మేము సిద్ధంగా ఉన్నాం. తొలి టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన తప్పులపై చర్చించాం. స్వీప్ షాట్‌లపై సాధన చేశాం. మేం అలాంటి షాట్లన్నీ ఆడగలం. అయితే పరిస్థితిని బట్టే బ్యాటర్లు దానిని అమలు చేస్తారు. గత ఓటమి తర్వాత మేమేం ఆందోళనకు గురి కాలేదు. జట్టులో అంతా బాగుంది. సుదీర్ఘ సిరీస్ కాబట్టి కోలుకునే అవకాశం ఉందని మాకు తెలుసు' అని అన్నాడు.

బరిలోకి బషీర్...

ఇంగ్లండ్ తమ తుది జట్టును గురువారమే ప్రకటించింది. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెడుతున్నాడు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్‌లీ మళ్లీ చెలరేగేందుకు సిద్ధంగా ఉండగా... అన్నింటికి మించి ఏకైక పేసర్ గా సీనియర్ బౌలర్ అండర్సన్ పునరాగమనం చేస్తుండటం విశేషం. వుడ్ స్థానంలో అతడిని ఇంగ్లండ్ ఎంపిక చేసింది. తొలి టెస్టులో ఎప్పటిలాగే తమ దూకుడైన బ్యాటింగే ఇంగ్లండ్‌ను గెలిపించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ ధాటిగా ఆడుతుండగా పోప్ ఆట ఎలాంటిదో గత మ్యాచ్ చూపించింది. స్టార్ బ్యాటర్ రూట్ అటు బౌలింగ్‌లోనూ ప్రధానపాత్ర పోషించడం జట్టు బలాన్ని పెంచింది. అటు బ్యాటింగ్‌తో, ఇటు కెప్టెన్సీతో స్టోక్స్ విలువైన ఆటగాడు. ఇంగ్లండ్ ముగ్గురు స్పిన్నర్లు ఈసారి భారత్‌ను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరం.



రోహిత్

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442 కోట్లు

గతేడాది కంటే రూ.45.36 కోట్లు ఎక్కువ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడల కోసం రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ. 3,396.96 కోట్లు క్రీడలకు వెచ్చిస్తే ఈసారి రూ.45.36 కోట్లు పెంచారు. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం రూ. 900 కోట్లు (రూ.20 కోట్లు పెరుగుదల), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు రూ. 822.60 కోట్లు (రూ.26.83 కోట్లు పెంపు) కేటాయించారు. మౌలిక వసతుల కల్పన, అథ్లెట్లకు ఆధునిక క్రీడా సామాగ్రి, కోచ్‌ల నియామకం కోసం ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ 340 కోట్లు (రూ.15 కోట్లు పెంచారు) ఇవ్వనున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బలోపేతానికి రూ. 22.30 కోట్లు కేటాయించారు. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూ. 91.90 కోట్లు (రూ.8.69 కోట్లు హెచ్చింపు) కేటాయించారు.

ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని పీకేఎల్ నిర్వాహకులైన మషాల్ స్పోర్ట్స్ తెలిపింది. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. మిగతా నాలుగు జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఫిబ్రవరి 26న ఎలిమినేటర్-1లో ఆరో స్థానం పొందిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... ఎలిమినేటర్-2లో ఐదో స్థానంలో నిలిచిన జట్టుతో నాలుగో స్థానం పొందిన జట్టు ఆడతాయి. ఫిబ్రవరి 28న ఎలిమినేటర్-1 విజేత తొలి సెమీఫైనల్లో లీగ్ 'టాపర్'తో... ఎలిమినేటర్-2 విజేత లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడతాయి. ఫైనల్ మార్చి 1న జరుగుతుంది.

సినిమా

గెటింగ్ రెడీ

'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు హీరో చిరంజీవి. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్నారు. 'గెటింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అంటూ తన వర్కౌట్స్ వీడియోను షేర్ చేశారు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. అయితే ముందు చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్స్‌లో ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: చోటా కే నాయుడు.



● చిరంజీవి

చలో రష్యా

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' రష్యాలో ఆరంభం కానుందట. 1987లో వచ్చిన 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో నటిస్తున్నారు కమల్‌హాసన్. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైంది. కమల్‌హాసన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను రష్యాలో ప్లాన్ చేశారట మణిరత్నం. ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.



● కమల్‌హాసన్

మహేశ్ సినిమాలో?

సూపర్ స్టార్ మహేశ్‌బాబు-కింగ్ నాగార్జున స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఈ కాంబినేషన్ ఏ సినిమాకీ? అంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందనున్న చిత్రానికి అంటున్నారు. 'గుంటూరు కారం' సినిమా హిట్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న మహేశ్‌బాబు తన తర్వాతి చిత్రాన్ని ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ మూవీగా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ చిత్రానికి రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఇటీవలే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట రాజమౌళి. ఈ సినిమాలో సౌత్ ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించనున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే నాగార్జున కూడా కీలక పాత్రలో నటించనున్నారని టాక్. సినిమాలో చాలా ప్రాధాన్యం ఉన్న ఓ పాత్రకి నాగార్జునని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. నాగార్జునకి దక్షిణాదితో పాటు ప్రత్యేకించి బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. అందుకే జాతీయ స్థాయిలో పేరున్న నాగార్జునను 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కోసం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భోగట్టా. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది. మరి మహేశ్‌బాబు-నాగార్జున కాంబో తెరపై కనిపిస్తుందా? అంటే ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్న.



● నాగార్జున

సరికొత్త కథతో శ్రీకారం



● అమర్‌దీప్, సుప్రీత

'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. ఈ చిత్రానికి మాల్యాద్రి రెడ్డి దర్శకుడు. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ కొట్టగా, వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ- ''ఇండియన్ సినిమాలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని కొత్త కథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మాలాంటి కొత్త వాళ్లకి ఎం3 మీడియా చాన్స్ ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు మాల్యాద్రి రెడ్డి. ''బిగ్ బాస్'కి వెళ్లకముందే ఈ సినిమా ఒప్పుకున్నాను'' అన్నారు అమర్‌దీప్ చౌదరి. సుప్రీత, నటీనటులు సురేఖా వాణి, తేజస్వి, గౌతమ్ కృష్ణ, రఘు, నటుడు, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: దాస్ కడియాల, కెమెరా: బాల సరస్వతి.

వేసవిలో మ్యాచ్



● సిద్ధార్థ్, నయనతార, మాధవన్

'ది టెస్ట్'ను పూర్తి చేశారు నయనతార. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నయనతారతో పాటు మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. మీరా జాస్మిన్ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సింగర్ శక్తి శ్రీగోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు, ఈ వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాను గత ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు వేసవికి వాయిదా వేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

తెలుగు, నేపాలీ భాషల్లో...



● బ్రహ్మానందం

ప్రముఖ నటుడు బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న తొలి తెలుగు, నేపాలీ చిత్రం 'హ్రాశ్వ దీర్ఘ'. చంద్ర పంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరిహర్ అధికారి, నీతా దుంగన లీడ్ రోల్స్ చేస్తున్నారు. నీతా ఫిలిమ్స్ ప్రొడక్షన్స్‌పై నీతా దుంగన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హ్రాశ్వదీర్ఘ'లోని ఆయన పాత్రకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

పల్లెటూరి ప్రేమకథ



● శ్రీకాంత్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ- ''రాధా మాధవం' ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమకథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది.. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''అందమైన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. మా సినిమా సెన్సార్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు దాసరి ఇస్సాకు. ''ఈ నెలలోనే మా సినిమా రిలీజ్ అవుతుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమకథతో సహజత్వం ఉట్టి పడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దాసరి ఇస్సాకు. మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన శ్రీకాంత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

విన్నర్‌గా ఎలా మారాడు?



● గీతానంద్

''గేమ్ ఆన్' యునిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా వైవిధ్యంగా చేయాలని ప్రయత్నించాం. ఈ చిత్రంలో హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇందులో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని గీతానంద్ అన్నారు. దయానంద్ దర్శకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో గీతానంద్ మాట్లాడుతూ-''దయానంద్ నా తమ్ముడు కావడంతో 'గేమ్ ఆన్' స్క్రిప్ట్ విషయంలో బాగా చర్చించుకునే వాళ్లం. రవి కస్తూరి కూడా నా ఫ్రెండ్ కావడంతో ముగ్గురం చర్చించుకుని నిర్ణయాలు తీసుకునేవాళ్లం. ఈ మూవీకి సీక్వెల్ ప్లాన్ ఉంది'' అన్నారు.

మ్యూజిక్ కూడా కథ చెబుతుంది

- దేవ్ జాంద్



రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాంద్ మాట్లాడుతూ- ''నా పదో తరగతి నుంచే మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశాను. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాను. కొన్ని వీడియో గేమ్స్‌కి మ్యూజిక్ ఇచ్చాను. సంగీత దర్శకుడిగా 'ఈగల్' నాకు తొలి చిత్రం. కాలేజీలో నేను, హీరో శ్రీవిష్ణు క్లాస్‌మేట్స్. అలా కార్తీక్ నాకు పరిచయం అయ్యాడు. ఇప్పుడు తనతో నా జర్నీ మొదలైంది. రవితేజగారితో సినిమా ఫిక్స్ అయ్యాక ఆయన ఓకే చెబితే, మ్యూజిక్ డైరెక్టర్‌గా నాకు చాన్స్ ఇస్తానన్నాడు కార్తీక్. రవితేజగారు నా మ్యూజిక్ ట్రాక్స్ విని, నచ్చి ఓకే చేశారు. రవితేజగారి సినిమాకు మ్యూజిక్ చేయడం నా లక్. ఈ సినిమాలో మ్యూజిక్, ఆర్ఆర్‌లకు మంచి స్కోప్ ఉంది. మ్యూజిక్ కూడా కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. ఇక కార్తీక్ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా చేస్తున్న ఓ సినిమాకు, దర్శకుడు నక్కిన త్రినాథరావుగారి ప్రొడక్షన్‌లోని ఓ మూవీకి మ్యూజిక్ ఇస్తున్నాను. మరో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.